మల్లెపూలు తెచ్చుకున్నందుకు
1.14 లక్షల జరిమానా



ఆస్ట్రేలియాలో మలయాళ నటి నవ్య నాయర్‌కు చేదు అనుభవం

కఠిన బయో సెక్యూరిటీ చట్టాలే కారణం

మెల్‌బోర్న్ ఎయిర్‌పోర్ట్‌లో ఘటన

2

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 9-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 145 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం, తిథి: విదియ రా.6.29 తదుపరి తదియ, నక్షత్రం: ఉత్తరాభాద్ర రా. 6.07 తదుపరి రేవతి, వర్జ్యం: శేషం ఉ. 6.20, పునః తె. 5.05 మొదలు, దుర్ముహూర్తం: ఉ.8.32-9.21, రా.10.10-10.56, అమృతఘడియలు: మ.1.42-3.10, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 6.05, సూర్యాస్తమయం: 6.18 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

టీటీడీ ఈవోగా మళ్లీ సింఘాల్



అనిల్‌కుమార్ సింఘాల్



జె.శ్యామలరావు

ఈవో శ్యామలరావు జీఏడీకి

11 మంది సీనియర్ ఐఏఎస్‌ల బదిలీ

గవర్నర్ స్పెషల్ సీఎస్‌గా అనంతరాము

కృష్ణబాబుకు ఆర్ అండ్ బీ, రవాణా

అదనంగా మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ అప్పగింత

అటవీ శాఖకు కాంతిలాల్ దండే

మీనాకు ఎక్సైజ్, పరిశ్రమలు, వాణిజ్యం

కార్యదర్శులుగా గౌర్, శ్రీధర్, శేషగిరిబాబు

దేవదాయ కార్యదర్శిగా హరి జవహర్‌లాల్

అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కసరత్తు తర్వాత రాష్ట్రంలో 11 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. కీలకమైన శాఖలు అప్పగించింది. కేంద్ర సర్వీసుల నుంచి తిరిగొచ్చి పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న అనిల్‌కుమార్ సింఘాల్ మరోసారి తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) కార్యనిర్వహణాధికారి (ఈవో)గా నియమితులయ్యారు. ఆ స్థానంలో ఉన్న జె.శ్యామలరావును సాధారణ పరిపాలనా విభాగం (జీఏడీ-పొలిటికల్) ముఖ్య కార్యదర్శిగా ప్రభుత్వం బదిలీచేసింది. ప్రస్తుతం

మిగతా 11వ పేజీలో...

553 కోట్లతో విశాఖలో భూగర్భ డ్రైనేజీ

జీవీఎంసీకి 498 కోట్ల ఐఎఫ్‌సీ రుణం

భారీ రుణం నేరుగా పొందిన తొలి సంస్థగా ఘనత

తక్కింది సర్దుబాటు చేయనున్న కేంద్రం

సీఎం సమక్షంలో ఒప్పందం ఖరారు

11



చంద్రబాబు సమక్షంలో ఒప్పంద పత్రాలతో అధికారులు, ఐఎఫ్‌సీ ప్రతినిధులు

యూరియా మాయ!

కష్టాలకు అసలు కారణాలు ఏమిటి?



ఇతర ఎరువులతో పోల్చితే చాలా చౌక

ఒక్కో బస్తాపై దాదాపు 2వేల సబ్సిడీ

రూ.266కే బస్తా యూరియా విక్రయం

ఇతర ఎరువులు రూ.1350కి పైగానే

యూరియా వినియోగానికి రైతుల మొగ్గు

సూచించిన దానికంటే రెట్టింపు వాడకం

అక్రమార్కుల పాపమూ కారణమే

సిండికేట్‌గా సొంతం చేసుకుంటున్న కొందరు

వ్యవసాయేతర అవసరాలకూ మళ్లింపు



యూరియా కొరత, ఉల్లి కొనుగోళ్లు, తురకపాలెం జ్వరాల అంశాలపై ఆర్టీజీఎస్‌లో సమీక్షిస్తున్న చంద్రబాబు

ప్రస్తుత సీజన్‌కు సరిపడా యూరియా సరఫరా అవుతోందని అధికారులు పదేపదే చెబుతున్నారు!

స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తరచూ సమీక్షిస్తూ... అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేస్తున్నారు!

అయినా... యూరియా 'కొరత' ఎందుకు ఏర్పడుతోంది? విక్రయ కేంద్రాల వద్ద ఎందుకు రైతులు బారులు తీరుతున్నారు?

సమస్యకు కారణం... యూరియా సరఫరా కొరతా? లేక, ఇతర అంశాలు ఉన్నాయా? వ్యవసాయరంగ నిపుణులు ఏం చెబుతున్నారు?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఇటీవలి కాలంలో ఎన్నడూ లేని విధంగా యూరియా కోసం రైతులు బారులు తీరుతున్నారు. పొరుగు రాష్ట్రాలతో పోల్చితే... ఆంధ్రప్రదేశ్‌లో యూరియా కష్టాలు తక్కువే అయినప్పటికీ... ఇబ్బందులు పడుతుండటం మాత్రం నిజం! ప్రస్తుత సీజన్‌కు సరిపడా యూరియా ఉందని వ్యవసాయశాఖ చెబుతోంది. కానీ, క్షేత్రస్థాయిలో మాత్రం కొరత కనిపిస్తోంది. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, కృష్ణా, బాపట్ల, కడప

మిగతా 14వ పేజీలో...

వివిధ రకాల ఎరువుల అసలు ధర, రాయితీ వివరాలు (బస్తాకు/రూ.)

ఎరువు	అసలు ధర	ప్రభుత్వ రాయితీ	గరిష్ఠ రిటైల్‌ధర
యూరియా	2,234	1,967	266.5
డీఏపీ	2,740	1,390	1,350
కాంప్లెక్స్ ఎరువులు			
14.35.14	2,881	1,081	1,800
20.20.0.13	2,383	883	1,500
28.28.0	3,013	1,033	1,800
ఎంఓపీ	1,871	71.4	1,800
ఎస్.ఎస్.పీ	1,013	363	650

సమృద్ధిగా యూరియా

కొరత లేదని రైతులకు భరోసా ఇవ్వాలి: సీఎం

అధికారులు, కలెక్టర్లతో సుదీర్ఘ సమీక్ష

అక్కడికక్కడే కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు ఫోన్

అదనపు యూరియా కేటాయింపులకు వినతి

కాకినాడ చేరుకున్న నౌకలోని 7 ర్యాకుల ఎరువులు ఇవ్వడానికి నడ్డా అంగీకారం

14

దీంతో 50 వేల టన్నులు అదనంగా రాక

బ్లాక్‌మార్కెట్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు

కర్నూలు ఉల్లి క్వింటా 1,200 కన్నా తగ్గితే ఆ మేరకు ప్రభుత్వం చెల్లింపు: చంద్రబాబు

ఆర్టీజీఎస్ నుంచి, టెలికాన్ఫరెన్స్‌లో సమీక్ష



సీపీ రాధాకృష్ణన్



జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

ఉప రాష్ట్రపతి ఎన్నిక నేడే!

జాతీయవాది, ఉదారవాది మధ్య సైద్ధాంతిక సమరం

ఎన్డీఏ నుంచి వివాద రహితుడు రాధాకృష్ణన్

ఇండీ అభ్యర్థిగా న్యాయ కోవిదుడు సుదర్శన్‌రెడ్డి


పోలింగ్‌కు దూరమన్న బీఆర్ఎస్, బీజేడీ

422 మంది సభ్యుల బలంతో ఎన్డీఏదే పైచేయి

నేటి సాయంత్రానికి ఫలితాల వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఒకరు బాల్యం నుంచీ హిందుత్వ భావజాలంతో ఎదిగిన జాతీయవాది అయితే మరొకరు సోషలిస్టు భావజాలాన్ని పుణికిపుచ్చుకున్న ఉదారవాది. ఉప రాష్ట్రపతి పదవికి మంగళవారం జరిగే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి తరఫున సీపీ రాధాకృష్ణన్, ఇండీ కూటమి తరఫున జస్టిస్ సుదర్శన్‌రెడ్డిల మధ్య జరుగుతున్న పోటీ గతంలో ఎన్నడూ లేనివిధంగా సైద్ధాంతిక సమరాన్ని తలపిస్తోంది. రెండు సార్లు లోక్‌సభకు ఎన్నికై మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్న అత్యంత వివాద రహితుడు సీపీ రాధాకృష్ణన్, దాదాపు రెండు దశాబ్దాల పాటు హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో న్యాయమూర్తిగా పలు చరిత్రాత్మక తీర్పులు

మిగతా 2వ పేజీలో...





కఠ్మాండూలో నిరసనకారులు, పోలీసుల మధ్య ఘర్షణ

సోషల్ మీడియాపై నిషేధానికి వ్యతిరేకంగా..

భగ్గుమన్న నేపాల్

ఆందోళనకారులపై కాల్పులు.. 20 మంది మృతి

400 మందికి పైగా యువకులకు గాయాలు

'పార్లమెంట్'లోకి యువత.. టియర్ గ్యాస్, రబ్బర్ బుల్లెట్లతో భద్రతాబలగాల కాల్పులు

అవినీతి వ్యతిరేక ఉద్యమంగా రూపాంతరం

ప్రధాని శర్మ ఓలి దిగిపోవాలంటూ నినాదాలు

కఠ్మాండూ, దేశ సరిహద్దుల్లో కర్ఫ్యూ విధింపు

కఠ్మాండూ, సెప్టెంబరు 8: నేపాల్‌లో రాజధాని నగరం కఠ్మాండూ సోమవారం నెత్తురోడింది. సోషల్ మీడియాపై నేపాల్ సర్కారు విధించిన నిషేధానికి వ్యతిరేకంగా వేల సంఖ్యలో యువత గళమెత్తింది. ప్రభుత్వం విధించిన కర్ఫ్యూను లెక్క చేయకుండా.. రోడ్లెక్కింది. పార్లమెంట్ భవనం ప్రాంగణంలోకి చొచ్చుకుపోయింది. వారిని అడ్డుకునేందుకు భద్రతాబలగాలు వాటర్ కెనాన్‌లను, టియర్‌గ్యాస్‌లను ప్రయోగించాయి. ఆందోళనకారులు కూడా బలగాలపై రాళ్లు, చెట్ల కొమ్మలతో దాడి చేశారు. దీంతో.. సైన్యం విచక్షణారహితంగా రబ్బర్

మిగతా 2వ పేజీలో...

రెండో దశ సుంకాలు!

రష్యా నుంచి చమురు కొంటున్న దేశాలపై విధిస్తాం: ట్రంప్

ఆంక్షలతో రష్యా ఆర్థికం కూలుతుంది.. పుతిన్ చర్చలకొస్తారు

సుప్రీం సుంకాలు కొట్టేస్తే ఆయా దేశాలకు రిఫండ్ తప్పదు

అది పెనుభారమే.. అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెసెంట్

వాషింగ్టన్, సెప్టెంబరు 8: రష్యా మీద, ఆ దేశం నుంచి చమురు కొనే దేశాల మీద రెండో దశ సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ఆదివారం ఓ విలేకరి ప్రశ్నకు ట్రంప్ ఈ విషయం చెప్పారు. దీనిపై అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెసెంట్ మాట్లాడుతూ యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడితో ట్రంప్ మాట్లాడారని, యూరప్

మిగతా 2వ పేజీలో...

ఎంపీసీలో చరిత్ర.. బైపీసీలో జాగ్రఫీ

సరికొత్తగా మారిన ఇంటర్ విద్య



ఎలక్టివ్ విధానం తెచ్చిన వైవిధ్యమిది

24 సబ్జెక్టుల్లో ఏదైనా ఎంచుకోవచ్చు

ఎంపీసీలో 'ఫ్రెంచ్' తీసుకున్న కొందరు

సీఈసీలో బయాలజీ తీసుకున్న 15 మంది

ఎం బైపీసీ విద్యార్థులు 11,257 మంది

నచ్చినట్లుగా భిన్నమైన సబ్జెక్టుల ఎంపిక

ఒకరోజు ఒక సబ్జెక్టుకే పరీక్షలు

నిర్వహించేలా ప్రణాళిక

"లెక్కలతో కుస్తీపట్టే ఎంపీసీ విద్యార్థులు చరిత్ర చదువుతున్నారు. జంతువులు, మొక్కలతో గడిపే బైపీసీ విద్యార్థులు సివిక్స్, జాగ్రఫీ తీసుకున్నారు. అకౌంట్లు సరిచూసే సీఈసీ విద్యార్థులు 15 మంది వైద్య విద్యకు సంబంధించిన బయాలజీ ఎంపిక చేసుకున్నారు. ఇంకా కొందరు విద్యార్థులు ఫ్రెంచి భాషను ఓ సబ్జెక్టుగా ఎంపిక చేసుకున్నారు. కొందరు సీఈసీ విద్యార్థులైతే పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ చదువుతున్నారు. ఇలా ఇంటర్మీడియట్‌లో విద్యార్థులు వైవిధ్యంగా సబ్జెక్టులను ఎంపిక చేసుకుంటున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్‌లో తీసుకొచ్చిన కీలకమార్పులతో విద్యార్థులకు ఈ అవకాశం లభించింది

(అమరావతి, ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్య వినూత్నంగా మారింది. కూటమి ప్రభుత్వం ఇంటర్ విద్యలో కీలక సంస్కరణలు ప్రవేశపెట్టడంతో విద్యార్థులు నచ్చిన సబ్జెక్టులను ఎంపిక చేసుకున్నారు. ఇప్పటివరకూ ఇంటర్మీడియట్ విద్య అంటే సంబంధిత సబ్జెక్టులే చదవాలి అనే నిబంధన ఉండేది. ఎంపీసీ విద్యార్థులు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ కాకుండా మరో సబ్జెక్టు చదివే అవకాశం ఉండేది కాదు. అలాగే బైపీసీలో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీలు మాత్రమే చదవాలి. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యలో తీసుకొచ్చిన మార్పులతో కోర్ సబ్జెక్టులను ఎలాగైనా

మిగతా 12వ పేజీలో...



కర్నూలు మార్కెట్ యార్డులో మాట్లాడుతున్న షర్మిల, వెనుక ఆమె కుమారుడు

రాజకీయాల్లోకి రాజారెడ్డి!

అవసరమైనప్పుడు నా కుమారుడు ఏపీలో రంగప్రవేశం చేస్తాడు: షర్మిల

కర్నూలులో ఉల్లి రైతులకు పరామర్శ

తల్లి వెంట వచ్చిన తనయుడు

అంతకుముందు విజయమ్మ ఆశీర్వాదం

13

బాబు అరెస్టుకు రెండేళ్లు!

2023 సెప్టెంబరు 9న నంద్యాలలో నిర్బంధం

దీనితోనే వైసీపీ పతనానికి నాంది.. టీడీపీ-జనసేన పొత్తుకూ ఇదే మూలం

జైల్లో బాబును కలిసి ఉమ్మడిగా పోటీచేస్తామని పవన్ కల్యాణ్ ప్రకటన

ఆనక వారిద్దరితో జతగట్టిన బీజేపీ.. అవినీతి కేసుల్లో నిండా మునిగిన జగన్

ఆ మకిలిని బాబుకూ అంటించేందుకు యత్నం.. అక్రమాలే లేని స్కిల్ కేసులో అరెస్టు

ఐపీఎస్‌ల వాంగ్మూలాలూ తారుమారు.. ఆధారాలు చూపడంలో సీఐడీ విఫలం

ఆయన అరెస్టుపై దేశవిదేశాల్లోని తెలుగువారి నుంచి తీవ్ర నిరసనలు

ప్రజావ్యతిరేకతతో గత ఏడాది ఎన్నికల్లో 11 సీట్లకే వైసీపీ పరిమితం

13



అరెస్ట్ తర్వాత కోర్టు ఆవరణలో చంద్రబాబు (ఫైల్)

ఆ ముగ్గురికి డీఫాల్ట్ బెయిల్‌పై హైకోర్టు

కీలక ఉత్తర్వులు

ఏసీబీ కోర్టు ఉత్తర్వుల్లోని పలు అంశాలపై స్టే

మద్యం నిందితులపై చార్జిషీట్లను తప్పుబడుతూ ఇచ్చిన ఆఫీస్ మెమోరాండం అమలు నిలుపుదల

ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీకి నోటీసులు

వీరి బెయిల్ రద్దు కోసం వ్యాజ్యం వేసిన సీఐడీ

ఎల్లుండికి తదుపరి విచారణ వాయిదా

14

రెగ్యులర్ బెయిల్ ఇవ్వండి!

ఏసీబీ కోర్టులో మిథున్‌రెడ్డి పిటిషన్

మల్లెపూలు తీసుకెళ్లినందుకు 1.14 లక్షల జరిమానా



న్యూఢిల్లీ, సెప్టెంబరు 8: మహిళలు తమ జడలో పూలు పెట్టుకోవడం దక్షిణ భారతదేశంలో ఎంతో సహజం. ముఖ్యంగా మల్లె పూలు... అయితే మల్లెపూలు తెచ్చుకోవడం కూడా నేరమే ఆస్ట్రేలియాలో..! ఈ కారణంగానే మలయాళ నటి నవ్య నాయర్‌కు మెల్‌బోర్న్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో రూ.1.14 లక్షల జరిమానా విధించారు! మలయాళ నటి నవ్య నాయర్ ఆస్ట్రేలియాలోని విక్టోరియాలో మలయాళీ అసోసియేషన్ నిర్వహించిన ఓనం వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లారు. ఈ సమయంలో తనతో పాటు హ్యాండ్‌బ్యాగులో 15 సెంటీమీటర్ల మల్లెపూల దండను తీసుకెళ్లినందుకు మెల్‌బోర్న్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఆమెకు రూ.1.14 లక్షల జరిమానా విధించారు. అయితే ఇది అనుకోకుండా జరిగిందని ఆమె చెప్పారు. మల్లెపూలు తెచ్చుకోవడం అక్కడ చట్ట వ్యతిరేకమని తనకు తెలియదని పేర్కొన్నారు. అక్కడి అధికారులు తనను 1,980 ఆస్ట్రేలియన్ డాలర్ల(రూ.1.14 లక్షలు) జరిమానా చెల్లించాలని కోరారని తెలిపారు. కాగా మెల్‌బోర్న్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో కఠినమైన 'బయో సెక్యూరిటీ' చట్టాలు అమలులో ఉన్నాయి. విదేశాల నుంచి వచ్చేవారు తమ వెంట పూలు, పండ్లు, విత్తనాలతోపాటు పాల ఉత్పత్తులు, పలు స్వీట్లు తేకుండా నిషేధించారు. వాటివల్ల తోటి ప్రయాణికులకు, తమ దేశంలో ప్రజలకు వ్యాధులు, తెగుళ్ల సోకే ప్రమాదం ఉందని ఇటువంటి నిబంధనలు విధించారు. అయితే ఈ ఘటనతో నవ్య నాయర్ విచారానికి గురవకుండా విక్టోరియాలో ఓనం వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

జెరూసలెంలో కాల్పులు.. ఆరుగురి మృతి

» గాజాపై హరికేన్ తరహా దాడి చేస్తామన్న ఇజ్రాయెల్

జెరూసలెం, సెప్టెంబరు 8: యూదుల పవిత్ర స్థలమైన ఇజ్రాయెల్‌లోని జెరూసలెంలో జరిగిన కాల్పుల్లో ఆరుగురు మృతిచెందారు. 12 మంది గాయపడ్డారు. జెరూసలెంలోని రమోత్ జంక్షన్ బస్టాప్ వద్దకు వాహనంపై వచ్చిన ఇద్దరు పాలస్తీనా సాయుధులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో మృతిచెందిన ఆరుగురిలో 30 ఏళ్లలోపు వారు ముగ్గురున్నారు. ఓ గర్భిణి కూడా కాల్పుల్లో గాయపడినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు కాల్పులకు పాల్పడిన సాయుధులను ఇజ్రాయెల్ సైన్యం హతమార్చింది. ఘటనా స్థలాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పరిశీలించారు. కాల్పుల నేపథ్యంలో జెరూసలెంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. మరోవైపు, తమ బందీలను విడిచిపెట్టకుంటే గాజాపై విరుచుకుపడతామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ హెచ్చరించారు. హరికేన్ తరహాలో దాడి చేస్తామన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా హమాస్‌కు ఇదే చివరి వార్నింగ్ అని హెచ్చరించారు.

15 రోజుల బిడ్డను ఫ్రీజర్‌లో పెట్టి మర్చిపోయిన తల్లి

మొరాదాబాద్, సెప్టెంబరు 8: తన 15 రోజుల బిడ్డను ఓ తల్లి ఫ్రీజర్‌లో పెట్టి మర్చిపోయింది. ఆ శిశువు చలికి గుక్కపట్టి ఏడవడంతో కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం రాత్రి బిడ్డను నిద్రపుచ్చిన తల్లి.. ఏదో ఆలోచిస్తూ ఆ శిశువును ఫ్రీజర్‌లో పెట్టి నిద్రపోయింది. అయితే కొద్ది నిమిషాలకే ఆ బిడ్డ చలికి తట్టుకోలేక బిగ్గరగా ఏడవడం ప్రారంభించాడు. దీంతో బిడ్డ కోసం ఇల్లంతా వెతికిన కుటుంబ సభ్యులు ఫ్రీజర్‌లో ఉన్నట్లు గుర్తించి బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. ఆ శిశువుకు చికిత్స అందించిన వైద్యులు.. ప్రాణాలకు ఏ ప్రమాదం లేదని తెలిపారు. అయితే సదరు మహిళ ప్రసవానంతర మానసిక సమస్యల (పోస్ట్‌పార్టమ్ సైకోసిస్)తో బాధపడుతున్నట్లు వైద్య పరీక్షల్లో తేలింది. దీంతో చికిత్స నిమిత్తం ఆమెను కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్చారు. కాగా, ప్రసవానంతరం హార్మోన్లలో మార్పులు, మానసిక ఒత్తిడి కారణంగా కొందరు మహిళలకు పోస్ట్‌పార్టమ్ సైకోసిస్ రావచ్చని.. దీంతో వారు తీసుకునే అసంబద్ధ నిర్ణయాలు బిడ్డకు హానీ చేయొచ్చని వైద్యులు చెబుతున్నారు. ముందే గుర్తించి చికిత్స అందిస్తే నయం చేయొచ్చంటున్నారు.

ట్రంప్ సవాళ్లను ఉమ్మడిగా ఎదుర్కొందాం

» బ్రిక్స్ దేశాలకు జిన్‌పింగ్ పిలుపు

బీజింగ్, సెప్టెంబరు 8: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల రూపంలో విసురుతున్న సవాళ్లను ఉమ్మడిగా ఎదుర్కోవాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ బ్రిక్స్ దేశాల నేతలకు పిలుపునిచ్చారు. ట్రంప్ ప్రకటించిన సుంకాల యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసిందని, అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలను పూర్తిగా విస్మరించిందని చెప్పారు. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణ అమెరికా దేశాల కూటమి అయిన 'బ్రిక్స్' నేతల సదస్సు సోమవారం వీడియో కాన్ఫరెన్స్ రూపంలో జరిగింది. దీనిని బ్రెజిల్ అధ్యక్షుడు లులా డి సిల్వా నిర్వహించారు. ఈ సందర్భంగా జిన్‌పింగ్ ప్రసంగిస్తూ ఆధిపత్యవాదం, ఏకపక్ష వాదం, రక్షణ వాదం రోజురోజుకూ పెరుగుతున్నాయని ఇవి వాణిజ్య యుద్ధాలకు దారి తీస్తున్నాయని తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేరు పెట్టకుండా ఆయన ఈ విమర్శ చేశారు. అమెరికా ప్రాబల్యానికి వ్యతిరేకంగా ఆయన గ్లోబల్ గవర్నెస్ ఇనిషియేటివ్ (జీజీఐ)ని ప్రతిపాదించారు. ఈ సదస్సులో ప్రధాని మోదీ తరఫున విదేశాంగ మంత్రి జైశంకర్ మాట్లాడుతూ ఆర్థిక విధానాలు న్యాయబద్ధంగా, పారదర్శకంగా ఉండాలని సూచించారు.

రష్యా చమురు.. 'నెత్తుటి సొమ్ము': నవారో

న్యూయార్క్, సెప్టెంబరు 8: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవర్రో సోమవారం మరోసారి భారత్‌పై విమర్శలు చేశారు. రష్యా నుంచి భారత్ కొనుగోలు చేస్తున్న ముడి చమురును 'బ్లడ్ మనీ' (నెత్తుటి సొమ్ము) అని వ్యాఖ్యానించారు. ఎక్స్‌లో పోస్టు పెడుతూ "వాస్తవం: ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేయడానికి ముందు భారత్ రష్యా నుంచి భారీగా చమురు కొనుగోలు చేయలేదు. ఇప్పుడు కొనుగోలు చేస్తోంది. ఇది నెత్తుటి సొమ్ము. ప్రజలు చనిపోతున్నారు" అని పేర్కొన్నారు. అంతకుముందు కూడా ఇలాంటి విమర్శలే చేశారు.

రష్యాతో వ్యాపారం చేసే దేశాలపై సుంకాల పెంపు సరైన ఆలోచన: జెలెన్‌స్కీ

వాషింగ్టన్, సెప్టెంబరు 8: రష్యాతో వ్యాపారాలు చేసే దేశాలపై అమెరికా సుంకాలు పెంచడాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొడ్మిర్ జెలెన్‌స్కీ సమర్థించారు. అది సరైన ఆలోచన అని వ్యాఖ్యానించారు. అయితే ఆయన ఎక్కడా భారత దేశం పేరును ప్రస్తావించలేదు. ఆదివారం ఓ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'రష్యాతో ఇంకా వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తున్న దేశాలపై టారిఫ్‌లు పెంచడం మంచిదే. ఇది సరైన ఆలోచనే' అని అభిప్రాయపడ్డారు. భారత్‌పై టారిఫ్‌లు పెంచడం దుష్ఫలితాలు ఇచ్చిందా అన్న ప్రశ్నకు సమాధానంగా పై అభిప్రాయం వ్యక్తం చేశారు.

భగ్గుమన్న నేపాల్



నిరసనల్లో నినదిస్తున్న ఓ యువతి



నేపాల్ పార్లమెంటు వైపు ర్యాలీగా వెళ్తున్న వేలాది మంది యువతీయువకులు

(మొదటి పేజీ తరువాయి)

బుల్లెట్లతో కాల్పులు జరిపింది. ఈ ఘటనలో 12 ఏళ్ల బాలుడు సహా.. 20 మంది ప్రాణాలను కోల్పోయారు. మరో 400 మందికి పైగా యువకులకు గాయాలయ్యాయి. ఆ తర్వాత ప్రభుత్వం సోషల్ మీడియాను పునరుద్ధరించినా.. ముందుజాగ్రత్తగా కర్మాండూ సహా, పోఖారా తదితర జిల్లాలు, దేశ సరిహద్దుల వద్ద కర్ఫ్యూ విధించింది. శాంతిభద్రతల వైఫల్యానికి నైతిక బాధ్యత వహిస్తూ.. నేపాల్ హోంమంత్రి రమేశ్ లేఖక్ రాజీనామా చేశారు. భారత్ కూడా అప్రమత్తమైంది. ఇండో-నేపాల్ సరిహద్దుల్లో సశస్త్ర సీమాబల్(ఎస్ఎస్‌బీ) భద్రతను కట్టుదిట్టం చేసింది. నేపాల్‌తో సరిహద్దు పంచుకుంటున్న బిహార్‌లోని ఏడు జిల్లాలు– పశ్చిమ చంపారన్, తూర్పు చంపారన్, సీతామర్హి, మధుబని, అరారియా, సుపౌల్, కిషన్‌గంజ్ జిల్లాల్లో హైఅలెర్ట్ ప్రకటించి, సరిహద్దులను మూసివేసింది.

చూస్తుండగానే పెరిగిన ఆందోళనలు



నేపాల్ సర్కారు ఈ నెల 3న ఫేస్‌బుక్, ఎక్స్, యూట్యూబ్ సహా.. 26 సామాజిక మాధ్యమాలపై నిషేదం విధించిన విషయం తెలిసిందే..! ఈ చర్య భావప్రకటన స్వేచ్ఛకు విఘాతం కల్పిస్తోందంటూ.. 30 ఏళ్లలోపు యువకులు(జెన్-జడ్) అందుబాటులో ఉన్న టిక్‌టాక్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఉద్యమాన్ని లేవనెత్తారు. సోమవారం ఉదయం నుంచి ఒక్కొక్కరుగా రోడ్డెక్కారు. అలా మధ్యాహ్నానికి సుమారు 12 వేల మంది యువకులు నిరసనల్లో పాల్గొన్నారు. దాంతో.. కర్మాండూ ప్రధాన రహదారులు జనసంద్రంగా మారాయి. క్రమంగా ఆందోళనకారులు పార్లమెంట్ భవనం వైపు దూసుకెళ్లారు. కొందరు యువకులు గేట్లపైకెక్కి.. పార్లమెంట్ ప్రాంగణంలోకి చొచ్చుకుపోయారు. నేపాల్ చరిత్రలోనే ఆందోళనకారులు పార్లమెంట్ ప్రాంగణంలోకి చొచ్చుకురావడం ఇదే మొదటిసారి. దీంతో అక్కడున్న భద్రతాబలగాలు, సైన్యం వాటర్ కెనాన్‌లు, బాష్ప వాయు గోళాలతో వారిని అడ్డుకునే ప్రయత్నం చేశాయి. ఆందోళనకారులు కూడా తమ వద్ద పడిన బాష్ప వాయు గోళాలు, రాళ్లు, చెట్ల కొమ్మలతో ఎదురుదాడికి దిగడంతో.. రబ్బర్ బుల్లెట్లతో కాల్పులు జరిపాయి. ఈ ఘటనలో 20 మంది మృతిచెందారు. క్షతగాత్రుల్లో 10 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. నిరసనకారులు రాళ్లు రువ్విన ఘటనలో 178 మంది నేపాల్ పోలీసులు, 30 మంది సాయుధ బలగాలకు గాయాలయ్యాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం సామాజిక మాధ్యమాలపై నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు ప్రకటన చేసింది. ఆ మేరకు మధ్యాహ్నం 3.30 నుంచి ఫేస్‌బుక్ వంటి సోషల్‌మీడియా ప్లాట్‌ఫారాలు నేపాల్‌లో తిరిగి పనిచేశాయి. అటు భద్రత బలగాలు రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని ఇళ్లకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాయి. అయితే.. నేపాల్ కాలమానం ప్రకారం అర్ధరాత్రి సమయంలో ఆందోళనకారులు ప్రధాని కేపీ శర్మ ఓలి ఇంటిపై రాళ్లు రువ్వారు. దీంతో, పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు.

ఏడు జిల్లాల్లో కర్ఫ్యూ

యువత ఆందోళన సోమవారం అర్ధరాత్రికి నేపాల్ వ్యాప్తంగా విస్తరించింది. 7జిల్లాల్లో హింస నమోదైంది. ఈ జిల్లాల్లో కర్ఫ్యూ విధించారు. కాగా.. యువత ఆందోళనలకు మాజీ ప్రధాని పుష్పకమల్ దహాల్(ప్రచండ) మద్దతు పలికారు. విదేశాల్లో నివసిస్తున్న నేపాలీలు కూడా జెన్-జడ్ ఉద్యమానికి మద్దతిచ్చారు.

కేపీ శర్మ ఓలి.. దిగిపో

సోషల్ మీడియాపై నిషేధానికి వ్యతిరేకంగా ప్రారంభమైన ఉద్యమం కాస్తా.. ప్రభుత్వ చర్యలు, మరణాలతో రూపాంతరం చెందింది. అవినీతికి వ్యతిరేక ఉద్యమంగా మారింది. ఆందోళనకారులు నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి దిగిపోవాలంటూ నినాదాలు చేశారు. ఆయనను ఒక దొంగగా పేర్కొంటూ.. 'కేపీ చోర్' అనే ప్లకార్డులను ప్రదర్శించారు. ప్రభుత్వం అప్రమత్తమై.. అత్యవసరంగా జాతీయ భద్రత సమావేశాన్ని ఏర్పాటు చేసింది. యువతపై కాల్పులను నేపాల్ విపక్షాలు తీవ్రంగా ఖండించాయి. సీపీఎన్(మావోయిస్టు సెంటర్) డిప్యూటీ జనరల్ సెక్రటరీ బర్షమన్ పున్, ఎన్‌సీపీ ప్రధాన కార్యదర్శి కబీంద్రతోపాటు.. కాంగ్రెస్-యూఎంఎల్, రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ(ఆర్పీపీ), సీపీఎన్(యూఎంఎల్), సోషలిస్టు పార్టీలు ఈ మేరకు వేర్వేరుగా ప్రకటనలు చేశాయి. ఒక్క హోంమంత్రి రాజీనామాతో సరిపోదని కేపీ శర్మ ఓలి సహా.. మంత్రిమండలి రాజీనామా చేయాలని ఆయా పార్టీల నేతలు డిమాండ్ చేశారు. వీరికి మంత్రి మండలిలో కూర్చునే నైతిక అర్హత లేదన్నారు.



నిరసనకారుల దాడిలో గాయపడిన పోలీస్

అమెరికా పాత్ర?

నేపాల్ ఆందోళనల వెనక అమెరికా పాత్ర ఉందంటూ నేపాలీ పత్రికల అనుబంధ వెబ్‌సైట్లు కథనాలను ప్రచురించాయి. అందుకే సోషల్ మీడియా నిషేధానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం కాస్తా.. 'కేపీ శర్మ ఓలి దిగిపో' అనే నినాదం వైపు మళ్లినట్లు విశ్లేషించాయి. ఓలి చైనాకు ఆప్తుడు అనే విషయం తెలిసిందే..! అయితే.. ఇటీవలి కాలంలో అమెరికా నేపాల్‌లో ప్రాజెక్టులను చేపట్టింది. అందుకే.. ఆర్థిక, దౌత్య మద్దతును పెంచింది. మిలీనియం చాలెంజ్ కార్పొరేషన్(ఎంసీసీ) వంటి సంస్థలు రూ.లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను నిర్వహిస్తున్నాయి. ఎస్ఎంబీ బ్యాంకుతో కలిసి నేపాల్ ప్రభుత్వం 2025లో అమెరికా అనుబంధ సంస్థలైన ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఎఫ్‌సీ), బ్రిటిష్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్(బీఐఐ) ద్వారా 60 మిలియన్ డాలర్ల 'గ్రీన్ బాండ్' ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇటీవల ప్రధాని ఓలి తీసుకున్న పలు నిర్ణయాలతో కొన్ని అమెరికా ప్రాజెక్టులకు బ్రేకులు పడ్డాయి. దీంతో.. ఓలికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని అమెరికా తెరవెనక ఉండి నడుపుతోందని నేపాలీ పత్రికలు పేర్కొన్నాయి.

లోకం తీరు

రష్యా చమురు కొనుగోలు దేశాలపై రెండో దశ ఆంక్షలకు సిద్ధం: ట్రంప్



సోషల్ మీడియాపై నిషేధం ఎందుకు?

విద్వేషపూరిత ప్రసంగాలు, ఫేక్ ప్రొఫైల్స్, సైబర్ నేరాలు, ఫేక్‌న్యూస్ వ్యాప్తి వంటి కేసులను విచారించిన సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నేపాల్ ప్రభుత్వం ఐటీ, కమ్యూనికేషన్స్ చట్టం ప్రకారం సామాజిక మాధ్యమాలన్నీ రిజిస్టర్ చేసుకోవాలని గత నెల 28న ఆదేశాలిచ్చింది. అందుకోసం వారం రోజులు గడువిచ్చింది. అలా రిజిస్ట్రేషన్ చేసుకున్న సంస్థలు ప్రభుత్వం కోరిన సమాచారాన్ని అందించాల్సి ఉంటుంది. అభ్యంతరకరమైన పోస్టులను తొలగించాలని పేర్కొంటే.. సామాజిక మాధ్యమ సంస్థలు ఆ ఆదేశాలను పాటించాల్సి ఉంటుంది. ప్రభుత్వం, పౌరులు ఇచ్చే లీగల్ నోటీసులకు కచ్చితంగా స్పందించేందుకు నేపాల్‌లో అధికారులను నియమించాలి. టిక్‌టాక్, వైబర్, విట్క్, నింబజ్, పోపోలైవ్ వంటి సంస్థలు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. టెలిగ్రామ్, గ్లోబల్ డైరీ సంస్థలు రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకోగా.. ఆమోదం పెండింగ్‌లో ఉంది. ఫేస్‌బుక్, ఎక్స్, యూట్యూబ్ సహా.. 26 సామాజిక మాధ్యమ సంస్థలు మాత్రం రిజిస్ట్రేషన్‌కు సుముఖంగా లేవు. భారత్‌లో ఇలాంటి నిబంధనకు కట్టుబడిన ఆయా సంస్థలు తమ దేశంలో విముఖంగా ఉండడంతో.. ప్రభుత్వం ఈ నెల 3న వాటిని నిషేధించింది.

ఢిల్లీలో ఫులేరా సర్కారు!

» సీఎం రేఖాగుప్తా భర్త ఏ హోదాతో అధికారిక భేటీలో పాల్గొన్నారు: ఆప్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 8: అధికారిక కార్యక్రమంలో ఢిల్లీ సీఎం రేఖాగుప్తాతో పాటు ఆమె భర్త కూడా పాల్గొనడం రాజకీయ దుమారానికి దారి తీసింది. ఢిల్లీలోని షాలిమార్ బాగ్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి ప్రాజెక్టులపై ఆదివారం ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో అధికారులతో పాటు ఆమె భర్త మనీష్ గుప్తా కూడా పాల్గొన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమగ్ర నివేదిక సమర్పించాలని సీఎం రేఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలు, ఫొటోలను సీఎంవో ఎక్స్‌లో షేర్ చేసింది. ఆ ఫొటోలో పసుపుపచ్చ రంగు చొక్కా ధరించిన మనీష్ గుప్తా, తన భార్య రేఖ పక్క కుర్చీలో కూర్చొని ఉన్నారు. దీనిపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. అధికారిక సమావేశంలో సీఎం భర్త ఎందుకు కూర్చున్నారని ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ ప్రశ్నించారు. ప్రభుత్వంతో సంబంధం లేని వ్యక్తిని అధికారిక సమావేశాల్లో కూర్చోబెట్టడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. ఢిల్లీలో 'ఫులేరా' తరహా ప్రభుత్వం నడుస్తోందా? అని ప్రశ్నించారు. పంచాయత్ అనే వెబ్ సిరీస్‌లో 'ఫులేరా' గ్రామానికి సర్పంచ్ మహిళ కాగా.. అక్కడ ఆమె భర్త పెత్తనం చెలాయిస్తుంటాడు. ఈ నేపథ్యంలోనే ఆప్ నేత 'ఫులేరా' సర్కారు అంటూ విమర్శలు గుప్పించారు. "ఢిల్లీలో 'ఫులేరా' ప్రభుత్వం నడుస్తోందా? కుటుంబ పాలనపై కాంగ్రెస్‌ను విమర్శించే బీజేపీ.. దీనికి సమాధానం చెప్పాలి. ఇది కుటుంబ పాలన కాదా?" అని సౌరభ్ భరద్వాజ్ ఎక్స్‌లో ప్రశ్నించారు. ఆప్ మరో నేత సంజయ్ సింగ్.. "ప్రధాని మోదీ ఢిల్లీకి ఇద్దరు సీఎంలను నియమించారు" అని విమర్శలు గుప్పించారు. అయితే, అధికారిక సమావేశంలో మనీష్ కూర్చోవడాన్ని బీజేపీ సమర్థించుకుంది. అందులో తప్పేమీ లేదంది. "మనీష్ కేవలం సీఎం రేఖ భర్త మాత్రమే కాదు. ఆయనో సామాజిక కార్యకర్త. షాలిమార్‌బాగ్ నియోజకవర్గంలో జరిగే పనులను పర్యవేక్షిస్తుంటారు. స్థానిక ప్రజల ప్రతినిధిగా ఉన్నారు. ఆ హోదాలోనే ఆయన సమావేశంలో కూర్చున్నారు. ఆ సమావేశంలో కొందరు స్థానికులు కూడా ఉన్నారు" అని ఢిల్లీ బీజేపీ నేత హరీశ్ ఖురానా చెప్పారు.

ఉప రాష్ట్రపతి ఎన్నిక నేడే!

(మొదటి పేజీ తరువాయి)

వెలువరించిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డిలలో ఎవర్ని రెండవ రాజ్యాంగ ఉన్నత పదవి అయిన ఉపరాష్ట్రపతి పదవికి ఉభయ సభల పార్లమెంట్ సభ్యులు ఎన్నుకుంటారో అన్నది మంగళవారం సాయంత్రానికి తేలనుంది. సంఖ్యాబలం రీత్యా చూస్తే ఎన్డీఏ అభ్యర్థి మెజారిటీ ఓట్లతో నెగ్గే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇరు వర్గాలు ఈ ఎన్నికలో సాధ్యమైనన్ని ఎక్కువ ఓట్లు సాధించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నాయి.



రాధాకృష్ణన్, జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

ఓటేసేది 770 మందే

మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. సాయంత్రం 6 గంటలకు ఓట్ల లెక్కింపు జరుగుతుంది. లోక్‌సభలో ఒక సీటు ఖాళీగా ఉన్న రీత్యా 542 మంది సభ్యులు, రాజ్యసభలో ఆరు సీట్లు ఖాళీ ఉన్న రీత్యా 239 మంది సభ్యులు ఓటింగ్ లో పాల్గొనాల్సి ఉంది. ఉభయ సభల్లో మొత్తం 781 మంది సభ్యులు ఓటింగ్ లో పాల్గొనాల్సి ఉండగా బీజేడీ నుంచి ఏడుగురు, బీఆర్ఎస్ నుంచి నలుగురు ఓటింగ్‌కు గైరు హాజరు కావాలని నిర్ణయించడంతో కేవలం 770 మంది మాత్రమే ఓటింగ్‌లో పాల్గొననున్నారు. వీరిలో 386 ఓట్లు ఎవరికి లభిస్తే వారు ఉప రాష్ట్రపతి అవుతారు.

ఇండీ కూటమి 42 ఓట్ల దూరం

జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి కాంగ్రెస్, సమాజ్‌వాదీ, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, శివసేన(ఉద్ధవ్ ఠాకరే), ఎన్సీపీ(శరద్ పవార్), ఆర్జేడీ, సీపీఎం, సీపీఐ, ఐయూఎంఎల్, జేఎంఎం, సీపీఐఎంఎల్, నేషనల్ కాన్ఫరెన్స్, వీసీకే, భారత్ ఆదివాసీ పార్టీ, కేరళ కాంగ్రెస్, ఎండీఎంకే, ఆర్ఎల్‌టీపీ, ఆర్ఎస్‌పీ, ఎంఎన్ఎం(కమల్ హాసన్) ఏజీఎం, కేరళ కాంగ్రెస్(మణి) మద్దతును ప్రకటించాయి. ఇండియా కూటమికి కనీసం 324 ఓట్లు లభించే అవకాశాలున్నాయి. దాదాపు 100 ఓట్లకు పైగా వ్యత్యాసం కనిపిస్తున్నప్పటికీ సంఖ్యాబలం పెంచుకోవడానికి ఇరు వర్గాలు కొద్ది రోజులుగా గట్టి ప్రయత్నాలు చేస్తున్నాయి. బీజేపీ తన ఎంపీలను ఢిల్లీకి రప్పించి వర్క్‌షాప్ నిర్వహించింది. ఏపీ ఐటీ మంత్రి లోకేష్ స్వయంగా వచ్చి తెలుగుదేశం ఎంపీలందరితో సమావేశం ఏర్పాటు చేశారు. ఒక్క ఓటు కూడా వృధా కాని వ్వొద్దని, రాధాకృష్ణన్ గెలుపు ప్రజాస్వామ్యానికి అవశ్యమని సూచించారు. ఇండీ కూటమి కూడా తమ ఎంపీలందర్నీ ఢిల్లీలో మోహరించింది. కాంగ్రెస్ తన ఎంపీలతో మాక్ ఓటింగ్ నిర్వహించి, వారికి శిక్షణనిచ్చింది. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి దేశవ్యాప్తంగా పర్యటించి, ఇండియా కూటమి నేతలను కలుసుకున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కూటమి నేతలందరితోనూ ఫోన్‌లో మాట్లాడుతున్నారు. ఒక్క ఓటు కూడా వృధా కాకుండా అందర్నీ రప్పించే ప్రయత్నం చేస్తున్నారు.

ఎన్డీఏకి గెలిపించేంత బలం

ఎన్డీఏకు ఇప్పటికే 422 మంది సంఖ్యాబలం (లోక్‌సభలో 293, రాజ్యసభలో 129) ఉన్నది. బీజేపీకి టీడీపీ, జేడీయూ, శివసేన(షిండే) లోక్ జనశక్తి(చిరాగ్ పశ్వాన్), అన్నాడీఎంకే, జేడీఎస్, జనసేన, రాష్ట్రీయ లోక్‌దళ్, అప్నాదళ్(సోనేలాల్), ఎన్సీపీ అజిత్ పవార్ వర్గం, ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్, హిందూస్తానీ ఆవామ్ మోర్చా, సిక్కిం క్రాంతికారీ మోర్చా, ఏజీపీ, యుపిపిఎల్, ఎన్‌పీపీ, ఆర్ఎల్ఎం, టీఎంసీ, ఆర్‌పీఐ, వైసీపీ, పలువురు స్వతంత్ర సభ్యులు, నామినేటెడ్ సభ్యులు మద్దతునిస్తున్నారు.

కన్నకొడుకును నిప్పుపెట్టి చంపేశారు!

వ్యసనాలకు బానిసై వేధిస్తున్నాడని తల్లిదండ్రుల ఘాతుకం



అనిల్ (ఫైల్)

బెంగళూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మద్యం, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసై వేధిస్తున్న కుమారుడిని తల్లిదండ్రులు, సోదరుడు మూకుమ్మడిగా కడతేర్చారు. కాళ్లూ చేతులు కట్టేసి, అతనిపై డీజిల్ పోసి నిప్పంటించారు. కర్ణాటక రాష్ట్రం బిదరి గ్రామంలో ఈ నెల 5న ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన పరప్ప, శాంతి దంపతుల కుమారుడు అనిల్ పరప్ప కానట్టి(32) మద్యానికి బానిసయ్యాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడుతూ, విలాసవంతంగా జీవించేవాడు. వ్యసనాల కోసం ఇప్పటికే అతను చేసిన రూ.20 లక్షల అప్పును తల్లిదండ్రులు తీర్చారు. తాజాగా మరో రూ.5 లక్షలు అప్పు చేశాడు. ఆస్తిలో వాటా ఇవ్వాలని తల్లిదండ్రులను వేధించడం ప్రారంభించాడు. పొలాన్ని ఇస్తే అమ్మేస్తాడని తల్లిదండ్రులు భావించారు. ఈ క్రమంలో ఉద్యోగార్థం వేరే ప్రాంతంలో ఉంటున్న అనిల్ తమ్ముడు బసవరాజ కానట్టి ఇటీవల సెలవులపై స్వగ్రామానికి వచ్చాడు. అతడితోనూ అనిల్ గొడవపడ్డాడు. చేతికి చిక్కిన వస్తువులతో తల్లిదండ్రులపై దాడి చేశాడు. దీంతో అందరూ కలిసి అతడి కళ్లలో కారం చల్లి బంధించారు. కాళ్లు, చేతులు కట్టేసి, ఒంటిపై డీజిల్ పోసి నిప్పంటించారు. ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

'సైడ్ ఇన్‌కం' ఉంటే బహిష్కరణే!

» హెచ్1బీ, ఎఫ్1 వీసాదారులకు అమెరికా హెచ్చరిక

వాషింగ్టన్, సెప్టెంబరు 8: అమెరికాలో వలసదారులకు దేశ బహిష్కరణ ముప్పు తీవ్రమైంది. హెచ్1బీ, ఎఫ్1 వీసాదారులు అనధికారికంగా ఉద్యోగాలు చేస్తున్నట్లు తేలితే ముప్పు తప్పదని ఇమ్మిగ్రేషన్ అధికారులు హెచ్చరిస్తున్నారు. అనధికారిక ఉద్యోగాలు(సైడ్ జాబ్స్) చేసేవారిని గుర్తించేందుకు ఇమ్మిగ్రేషన్ అధికారులు ఐఆర్ఎస్(ఇంటర్నల్ రెవెన్యూ సర్వీస్) సమాచారంపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. హెచ్1బీ లేదా ఎఫ్-1 వీసాదారులు అనధికారికంగా ఉద్యోగాలు చేస్తూ ఆదాయం పొందుతున్నట్టు గుర్తిస్తే అలాంటి వారికి వీసా నిరాకరించడం, దేశంలోకి ప్రవేశాన్ని నిరాకరించడంతోపాటు దేశం నుంచి బహిష్కరణకు గురయ్యే అవకాశం కూడా ఉందని తాజాగా ఒక ఆంగ్ల పత్రిక కథనం వెల్లడించింది. సైడ్ ఇన్‌కంను గుర్తించేందుకు పన్నుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు ఆ కథనం పేర్కొంది. 'ఐఆర్ఎస్ స్పష్టంగా ఐసీఈ(ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్)తో సమాచారాన్ని పంచుకుంటోంది. అనధికారికంగా ఉద్యోగాలు చేసేవారిని గుర్తించి చర్యలు చేపట్టే ప్రక్రియను మేం ప్రారంభించాం' అని ఇమ్మిగ్రేషన్ అటార్నీ జత్ షాహ్ తెలిపారు.

రెండో దశ సుంకాలు!

(మొదటి పేజీ తరువాయి)

దేశాలు (ఈయూ) కూడా కలిసి వస్తే.. రెండో దశ సుంకాలు విధించి రష్యా మీద ఒత్తిడి పెంచుతామన్నారు. ఫలితంగా రష్యా ఆర్థికవ్యవస్థ కుప్పకూలుతుందని, పుతిన్ చర్చలకు రాక తప్పని పరిస్థితి నెలకొంటుందని స్కాట్ పేర్కొన్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధంపై స్పందిస్తూ.. 'ఉక్రెయిన్ సైన్యం ఎంతకాలం ఎదుర్కొంటుంది.. రష్యా ఆర్థిక వ్యవస్థ ఎంతకాలం తట్టుకొని నిలబడగలుగుతుంది అన్నదే ప్రధానం. ఈ రెండింటి మధ్యే ఇప్పుడు రేసు నడుస్తోంది' అని స్కాట్ వివరించారు. మరోవైపు, అమెరికా వాణిజ్య భాగస్వామ్య దేశాలపై ట్రంప్ విధించిన సుంకాలు చట్టవ్యతిరేకమని దేశ సుప్రీంకోర్టు కొట్టేస్తే.. వాటిలో సగమైనా ఆయా దేశాలకు, సంస్థలకు తక్షణం తిరిగి చెల్లించాల్సి ఉంటుందని స్కాట్ బెసెంట్ తెలిపారు. అదే పరిస్థితి వస్తే ఆర్థికశాఖకు మోయలేని భారం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశిస్తే వాటిని పాటించకతప్పదని స్పష్టం చేశారు. ట్రంప్ విధించిన సుంకాలు చట్టవ్యతిరేకమని గత నెల అమెరికాలో ఒక దిగువస్థాయి కోర్టు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది.

ట్రంప్‌తో పంచాయితీ తెగకుంటే వచ్చే ఆర్థిక సంవత్సరం కష్టమే

» భారత ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 8: ట్రంప్ టారిఫ్‌ల మోత కారణంగా భారత్ వృద్ధిరేటులో 0.5% నుంచి 0.6% వరకు కోత పడవచ్చని భారత ముఖ్య ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ అన్నారు. బ్లూమ్‌బెర్గ్ టీవీ చానెల్‌కు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. రష్యా చమురు కొనుగోలు కారణంగా భారత్ మీద అదనంగా వేసిన ప్రతీకార ట్యారిఫ్‌ల వ్యవహారం కొంతకాలమే ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ట్యారిఫ్‌ల అనిశ్చితి వచ్చే ఆర్థిక సంవత్సరానికి కూడా కొనసాగితే మాత్రం ప్రభావం తీవ్రంగా ఉంటుందని, భారత్‌కు ముప్పు తప్పదని హెచ్చరించారు. 2026 మార్చితో ముగిసే ఆర్థిక సంవత్సరానికి భారత ప్రభుత్వం 6.3 నుంచి 6.8 శాతం వృద్ధిరేటును ఆశిస్తోంది. మొదటి మూడు నెలల వృద్ధిరేటు భారీగా 7.8 శాతం నమోదైన నేపథ్యంలో భారత్ భారీ అంచనాల్లో ఉంది. జీఎస్టీ సంస్కరణలతో పన్నురేట్లు భారీగా తగ్గడం, ద్రవ్యోల్బణం బాగా తగ్గిపోవడం ఆర్థిక వ్యవస్థల మీద ఆశలు రేకెత్తిస్తున్నాయని నాగేశ్వరన్ చెప్పారు.

ఏ దేశంలో వారికి ఆ దేశంలోనే!

» వలసేతర వీసాల ఇంటర్వ్యూలపై అమెరికా రూల్స్ టఫ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 8: వలసేతర వీసా(నాన్ ఇమ్మిగ్రెంట్).. బీ-1(వ్యాపారం), బీ-2(పర్యాటకం) ఇంటర్వ్యూలకు సంబంధించిన నిబంధలను మరింత కఠినతరం చేస్తూ అమెరికా విదేశాంగ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం వలసేతర వీసా కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఇక నుంచి వారి స్వదేశంలో లేదా, చట్టపరమైన నివాసం ఉన్న ప్రాంతాల్లో మాత్రమే ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ ఉత్తర్వులు భారతీయులు సహా అన్ని దేశాల పౌరులకు వర్తిస్తాయని, తక్షణమే అమల్లోకి వస్తాయని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. స్వల్ప కాలంలో ఇంటర్వ్యూలు పొందాలనుకునే వారు ఇప్పటి వరకు వారు పనిచేస్తున్న దేశాల నుంచి వలసేతర వీసాలకు దరఖాస్తు చేసుకుని, అక్కడే ఇంటర్వ్యూలకు హాజరయ్యేవారు. తాజా నిబంధనతో వీరు ఇకపై ఆ అవకాశాన్ని కోల్పోనున్నారు. "దరఖాస్తుదారులు వారి స్వదేశం లేదా చట్టపరమైన నివాసం ఉన్న ప్రాంతాల్లోని అమెరికా దౌత్యకార్యాలయాలు, కాన్సులేట్‌లలో మాత్రమే ఇంటర్వ్యూలకు అర్హులు." అని ఉత్తర్వులో అధికారులు పేర్కొన్నారు.

ఆ వ్యాధి ఇంకెక్కడా రాకూడదు

- కేస్ స్టడీగా తురకపాలెం జ్వరాలు
- రాష్ట్ర వ్యాప్తంగా ముందస్తు జాగ్రత్తలు
- గ్రామంలో మట్టి నమూనాల సేకరణ
- గాలి నాణ్యత పరీక్షలు చేసిన నిపుణులు
- తురకపాలానికి నేడు ఐసీఎంఆర్ బృందం
- గ్రామంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే పల్లె నిద్ర


గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో తురకపాలెం వంటి జ్వరాలు ప్రబలకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గుంటూరు జిల్లాలోని ఆ గ్రామంలో ప్రబలిన జ్వరాలను, నమోదైన మరణాలను కేస్ స్టడీగా తీసుకొని మరెక్కడా ఇలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. తురకపాలెంలో నమోదైన మెలియోయిడోసిస్ జ్వరాలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపాయి. వీటిని సకాలంలో గుర్తించి చికిత్స చేయకపోతే మరణాల శాతం అధికంగా ఉంటుందని వైద్యనిపుణులు ప్రభుత్వానికి నివేదించారు. ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖకు సీఎం చంద్రబాబు పలు సూచనలు చేశారని తెలిసింది. ఈ తరహా జ్వరాల నిర్ధారణ, చికిత్సలకు ప్రామాణిక నిర్వహణ మార్గదర్శకాలు (ఎస్‌వోపీ) రూపొందించాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వ వైద్య కళాశాల మైక్రోబయాలజీ విభాగాల్లో బ్లడ్ కల్చర్ పరీక్షలు ఇకపై 24 గంటలూ నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ నిర్ణయించింది.

ఎమ్మెల్యే సహపంక్తి భోజనం

గ్రామస్తులకు భరోసా కల్పిస్తూ ప్రత్తిపాడు శాసనసభ్యుడు బూర్ల రామాంజనేయులు సోమవారం గ్రామస్తులతో సహపంక్తి భోజనం చేశారు. అదేవిధంగా గ్రామస్తుల్లో ధైర్యం నింపేందుకు పల్లె నిద్ర కార్యక్రమం కింద తురకపాలెంలోనే రాత్రి నిద్రించారు.

నమూనాలు సేకరించిన నిపుణుల బృందం

ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్) సూచించిన హైదరాబాదులోని లాబొరేటరీ బృందం సోమవారం తురకపాలెంలోని ఎనిమిది ప్రాంతాల్లో పరీక్షల కోసం మట్టి నమూనాలు సేకరించారు. గనులు, భూగర్భ శాఖ, ఏపీ పీసీబీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన గాలి నాణ్యత పరీక్షల్లో అన్ని స్థాయిలు సాధారణంగానే ఉన్నాయని ఫలితాలు వచ్చాయి. గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకులు, డ్రైన్లు, మంచి నీటి వాల్వ్ పిట్స్ శుభ్రపర్చి, ఫాగింగ్, ఎబెట్ స్ప్రే చేస్తున్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో గ్రామంలో 4 వేల లీటర్ల సామర్థ్యం గల 20 ట్యాంకర్లు, 12 వేల లీటర్ల సామర్థ్యం గల 3 ట్యాంకర్ల ద్వారా మంచి నీటిని సరఫరా చేశారు. సోమవారం గ్రామంలో 3,829 మందికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించారు.


నీటి నమూనాలు సేకరిస్తున్న ల్యాబ్ సిబ్బంది

ఇద్దరికి మెలియోయిడోసిస్

ఢిల్లీ నుంచి భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) నిపుణుల బృందం మంగళవారం తురకపాలానికి రానుంది. గ్రామాన్ని సందర్శించి ఆరోగ్య పరిస్థితులను సమీక్షిస్తుంది. ప్రస్తుతం ఏడుగురు తురకపాలెం వాసులు అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారని, వీరిలో పి.ఎలీషా, పి.నరసింహారావుకు మెలియోయిడోసిస్ వ్యాధి నిర్ధారణ అయిందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ తెలిపారు. వీరి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని వివరించారు. మరోపక్క జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వైద్యులతో పాటు మంగళగిరి ఎయిమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం వైద్యులు, ఆస్టర్ రమేశ్ ఆసుపత్రి వైద్యనిపుణులు గ్రామంలో ఓపీ వైద్య సేవలు అందించారు. పది బృందాలు ఇంటింటి సర్వే చేస్తూ గత మూడు రోజుల్లో 1,501 రక్త నమూనాలను సేకరించాయి. వాటిని ల్యాబ్‌లకు పంపారు. ఈ కార్యక్రమాలపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నోడల్ అధికారి డాక్టర్ ఎ. సిరి ఆధ్వర్యంలో సమీక్ష జరిగింది.

పరీక్షకు అనుమతించలేదని.. ప్రొఫెసర్‌పై కత్తితో దాడి

- నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఎంటెక్ విద్యార్థి ఘాతుకం
- ప్రొఫెసర్‌కు తీవ్ర గాయాలు.. విద్యార్థి అరెస్టు

నూజివీడు టౌన్, అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పరీక్షకు అనుమతించలేదని ఆగ్రహంతో ఊగిపోయిన ఓ ఎంటెక్ విద్యార్థి.. ఏకంగా ప్రొఫెసర్‌పైనే కత్తి దూశాడు. విచక్షణారహితంగా దాడికి దిగి తీవ్రంగా గాయపరిచాడు. ఆర్జీయూకేటీ నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సోమవారం జరిగిన ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ విద్యను అందించే నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఎంటెక్ విద్యను సైతం అందిస్తున్నారు. అయితే దీన్ని రెండేళ్ల పాటు పూర్తి రెసిడెన్షియల్ విధానంలో అభ్యసించాలి. కానీ.. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం వడ్డిగూడెంకు చెందిన మద్ది వినయ్ పురుషోత్తమ్ అనే విద్యార్థి క్యాంపస్ హాస్టల్లో వసతి పొందుతూ తరగతులకు హాజరుకాలేదు. 74 శాతం హాజరు లేకపోవడంతో హెచ్‌వోడీతోపాటు ట్రిపుల్ ఐటీ ఉన్నతాధికారులు దీనిపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ వినయ్‌ను పరీక్షలకు అనుమతించలేదు. సోమవారం మొదటి సంవత్సరం ల్యాబ్ పరీక్ష ఉండగా... దాన్ని క్యాంపస్ సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ గోపాలరాజు పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం ఎగ్జామ్ హాల్‌కు వచ్చిన వినయ్‌ను ఆయన పరీక్ష రాయనివ్వలేదు. దీంతో వినయ్ పరీక్ష హాలులోనే ఉండిపోయాడు. అయితే పరీక్ష జరుగుతున్న సమయంలో ఇక్కడ ఉండకూడదని భావించిన ప్రొఫెసర్ గోపాలరాజు.. సెక్యూరిటీ సిబ్బందిని పిలిచి వినయ్ బయటకు పంపించాలని సూచించారు. దీంతో ఒక్కసారిగా ఆగ్రహానికి గురైన వినయ్.. తనవెంట తెచ్చుకున్న కత్తితో గోపాలరాజుపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. పరీక్ష కేంద్రంలోని తోటి విద్యార్థులు నిర్ఘాంతపోయారు. కొందరు వినయ్‌ను అడ్డుకున్నారు. అప్పటికే.. మెడ, చెయ్యి, నుదిటిపై కత్తి గాట్లు పడటంతో గోపాలరాజును నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి వద్ద గోపాలరాజు నుంచి వివరాలు సేకరించిన పట్టణ పోలీసులు... హత్యాయత్నం కేసు నమోదు చేసి వినయ్‌ను అరెస్టు చేశారు.


గాయపడిన ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్ గోపాలరాజు

విద్యార్థుల్లో క్రమశిక్షణ లేమిని ఉపేక్షించం: మంత్రి లోకేశ్

ఆర్జీయూకేటీ నూజివీడు క్యాంపస్ ప్రొఫెసర్ గోపాలరాజుపై ఎంటెక్ విద్యార్థి దాడికి పాల్పడటాన్ని మంత్రి లోకేశ్ సోమవారం తీవ్రంగా ఖండించారు. మొదటి సెమిస్టర్‌లో సరిపడా హాజరు లేకపోవడం వల్లే ఆ విద్యార్థిని ప్రాక్టికల్ పరీక్షలకు అనుమతించలేదని తెలిపారు. 'విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో గురువులది కీలక పాత్ర. విద్యార్థి జీవితాన్ని పాడుచేయాలని ఏ అధ్యాపకుడూ భావించరు. ప్రొఫెసర్‌పై దాడికి పాల్పడిన విద్యార్థి వినయ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ లేమి, హింసా ప్రవృత్తిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించం' అని లోకేశ్ పేర్కొన్నారు.


దుబాయ్‌లో పశ్చిమగోదావరి ప్రవాసీయుల వినాయక పూజ

గల్ఫ్‌లో ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

గల్ఫ్‌లో వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. దుబాయ్‌లో మినీ భారత్‌గా పిలిచే సోనాపూర్‌లో పదేళ్లుగా వినాయకచవితి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది కూడా ప్రముఖ భారీ యంత్రాల సంస్థ కార్మికుల క్యాంప్ ఆవరణలో ఏర్పాటుచేసిన ఏకదంతుని విగ్రహాన్ని రోజూ వేలాది మంది భక్తులు సందర్శించుకుని పూజలు నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా ప్రవాసీయుల ఆధ్వర్యంలో నిమజ్జన కార్యక్రమాన్ని కూడా అత్యంత భక్తిశ్రద్ధలతో పూర్తిచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక తదితర దేశాల వారితో సహా మొత్తం పది వేల మంది పాల్గొన్నట్లు కార్యక్రమ నిర్వాహకుడైన తాడేపల్లిగూడెం మండలం దర్శిపురానికి చెందిన పంతం సుబ్బరాజు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన అబ్దుల్ నాజర్, అరబ్బుల సహాయంతో తమ జిల్లా వాసులు పదేళ్లుగా ఈ కార్యక్రమం చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన ప్రవాసుల సహకారం కూడా మరువలేనిదన్నారు. ఇక.. సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో నిడదవోలు నియోజకవర్గానికి చెందిన యోగేశ్వరరావు.. ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన అనేక మంది భక్తుల సమక్షంలో వినాయకుడి నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.

తెరుచుకున్న శ్రీవారి ఆలయం తలుపులు

తిరుమల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రహణంతో మూతబడిన తిరుమల శ్రీవారి ఆలయం తలుపులు సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు తిరిగి తెరుచుకున్నాయి. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు తలుపులు మూసివేసిన విషయం తెలిసిందే. సోమవారం వేకువజామున ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం, కైంకర్యాలు నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు.

సింధూర నారాయణకు సౌత్ ఇండియా బిజినెస్ అవార్డ్

హైదరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో చేసిన కృషికి నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పి.సింధూర నారాయణ దుబాయ్‌లో సౌత్ ఇండియా బిజినెస్ అవార్డ్-25 అందుకున్నారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి వేర్వేరు రంగాల్లో రాణిస్తున్న వారిని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు సోమవారం ప్రకటనలో తెలిపారు. పదేళ్లకు పైగా సినీ రంగానికి చెందిన వ్యక్తులను గౌరవిస్తున్న సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ సంస్థ.. వ్యాపార రంగంలో ఉన్నత విలువలు, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఈ అవార్డును అందిస్తోంది. అవార్డ్ స్వీకరించిన సందర్భంగా సింధూర నారాయణ మాట్లాడుతూ.. ముందు ఉత్పత్తి చేసి దానికి మార్కెట్ వెతకడం కంటే ఉన్న సమస్యలకు పరిష్కారం చూపడం ముఖ్యం అన్నారు. నారాయణ విద్యాసంస్థల్లో ప్రతి విద్యార్థి సమగ్రాభివృద్ధి సాధించే విధంగా పాఠ్యప్రణాళికలను రూపొందించినట్లు చెప్పారు. నారాయణ విద్యా సంస్థలు ఆసియాలో అతి పెద్ద విద్యా సంస్థల్లో ఒకటిగా ఎదిగిందన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తూ.. మీ కలలే మా కలలు అనే నినాదాన్ని నిజం చేస్తున్నామన్నారు. విద్యారంగంలో సింధూర నారాయణ చేసిన కృషిని నిర్వాహకులు ఈ సందర్భంగా కొనియాడారు.


సింధూర నారాయణ

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నేపాల్‌లో యువ ప్రభంజనం

సోషల్ మీడియాపై ప్రభుత్వ నిషేధాన్ని నిరసిస్తూ నేపాల్‌లో యువతరం చేపట్టిన ఉద్యమాన్ని మీడియా 'జెన్ జీ రివల్యూషన్'గా అభివర్ణిస్తోంది. వేలాదిమంది యువతీయువకులు ఏకంగా పార్లమెంట్ భవనం మీదకు లంఘించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ప్రభుత్వ బలగాలు ఏకంగా కాల్పులకు తెగబడటంతో పదహారు మంది మరణించారనీ, వందలాది మంది గాయపడ్డారని వార్తలు వస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో హసీనా ప్రభుత్వం తరహాలో నేపాల్‌లో ఓలి తీవ్ర దమనకాండకు పాల్పడుతున్నా యువత వెనకడుగువేయడం లేదు. పాతికకుపైగా సామాజిక వేదికలు నిషేధానికి గురైన వెంటనే, ఒక ప్రధాన నాయకుడంటూ లేకపోయినా, టిక్‌టాక్ ఆధారంగా ఇంతటి భారీ స్థాయి జనసమీకరణతో సాగుతున్న ఈ ఉద్యమం ఓలి ప్రభుత్వాన్ని దిగివచ్చేట్టు చేస్తుందా, ప్రభుత్వమే కూలిపోయే పరిస్థితులు ఏర్పడతాయా అన్నది చూడాలి.

ఓలి ప్రభుత్వం చైనా యాప్‌లను అనుమతించి, అమెరికా సోషల్ మీడియాను నిషేధించడంతో ఈ ఆగ్రహం వెల్లువెత్తిందనీ, ఉద్యమం వెనుక అమెరికా కుట్ర ఉన్నదన్న విమర్శలను అటుంచితే, అమెరికా కంపెనీలు నేపాల్ నిబంధనలకు, చట్టాలకు అనుగుణంగా నడుచుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిన మాట వాస్తవం. అన్ని సోషల్ మీడియా సంస్థలు నేపాల్‌లో నమోదు కావాలనీ, స్థానిక ప్రతినిధి, ఫిర్యాదుల పరిష్కర్త వంటి అధికారులను నియమించాలంటూ గత ఏడాది నేపాల్ సుప్రీంకోర్టు ఆదేశించింది. తదనుగుణంగా నేపాల్ రూపొందించిన నిబంధనలకు చైనా యాప్‌లు రిజిస్టర్ చేసుకున్నాయి కానీ, ప్రధాన ప్లాట్‌ఫామ్‌లు దిగిరాలేదు. నేపాల్ ప్రభుత్వం పలుమార్లు గడువులు పెంచుతూ చివరకు సెప్టెంబర్ 4న 26 అప్లికేషన్లను బ్లాక్ చేసింది. ప్రధానంగా అమెరికన్ సంస్థలు మా దేశ చట్టాల పట్ల ఇలా అగౌరవంగా వ్యవహరించడంతో, ఈ చర్యద్వారా నేపాల్ తన ఆత్మగౌరవాన్ని కాపాడుకున్నదని ప్రభుత్వం చెబుతోంది. నేపాల్‌లో దాదాపు కోటి ముప్పైఐదులక్షల మంది ఫేస్‌బుక్ వినియోగదారులున్నారు. ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి అప్లికేషన్లకు లక్షలాదిమంది ఉన్నారు. ఇప్పుడు ఉద్యమిస్తున్న యువతరం సోషల్ మీడియాకు బానిసలు అయిపోవడంతో ఆత్మాభిమానాన్ని కూడా వదిలేసి, ఇలా రోడ్లమీదకు వచ్చారని కొందరు చులకనగా మాట్లాడుతున్నారు. సోషల్ మీడియా ఈ జెన్ జనరేషన్‌కు ఉల్లాసం, ఉత్సాహంతో పాటు ఉపాధి కూడా ఇస్తున్నది. సమస్త సమాచారాన్ని అరచేతిలో చూడగలగడంతో పాటు, ఈ నెట్‌వర్క్ ద్వారా వ్యాపారాలు చేసుకుంటూ, పలువిధాలుగా ఆదాయాలను సంపాదించుకుంటున్న యువత పెద్దసంఖ్యలో ఉన్నారు. స్వదేశంలో ఉపాధిలేక సంపాదనకోసం ఇతర దేశాలకు తరలిపోయిన లక్షలాది మంది నేపాలీ యువత తమ కుటుంబీకులతో, బంధుమిత్రులతో సంభాషించే అవకాశాన్ని కూడా కోల్పోతారు.

నిర్దిష్టమైన ఎజెండా, డిమాండ్లు లేనట్టు పైకి కనిపిస్తున్నప్పటికీ, సోషల్ మీడియాను పునరుద్ధరించాలన్న నినాదం మరింత విస్తరించి, ఇప్పుడు పాలకుల అవినీతినీ, బంధుప్రీతినీ కూడా ప్రశ్నిస్తోంది. పాలకుల, వారి పుత్రరత్నాల విలాసవంతమైన జీవితాలను సామాన్యుల బతుకు కష్టంతో పోలుస్తూ 'నెపో బేబీ' వంటి ట్రెండ్స్ విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. 'నాయకుల పిల్లలు విమానాల్లో వస్తారు, సామాన్యుల పిల్లలు శవపేటికలో తిరిగివస్తారు' వంటి నినాదాలు ప్రజలను ప్రభావితం చేస్తాయి. రాబడికోసమో, రాజ్యాంగ నిబంధనల కోసమో సామాజిక మాధ్యమాలను నిషేధించలేదని, పాలకుల అవినీతి ప్రజలకు తెలియకుండా, వారిపై విమర్శలు, ప్రశ్నలు వ్యాప్తిచెందకుండా, ఈ నిషేధం అమలు చేశారని ఉద్యమకారుల అభిప్రాయం. సామాజిక మాధ్యమాలతోనే పలు దేశాల్లో అవినీతి ప్రభుత్వాలు కూలిపోయినందున నేపాల్ పాలకులు భయపడుతున్నారని వారంటారు.

నిప్పంటూ అంటుకున్నాక అది ఎంతకాలం మండుతుందో, ఎక్కడికి పాకుతుందో, వేటిని తగలబెడుతుందో చెప్పలేం. నేపాల్‌లో యువతరం తన గుండెలను మండిస్తున్న అంశాలన్నింటినీ ఇప్పుడు ముందుపెడుతోంది. దేశ సమూల ప్రక్షాళనకు నడుంబిగిస్తోంది. తమ అధికారకాంక్షతో ఓలి, ప్రచండ నేపాల్ రాజకీయాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించారు. ఒకరి కుర్చీ ఒకరు లాగుతూ రాజ్యాంగాన్నీ, చట్టాలను అపహాస్యం చేస్తూంటే, మిగతాపక్షాలన్నీ అధికారకోసం, అవినీతిలో వాటాకోసం వీరితో వంతులవారీగా చేతులు కలుపుతున్నాయి. నేపాల్ ప్రజలు అనతికాలంలోనే ప్రజాస్వామ్యం మీద నమ్మకం కోల్పోయారు. మళ్ళీ రాజుగారు రావాలంటూ అక్కడ ఉద్యమం మొదలైంది కూడా. యువత ఆందోళనలకు తలొగ్గి, ఆత్మగౌరవాన్ని కూడా వెనక్కునెట్టి, సోషల్ మీడియాపై నిషేధాన్ని ఓలి ప్రభుత్వం ఎత్తివేయవచ్చు. కానీ, ఈ ఉద్యమం నేపాల్ అధికారపక్షాలన్నింటికీ ఒక బలమైన హెచ్చరిక.

భారత్ చేయి విడిస్తే అమెరికాకే భారం

భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం అమెరికాకు కలిమి, బలిమి కలిగించేదేకానీ భారమయ్యేది కాదు, కాబోదు. అయినా ప్రపంచ అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాన్ని ప్రపంచ పురాతన ప్రజాస్వామిక రాజ్యం ఎందుకు దూరం చేసుకుంటోంది? 1940ల తుదినాళ్లలోను, 1950ల తొలినాళ్లలోను 'చైనాను కోల్పోయింది ఎవరు?' అన్న అంశంపై అమెరికాలో తీవ్ర చర్చ జరిగింది. అక్టోబర్ 1949లో జనచైనా (పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా) ఆవిర్భావం అమెరికా రాజకీయ వేత్తలు, శాసన నిర్మాతలను అమితంగా కలవరపరిచింది. మహానాయకుడు మావో నేతృత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ చాంగ్–కై–షేక్ నాయకత్వంలోని జాతీయవాద కొమింగ్‌టాంగ్‌ను ఓడించి జనచైనాను నెలకొల్పింది. ఈ పరిణామం కమ్యూనిజంపై ప్రచ్ఛన్న యుద్ధంలో ప్రజాస్వామ్యానికి ఒక వినాశనకర ఓటమిగా, అమెరికా విదేశాంగ విధానం వైఫల్యంగా వాషింగ్టన్ పాలకవర్గాలు భావించాయి.

భారత స్వాతంత్ర్య శతాబ్ది (2047) నాటికి, లేదా ఆలోగానే మరొక పరిణామం అమెరికా పాలకవర్గాలలో మరో తీవ్ర అలజడికి కారణమయ్యేందుకు ఆస్కారమున్నది. అమెరికాకు దూరమై, చైనా, రష్యాలకు భారత్ సన్నిహితమవడమే ఆ సంభావ్య పరిణామం. అదే జరిగితే 'భారత్‌ను కోల్పోయింది ఎవరు?' అనే విషయమై అమెరికాలో సంచలనశీల వాదోపవాదాలు జరగడం ఖాయం.

భారత్‌తో మైత్రి పెద్దగా ప్రాధాన్యం లేని విషయంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యవహరిస్తున్నారు! ఇది సబబేనా? అమెరికా–భారత్ స్నేహబంధం 21వ శతాబ్ది అత్యంత ప్రధానమైన వ్యూహాత్మక భాగస్వామ్యాలలో అగ్రగణ్యమైనది. రక్షణ రంగంలో సహకారం, సాంకేతికతల ఆదాన ప్రదానాల నుంచి పసిఫిక్ మహాసముద్ర తీరస్థ ప్రాంతాలలో శాంతి సుస్థిరతలకు ఇతోధిక కృషి దాకా పరస్పర గౌరవ విశ్వాసాలు, ఉమ్మడి ప్రయోజనాలకు దృఢమైన పునాదులను న్యూఢిల్లీ, వాషింగ్టన్ నిర్మించుకున్నాయి.

అయితే ఇప్పుడు ఆ పునాదులు కదిలిపోతున్నాయి. కారణమేమిటి? భారత్‌పై కనీవినీ ఎరుగని రీతిలో ట్రంప్ విధిస్తున్న ప్రతీకార సుంకాలు, భారత్ పట్ల ఆయన ప్రదర్శిస్తున్న తిరస్కారపూరిత వైఖరి. ఇవి ఉభయ దేశాల మధ్య దౌత్య ఘర్షణలకు దారితీస్తున్నాయి. అమెరికాకు ప్రధాన శత్రువు అని భావిస్తున్న చైనాపై 30 శాతం సుంకాలు, ఇతర ఆసియా దేశాలపై 15 నుంచి 20 శాతం సుంకాలు మాత్రమే విధించిన ట్రంప్ భారత్‌పై ఏకంగా 50 శాతం సుంకాలు విధించారు! అమెరికా ప్రజలు సైతం హర్షించని నిర్ణయమిది అనడంలో సందేహం లేదు. పాతికేళ్లుగా భారత్–అమెరికా సంబంధాలను నిర్వచించి, నిర్ణయిస్తున్న, నిర్దేశిస్తున్న 'వ్యూహాత్మక భాగస్వామ్యం' ఏమయింది? ట్రంప్ నిర్ణయాలు, చర్యలు దానికి సమాధి తవ్వుతున్నాయి.

అయితే ఆ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కాపాడుకుని పెంపొందించుకునేందుకు ఇంకా కాలం మించిపోలేదు –వాషింగ్టన్ అభిలషిస్తే. భారత్ పట్ల ఘర్షణాత్మక వైఖరిని అమెరికా విడనాడాల్సిన సమయమాసన్నమయింది. బీటలువారుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పునరుద్ధరించుకుని దృఢతరం చేసుకోవాల్సిన ఆగత్యం ఎంతైనా ఉన్నది. ఇది ఇరుదేశాల ప్రయోజనాల పరిరక్షణకే కాకుండా ప్రపంచ దేశాల విస్తృత లబ్ధికి కూడా చాలా అవసరం.



భారత్ వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి తన సార్వభౌమత్వాధికార వ్యక్తీకరణేగానీ, ఏ దేశాన్నీ ధిక్కరించడంగానీ, సవాల్ చేయడం గానీ కాదని అమెరికా గుర్తించాలి. విదేశీ వాణిజ్యంలో ఏ దేశమైనా స్వీయ జాతీయ ప్రయోజనాలకే అగ్ర ప్రాధాన్యమిస్తుంది. మరి రష్యా నుంచి చమురు, సహజవాయువు, సైనిక సామగ్రి కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌ను ప్రతీకార సుంకాలతో శిక్షించడం సమంజసమేనా, ట్రంప్ గారూ?

ఆగస్టు 26–27 అర్ధరాత్రి భారతీయ సరకులపై సుంకాలను రెట్టింపు (50 శాతం) చేశారు. అమెరికాకు భారత్ ఎగుమతి చేస్తున్న 8,700 కోట్ల డాలర్ల విలువైన సరుకులలో 4,800 కోట్ల డాలర్ల విలువైన సరుకులపై ఈ సుంకాల పెంపుదల భారం పడింది. జౌళి, బంగారు ఆభరణాలు, ముత్యాలు, చర్మ ఉత్పత్తులు, సముద్ర ఆహారోత్పత్తులు (ముఖ్యంగా రొయ్యలు), ఆటోమొబైల్స్ విడిభాగాల ఎగుమతులు ఈ సుంకాల భారాన్ని భరించవలసివున్నది. ప్రస్తుతానికి ఫార్మాస్యూటికల్స్, ఎలక్ట్రానిక్ వస్తువులను ఈ సుంకాల పెరుగుదల నుంచి మినహాయించారు.

భారత్ ఎగుమతులపై అమెరికా సుంకాల పెరుగుదలకు కారణమేమిటి? రష్యా నుంచి చమురు, సహజ వాయువు, సైనిక సామగ్రిని భారత్ కొనుగోలు చేయడమే! ఈ కొనుగోళ్ల నుంచి లభిస్తున్న ఆదాయంతోనే రష్యా, ఉక్రెయిన్‌పై ఎడతెగని యుద్ధం చేయగలుగుతోందని ట్రంప్ ఆరోపిస్తున్నారు. ఈ అభియోగాన్ని న్యూఢిల్లీ తీవ్రంగా ఖండించింది. అదొక నిరాధారమైన ఆరోపణ అని సహేతుకంగా స్పష్టం చేసింది. చైనా తమకంటే చాలా పెద్ద ఎత్తున రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుందని, యూరోపియన్ యూనియన్ దేశాలు కూడా రష్యా నుంచి 6,700 కోట్ల డాలర్ల విలువైన సరుకులు దిగుమతి చేసుకుంటున్నాయని, అయినా చైనా, యూరోపియన్ దేశాలపై అమెరికా అధిక సుంకాలు విధించలేదని భారత్ ఆక్షేపించింది. భారత్‌పైనే వివక్ష ఎందుకు అని ప్రశ్నించింది.

ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలు కేవలం ఆర్థిక జరిమానాలు కాదు. అవి రాజకీయ సంకేతాలు. వ్యూహాత్మక స్వతంత్ర ప్రతిపత్తితో వ్యవహరిస్తున్నందుకు భారత్‌కు శిక్షగా అమెరికా ఆ ప్రతీకార సుంకాలు విధించిందని న్యూఢిల్లీ అధికార వర్గాలు సునిశ్చితంగా విశ్వసిస్తున్నాయి. ఆ సుంకాల పర్యవసానాలు భారత్‌కు తీవ్ర నష్టదాయకంగా పరిణమించనున్నాయి. అమెరికా విపణిలో భారతీయ సరుకులు పోటీ సామర్థ్యాన్ని కోల్పోనున్నాయి. స్వదేశంలో తిరుపూర్, సూరత్, విశాఖపట్నంలో వేలాది కార్మికులు వీధిన పడవలసే పరిస్థితులు నెలకొన్నాయి. అమెరికా వినియోగదారులు అధిక ధరలు భరించవలసిరావడంతో ఆ దేశ వ్యాపారస్తులు ఇప్పటికే వియత్నాం, ఈక్వెడార్, థాయిలాండ్, టర్కీ నుంచి భారతీయ ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా వివిధ సరుకుల దిగుమతికి ఇప్పటికే ఏర్పాట్లు చేసుకొంటున్నారు. సూరత్‌లో బంగారు ఆభరణాల శ్రామికులు, తిరుపూర్‌లో జౌళి కార్మికులు, విశాఖపట్నంలో రొయ్యల సాగుదారులు కోలుకోలేని రీతిలో నష్టాలపాలయ్యారు.

ఇది అటు అమెరికాకు కానీ, ఇటు భారత్‌కు కానీ లాభదాయకం కాని పరిస్థితి. ఉభయులకూ నష్టాలు ఖాయంగా వాటిల్లుతాయి. ఇంకెంత మాత్రం ఈ పరిస్థితి కొనసాగకూడదు. దీనిని తొలగించుకోకపోతే భారత్–అమెరికా ద్వైపాక్షిక సంబంధాలు అడుగంటుతాయి. ఆర్థిక వ్యవస్థల సౌష్ఠవమూ దెబ్బతింటుంది. ఆసక్తికరమైన విషయమేమిటంటే ఈ వాణిజ్య యుద్ధం పెచ్చరిల్లుతున్నప్పటికీ రక్షణ రంగంలో భారత్ అమెరికాల మధ్య సహకారం యథాతథంగా ఉన్నది. సైనిక సహకారాన్ని మరింత దృఢతరం చేసుకునేందుకు, అత్యాధునిక ఆయుధాల ఉత్పత్తిలో భాగస్వామ్యాన్ని పెంపొందించుకొనేందుకు, 'టైగర్ ట్రయంఫ్' పేరిట సంయుక్త సైనిక విన్యాసాలు నిర్వహించేందుకు భారత్, అమెరికాలు ఫిబ్రవరి 2025లో పరస్పరం సంకల్పించుకున్నాయి. పలు అత్యాధునిక యుద్ధ విమానాలు, నవీన సైనిక సామగ్రిని అమెరికా నుంచి కొనుగోలు చేసేందుకు భారత్ నిర్ణయించుకున్నది. ట్రంప్ విధించిన ప్రతీకార సుంకాలతో రక్షణ రంగంలో ఈ సహకారానికి తీవ్ర విఘాతమేర్పడే అవకాశమున్నది. భారత్ కేవలం వాణిజ్య భాగస్వామి మాత్రమే కాదు, ఇండో–పసిఫిక్ ప్రాంతంలో ఒక కీలక శక్తి. అమెరికా ఈ వాస్తవాన్ని విస్మరిస్తే 'క్వాడ్' బలహీనపడే ప్రమాదమున్నది. అది, అమెరికాకు ఏ మాత్రం శ్రేయస్కరం కాని పరిణామమవుతుంది.

భారత్ వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి తన సార్వభౌమత్వాధికార వ్యక్తీకరణేగానీ, ఏ దేశాన్నీ ధిక్కరించడంగానీ, సవాల్ చేయడం గానీ కాదని అమెరికా గుర్తించాలి. విదేశీ వాణిజ్యంలో ఏ దేశమైనా స్వీయ జాతీయ ప్రయోజనాలకే అగ్ర ప్రాధాన్యమిస్తుంది. మరి రష్యా నుంచి చమురు, సహజవాయువు, సైనిక సామగ్రి కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌ను ప్రతీకార సుంకాలతో శిక్షించడం సమంజసమేనా, ట్రంప్ గారూ? దూరదృష్టితో తీసుకోని నిర్ణయాలు అమెరికాకు ప్రతికూలంగా పర్యవసించడం ఖాయం. ఉభయతారకం కాని చర్యలకు బదులుగా వాషింగ్టన్ ఇలా వ్యవహరించడం ఇరు దేశాలకూ శ్రేయస్కరంగా ఉంటుంది : ప్రతీకార సుంకాలను, మరీ ముఖ్యంగా శ్రమ సాంద్ర రంగాలపై, తక్షణమే ఎత్తివేయాలి (25 శాతం సుంకాలకే ఈ రంగాలు కుదేలవుతున్నాయి. 50 శాతం సుంకాలతో అవి తమ ఉత్పత్తులను విక్రయించుకోవడం అసాధ్యం); స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై చర్చలు వేగవంతం చేయాలి; పరస్పర రాయితీలపై నిర్మాణాత్మక చర్చలతో భారత్‌పై విధించే సుంకాలను, ఇతర ఆసియా దేశాల విషయంలో వలే, 15 నుంచి 19 శాతానికి తగ్గించాలి; ప్రభుత్వాధినేతల మధ్య ప్రత్యక్ష సంభాషణలతో సహా అత్యున్నత స్థాయి దౌత్య మంతనాలను పునః ప్రారంభించాలి (ఈ నెల 17న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు అధ్యక్షుడు ట్రంప్ శుభాకాంక్షలు తెలిపితే ఇరువురి మధ్య సంబంధాలలో నెలకొన్న పొరపొచ్చాలు తొలగిపోయి సుహృద్భావం వెల్లివిరియదా? ఈ నెలలోనే ప్రారంభమవనున్న ఐక్య రాజ్యసమితి సర్వప్రతినిధి సమావేశాల సందర్భంగా ట్రంప్, మోదీ మనసు విప్పి మాట్లాడుకుంటే అద్భుతాలు సంభవిస్తాయి). సాంకేతికతల ఆదాన ప్రదానాలు, రక్షణ రంగంలో సహకారం పరస్పర విశ్వాసాన్ని దృఢతరం చేస్తాయి, ఉభయ దేశాల ప్రయోజనాలను పరిరక్షిస్తాయి. భారత్ కేవలం ఒక సౌలభ్య భాగస్వామి మాత్రమే కాదు, ఎంతో ప్రాధాన్యమున్న ఎనలేని సానుకూల పరిణామాలకు దోహదం చేసే సాటిలేని భాగస్వామి. భారత్ భాగస్వామ్యం బలిమేగానీ భారం కాదని, కాబోదనే వాస్తవాన్ని అర్థం చేసుకోవాలి. విభేదాలు కొనసాగితే రెండు దశాబ్దాల (ఉమ్మడి లక్ష్యాల, ప్రయోజనాల) వ్యూహాత్మక ఏకీకరణ నిరర్థకమవుతుంది. భారత్–అమెరికా వ్యూహాత్మక సంబంధం అంతర్జాతీయ శాంతిభద్రతలు, రాజకీయ సుస్థిరత భవిష్యత్తుకు ఆవశ్యకమైనది. ఆ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పునర్నిర్మించేందుకు భారత్–అమెరికాల మధ్య పరస్పర విశ్వాసం మళ్లీ నిండుగా వర్ధిల్లాలి. ఇందుకు అమెరికాయే ప్రథమ చొరవ తీసుకోవాలి. 'చెరపకురా చెడేవు, చెరువుకు నీటి ఆశ, నీటికి చెరువు ఆశ' అనే భారతీయ లోకోక్తులలోని విశ్వజనీన వివేకాన్ని ట్రంప్ విస్మరించరని ఆశిద్దాం.



• శశి థరూర్
లోక్‌సభ సభ్యుడు
('ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యం)

జావెద్ అక్తర్ తప్పేంటి?

'షోలే' సినిమా విడుదలై 50 సంవత్సరాలు అయిందని సంబరాలు చేసుకుంటున్నాం. అయితే ఆ ల్యాండ్ మార్క్ సినిమాకు రచనా సహకారం అందించినవారిలో ఒకరైన జావెద్ అక్తర్‌కు జరిగిన అవమానం గురించి మాత్రం పట్టించుకోవడం మానేశాం.

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, ఉర్దూ అకాడెమి ఆధ్వర్యంలో 'Urdu in Cinema' పేరుతో చేపట్టిన మూడు రోజుల సాహితీ ఉత్సవం సెప్టెంబరు 1 నుంచి 3వ తేదీ వరకూ కలకత్తాలో జరగాల్సి ఉన్నది. ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. జావెద్ అక్తర్‌తో పాటు ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు, కవి అయిన ముజఫర్ అలీని కూడా పిలిచారు. వీళ్లిద్దరి పేర్లతో పోస్టర్లు వెలిశాయి. ముషాయిరా, సెమినార్లు, ప్రసంగాలు, ఉర్దూ నాటకాలు, సినిమా సంభాషణలు వంటి అనేక అంశాలు ఈ కార్యక్రమంలో అలరిస్తాయని షెడ్యూల్ కూడా ప్రకటించారు. అయితే ప్రారంభానికి కొన్ని గంటల ముందు కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఆ తర్వాత ఎప్పుడు నిర్వహిస్తారో కూడా చెప్పలేదు, సరైన కారణాలు కూడా సదరు సాహితీవేత్తలకు తెలుపలేదు.



జావెద్ అక్తర్ మొదటి నుంచి హేతువాద దృక్పథం ఉన్నవాడని తెలిసి కూడా బెంగాల్ ప్రభుత్వం ఆయన వాక్ స్వేచ్ఛను కాపాడలేకపోయింది. మతతత్వ పార్టీగా పేరున్న బీజేపీకి ఒక దశలో కాంగ్రెస్ కన్నా ఎక్కువగా ఎదురొడ్డి నిలిచి, గెలిచి చివరికి బెంగాల్‌లో దీదీ సాధించిందేంటో ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

అసలు విషయం ఏంటంటే జావెద్ అక్తర్‌ని ప్రముఖంగా ఉర్దూ అకాడెమి పిలవడాన్ని బెంగాల్‌లోని కొన్ని మత సంస్థలు అభ్యంతరం తెలిపాయి. జావెద్ ఇస్లాంకి వ్యతిరేకంగా మాట్లాడారని, నాస్తికత్వం ముసుగులో తమ సంప్రదాయాలకు వ్యతిరేకంగా ప్రచారం చేశారని అలాంటి వ్యక్తిని ఈ కార్యక్రమానికి పిలవడం తమకు నచ్చలేదని జమాతే ఉలేమా హింద్ సంస్థ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ ప్రయత్నాన్ని వెంటనే విరమించుకోకపోతే తాము తీసుకునే తీవ్ర చర్యలకు బాధ్యులు అవుతారని హెచ్చరించింది. అంతేకాకుండా గతంలో బంగ్లాదేశ్ రచయిత్రి తస్లీమా నస్రీన్‌కు వ్యతిరేకంగా తాము చేసిన ఉద్యమాన్ని కూడా గుర్తుపెట్టుకోవాలని భయపెట్టింది. ఈ సంస్థకు వాయహిన్ (Wahya Hin) అనే సంస్థ కూడా మద్దతు తెలిపింది. దీంతో తర్జన భర్జన పడ్డ బెంగాల్ ప్రభుత్వం చివరికి వివాదం ముదురుతుండటంతో మొత్తం కార్యక్రమాన్నే రద్దు చేసుకుని పారిపోయింది.

జావెద్ అక్తర్ మొదటి నుంచి తనను తాను నాస్తికుడిగానే ప్రకటించుకున్నారు. చివరికి తన పేరుకు ఇస్లాంకు కూడా సంబంధం లేదని అది పర్షియన్ పేరు అని ఒక సందర్భంలో చెప్పారు. ఆయన గతంలో షరియత్ చట్టాల మీద విమర్శ చేశారు. ముస్లిం మత సంఘాలు ఏకపక్షంగా ఫత్వాలు జారీ చేయడాన్ని వ్యతిరేకించారు. మత మూఢత్వం ముస్లింలకు మేలు చేయదని చెప్పారు. ఈ దేశంలో మత సామరస్యం పరిఢవిల్లాలనేది ఆయన ఆకాంక్ష. దేవుని ఉనికిని ప్రశ్నిస్తూ ఆయన బహిరంగంగా టీవీ ఇంటర్వ్యూలు ఇచ్చారు. లౌకిక పునాదుల మీద తాను నడుస్తానని ప్రకటించారు.

అయితే అంతకుముందు హిందూ మత సంస్థల ఆగ్రహానికి కూడా జావెద్ అక్తర్ గురయ్యారు. మైనార్టీల మీద మెజార్టీ మతవాదులు చేస్తున్న దాడులు తాలిబన్ల దుశ్చర్యలను తలపిస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా ఆరెస్సెస్‌ని, భజరంగదళ్‌ని, వీహెచ్‌పీని టార్గెట్ చేస్తూ విమర్శలు చేశారు. దీంతో హిందుత్వ సంఘాలు ఆయనను తీవ్రంగా విమర్శించాయి. ఒక దశలో చంపేస్తామని కూడా బెదిరించాయి. అయినా ఆయన తన ధోరణి మార్చుకోలేదు.

అయితే తాజా వివాదంలో మాత్రం సహజంగానే హిందూ సంఘాలు జావెద్ అక్తర్ వైపు నిలిచాయి. ఈ సంఘటనను ఆధారం చేసుకుని బెంగాల్ ప్రభుత్వంపై పెద్ద ఎత్తున విమర్శలకు దిగాయి. పశ్చిమ బెంగాల్లో ఇలాంటి బెదిరింపుల పాలనను కొనసాగిస్తారా? అంటూ బహిరంగంగానే నిరసన ప్రదర్శనలు చేస్తున్నాయి. దీన్ని ఒక రాజకీయ అస్త్రంగా బీజేపీ ప్రయోగిస్తుండటంతో మరోవైపు జావెద్‌ను వ్యతిరేకిస్తున్న ముస్లిం మత సంఘాలు కూడా రంగంలోకి దిగి రాజకీయ విమర్శలు చేయడం మొదలుపెట్టాయి.

ఈ మొత్తం గందరగోళం మధ్య జావెద్ అక్తర్ స్పందించి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై సంధించిన కొన్ని ప్రశ్నలు మాత్రం చర్చకు దారి తీస్తున్నాయి. రెండు వర్గాల మతమౌఢ్యుల దగ్గర నుంచి తరచూ తనకు బెదిరింపులు వస్తున్నాయంటే తాను సరైన దారిలోనే నడుస్తున్నట్టు భావిస్తున్నానని తెలిపారు. ఉర్దూ అకాడెమికి మత సంస్థలకు సంబంధం ఏంటి? అని ప్రశ్నించారు. 'ఉర్దూ అనేది మత భాష కాదు, ప్రజల భాష' అని అన్నారు. మతానికి ఏ మాత్రం సంబంధం లేని కార్యక్రమంలో పలు మత సంస్థల మాటలకు విలువనిచ్చి కార్యక్రమాన్ని రద్దు చేయడం సమంజసంగా లేదని చెప్పారు. ఈ విషయంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అనుసరించిన తీరు మొదటి నుంచి ప్రజాస్వామ్య విధానాలకు, విభిన్న గొంతులకు నిలయంగా ఉన్న కోల్‌కతా నగర ప్రతిష్ఠకు భంగం కలిగించేదిగా ఉందని చెప్పారు. ప్రభుత్వం పారిపోకుండా ఈ విషయంలో జోక్యం చేసుకుని కవులు, కళాకారుల గొంతును, మాట్లాడే స్వేచ్ఛను కాపాడితే బావుండేదన్నారు. జరిగిన పరిణామాలతో తాను తీవ్ర నిరాశకు గురైనట్టు చెప్పారు. జావెద్ అక్తర్‌కి మద్దతుగా పలువురు హిందీ, ఉర్దూ రచయితలు స్పందించి బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి ఉత్తరం రాశారు. బెంగాల్‌లో వాక్ స్వాతంత్ర్యాన్ని కాపాడలేకపోయారని ఆ లేఖలో విమర్శించారు.

జావెద్ అక్తర్ సాదా సీదా కవి కాదు. ఎందరి హృదయాలనో కదిలించే బలమైన కవిత్వం, పాటలు రాసినవారు. ఉర్దూ, హిందీ రెండు భాషల్లోనూ రచనలు చేశారు. పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలు అందుకున్నారు. ఐదుసార్లు జాతీయ అవార్డులు పొందారు. హైదరాబాద్‌లో సైతం ఆయన ప్రముఖ కవి సినారె పేరు మీద ఇచ్చే విశ్వంభర పురస్కారం అందుకున్నారు. తన చలన చిత్ర జీవితంలో షోలే, జంజీర్, దీవార్ తోపాటు ఎన్నో మైలురాళ్ల వంటి సినిమాలకు రచనా సహకారం అందించారు.

జావెద్ అక్తర్ మొదటి నుంచి హేతువాద దృక్పథం ఉన్నవాడని తెలిసి కూడా బెంగాల్ ప్రభుత్వం ఆయన వాక్ స్వేచ్ఛను కాపాడలేకపోయింది. మతతత్వ పార్టీగా పేరున్న బీజేపీకి ఒక దశలో కాంగ్రెస్ కన్నా ఎక్కువగా ఎదురొడ్డి నిలిచి, గెలిచి చివరికి బెంగాల్‌లో దీదీ సాధించిందేంటో ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటికైనా తప్పు సరిదిద్దుకుని ఈ కార్యక్రమాన్ని తిరిగి ఇదే సాహితీవేత్తలతో నిర్వహించి పరువు కాపాడుకోవాల్సి ఉంది.

◆ డా. వేంపల్లె షరీఫ్
జర్నలిస్టు, కథా రచయిత

పాలకొండ జిల్లా ఏర్పాటు చేయాలి

ఏపీలో గత వైసీపీ ప్రభుత్వం 13 జిల్లాలను 26 జిల్లాలుగా విభజించింది. ఏ మాత్రమూ అవగాహన లేకుండా చేపట్టిన ఈ జిల్లాల పునర్విభజనతో రాష్ట్రంలోని అనేక మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పాలకొండ ప్రాంత ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఈ ప్రాంతం గతంలో శ్రీకాకుళం జిల్లాలో ఉండేది. పునర్విభజన అనంతరం పార్వతీపురం మన్యం జిల్లాలో కలిపారు. ప్రస్తుతం పాలకొండ రెవెన్యూ డివిజన్‌లో 13 మండలాలున్నాయి.

పాలకొండ, చుట్టు పక్కల మండలాల ప్రజలు ప్రస్తుత జిల్లా కేంద్రమైన పార్వతీపురానికి చేరుకోవడానికి చాలా సమయం పడుతోంది. దీంతో సమీపంలోని ఇతర మండలాలతో కలిపి పాలకొండను జిల్లాగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు. ఈ ప్రాంతాన్ని జిల్లాగా మారిస్తే చుట్టు పక్కల మండలాల వారు జిల్లా కేంద్రమైన పాలకొండకు గంట సమయంలోపే చేరుకోవచ్చు. సీతంపేట, పాలకొండ ప్రాంతాల్లో గతంలో నిర్మించిన అనేక ప్రభుత్వ భవన సముదాయాలున్నందున, పాలకొండ జిల్లా ఏర్పాటు వల్ల ప్రభుత్వంపై అదనంగా ఆర్థికభారం పడే అవకాశం చాలా తక్కువ. పాలకొండ జిల్లా ఏర్పాటు కుదరకపోతే ఈ ప్రాంతాన్ని తిరిగి శ్రీకాకుళం జిల్లాలోనే కొనసాగించాలని స్థానికులు కోరుతున్నారు. తాము అధికారంలోకి వస్తే 'జిల్లాల అస్తవ్యస్త విభజన' సమస్యను పరిష్కరిస్తామని గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ హామీని అమలు చేస్తూ, పాలకొండను జిల్లాగా మార్చాలి.

– చౌడ నాయుడు
పాలకొండ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు

అంతులేని రాజకీయ పతనం!

ముప్పై మంది ఎంపీలు తమను కలవడానికి ఎన్నికల కమిషన్ గత నెల అనుమతిని ఇచ్చింది. ఆగస్టు 10న ఆ ఎంపీలు తమ ఫిర్యాదును దాఖలు చేయడానికి ఈసీ కార్యాలయానికి బయలుదేరారు. యాత్ర ప్రశాంతంగా జరుగుతోంది. పార్లమెంటు నుంచి ఆ ఆఫీస్‌కు దూరం ఒక కిలోమీటరు కంటే తక్కువే. ఊరేగింపు బయలుదేరిన సమయం ట్రాఫిక్ రద్దీ ఉండే సమయం కూడా కాదు. అయినప్పటికీ, పార్లమెంట్ సభ్యుల యాత్రను ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. ప్రజాప్రతినిధుల ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడానికి కూడా ఈ ప్రభుత్వం వెనుకాడలేదు.

బీజేపీకీ, ఎన్నికల కమిషన్‌కు మధ్య ఉన్న సంబంధం గురించి రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. ఒక నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియపై ఆయన చేసిన పరిశోధన ప్రకారం– జాబితాలోని లక్ష కంటే ఎక్కువమంది ఓటర్ల నమోదులో చాలా అవకతవకలు ఉన్నాయి. ఇవి రెండు అంశాలను స్పష్టం చేస్తున్నాయి: ఒకటి, నిజాయితీతో కూడిన దిద్దుబాట్లు చేయాల్సిన అవసరాన్ని; రెండు, ఓటర్ల నమోదులో మోసం చేసే ఉద్దేశం ఉండే అవకాశాన్ని. ఈ విధమైన వాదనలు చేసే అవకాశం ఉన్నప్పటికీ రాహుల్‌గాంధీ తన విజ్ఞాపన పత్రంలో అణకువతో కూడిన అభ్యర్థన మాత్రమే చేసారు. అన్ని నియోజకవర్గాలలో నిష్పాక్షిక దర్యాప్తు నిర్వహించాలన్నారు. అవకతవకలకు కారణాలను వివరించమన్నారు. జాబితా తాలూకు ఎలక్ట్రానిక్ వెర్షన్‌ను తనకు ఇస్తే అన్ని నియోజకవర్గాల్లో ఈ విధమైన విశ్లేషణను చేపట్టడానికి సంసిద్ధంగా ఉన్నానని తెలియజేశారు.

ఈ విషయాలు వెల్లడైన కొన్ని గంటల్లోనే, దీన్ని కాదనే రుజువులేమీ చూపించకుండా, రాహుల్‌గాంధీ ఎత్తి చూపిన విషయాలన్నీ అబద్ధాలనీ, తప్పుదారి పట్టించేవనీ బీజేపీ ఖండించింది. కేబినెట్ మంత్రులు రాహుల్‌పై వ్యక్తిగత దూషణలతో విరుచుకుపడ్డారు, ఆయన వ్యక్తిత్వ హననానికి పూనుకున్నారు. ఆయనపై దేశ వ్యతిరేకి అని ముద్ర వేస్తూ తీవ్రంగా విమర్శించారు. రాహుల్ విశ్లేషణ తప్పు అని ప్రకటించడానికి బీజేపీ దగ్గర ఉన్న డేటా ఏమిటి? అసలు ఎన్నికల కమిషన్ తరఫున మాట్లాడాల్సిన అవసరం ఆ పార్టీకి ఎందుకు వచ్చింది? మరోపక్క గోదీ మీడియా బీజేపీ వాదనలనే ప్రతిధ్వనించింది. ఇంతటి జాతీయ సమస్య కంటే వీధి కుక్కలపై సుప్రీం తీర్పు వంటి అంశాలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చింది.

ఎన్నికల కమిషన్ మరింత దారుణంగా వ్యవహరించింది. రాహుల్ తన ఆధారాలను బైటపెట్టిన కొన్ని గంటల్లోనే, ఆ డేటా తప్పు అని తోసిపుచ్చింది. రాహుల్ క్షమాపణ చెప్పాలని, అఫిడవిట్ సమర్పించాలని డిమాండ్ చేసింది. రాహుల్‌గాంధీ వెల్లడించిన వివరాలు వారి దగ్గర ఇప్పటికే ఉన్నాయా? లేక రాహుల్ డేటా తప్పు అని నిరూపించే విధంగా ఈ లోగా ఓటర్ల జాబితాను సవరించగలమన్న విశ్వాసమా? ఎన్నికల కమిషన్ అందించిన డేటా ఆధారంగానే తన విశ్లేషణ ఉందని రాహుల్ గాంధీ విలేఖరుల బహిరంగ సమావేశంలో సుస్పష్టంగా ప్రకటించారు. అలాంటప్పుడు ఒక నిష్పాక్షిక సంస్థగా ఈసీ మొదటి ప్రతిస్పందన ఏమై ఉండాల్సింది? ఎత్తి చూపిన అవకతవకలపై దర్యాప్తు చేసి ఫలితాలు ప్రకటిస్తామని చెప్పాల్సింది. కానీ రాహుల్ వాదనను ఖండించడంలో ఎన్నికల కమిషన్ చూపించిన తొందరపాటు దాని ఉద్దేశాలపై అనుమానాలను కలిగిస్తున్నది. అంతేగాక, అది దర్యాప్తులను తారుమారు చేసే అవకాశం ఉందని కూడా సూచిస్తున్నది. సామాన్యుడి ప్రాథమిక హక్కులపై ప్రభావం చూపే ఈ విషయంపై పూర్తిగా పారదర్శకంగా, నిష్పాక్షికంగా, నిజాయితీగా దర్యాప్తు జరగడం చాలా ముఖ్యం.

ప్రతిపక్షాలు లేవనెత్తిన ఓటరు జాబితాలో అవకతవకలూ, డేటా తారుమారు వంటి అంశాలు దర్యాప్తునకు అర్హమైనవి. ఈ విషయంలో ఎన్నికల సంఘం ఆ డేటా కచ్చితత్వాన్ని నిర్ధారణ చేసుకోవడానికి దర్యాప్తు చేపట్టాలి. అంతేతప్ప, వారికి రాహుల్ అఫిడవిట్ ఎందుకు అవసరం? రాహుల్‌గాంధీని జవాబుదారీగా నిలబెట్టేందుకు అఫిడవిట్ అవసరం అనేటట్లయితే, ఒకవేళ లోపాలు ఉన్నట్టు వెల్లడైన పక్షాన క్రిమినల్‌గా ప్రాసిక్యూషన్‌కు

ప్రతిపక్షాలు లేవనెత్తిన ఓటరు జాబితాలో అవకతవకలూ, డేటా తారుమారు వంటి అంశాలు దర్యాప్తునకు అర్హమైనవి. ఈ విషయంలో ఎన్నికల సంఘం ఆ డేటా కచ్చితత్వాన్ని నిర్ధారణ చేసుకోవడానికి దర్యాప్తు చేపట్టాలి. అంతేతప్ప, వారికి రాహుల్ అఫిడవిట్ ఎందుకు అవసరం? రాహుల్‌గాంధీని జవాబుదారీగా నిలబెట్టేందుకు అఫిడవిట్ అవసరం అనేటట్లయితే, ఒకవేళ లోపాలు ఉన్నట్టు వెల్లడైన పక్షాన క్రిమినల్‌గా ప్రాసిక్యూషన్‌కు సిద్ధపడుతూ ఈసీ కూడా అఫిడవిట్ ఇవ్వాలి కదా?



సిద్ధపడుతూ ఈసీ కూడా అఫిడవిట్ ఇవ్వాలి కదా?


న్యాయం కోసం కోర్టులను సంప్రదించమని ప్రతిపక్షాలకు ప్రభుత్వం, ఈసీ సలహా ఇస్తున్నాయి. తక్కువ సమయంలో న్యాయం జరుగుతుందని వారు నిర్ధారించగలరా? కోర్టులు చాలా సమయం తీసుకుంటాయని, ఈలోగానే మరో ఎన్నికలు వస్తాయని తెలిసిందే. అదలా వుంచితే, కోర్టులు చట్టపరమైన ఆదేశాల ద్వారా అన్ని రాజకీయ పరిపాలనా సమస్యలను పరిష్కరించగలవా?

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) గురించి ప్రతిపక్షాలు పార్లమెంటులో చర్చించాలని చేసిన ప్రయత్నాన్ని ప్రభుత్వం అడ్డుకుంది. ఎన్నికల కమిషన్ ఒక స్వయంప్రతిపత్తి గల సంస్థ అనీ, అందువల్ల దానిని పార్లమెంటులో చర్చించలేమని పేర్కొంది. కానీ కాగ్, ఈడీ, సీబీఐలు కూడా స్వయంప్రతిపత్తి గల సంస్థలే. మరి వాటి గురించి పార్లమెంటులో చర్చను అనుమతిస్తున్నారు, చర్చ జరుగుతున్నది కూడా. ఎస్ఐఆర్‌పై చర్చ విషయంలో మాత్రం ప్రభుత్వమూ, గోదీ మీడియా కలిసి ప్రతిపక్షాలు పార్లమెంటు కార్యకలాపాలకు అడ్డు వస్తున్నాయని నిందిస్తున్నాయి. న్యాయమైన, స్వేచ్ఛాయుతమైన ఎన్నికలను డిమాండ్ చేయడానికి సాధారణ వ్యక్తికి ఉన్న రాజ్యాంగ హక్కు కంటే మరేదీ ముఖ్యమైనది కాదన్నది ఇక్కడ గమనించాలి.

ఈ రోజు వరకు, ఎంపీలను అరెస్టు చేయడానికి పోలీసులు కారణాలు పేర్కొనలేదు. నైతిక దృక్కోణం నుంచి చూస్తే, ప్రజల్లో 60శాతం ఆకాంక్షలకు ప్రతిపక్ష ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తుండగా ప్రభుత్వ పక్షం పార్లమెంట్ సభ్యులు 40శాతం జనాభా ఆకాంక్షలకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తారు. కాబట్టి, ప్రతిపక్షాల వారు ఒక సమస్యపై ప్రాతినిధ్యం వహించడానికి శాంతియుత నిరసన ప్రదర్శనను చేపడుతుంటే ప్రభుత్వం ఎలా తిరస్కరించగలదు? నిరంకుశ రాజకీయాలను దేశం అనుమతించాలా? ప్రజలు తమకు అధికారం ఇచ్చారని క్లెయిమ్ చేయడానికి ప్రభుత్వానికి చట్టబద్ధత ఉంది నిజమే. కానీ ప్రభుత్వాన్ని ప్రశ్నలు అడగడానికీ, దానిని జవాబుదారీగా నిలబెట్టడానికీ ప్రజలు ఒక ప్రతిపక్షాన్ని ఎన్నుకున్నారనే నిజాన్ని కూడా గౌరవించాలి. ప్రతి విమర్శను దేశ వ్యతిరేకమైనదిగా లేదా భారతదేశానికి వ్యతిరేక కుట్రగా నిరంతరం పేర్కొనడం అనేది అతిగా ఉపయోగించబడుతున్న ఒక జిత్తులమారి ఎత్తుగడ.

న్యాయమైన, స్వేచ్ఛాయుత ఎన్నికలు దేశంలోని సామాన్యులకు అత్యంత ముఖ్యమైన అంశం. రాహుల్‌గాంధీ ఆరోపణలు ఒక విస్ఫోటన స్వభావం గలవి కావటం వలన సుప్రీంకోర్టు లేదా దేశాధ్యక్షుడు పారదర్శకమైన, నిష్పాక్షికమైన స్వతంత్ర దర్యాప్తును ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఉంది. పౌర సమాజం ఇప్పటికిప్పుడే అప్రమత్తమై సమతుల్యతను పునరుద్ధరించడానికి నడుం బిగించకపోతే, దేశానికి కోలుకోలేని నష్టం జరిగే అవకాశం ఉన్నది.

■ కె. విజయ్‌రావు
వైస్ ఛైర్మన్, సొసైటీ ఫర్ కమ్యూనల్ హార్మనీ



పరిటాలలో ఉద్రిక్తత

గణేశ్ నిమజ్జనంలో ఇరువర్గాల ఘర్షణ

- రెండు వర్గాలపై కేసులు నమోదు
- పరిటాల, కంచికచర్లలో బంద్
- రోడ్డెక్కిన ఇరువర్గాలు
- జిల్లాలో పోలీసు యాక్ట్ 30 అమలు





పోలీస్ స్టేషన్‌ను ముట్టడించిన హిందువులు (ఇన్‌సెట్‌లో) రాళ్ల దాడిలో గాయపడిన ఇద్దరు యువకులు

కంచికచర్ల/రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వినాయకుడి నిమజ్జనం రోజున జరిగిన చిన్న వివాదం చినికిచినికి గాలివానలా మారుతోంది. రెండు వర్గాల మధ్య చెలరేగిన వివాదం రాస్తారోకోలు, ధర్నాల వరకు వెళ్లింది. కేసులు నమోదు చేయాలని ఇరువర్గాలు పోటాపోటీగా ఆందోళనలు సాగించాయి. వివరాల్లోకి వెళితే.. కంచికచర్ల మండలం పరిటాలలోని ఆంజనేయ ఆలయ వీధిలో ఏర్పాటుచేసిన గణనాథుడిని శనివారం నిమజ్జనం చేయడానికి నవరాత్రుల నిర్వహణ కమిటీ ఊరేగింపును ప్రారంభించింది. ఈ ఊరేగింపు ఒక ప్రార్థనా మందిరం వద్దకు వచ్చేసరికి ఓ మతానికి సంబంధించిన గీతాన్ని పెట్టారు. దీనిపై అక్కడ ప్రార్థనా మందిరం వద్ద ఉన్న యువకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పాటను ఆపి, కొంచెం ముందుకు వెళ్లిన తర్వాత పెట్టుకోవాలని ఊరేగింపులో ఉన్నవారితో అన్నారు. దీంతో వివాదానికి బీజం పడింది. ఇద్దరు యువకులు ఒకరినొకరు తోసుకున్నారు. బందోబస్తులో ఉన్న పోలీసులు దీన్ని గమనించి ఊరేగింపును ముందుకు పంపేశారు. తర్వాత ప్రార్థనా మందిరం వద్ద ఉన్న కొంతమంది రాళ్లు రువ్వడంతో ఊరేగింపులో ఉన్నవారికి గాయాలయ్యాయి. రాళ్లతో దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని ఊరేగింపులో ఉన్నవారు పరిటాల సెంటర్లో పాత జాతీయ రహదారిపై ధర్నా చేశారు. అక్కడి నుంచి గణేశ్ మండపం వద్ద ఇరువర్గాలు మోహరించాయి. రాత్రి 9 గంటల మిగతా 6లో..

తహసీల్దార్ల కోసం తహతహ

ఉమ్మడి కృష్ణాలో 20 పోస్టులు ఖాళీ

రెవెన్యూ శాఖను తహసీల్దార్ల కొరత పీడిస్తోంది. సీనియారిటీ కలిగిన వారికి కనీసం అడ్‌హక్ ప్రమోషన్లు కల్పించటంలో కృష్ణాజిల్లా యంత్రాంగం అంతులేని తాత్సారం చేస్తోంది. దీంతో తహసీల్దార్ల కొరత ఏర్పడి జూనియర్ డిప్యూటీ తహసీల్దార్లు ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్నారు. డీటీలుగా తమ పనిని సక్రమంగా చేయలేక, తహసీల్దార్లుగా, అడ్మినిస్ట్రేటివ్ అధికారులుగా బండెడు పనిచేయలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు నిర్ణీత సమయంలో పనులు జరగని దుస్థితి కూడా ఏర్పడుతోంది.

తహసీల్దార్ ఆఫీసులు, ఆర్‌డీవో కార్యాలయాలు, కలెక్టరేట్ సెక్షన్లలో..

- జూనియర్ డీటీలకు ఇన్‌చార్జులుగా అదనపు బాధ్యతలు
- రెగ్యులర్ డీటీలు, 2018 పీడీటీ మధ్య సీనియారిటీ వివాదం
- న్యాయస్థానంలో కేసులు.. ఇప్పటికీ పరిష్కారం కాక అవస్థలు
- మిగిలిన జిల్లాల్లో అడ్‌హక్ పదోన్నతులతో కొంచెం బెటర్
- రెగ్యులర్ తహసీల్దార్లు లేక ప్రజలకు ఇబ్బందులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 20 మంది తహసీల్దార్ల కొరత ఉంది. ఎన్టీఆర్ జిల్లాలో జగ్గయ్యపేట, వత్సవాయి, ఏ.కొండూరు, మైలవరం కార్యాలయాల్లో రెగ్యులర్ తహసీల్దార్లు లేరు. వీరి స్థానంలో జూనియర్ డీటీలు ఇన్‌చార్జులుగా ఉన్నారు. తిరువూరు, నందిగామ ఆర్డీవో కార్యాలయాల్లో ఇద్దరు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ల (ఏవో) పోస్టుల్లో రెగ్యులర్ తహసీల్దార్లు మిగతా 6లో..

జాప్యంతో ఇబ్బందులు

అడ్‌హక్ పదోన్నతులు కల్పించటంలో జరుగుతున్న అంతులేని జాప్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెగ్యులర్ తహసీల్దార్ల స్థానంలో డీటీలు ఇన్‌చార్జులుగా ఉండటం వల్ల రెండు పనులూ వారే చేయాల్సి వస్తోంది. డీటీలు పనిమీద బయటకు వెళ్లాల్సి వస్తే తహసీల్దార్లుగా ప్రజలకు అందుబాటులో లేని పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో ప్రజలు పనులు కాక ఇబ్బందులు పడుతున్నారు. పదేపదే రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.



అడ్‌హక్ బదిలీలకు అంతులేని తాత్సారం

అన్ని జిల్లాల్లోని రెవెన్యూ కార్యాలయాల్లో తహసీల్దార్ల కొరతను దృష్టిలో ఉంచుకుని అడ్‌హక్ పదోన్నతులు కల్పిస్తున్నారు. పొరుగున ఉన్న ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు ఉత్తరాంధ్రలోని ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం తదితర జిల్లాల పరిధిలో అడ్‌హక్ పదోన్నతులు కల్పించారు. ఈ పదోన్నతుల కారణంగా సీనియారిటీ కలిగిన డిప్యూటీ తహసీల్దార్లను తహసీల్దార్లుగా తాత్కాలికంగా పదోన్నతి కల్పించారు. దీంతో రెగ్యులర్ తహసీల్దార్ల ఇబ్బందులు తొలగిపోయాయి. తహసీల్దార్లుగా తాత్కాలికంగా వారికి పదోన్నతులు కల్పించినా డిప్యూటీ తహసీల్దార్ల వేతనాలనే వారు తీసుకుంటారు. రెగ్యులర్ తహసీల్దార్లుగా వ్యవహరిస్తుంటారు.

పేరుకే రాష్ట్ర పండుగ..

నిధులివ్వరు నిండుగా..

- దసరా ఉత్సవాల ఖర్చు భారమంతా దేవస్థానంపైనే
- రాష్ట్ర హోదా కల్పించినా పైసా విదల్చని ప్రభుత్వాలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : 'రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఒకటి. ఇక్కడ ఏటా జరిగే దసరా ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటిస్తున్నాం.' 2017లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం చేసిన ప్రకటన ఇది. నాటి నుంచి ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలు రాష్ట్ర పండుగగానే జరుగుతున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా నిధుల కేటాయింపులో మాత్రం స్పష్టత లేదు. దసరాను రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడం తప్ప అందుకు అవసరమైన నిధులు మాత్రం విడుదల చేయట్లేదు. ఆ భారమంతా దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంపై పడుతోంది.

అక్కడ బతుకమ్మ.. ఇక్కడ దసరా ఉత్సవాలు

ఆంధ్రాలో దసరా శరన్నవరాత్రులు ప్రారంభమైతే, తెలంగాణలో బతుకమ్మ సంబరాలు ఆరంభమవుతాయి. 2014లో రాష్ట్ర విభజన జరిగాక బతుకమ్మను తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించుకుని ప్రత్యేక నిధులు కేటాయిస్తోంది. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం దసరాను రాష్ట్ర పండుగగా ప్రకటించింది. కానీ, ఎలాంటి నిధుల కేటాయింపులు చేయలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దసరాను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తామని ప్రకటనలు చేసింది. శరన్నవరాత్రుల నిర్వహణకు ఒక్క రూపాయి కేటాయించలేదు. నాలుగేళ్ల క్రితం సీఎంగా ఉన్న జగన్ మూలానక్షత్రం రోజున పట్టువస్త్రాలు సమర్పించడానికి రావడానికి ముందు కొండచరియలు మిగతా 6లో..

చకచకా





ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవ ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. క్యూ మార్గాలను యుద్ధప్రాతిపదికన సిద్ధం చేస్తున్నారు. అలాగే, ఇంద్రకీలాద్రి గోడలకు చూడచక్కని బొమ్మలతో రంగులు అద్దుతున్నారు. పదుల సంఖ్యలో కార్మికులు రోజూ ఈ పనుల్లో నిమగ్నమై కనిపిస్తున్నారు.

కుప్ప కూలింది!

రోడ్డునపడిన రోజువారి కూలీ కుటుంబం

- జూపూడి పేలుడు ఘటనలో దోషులెవరు
- దిక్కుకోల్పోయిన దినసరి కూలి కుటుంబం 6





ఇటీవల బీఆర్‌టీఎస్ రోడ్డులో జరిగిన ఓ ప్రమాదం (ఫైల్)

అతివేగంతో అనర్థాలు

రెండు జిల్లాల్లో ఆరు నెలల్లో 589 ప్రమాదాలు

201 మంది మృతి, 512 మందికి గాయాలు

జాతీయ రహదారులపై 268, రాష్ట్ర రహదారులపై 86

- ఇతర రోడ్లపై 235 ప్రమాదాలు
- ద్విచక్ర వాహనాలతోనే అధికంగా..

మితిమీరిన వేగం దారి తప్పుతోంది. ప్రయాణం ప్రాణాలు తీసేస్తోంది. గత ఆరు నెలల కాలంలో జాతీయ, రాష్ట్ర, అంతర్గత రహదారులపై నిర్దిష్ట వేగానికి మించి ప్రయాణించడం వల్ల ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. మలుపులు, రోడ్ల కూడళ్లు, బ్లాక్ స్పాట్‌లున్నాయని తెలిసీ అతివేగంతో వెళ్లడం వల్లే అత్యధిక ప్రమాదాలు జరిగినట్లు తాజా క్రైం లెక్కలు చెబుతున్నాయి. 8

విజయ పథంలో..

విజయ డెయిరీ 2024-25 టర్నోవర్ రూ.1,200 కోట్లు

- కృష్ణామిల్క్ యూనియన్‌కు రూ.29 కోట్ల నికర లాభం
- రూ.92 కోట్ల నుంచి రూ.230 కోట్లకు చేరిన రిజర్వు నిధులు
- 2025-26కు రూ.1,350 కోట్ల టర్నోవర్ లక్ష్యం
- బుడమేరు ముంపు సమస్యను ఎదుర్కొని విజయం దిశగా..
- వార్షిక వివరాలను వెల్లడించిన చైర్మన్ చలసాని



(ఆంధ్రజ్యోతి, విజయవాడ/చిట్టినగర్) : కృష్ణామిల్క్ యూనియన్ మరోమారు 'విజయా'ల రికార్డులను తిరగరాసింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1,210 కోట్ల టర్నోవర్ సాధించి దుమ్ము దులిపింది. ముగిసిన ఆర్థిక సంవత్సరాల ఫలితాలను కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్‌గా చలసాని ఆంజనేయులు సోమవారం చిట్టినగర్‌లోని మిల్క్‌ఫ్యాక్టరీలో మీడియాకు వెల్లడించారు. ముగిసిన ఆర్థిక సంవత్సరంలో విజయ డెయిరీ రూ.29 కోట్ల నికర ఆదాయాన్ని పొందింది. నాలుగు త్రైమాసికాల్లో రూ.46 కోట్లను బోనస్‌గా ఇచ్చినప్పటికీ ఇంత భారీ ఆదాయాన్ని సాధించటం గమనార్హం. ప్రస్తుత ఏడాది విజయాకు రూ.23 కోట్ల నిధులు రిజర్వులో ఉన్నాయి. చైర్మన్‌గా చలసాని ఆంజనేయులు వచ్చాక ఆరేళ్ల పాలకవర్గంలో రూ.92 కోట్ల రిజర్వు నుంచి రూ.235 కోట్ల రిజర్వు స్థాయికి ఎదిగింది. దీంతో రెట్టించిన ఉత్సాహంతో 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.1,350 కోట్ల టర్నోవర్ సాధించాలని కృష్ణామిల్క్ యూనియన్ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

అవరోధాలను అధిగమించి..

కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్‌గా చలసాని ఆంజనేయులు బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి 'విజయ'పథం కొనసాగుతోంది. బుడమేరు ముంపు సమయంలో ముంపు బారిన పడి 49 రోజుల పాటు చిట్టినగర్ పాలఫ్యాక్టరీ మూతపడింది. సుమారు రూ.50 కోట్ల మేర నష్టం వచ్చింది. బుడమేరు వరదల కంటే ముందే మిగతా 6లో..

జిల్లాలో యూరియా కొరత లేదు
కలెక్టర్ లక్ష్మీశ 8

73 శాతం స్మార్ట్‌కార్డుల పంపిణీ
పోర్టబిలిటీతో వెనుకబడ్డ అర్బన్ 6



అవగాహన ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్, చౌ ట్రీ యంగ్.

వియత్నాంతో పర్యాటక ఒప్పందం

విశాఖపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగంలో మరింత ముందుకు వెళ్లడానికి వియత్నాంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్టు పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్ తెలిపారు. విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఏజెన్సీ సహకారంతో వియత్నాం ప్రధాన మంత్రి అడ్వైజరీ బాడీ అసోసియేషన్ మెంబర్, వియత్నాం టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ఛైర్మన్ చౌ ట్రీ యంగ్‌తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. వియత్నాం పర్యాటకులు బుద్ధిజానికి సంబంధించి బుద్ధగయ, తదితర ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి కాలచక్రం, ఉమ్మడి విశాఖ జిల్లాలో బొజ్జన్నకొండ, బావికొండ, తొట్లకొండ, తదితర ప్రాంతాలు సందర్శించేలా అవగాహన ఒప్పందం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జిల్లా పర్యాటక శాఖ అధికారిణి జె.మాధవి, పర్యాటక అభివృద్ధి సంస్థ రీజనల్ డైరెక్టర్ జగదీశ్, ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ఛైర్మన్ విజయ మోహన్, పవన్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

11 ఏళ్ల బాలికపై అత్యాచారం

- అఘాయిత్యానికి ఒడిగట్టిన ఇద్దరు బాలురు
- విశాఖలో దారుణం.. పోక్సో కేసు నమోదు

సీతంపేట (విశాఖపట్నం), సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో దారుణం జరిగింది. గ్రహణం మొర్రి శస్త్రచికిత్స కారణంగా సరిగా మాట్లాడలేని స్థితిలో ఉన్న ఓ పదకొండేళ్ల బాలికపై 16 ఏళ్ల వయసుండే ఇద్దరు బాలురు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు పోక్సో చట్టం, బీఎన్ఎస్‌లోని పలు సెక్షన్ల కింద మేరకు కేసు నమోదు చేశారు. అఘాయిత్యానికి పాల్పడిన ఇద్దరు మైనర్ నిందితులను గుర్తించారు. ద్వారకా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధిత బాలిక కుటుంబం సీతమ్మధార కొండను ఆనుకుని ఉన్న బిలాల్ కాలనీలో నివాసం ఉంటోంది. ఆరో తరగతి చదువుతున్న ఆ బాలికకు గ్రహణం మొర్రి ఉండడంతో కొన్నాళ్ల కిందట శస్త్రచికిత్స జరిగింది. దీంతో ఆమె సరిగా మాట్లాడలేని పరిస్థితిలో ఉంది. వారి ఇంటికి సమీపంలోనే ఐటీఐ రెండో సంవత్సరం చదువుతున్న ఓ బాలుడు, ఎనిమిదో తరగతితో చదువు మానేసిన మరో బాలుడు ఉంటున్నారు. వారిద్దరూ ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో బాలిక ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో బాలికకు మాయమాటలు చెప్పి సమీపంలోని తుప్పల్లోకి తీసుకెళ్లారు. బాలిక ఏడుస్తున్నా సరే పట్టించుకోకుండా ఇద్దరూ ఆమెపై అఘాయిత్యానికి పాల్పడి.. అక్కడ నుంచి పరారయ్యారు. పనిపై బయటకు వెళ్లిన బాధిత బాలిక తల్లిదండ్రులు ఇంటికి వచ్చేసరికి కుమార్తె కనిపించకపోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఇంతలో కొండవాలున తుప్పల్లో బాలిక ఏడుస్తుండడం గుర్తించారు. బాలికకు రక్తస్రావం కావడంతో డయల్ 100కి ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ద్వారకా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. బాలికపై అత్యాచారం జరిగినట్టు నిర్ధారించుకున్నారు. కేసును దర్యాప్తు కోసం దిశ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

'లా' కౌన్సెలింగ్ ప్రారంభం

తిరుపతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లా కోర్సుల్లో ప్రవేశానికి సోమవారం కౌన్సెలింగ్ ప్రారంభం అయినట్టు, 11వరకు నిర్వహించనున్నట్టు ఏపీ లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ సీతాకుమారి వెల్లడించారు. క్యాప్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 12న గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఆమె సూచించారు. సమగ్ర సమాచారం కోసం.. సెట్స్‌ఏపీసీహెచ్‌ఈ.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

జిన్నింగ్ మిల్లుల యజమానులతో
నేడు సీసీఐ సీఎండీ సమావేశం

గుంటూరు సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గుంటూరులోని రాష్ట్ర మార్కెటింగ్ కమిషనర్ కార్యాలయంలో జిన్నింగ్ మిల్లుల యజమానులతో సీసీఐ సీఎండీ లలిత్ కుమార్ గుప్తా మంగళవారం భేటీ కానున్నారు. రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లుల యజమానులకు, సీసీఐ మధ్య ఏర్పడిన ప్రతిష్టంభన నేపథ్యంలో ఈ సమావేశం జరగనుంది. పత్తి మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సీసీఐ జారీ చేసిన టెండర్ ప్రక్రియను ఏపీలోని జిన్నింగ్ మిల్లుల యజమానులు బహిష్కరించిన విషయం విదితమే.

పశ్చిమ, కృష్ణా జిల్లాలకు
పోలవరం నుంచి గోదావరి జలాలు

- కృష్ణాలోకి 84.7 టీఎంసీలు.. 3.2లక్షల ఎకరాలకు సాగునీరు
- శరవేగంగా ట్విన్ టన్నెళ్ల నిర్మాణం



టన్నెల్ పనుల్లో నిమగ్నమైన కార్మికులు

అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా గోదావరి జలాలను పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలకు తరలించేందుకు కార్యాచరణ వేగవంతమైంది. కృష్ణా-గోదావరి నదుల అనుసంధాన ప్రక్రియలో భాగంగా పోలవరం కుడి ప్రధాన కాలువను అనుసంధానించేలా ట్విన్ టన్నెళ్ల(జంట సొరంగాల) తవ్వకాల పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఒకవైపు వానలు పడుతున్నా పనులు కొనసాగడం విశేషం. ఇప్పటికే ప్యాకేజీ 63లో ట్విన్ టన్నెళ్ల లైనింగ్ పనులు 73 శాతం మేర పూర్తయ్యాయి. ఒక్కో టన్నెల్ 736 మీటర్ల పొడవుంటుంది. ఈ ట్విన్ టన్నెళ్ల ద్వారా 20000 క్యూసెక్కుల చొప్పున జలాలను తరలిస్తారు. ప్యాకేజీ 64 ద్వారా ఎగ్జిట్ చానల్‌ను తవ్వుతున్నారు. ఇందుకోసం బెడ్‌లైనింగ్ పనులు, కుడి టన్నెల్ పనులు 55 శాతం పూర్తయ్యాయి. కుడి ప్రధాన కాలువ కనెక్టివిటీ పనులు పూర్తయితే.. పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన 3.2 లక్షల ఎకరాల ఆయకట్టుకు 84.7 టీఎంసీల నీరందుతుంది. పోలవరం కుడి ప్రధాన కాలువ నుంచి గోదావరి జలాలను కృష్ణాలోకి కలుపుతూ ప్రకాశం బ్యారేజీకి పంపుతారు.

ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ 2027 నాటికి పూర్తి!

ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గ్యాప్-3 ప్రాంతంలో ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ పనులు నవంబరు ఒకటో తేదీ నుంచి ప్రారంభిస్తారు. ఇవి 2027 డిసెంబరునాటికి పూర్తి చేస్తామని జల వనరుల శాఖ విశ్వాసం వ్యక్తం చేస్తోంది. ఇదే సమయంలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకాన్ని పూర్తి చేసేందుకు జలవనరులశాఖ కార్యాచరణను సిద్ధం చేస్తోంది. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాల్లో నాలుగు లక్షల ఎకరాలకు, పశ్చిమగోదావరి జిల్లాలో 3.2 ఎకరాలకు సాగునీరందించేలా జలవనరుల శాఖ పనులు చేపడుతోంది. కాగా, గోదావరి నదికి ఆగస్టు నెల నుంచి వరద ఉధృతి బాగా ఉంటుంది. వరదల సమయంలోనూ నిర్మాణ పనులు చేపట్టేలా ఇంజినీరింగ్ అధికారులు కార్యాచరణతో ముందుకు వెళ్తుండడం గమనార్హం.

కుప్పకూలింది!

రోడ్డునపడిన రోజువారి కూలీ కుటుంబం



పేలుడు ధాటికి ధ్వంసమైన ఇల్లు

ఎక్కడి నుంచో పొట్ట చేత్తో పట్టుకొని భార్యా పిల్లలను పోషించుకునేందుకు వెల్డింగ్ హెల్పర్‌గా వచ్చిన రోజువారి కూలీ ఎవరో స్వార్థానికి బలయ్యాడు. ఇంటి పెద్ద మృతితో ఆ కుటుంబం కుప్పకూలింది. తమకు న్యాయం చేయాలన్న భార్య పోరాటం అరణ్య రోదనగా మిగిలింది. ఇద్దరు పిల్లలతో ఆమె దిక్కుతోచని స్థితిలో సహాయం కోసం అర్థిస్తోంది.

- జూపూడి పేలుడు ఘటనలో దోషులెవరు
- దిక్కుకోల్పోయిన దినసరి కూలి కుటుంబం
- భార్య, పిల్లల ఆవేదన అరణ్యరోదనేనా..
- మిస్టరీగా బాణసంచా తయారీ వస్తువులు
- దోషులను శిక్షించి.. ప్రభుత్వం ఆదుకోవాలి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నం మండలం జూపూడి శివారు భీమేశ్వరకాలనీలో ఈనెల 3న రెంటపల్లి కోటమ్మ ఇంట్లో జరిగిన పేలుడు వెనుక దోషులెవరు.. ప్రమాదానికి గల కారణంపై పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టారు. పేలుడుకు బాణసంచా వస్తువులే కారణమని నిర్ధారణకు వచ్చినా.. వివరాలు గోప్యంగా ఉంచారు. అయితే ఇంటికి సమీపంలో బాణా సంచా తయారీకి ఉపయోగించే వస్తువులు పారేడం స్థానికంగా కలకలం రేపుతోంది. కొందరు వ్యక్తులు దీపావళి పండుగకు మందుగుండు సామగ్రి తయారు చేస్తున్నారనే అనుమానం స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలోనే ఇంట్లో గ్రిల్స్‌కు వెల్డింగ్ చేస్తుండగా మందుగుండు సామగ్రికి మంటలు అంటుకొని విస్ఫోటనం జరిగిందనే అనుమానం బలపడుతోంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గోపి చికిత్స పొందుతూ మృతి చెందాడు. దిక్కుతోచని స్థితిలో మృతుడి భార్య స్వాతి, తన ఇద్దరు పిల్లలతో పేలుడు జరిగిన ఇంటి వద్ద గ్రామస్థులతో కలిసి ఆదివారం రాత్రి నిరసనకు దిగారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. పేలుడుతో శ్మశానంలా మారిన ఇంట్లో ఎవరూ లేరు. బాధితురాలి గోడు ఏ ఒక్క అధికారి, ప్రజా ప్రతినిధికి గాని వినిపించలేదు. పదేళ్లు కూడా నిండని ఇద్దరు పిల్లలతో ఏం చేయాలో తెలియని స్థితిలో స్వాతి ఆవేదన అరణ్యరోదనగా మిగిలింది.

ఫోరెన్సిక్ నివేదిక వచ్చేదెన్నడో..

పేలుడు ఘటన జరిగి వారం రోజులవుతున్నా ఇంకా నివేదిక రాలేదు. మరికొద్ది రోజులు పట్టే అవకాశం ఉంది. నివేదిక వచ్చి కుటుంబయజమాని జైలు కెళితే బాధిత కుటుంబానికి న్యాయం చేసేది ఎవరనే సందేహం వ్యక్తం అవుతుంది. అసలు బాణా సంచా తయారీ వెనుక ఉన్నది ఎవరనేది తేలాల్సి ఉంది. అనుమతులు లేకుండా బాణా సంచా తయారీ ఎలా చేస్తున్నారనే దానిపై విచారణ చేయాల్సి ఉంది. జరిగిన ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.



మృతుడు గోదా గోపి(ఇన్‌సెట్), దిక్కుతోచని స్థితిలో భార్య, పిల్లలు

15 కుటుంబాలకు ఉల్లిపాయ బాంబుల తయారీ వస్తువులు

భీమేశ్వర కాలనీలో ఉల్లిపాయబాంబులు తయారు చేయమని ఓ వ్యక్తి సుమారు 15 కుటుంబాలకు వస్తువులు ఇచ్చినట్టు సమాచారం. 100 ఉల్లిపాయ బాంబులు చుడితే రూ.40ల చొప్పున వస్తాయని కొందరు పని చేసేందుకు ఒప్పుకున్నట్టు తెలిసింది. ఈక్రమంలోనే పేలుడు జరిగిన కుటుంబ యజమాని పేలుడు సామగ్రి గురించి అవగాహన లేక నిర్లక్ష్యంగా ఇంట్లో ఉంచడం.. వెల్డింగ్ సమయంలో నిప్పురవ్వలు ఎగసిపడి జరిగిన పేలుడులో అమాయకుడు మరణించడం జరిగింది. ఘటనలో నిందితులను గుర్తించి గోదా గోపి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



ఇంటి సమీపంలో బాణాసంచా తయారీ వస్తువులు

వెలంపల్లీ.. వాస్తవాలు తెలుసుకో!

- రైతుల అంగీకారంతోనే తాత్కాలికంగా దసరా ఉత్సవ్‌కు కలెక్టర్ నేతృత్వంలో లీజుకు గొల్లపూడి స్థలం
- గన్నే వెంకట నారాయణ ప్రసాద్



విజయవాడ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : దసరా ఉత్సవాల నేపథ్యంలో నగరంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న దసరా ఉత్సవ్-2025లో అంతర్భాగంగా మాత్రమే గొల్లపూడిలో తాత్కాలిక ఎగ్జిబిషన్‌ను నిర్వహించటం జరుగుతోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే వెంకటనారాయణ ప్రసాద్ అన్నారు. దేవదాయశాఖకు చెందిన స్థలాన్ని లీజుకు తీసుకున్న రైతుల నుంచి ఎగ్జిబిషన్ కమిటీ ఛైర్మన్‌గా ఉన్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కొద్ది రోజుల కార్యక్రమానికి వారి అనుమతితో తాత్కాలికంగా స్థలాన్ని తీసుకోవటం జరిగిందే తప్ప.. మరో ఉద్దేశ్యం కాదన్నారు. సోమవారం వెలంపల్లి వ్యాఖ్యలను మీడియా ఎదుట గన్నే తీవ్రంగా ఖండించారు.

వెలంపల్లి శ్రీనివాసరావు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'విజయవాడ ఉత్సవ్' కు అడ్డంకులు సృష్టించే కుట్రకు తెరతీసాడని విమర్శించారు. వాస్తవాలు మరుగనపెట్టి నిరాధార ఆరోపణలు చేయటం తగదన్నారు. స్థలాన్ని లాగేసుకుంటున్నట్టు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమన్నారు. ఎగ్జిబిషన్ నిర్వహించటానికి విజయవాడలో స్థలం లేదు కాబట్టే.. గొల్లపూడిలోని స్థలంలో 45 రోజుల పాటు నిర్వహించేందుకు తీసుకోవటం జరిగిందన్నారు. రైతులకు 2026 వరకు లీజు గడువు ఉందని చెప్పారు. దేవాలయ ఆస్తులను కబ్జా చేసిన చరిత్ర వెలంపల్లికి ఉందన్నారు. ఎన్ని ఆరోపణలు చేసినా విజయవాడ ఉత్సవ్ 2025ను విజయవంతంగా నిర్వహిస్తామని అన్నారు.

రైతుపోరు పేరుతో ఉనికి కాపాడుకునే యత్నం

- తెలుగురైతు రాష్ట్ర అధికార ప్రతినిధి అమ్మినేని జ్వాలా ప్రసాద్



నందిగామ: రైతుపోరు పేరుతో తన ఉనికి కాపాడుకోవడానికి వైసీపీ ప్రయత్నిస్తున్నదని తెలుగురైతు రాష్ట్ర అధికార ప్రతినిధి అమ్మినేని జ్వాలా ప్రసాద్ విమర్శించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌కు రైతులకు సరిపడా యూరియా అందించేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టిందన్నారు. బ్లాక్ మార్కెట్ అరికట్టేందుకుగాను 70శాతం ఎరువులు మార్క్‌ఫెడ్ ద్వారా రైతులకు అందించిందన్నారు. అక్రమాలకు పాల్పడే వారిపై పీడీ కేసులు నమోదు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. రాజకీయాలకు అతీతంగా రైతుసేవలో ఉన్న కూటమిపై వైసీపీ దిగజారుడు కార్యక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. రాజకీయ లబ్ధి కోసం ఎవరెన్ని విమర్శలు చేసినా.. అన్నదాతలకు అవసరమైన మేర ఎరువులు అందించడమే లక్ష్యమని జ్వాలాప్రసాద్ అన్నారు.

జిల్లాలో 73శాతం స్మార్ట్ కార్డుల పంపిణీ

- పోర్టబిలిటీతో వెనుకబడ్డ అర్బన్

మొగల్రాజపురం : ఎన్టీయార్ జిల్లాలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ 73శాతంకు చేరింది. మొత్తం జిల్లాలో 5లక్షల 87 వేల 46 కార్డులు ఉండగా సోమవారం నాటికి 4లక్షల 30వేల వరకు పంపిణీ చేశారు. మొత్తం 18 మండలాలలకుగాను వీరులపాడు 87శాతంతో ముందుంది. విజయవాడ అర్బన్‌లో మూడు సర్కిల్స్ కలిపి 2లక్షల 61వేల 300 కార్డులు ఉండగా ఇప్పటి వరకు 1లక్ష 62వే ల కార్డులను పంపిణీ చేశారు. నగరంలో పంపిణీ శాతం పెరగకపోవడానికి ప్రధాన కారణం పోర్టబిలిటీ. కార్డుదారులు ఇళ్లు మారి వేరే డివిజన్‌కు వెళ్లినా, వేరే మండలానికి వెళ్లినా, వేరే జిల్లాకు వెళ్లినా పోర్టబిలిటీ విధానంలో ఎక్కడైనా రేషన్ తీసుకునే విధానం ఉండటంతో కార్డుల చిరునామా, రేషన్ షాపును మార్చుకోలేదు. దీంతో ఈ నాలుగు సంవత్సరాల కాలంలో పలుసార్లు ఇల్లు మారిన వాళ్లు తమకార్డు ఎక్కడుందో తెలియక డిపోల చుట్టు తిరుగుతున్నారు.

మ్యాపింగ్‌తో సమస్యలు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయాలు ఏర్పాటు, మున్సిపల్ వార్డు, కార్పొరేషన్ డివిజన్‌లకు బదులు సచివాయాల పరిధి ఏర్పాటుచేసి ఇళ్లను మ్యాపింగ్ చేశారు. తరువాత రైస్‌కార్డుల పేరుతో అప్పటి వరకు ఉన్న డబ్ల్యుఏపి, జెఏపి, టిఏపి, ఆర్ఏపి పేర్లతో మండలానికి ఒక కోడ్ పెట్టి ఉన్న రేషన్ కార్డులను28 సీరీస్‌తో పాత చిరునామాలతో ముద్రించారు. అప్పట్లోనే చాలా మంది రైస్ కార్డులు ఈ గందరగోళానికి తీసుకోలేదు. ఈ ప్రభావం ఇప్పుడు పడింది. తమ వద్ద ఉన్న రైస్ కార్డులో కార్డుదారుని చిరునామా ఒక చోట ఉంటే ఎక్కడో దూరంగా ఉన్న రేషన్ షాపు నెంబరు ఉంది. ఇపుడు ఆ రైస్ కార్డులు పట్టుకుని చాలామంది తమ కార్డు డిపో పరిధిలో ఏ సచివాలయంలో ఉందో తెలుసుకునే పనిలో పడ్డారు.

వెబ్‌సైట్‌లు పనిచేయక

పౌరసరఫరాల వెబ్‌సైట్స్ వాడకం మీద అవగాహన ఉన్న వారు, రేషన్ డీలర్లు కార్డు ఏ డిపోలో ఉందో చెప్పడానికి పౌరసరఫరాల వెబ్‌సైట్స్‌లో బెనిఫిషరీ డిటెయిల్స్ ఆర్‌సి డిటైయిల్స్‌కు వెళ్లి కార్డు నెంబరు ఎంటర్ చేసి ఒకే చేస్తే డేటా నాట్ ఫౌండ్ అని వస్తోంది. దీంతో కార్డుదారులకు సమాధానం చెప్పలేక డీలర్‌లు సతమతమవున్నారు. అధికారులు దీనికి పరిష్కారం చూపించాల్సిన అవసరం ఉంది.

తహసీల్దార్ల కోసం తహతహ

(5వ పేజీ తరువాయి)

లేరు. ఎన్టీఆర్ కలెక్టరేట్‌లో రెండు సెక్షన్ల పరిధిలో రెగ్యులర్ తహసీల్దార్లు లేరు. ఇన్‌చార్జులే ఉన్నారు. విజయవాడ సబ్ కలెక్టరేట్‌లో మరో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో) పోస్టులో రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడంతో ఇన్‌చార్జే కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో ఉన్న నూజివీడు ఆర్‌డీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ స్థానంలో రెగ్యులర్ తహసీల్దార్ లేరు. మండవల్లి, కైకలూరు మండలాలకు కూడా రెగ్యులర్ తహసీల్దార్లు లేరు. కృష్ణాజిల్లాలోని గుడ్లవల్లేరు, బంటుమిల్లి, పెడన, కృత్తివెన్ను మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయంలో మూడు సెక్షన్లలో రెగ్యులర్ తహసీల్దార్లు లేరు.

పదోన్నతులకు అడ్డంకి

తహసీల్దార్ల పదోన్నతులకు రెగ్యులర్ డీటీలు, 2018 ప్రొబెషనరీ డీటీల మధ్య తలెత్తిన సీనియారిటీ వివాదమే ప్రధాన అవరోధంగా ఉంది. సీనియారిటీపై ఉభయ పక్షాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. న్యాయస్థానం ఆ కేసుపై స్టే ఇచ్చింది. దీంతో అప్పటి నుంచి తహసీల్దార్ పదోన్నతులకు ఇబ్బందిగా మారింది. ఈ కేసు తేలితే తప్ప సమస్య పరిష్కారం అయ్యే పరిస్థితి లేదు.

10 నుంచి స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక

విజయవాడ(స్పోర్ట్స్)/మచిలీపట్నం టౌన్: కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి స్కూల్ గేమ్స్ జల్లా జట్ల ఎంపికలు ప్రారంభమవుతాయని ఎన్టీఆర్ జిల్లా, స్కూల్ గేమ్స్ కార్యదర్శులు ఎల్.దుర్గారావు, టి.శ్రీలత లు తెలిపారు. ఎంపికలు పటమటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతాయని, 10వ తేదీ జూడో, సెపక్ తక్ర అండర్ 14,17 బాలబాలికలు, జిల్లా జట్ల ఎంపికలు జరుగుతాయని తెలిపారు. అదేవిధంగా 11న టెన్నిస్, టేబుల్ టెన్నిస్, సాఫ్ట్ టెన్నిస్ అండర్ 14, 17 బాల బాలికల జిల్లా జట్లు ఎంపికలు ఇందిరాగాంధీ స్టేడియంలో జరుగుతాయని తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే పాఠశాలల క్రీడాకారులు ఆయా తేదిల్లో ఉదయియం 9గంటలకు హాజరుకావాలన్నారు.

8రాము8 : పికిల్ బాల్ ఛాంపియన్ షిప్ విజేతలు రైల్వే అధికారులు

ఏపీ పికిల్‌బాల్ చాంపియన్‌షిప్‌లో మెరిసిన రైల్వే అధికారులు



రైల్వేస్టేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈనెల 6, 7 తేదీల్లో ప్యాడిల్ థియరీ, పికిల్, బ్రూ వేదికల్లో జరిగిన 2వ ఆంధ్రప్రదేశ్ పికిల్‌బాల్ చాంపియన్‌షిప్-2025 అన్ని వయసుల క్రీడాకారులను ఆకర్షించింది. విజయవాడ రైల్వే డివిజన్ సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (బ్రిడ్జ్ లైన్స్) పి.శ్రీనివాసరావు పురుషుల 50+సింగిల్స్ విభాగంలో కాంస్య పతకం గెలుచుకున్నారు. డివిజనల్ హాస్పటల్, విజయవాడ అదనపు చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవికాంత్ పురుషుల 50+డబుల్స్‌లో 4వ స్థానాన్ని సాధించారు. ఇద్దరు అధికారులు రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహించారు.

విజయపథంలో..

(5వ పేజీ తరువాయి)

రూ.200 కోట్లతో వీరవల్లిలో కంప్యూటరైజ్డ్, మెకనైజ్డ్ డెయిరీని నిర్మించారు. వీరవల్లిలోని పాలఫ్యాక్టరీ ద్వారా బుడమేరు వరదల్లో కూడా పాలకు కొరత రాకుండా విజయా డెయిరీ చర్యలు తీసుకుంది. ఏటా రైతులకు బోనస్ ఇవ్వటం అనేది సంస్థకు ఖర్చుతో కూడుకున్న విషయమే అయినా బుడమేరు వంటి విపత్తులో కూడా బోనస్‌ను ప్రకటించింది. ప్రతి త్రైమాసికానికి బోనస్‌ను ప్రక టించడం విజయాకే దక్కింది. ముగిసిన ఆర్థిక సంవత్సర ంలో రూ.46 కోట్లను బోనస్‌గా ప్రకటించింది. మరో రూ.15 కోట్ల మేర పాడి సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేసింది. మిల్క్‌ఫ్యాక్టరీకి జరిగిన నష్టాన్ని కూడా పాలకవర్గం, అధికారులు సమన్వయంతో పనిచేసి గణనీయంగా పూడ్చారు. విజయా డెయిరీకి ఇప్పుడు అప్పులు అనేవి దాదాపు లేవు. నికర నిల్వలోనే ఉండటం డెయిరీలకు ఆదర్శంగా నిలిచింది.

మేలుజాతి పశువుల దిగుమతి వల్లే..

మేలుజాతి పశువులను దిగుమతి చేసుకుని పాల ఉత్పత్తిని పెంచడం ద్వారా అత్యుత్తమ విజయాన్ని సాధించామని ఛైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. సోమవారం చిట్టినగర్ పాలఫ్యాక్టరీలో జరిగిన పాలకవర్గ సమావేశంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి టర్నోవర్‌ను పాలకవర్గం ప్రకటించింది. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా యూనియన్ పాటు పడుతోందన్నారు. పాడి రైతులకు అత్యధిక పాల సేకరణ ధరతో పాటు ఏటా రూ.46 కోట్ల బోనస్ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వ సహకారంతో మేలుజాతి పెయ్యదూడల సెమన్ (వీర్యం) రూ.500 ఉండగా, ప్రభుత్వం రూ.350 సబ్సిడీ ఇవ్వగా, యూనియన్ రూ.100 భరించి రైతుకు రూ.50కే అందిస్తోందన్నారు. పాల ఉత్పత్తి పెంచేందుకు దాణాపై కిలోకు రూ.3 నష్టాన్ని యూనియన్ భరిస్తోందని చెప్పారు. ప్రభుత్వం సహకరిస్తే ప్రతి గ్రామంలో గోకుల హాస్టళ్లు పెట్టేందుకు యూనియన్ సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికే నందిగామలోని మునగచర్లలో గోకుల హాస్టల్ ఏర్పాటు చేశామన్నారు. గేదెలు కొనేందుకు కో-ఆపరేటివ్ బ్యాంకుల్లో రుణాలు ఇప్పిస్తున్నామని చెప్పారు. రుణం చెల్లించిన వెంటనే దానిపై వడ్డీని యూనియన్ భరిస్తుందన్నారు. క్షీరబంధు పథకంలో భాగంగా మరణించిన పాడి రైతు కుటుంబానికి రూ.50 వేల చొప్పున 2 వేల మందికి ఇచ్చామని చలసాని తెలిపారు. పాడి రైతుల ఇళ్లలో జరిగే వివాహ కార్యక్రమాలకు కల్యాణమస్తు పథకం కింద రూ.20 వేల విలువైన బంగారు నాణేలను మొత్తం 3,500 మందికి అందజేశామన్నారు. రైతులు వారి కుటుంబ ఆరోగ్యం కోసం హెల్త్‌కార్డులు అందజేస్తున్నామన్నారు. డ్వాక్రా మహిళలకు బాసటగా నిలిచి పాల పదార్థాలు, ఆర్గానిక్ పిండివంటలు వంటివి చేసుకునేలా చేయూత నిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ కొల్లి ఈశ్వర బాబు, పాలకవర్గ సభ్యులు,అధికారులు పాల్గొన్నారు.

పేరుకే రాష్ట్ర పండుగ.. నిధులివ్వరు నిండుగా..

(5వ పేజీ తరువాయి)

విరిగిపడ్డాయి. ఆ సమయంలో ఆలయ అభివృద్ధికి రూ.70 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. ఇందులో కొంత మాత్రమే విడుదల చేసి మిగతా వదిలేసింది. అంతే తప్ప శరన్నవరాత్రుల నిర్వహణకు మాత్రం ఇప్పటివరకు ఏ ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులివ్వలేదు. శరన్నవరాత్రుల్లో విధుల నిర్వహణకు వివిధ ఆలయాల నుంచి అధికారులు, సిబ్బంది వస్తారు. వారు కాకుండా బందోబస్తు నిమిత్తం పోలీసులు, ప్రాథమిక వైద్యసేవలు నిర్వహించడానికి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది వివిధ జిల్లాల నుంచి వస్తుంటారు. పారిశుధ్య నిర్వహణకు వీఎంసీ కార్మికులు, స్నానఘాట్ల వద్ద గస్తీకి ప్రకృతి విపత్తుల నిర్వహణ శాఖ సిబ్బంది ఉంటారు. వీరందరికీ భోజన, వసతి సదుపాయాలను దేవస్థానం కల్పించాలి. అంత సామర్థ్యం దేవస్థానానికి లేదు. దేవస్థానం దినదినాభివృద్ధి చెందుతున్నా దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇక్కడ ఎలాంటి వసతి సదుపాయం లేదు. దీంతో ఉత్సవాల్లో పాలుపంచుకున్న వివిధ శాఖలు తీసుకొచ్చే సిబ్బందికి ఆ శాఖాధికారులే భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తున్నారు. దీనికయ్యే ఖర్చును మాత్రం దేవస్థానం చెల్లించాలి.

ఏటా పెరుగుతున్న భారం

ఉత్సవాల నిర్వహణ భారం మొత్తం దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంపైనే పడుతోంది. ఏటా ఈ భారం పెరుగుతోంది. ప్రభుత్వాలు నిధులు కేటాయించకపోవడంతో మొత్తం నిధులను దేవస్థానం సమకూర్చుకోవాల్సి వస్తోంది. శరన్నవరాత్రులకు రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు ఖర్చును దేవస్థానమే సమకూర్చుకోవాలి. ఈ ఏడాదైనా ప్రభుత్వం రాష్ట్ర పండుగకు నిధులు కేటాయిస్తుందా లేదా అని దేవస్థాన వర్గాలు ఎదురుచూస్తున్నాయి.

పరిటాలలో ఉద్రిక్తత

(5వ పేజీ తరువాయి)

వరకు ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఉత్సవ నిర్వాహకులు చేసిన ఫిర్యాదుతో ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం పోలీసులు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఈ వర్గానికి చెందిన పలువురు పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. ఘర్షణకు సంబంధించి ఊరేగింపు నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు 15 మందిపై కేసు నమోదు చేశారు. ఎఫ్‌ఐఆర్ ప్రతిని తమకు ఇవ్వాలని, ఊరేగింపు నిర్వాహకులను అరెస్టు చేయాలని, లేనిపక్షంలో తమ వారిని విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. పోలీసులు 41ఏ నోటీసులు ఇచ్చి ఐదుగురిని విడిచిపెట్టారు. దీనికి వ్యతిరేకంగా ఊరేగింపు నిర్వాహకులు సోమవారం పరిటాల, కంచికచర్ల బంద్‌కు పిలుపునిచ్చారు. దాదాపు 2 గంటలసేపు పోలీస్ స్టేషన్ ఎదుట రోడ్డుపై భైఠాయించారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ వర్గీయులపై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలని, రాళ్ల దాడి నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఉన్న జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. పరిటాలలో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు జిల్లాలో పోలీసు యాక్ట్ సెక్షన్ 30ను అమలు చేశారు. రెండు వర్గాలు పోటాపోటీగా మంగళవారం నిర్వహించే నిరసన కార్యక్రమాలకు ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిరసన కార్యక్రమాలు నిర్వహించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాతీయ రహదారి దిగ్బంధనం

హిందూ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి పరిటాల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారి దిగ్బంధనం జరిగింది. గంటన్నర పాటు నిరసన కొనసాగడంతో ఇబ్రహీంపట్నం వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. వందలాది మంది జాతీయ రహదారికి ఇరువైపులా భైఠాయించి నినాదాలు చేశారు. రాళ్ల దాడికి పాల్పడిన వారిని మంగళవారం సాయంత్రంలోగా అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు నిరసన విరమించారు.

సీబీసీఎన్‌సీ ఆస్తుల కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మొవ్వ మండలం భట్లపెనుమర్రు గ్రామంలో సీబీసీఎన్‌సీ ఎయిడెడ్ పాఠశాల ఆస్తుల కబ్జాపై సోమవారం కలెక్టర్ బాలాజీకి సీబీసీఎన్‌సీ ఉయ్యూరు ఈస్ట్‌ఫీల్డ్ కౌన్సిల్ సభ్యుడు ఏ. విలియం ఫిర్యాదు చేశారు. సీబీసీఎన్‌సీ పాఠశాలకు చెందిన స్థలాన్ని కోరం లేకుండా పంచాయతీ అధికారులు తీర్మానం చేసి కబ్జా చేస్తున్నారన్నారు ఇప్పటికే ఎస్సీ కాలనీలో 15 సెంట్లకు పైగా స్థలంలో కమ్యూనిటీ హాలు ఉందని, అది నిరుపయోగంగా ఉందని, మల్టీపర్పస్ కమ్యూనిటీ హాలు నెపంతో స్కూల్ స్థలాన్ని కబ్జా చేసే అవకాశం ఉందన్నారు. గంగానమ్మ గుడి సెంటర్‌లోని సిబ్బంది క్వార్టర్స్‌ను అరాచక శక్తులు ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారని, దీనిపై కూచిపూడి తహసీల్దార్, ఎస్సైకు ఫిర్యాదు చేసినప్పటికీ ఏ విధమైన చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135,144, 155
చికెన్ విత్ స్కిన్	256
చికెన్ స్కిన్‌లెస్	266

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

మున్సిపల్ టీచర్లను ఉద్యోగులుగా గుర్తించండి

ప్రోగ్రెసివ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్

గాంధీనగర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ మేనేజ్‌మెంట్ మున్సిపల్ టీచర్లను కనీసం మున్సిపల్ ఉద్యోగులుగా పరిగణించకపోవడం దురదృష్టకరమని ప్రోగ్రెసివ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు సోమరౌతు శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ టీచర్లకు సర్వీస్ రూల్స్ 2016లో విడుదల చేయడం జరిగిందని తెలిపారు. మున్సిపల్ టీచర్లకు రాజ్యాంగంలో పొందుపరచిన హక్కులను పరిరక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన విజ్ఞప్తి చేశారు.

కాలుష్య కోరల్లో ఆటోనగర్

●'ఐలా' నిర్లక్ష్యంతో పెరుగుతున్న కాలుష్యం ● క్షేత్రస్థాయిలో గుర్తించిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ● 'ఐలా' కు నోటీసు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఆటోనగర్‌లో కాలుష్య తీవ్రతను తగ్గించేందుకు తక్షణం చర్యలు తీసుకోవాల్సిందిగా ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా)కు కాలుష్య నియంత్రణ మండలి నోటీసు ఇచ్చింది. ఐలా నుంచి వచ్చే ప్రతిస్పందనను బట్టి కాలుష్యకారకాలను తగ్గించటానికి సెకండ్ నోటీసు ద్వారా నిర్ణీత సమయాన్ని ఇవ్వాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు భావిస్తోంది. అప్పటికీ చర్యలు తీసుకోకపోతే ఐలాపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు కూడా వెనుకాడకూడదని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు భావిస్తోంది.

ఐలా బాధ్యతా రాహిత్యంతోనే ఆటోనగర్‌లో కాలుష్యం పెరిగిపోయింది. పారిశ్రామికవాడ కు ఐలా అనేది పాలక సంస్థ . పారిశ్రామికవాడలోనే యూనిట్ల నుంచి పన్నులు పిండుకుంటున్న ఐలా. ఆటోనగర్‌లో పరిశుభ్రతకు, కాలుష్య నివాణకు చర్యలు తీసుకోలేకపోతోంది. ఆటోనగర్‌లో చెత్త ఎత్తే పరిస్థితి లేదు. చెత్తను తరలించటంలో కూడా ఘోర వైఫల్యం చెందుతోంది. ఆటోనగర్ రోడ్లపై చెత్త పోగులు దర్శనమిస్తున్నాయి. యూనిట్ల వ్యర్థాలన్నీ రోడ్ల మీదనే ఉంటాయి.



ఇవన్నీ పేరుకుపోయి వాహనాల కింద నలిగిపోయి ఆటోనగర్‌లో విపరీతంగా వాయు కాలుష్యాన్ని సృష్టిస్తున్నాయని కాలుష్య నియంత్రణ మండలి పరిశీలనలో వెల్లడయ్యాయి. ఆటోనగర్ రోడ్లు దారుణమైన మురికి కూపాలుగా మారిపోయాయి. ఆటోనగర్ రోడ్ల మీద మట్టి , ఇసుక ఉంటాయి. వాహనాలు తిరుగుతుంటే దుమ్ము ఎగదన్నుతోంది. ఐలాలో రసాయన వ్యర్థాలను శుద్ధి చేసేందుకు గతంలో యూనిట్ ఏర్పాటు చేశారు. కానీ, ఇప్పటికీ ఆ రసాయనాలు గుంటుతిప్ప డ్రెయిన్‌లో కలుస్తున్నాయి. ఈ డ్రెయిన్ ప్రసాదంపాడు, ఎనికేపాడుల మధ్య నుంచి అత్యంత దుర్గంధభరితంగా ముందుకు వెళుతుంది. డ్రెయిన్ల నిర్వహణ కూడా సక్రమంగా లేదు. భారీగా ఉత్పత్తి అవుతున్న కాలుష్యంపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదులు వస్తున్నాయి. ఇటీవల పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కూడా ఆటోనగర్‌లోని పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు విభాగం రంగంలోకి దిగి క్షేత్ర స్థాయి పరిస్థితులను అధ్యయనం చేసింది. ఆటోనగర్‌లో కాలుష్యం పెరిగిపోతోందని గుర్తించి ఐలా బాధ్యతను గుర్తు చేస్తూ ప్రాథమికంగా నోటీసు ఇచ్చింది. ఈ నోటీసుకు సంబంధించి ఇంకా ఐలా నుంచి పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు ప్రతిస్పందన రాలేదు. ఒకవేళ ఐలా తమకు పరిస్థితులను చక్కదిద్దటానికి కొంత సమయం కావాలని కోరితే దానికి తగిన సమయం ఇస్తూ రెండో నోటీసు ఇవ్వటానికి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సిద్ధంగా ఉంది. రెండో నోటీసుకు స్పందించకపోయినా చట్ట ప్రకారం ఐలాపై చర్యలు తీసుకునేందుకు కాలుష్య నియంత్రణ మండలి వెనుకాడకూడదని భావిస్తోంది.



ప్రజల నుంచి అర్జీలు పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్

ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించండి

● అదనపు కమిషనర్ చంద్రశేఖర్

కార్పొరేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ (ప్రాజెక్టు) డాక్టర్ డి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. మొత్తం 7 ఫిర్యాదులు వచ్చాయి. సమస్యలను ఆయా విభాగాలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం సీఈ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, డిప్యూటీ డైరెక్టర్(హార్టికల్చర్), ఎస్టేట్ ఆఫీసర్ ఏ.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ఏరోబిక్స్ పోటీల్లో పాల్గొననున్న విద్యార్థులతో స్కూల్ ఉపాధ్యాయులు

ఏరోబిక్స్ పోటీలకు వీపీ సిద్ధార్థ విద్యార్థులు

లబ్బీపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర షిర్డీలో ఈ నెల 10నుంచి 14వరకు ద్రోణ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించే సీబీఎస్ఈ నేషనల్ ఏరోబిక్స్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొననున్నట్లు వీరమాచినేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య తెలిపారు. సోమవారం స్కూల్‌లో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించి పోటీల్లో విజయం సాధించి పాఠశాలకు, రాష్ట్రానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ రోజ్‌మేరీ, ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మీ, కోచ్ ఐశ్వర్య, మేనేజర్ లక్ష్మీ కనకదుర్గ పాల్గొన్నారు.



వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ అనురాధ తదితరులు

విద్యార్థులు ఆధునిక టెక్నాలజీలో ప్రావీణ్యం పొందాలి

నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ

లబ్బీపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆధునిక టెక్నాలజీలో విద్యార్థులు ప్రావీణ్యం సాధిస్తే భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ పేర్కొన్నారు. కళాశాలలో సోమవారం మూడో సంవత్సరం విద్యార్థులకు స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఐబీఎం-ఎడ్యూనెట్ ఆధ్వర్యంలో ఏఐ, జనరేటివ్, ఏజెంటిక్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ వర్క్‌షాపును ఏలూరి నరేంద్ర పలు కోర్సులతో పాటు ప్రాజెక్ట్‌ని వివరించారు. ఈ కార్యక్రమంలో 105 మంది విద్యార్థులు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజర్ శ్రీనివాసరావు, కె.లావణ్య, బి.చంద్రగిరి తదితరులు పాల్గొన్నారు.



భవనం మధ్యలో మొలిచిన చెట్టు

శిథిలావస్థలో సామాజిక భవనం

పటమట,ఆంధ్రజ్యోతి: పటమట నల్లూరివారి శ్రీవెంకటేశ్వరస్వామి గుడి ఎదురుగా కార్పొరేషన్‌కు చెందిన సామాజిక భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. కొన్ని సంవత్సరాల క్రితం పేద ప్రజలు కర్మకాండలు చేసుకునేందుకు వీలుగా ఈసామాజిక భవనాన్ని నిర్మించారు. ఆ తరువాత కాలంలో ఇంటిపన్ను, కరెంట్ బిల్లు అక్కడ కట్టించుకున్నారు. కాలక్రమంలో మీసేవ కేంద్రం అందుబాటులోకి రావడంతో ఆ భవనం పూర్తిగా పాడుపడింది. భవనం బీటలు వారి గోడ మధ్యలో చెట్లు మొలిచాయి. సంబంధిత అధికారులు స్పందించి శిథిల భవనాన్ని పూర్తిగా తొలగించి పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా కొత్త భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా అంతర్జాతీయ ఫిజియోథెరపీ డే

మాచవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వాసుపత్రిలో ఫిజియోథెరపీ విభాగంలో సోమవారం అంతర్జాతీయ ఫిజియోథెరపీ డేను ఘనంగా నిర్వహించారు. ఫిజియోథెరపీ విభాగ ఇన్‌చార్జి డాక్టర్ కిరణ్ ఆధ్వర్యంలో ఫిజియో థెరపిస్టులకు క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం సీనియర్ ఫిజియోథెరపిస్టుల చేత అధునాతన ఫిజియోథెరపీ వైద్య విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఏవీ రావు మాట్లాడుతూ ఫిజియోథెరపీ రంగం ప్రాముఖ్యత గణనీయంగా పెరుగుతుందన్నారు. ఫియోథెరపిస్టులకు ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ శ్యామ్ బాబ్జి, డాక్టర్ ఎ.శ్రీనివాస్, డాక్టర్ పద్మావతి, డాక్టర్ అవని, పాల్గొన్నారు.



ఫిజియోథెరపీ దినోత్సవంలో పాల్గొన్న వైద్యులు

నేత్రదానంపై అపోహలు వీడండి

● ప్రముఖ పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్

పటమట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నేత్రదానం ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, నేత్రదానంపై అపోహలు వీడాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, పూర్వ లయన్స్ గవర్నర్ పుట్టగుంట సతీష్ తెలిపారు. సోమవారం స్వేచ్ఛ గోరా ఐ బ్యాంక్ నిర్వహించిన నేత్రదాన ప్రచార పక్షోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఐ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు అంధుల చేత బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సెక్రటరీ చిట్టిబాబు, డైరెక్టర్ డాక్టర్ సమరం, కళాసాగర్, సూర్యనారాయణ, మల్లిక్, గంగ, రవికుమార్ పాల్గొన్నారు.



విజేతకు బహుమతి ఇస్తున్న పుట్టగుంట సతీష్



లేపాక్షి హస్తకళల ప్రదర్శనను ప్రారంభిస్తున్న లేపాక్షి చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్

లేపాక్షి హస్తకళల ప్రదర్శన ప్రారంభం

మొగల్రాజపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సున్నబట్టీల సెంటర్‌లో ఉన్న ఆంధ్రామోటార్ మర్చంట్స్ (అమ్మ) అసోసియేషన్ హాలులో రాష్ట్ర స్థాయి గాంధీ శిల్పబజార్ పేరుతో లేపాక్షి హస్తకళల ప్రదర్శనను సోమవారం లేపాక్షి చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ హస్త కళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో హస్తకళల అభివృద్ధి కమిషనర్ భారత ప్రభుత్వ వస్త్ర మంత్రిత్వ శాఖ లేపాక్షి సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రదర్శనలో దేశ వ్యాప్తంగా నలభై మంది శిల్పులు తమ హస్త కళలను ప్రదర్శిస్తున్నారని చెప్పారు. కలప చెక్క వస్తువులు, క్రోషేలేసు, తంజావూరు చిత్రాలు, తోలుబొమ్మలు, రగ్గులు, కృత్రిమ నగలు, కలంకారీ ముద్రణ వస్తువులు, కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు తదితర వస్తువులు ఉంటాయని తెలిపారు. కళలకు ఆదరణ కల్పించడంతో పాటు నేటి యువతకు భారత కళలను తెలియజేయడం, కళాకారుల వస్తువులకు మార్కెటింగ్ కల్పించడం ప్రధాన ఉద్దేశంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 12 వరకు ఉంటుందని ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షుడు మేనేజింగ్ డైరెక్టర్ విశ్వమనోహర్ తెలిపారు. గాంధీ శిల్పబజార్, లేపాక్షి హస్తకళల డిజైన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

19. 20 తేదీల్లో 'గ్రీన్ హైడ్రోజన్ ఫ్యూయల్ ఆఫ్ ది ఫ్యూచర్'పై సదస్సు

లబ్బీపేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ మహిళా కళాశాలలో రసాయన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో సిద్ధార్థ అకాడమీ గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్‌లో భాగంగా గ్రీన్ హైడ్రోజన్ ఫ్యూయల్ ఆఫ్ ది ఫ్యూచర్ అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.వి.ఎస్ కుమారి తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సదస్సులో గ్రీన్ హైడ్రోజన్ తయారీ, నిల్వ, రవాణా, సరఫరా, రవాణా శాఖలో, మెడికల్ విభాగంలో, విద్యుత్ ఉత్పత్తిలో దీని ప్రాముఖ్యత తదితర అంశాలపై ప్రముఖులు వివరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా స్వచ్ఛాంధ్రా కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. రసాయన శాస్త్ర విభాగధిపతి ఎస్.కల్పన ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

ముహమ్మద్ పరిచయ ఉద్యమ పోస్టర్ ఆవిష్కరణ

ఆటోనగర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పరిచయ ఉద్యమం పురస్కరించుకొని సోమవారం ఆటోనగర్ కాలనీలోని మసీద్‌లో జమాఅతె ఇస్లామీ హింద్- విజయవాడ నార్త్ విభాగం పోస్టర్ విడుదల కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో జమాతె ఇస్లామీ హింద్ రాష్ట్ర మీడియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్బర్ బాషా ముఖ్య అతిథిగా పాల్గొని విలేకరులతో మాట్లాడుతూ ప్రేమ, క్షమ, కరుణతో కూడిన సమాజ నిర్మాణమే ప్రవక్త ముహమ్మద్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రవక్త సందేశాన్ని ప్రతివ్యక్తి తన జీవన విధానంలో ఆచరించడం ద్వారా సమాజంలో శాంతి, న్యాయం నెలకొల్పవచ్చని స్థానిక మీడియా కార్యదర్శి ఇలియాజ్ పిలుపునిచ్చారు. ప్రవక్త పరిచయ ఉద్యమం పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని నార్త్ ఉపాధ్యక్షుడు జనాబ్ హబీబ్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక అధ్యక్షుడు జహీర్, ఉద్యమ కన్వీనర్ ఇబ్రహీం, నేతలు ఖాలీద్, కలాం, హబీబుల్లాహ్, షాబాజ్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ ఉత్సవ్ విజయానికి కృషి చేయండి

● ఎమ్మెల్యే గద్దె

రాణిగారితోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా నగరంలో నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్ కార్యక్రమంతో దేశం మొత్తం విజయవాడ పేరు మార్మోగనుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. రాణిగారితోట 18వ డివిజన్ లో సోమవారం పర్యటించిన ఆయన స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డివిజన్‌లో రెండు కుటుంబాలకు 50వేలు విలువ చేసే టిఫిన్, ఇస్త్రీ బండ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ ఆంధ్ర రాష్ట్రానికే కాకుండా దేశానికి కూడా నడిబొడ్డున ఉందని, ఎంతో ఘనకీర్తి ఉన్నా మొదటి నుంచి నగరానికి దక్కాల్సిన ప్రాధాన్యత దక్కలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతి రాజధానిగా ప్రకటించి అటు అమరావతిని, ఇటు విజయవాడ నగరాన్ని అభివృద్ధి చేశారన్నారు. విజయవాడ ఉత్సవ్‌తో నగరానికి భక్తులు, టూరిస్టులు వస్తారని, టూరిజం వలన ఆదాయం పెరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు వేముల దుర్గారావు, రాయి రంగమ్మ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాణిగారితోట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం స్క్యూ బ్రిడ్జి సెక్షన్, కృష్ణలంక విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ గీతానగర్ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. తారకరామా నగర్, భూపేష్ గుప్తా నగర్, చలసాని నగర్, బాలాజీ నగర్, గీతా నగర్ కట్ట, పోలీస్ కాలనీ తదితర ప్రాంతాలలో సరఫరా ఉండదని తెలిపారు. ● కృష్ణలంక లోని నెహ్రూనగర్ ఏరియాలో కొంతభాగం, గౌతమీ నగర్‌లో కొంతభాగం, ద్వారకానగర్ ఏరియాలో కొంతభాగం, శంకర్ మఠం ఏరియా, రాణిగారితోట ఏరియాలో కొంతభాగం సరఫరా ఉండదని తెలిపారు. **భారతీనగర్:** రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనగర్ కాలనీ, నోవాటెల్ సమీపంలోని సర్వీస్ రోడ్డు, సమోసా కంపెనీ ఏరియా, అక్కినేని ఉమెన్స్ హాస్పిటల్, చందమామ హాస్పిటల్ ఏరియా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

రాజ్యాంగ పరిరక్షణ కోసం సుదర్శన్‌రెడ్డిని గెలిపించండి

విజయవాడ సిటీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి అభ్యర్థి సుదర్శన్‌రెడ్డికి ఓటు వేసి రాజ్యాంగ పరిరక్షణ కోసం ఎంపీలు పాటుపడాలని ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వల్లూరు భార్గవ్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఇది పార్టీ విధేయతకు సంబంధించిన ఎన్నిక కాదని, రాజ్యాంగ విధేయతకు సంబంధించిన ఎన్నిక అని గుర్తు చేశారు. విప్ ఒత్తిడి, బలవంతం లేకుండా ఎంపీలు ఈ ఎన్నికల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సిద్ధార్థ మెడికల్ కాలేజీలో

ముగిసిన నేత్రదానంపై అవగాహన

విజయవాడ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ మెడికల్ కాలేజీలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమం ముగింపు వేడుక సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఏ.వై.రావు, డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసిని, అంధత్వ నివారణ జాతీయ ప్రాజెక్టు సంయుక్త సంచాలకుడు డాక్టర్ సునీల్‌కుమార్ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ, నేత్రదానంపై ప్రజల్లో అవగాహన పెంచే మార్గాలను వివరించారు. యువతలో ఈ విషయంపై చైతన్యం తీసుకురావాలన్నారు. నేత్రదానంపై సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పించాలని జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సునీల్‌నాయక్ విద్యార్థులను కోరారు. ప్రిన్సిపాల్ ఏ.వై.రావు మాట్లాడుతూ, నేత్రదానం మనుషుల జీవితాల్లో వెలుగును నింపే పవిత్ర కార్యమన్నారు. ప్రజల్లోకి ఈ సందేశాన్ని తీసుకెళ్లేలా కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. అవగాహన కార్యక్రమం 15 రోజులుగా కొనసాగుతూ, క్విజ్‌పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



డాక్టర్ సునీల్ నాయక్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ ఏ.వై.రావు, ప్రొఫెసర్లు

లయోలలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం

భారతీనగర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర లయోలా ఇంజనీరింగ్ కళాశాలల్లో ఐక్యూఏసీ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి డైరెక్టర్, కార్యదర్శి ఫాదర్ ఎస్. జె జోజిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో ఉన్న విద్యార్థులకు అక్షరాస్యత, దాని గొప్పతనం వివరించారు. కళాశాల విభాగాధిపతులు సరత్ కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారులు రక్తసిక్తం

● అతివేగంతో ఆరు నెలల్లో 589 ప్రమాదాలు ● 201 మంది మృతి, 512 మందికి గాయాలు

● జాతీయ రహదారులపై 268, రాష్ట్ర రహదారులపై 86, ఇతర రోడ్లపై 235 ప్రమాదాలు ● ద్విచక్ర వాహనాలే అధిక ప్రమాదాలకు కారణం

ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ: మితిమీరిన వేగం ప్రాణాలను హరిస్తోంది. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, అంతర్గత రోడ్లపై నిర్దిష్టవేగానికి మించి ప్రయాణంతో ప్రమాదాలకు దారితీస్తోంది. ఎన్నో కుటుంబాలను దిక్కులేని వాళ్లను చేస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూలై వరకు జరిగిన ప్రమాదాల గణాంకాలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. మలుపులు, రోడ్ల కూడళ్లు, బ్లాక్ స్పాట్‌లున్నాయని తెలిసీ అతివేగంతో వెళ్లడం వల్లే అత్యధిక ప్రమాదాలు జరిగినట్లు తాజా క్రైం లెక్కలు చెబుతున్నాయి. మద్యం మత్తులో వాహనం నడిపడం, రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడపటంతో ఎలాంటి ప్రమాదాలు జరగలేదని పోలీసులు రికార్డుల్లో పేర్కొన్నారు.



రోజుకు ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు

తాజా క్రైం నివేదిక ప్రకారం గడిచిన 180 రోజుల్లో 589 ప్రమాదాలు జరిగాయి. వీటిల్లో 195 ప్రమాదాలు అతి తీవ్రమైనవిగా పోలీసులు పరిగణించారు. 394 ప్రమాదాలు సాధారణ ప్రమాదాలుగా గుర్తించారు. ఈ ప్రమాదాల్లో 201 మంది ప్రాణాలు కోల్పోగా 170 మంది తీవ్ర గాయాల పాలై నేటికీ మంచానికే పరిమితమయ్యారు. 342 మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. జాతీయ రహదారులపై 268 ప్రమాదాలు జరగ్గా 101 మంది మృతి చెందారు. రాష్ట్ర రహదారులపై జరిగిన 86 ప్రమాదాల్లో 37 మంది, ఇతర రోడ్లపై జరిగిన 235 ప్రమాదాల్లో 63 మంది మృతి చెందారు. ఎన్‌హెచ్-65పై అత్యధికంగా 150 ప్రమాదాలు జరిగి 60 మంది ప్రాణాలు కోల్పోయారు. ఎన్‌హెచ్-16పై 66 (20 మంది మృతి), ఎన్‌హెచ్-30పై 46 (16 మంది మృతి), ఎన్‌హెచ్-216పై ఆరు (ఐదుగురు మృతి) ప్రమాదాలు జరిగాయి.

ద్విచక్ర వాహన ప్రమాదాలే అధికం

నిర్లక్ష్యం, అతివేగంతో ప్రయాణించే ద్విచక్ర వాహనాల కారణంగా 199 ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో 81 మంది మృతి చెందగా, 150 మంది గాయాలపాలయ్యారు. కారు, జీప్, వ్యాన్ కారణంగా 145 ప్రమాదాలు జరిగి 33 మంది మృతి చెందారు. ట్రాక్టర్, లారీలు 97 ప్రమాదాలకు కారణమై 38 మందిని పొట్టనపెట్టుకున్నాయి. ఆటోలు 79 యాక్సిడెంట్‌లు చేసి 18 మందిని బలితీసుకున్నాయి. ఆర్టీసీ బస్సులు చేసిన 24 ప్రమాదాల్లో 10 మంది చనిపోయారు. ట్రక్ వాహనాలు చేసిన 18 ప్రమాదాల్లో 11 మంది మృతిచెందారు. ప్రైవేటు బస్సుల కారణంగా జరిగిన 11 ప్రమాదాల్లో ఒక్కరు మృతిచెందారు. భారీ వాహనాలు చేసిన రెండు ప్రమాదాల్లో ఒక్కరు, గుర్తు తెలియని వాహనాలు చేసిన 12 ప్రమాదాల్లో 8 మంది మృతి చెందారు. స్కూల్ బస్సులు చేసిన 2 ప్రమాదాల్లో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 9 గంటల మధ్యలోనే అధికం

మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల మధ్యలో 106 ప్రమాదాలు జరగ్గా, సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల మధ్య 116 ప్రమాదాలు జరిగాయి. రాత్రి 9 నుంచి అర్ధరాత్రి 12 గంటల మధ్యలో 82, అర్ధరాత్రి 12 నుంచి 3 గంటల వరకు 31, 3 నుంచి తెల్లవారుజామున 6 గంటల మధ్యలో 35, తెల్లవారుజామున 6 నుంచి ఉదయం 9 గంటల మధ్యలో 64, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్యలో 80, మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్యలో 75 ప్రమాదాలు జరిగాయి.



దుర్గగుడిలో దసరా ఏర్పాట్లు, అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్, ఈవో శీనానాయక్, ఇంజినీరింగ్ అధికారులు

సామాన్య భక్తులు సంతృప్తి చెందేలా..

దుర్గగుడిలో దసరా ఏర్పాట్లు

» దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సామాన్య భక్తుల సంతృప్తే ధ్యేయంగా ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని, సాంకేతికత వినియోగించి మరిన్ని సేవలు అందించే సంకల్పంతో ఉన్నామని దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ వివరించారు. విశ్వావసు నామ సంవత్సర దసరా ఉత్సవ ఏర్పాట్లు, ఇంద్రకీలాద్రి క్షేత్ర అభివృద్ధి పనులపై సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటన జరిపి, సమీక్ష నిర్వహించారు. కనకదుర్గానగర్ ప్రారంభం నుంచి ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్, కొత్తగా నిర్మించిన బీటీ రోడ్డు, నిర్మాణంలో ఉన్న ప్రసాదంపోటు, అన్నదాన భవనాలు తదితర పనులను ఈవో, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్న బెజవాడ కనకదుర్గమ్మ దసరా ఉత్సవాలకు దేశవ్యాప్తంగా 10 లక్షలకు పైగానే భక్తులు తరలివస్తారని అంచనా కాగా, భక్తుల సౌకర్యార్థం చేపట్టిన ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు కలెక్టర్, పోలీస్ కమిషనర్, ఈవో సమీక్ష జరిపి అన్ని కోణాల్లో పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. రాబోయే 10 రోజులు చాలా కీలకమన్నారు. ఏర్పాట్లు ఈనెల 15కి కచ్చితంగా పూర్తయ్యేలా ముందుకు సాగుతామని కమిషనర్ పేర్కొన్నారు. నూతన ప్రసాదాల పోటులో ప్రధానంగా అమ్మవారి ప్రసాదముల తయారీ జరుగుతుందని, నూతన అన్నదాన భవనంలో రెండు అంతస్తుల్లో బఫె విధానంలో భక్తులకు భోజన ఏర్పాట్లు చేసినట్టు కమిషనర్ తెలిపారు. ఈవో ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ పలు ఆదేశాలు జారీ చేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె.వి.ఎస్.ఆర్.కోటేశ్వరరావు, బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి సమయం ఇవ్వండి: కలెక్టర్

విజయవాడ సిటీ, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజలిచ్చిన అర్జీలను పరిష్కరించేందుకు సమయాన్ని కేటాయించాలని అధికారులకు కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ సూచించారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశపు హాలులో ప్రజల నుంచి ఆయన సోమవారం అర్జీలు స్వీకరించారు. ప్రజల అర్జీలపై అధికారుల వివరణ తీసుకున్నారు. క్షేత్రస్థాయి పరిశీలన చేసి, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో అర్జీలను నిర్దీత కాలవ్యవధిలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియా, డీఆర్వో ఎం లక్ష్మీనరసింహం, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, హౌసింగ్ పీడీ రజనికుమారి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న అర్జీదారులు

119 అర్జీలు

బురదకయ్యగా ఉన్న తమ కళాశాల రోడ్డును అభివృద్ధి చేయాలని కోరుతూ కంచికచర్ల ఎస్‌వీఎస్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. అలాగే తండ్రి, బాబాయి నుంచి తనను రక్షించాలని కోరుతూ విద్యాధరపురానికి చెందిన పాగోలు భార్గవ్‌రాజ్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. దివ్యాంగులకు 5శాతం రాజకీయ కోటా ఇస్తానని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని ఏపీ వీరవసంత దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లెల లక్ష్మీనారాయణ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించిన నేపథ్యంలో నష్టపోతున్న ఆటో, టాటా మ్యాజిక్, క్యాబ్ డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఇఫ్టూ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ప్రగతిశీల ఆటోకార్మిక సంఘం ప్రతినిధులు శ్రీను, నాని, రమేష్, అరుణోదయ శ్రీను, రామచంద్రరావు, ఇఫ్టూ నేతలు ఎం రామకృష్ణ వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు. ఇమామ్, మౌజిమ్‌కు గౌరవ వేతన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని వైసీపీ మైనార్టీ విభాగం ఎన్టీఆర్ జిల్లా ప్రతినిధులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఎమ్మెల్సీ రుహుల్లా, వైసీపీ మైనార్టీ విభాగం ప్రతినిధులు హఫీజ్‌ఖాన్, ఖాదర్‌బాషా, మస్తాన్ పాల్గొన్నారు. అలాగే పోలీస్ శాఖకు 24, రెవెన్యూ శాఖకు 18, వీఎంసీకి 18, డీఆర్‌డీఏకు ఎనిమిది, విభిన్న ప్రతిభావంతుల శాఖకు ఏడు, పంచాయతీరాజ్‌కు ఏడు, విద్యాశాఖకు ఐదు, పౌరసరఫరాల శాఖకు నాలుగు, వైద్య శాఖకు మూడు, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్‌కు మూడు, డీసీవోకు రెండు, మార్కెటింగ్‌కు రెండు, సాంఘిక సంక్షేమ శాఖకు రెండు, సర్వేకు రెండు, రవాణా శాఖకు రెండు, వ్యవసాయం, విద్యుత్, ఏపీఐడీసీ, ఏపీఎస్ఆర్టీసీ, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్, కాలుష్య నియంత్రణ శాఖలకు ఒక్కోటి చొప్పున అర్జీలు వచ్చినట్టు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు.



సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఏపీ రత్నప్రసాద్‌ను సత్కరించి అవార్డులను అందజేస్తున్న జేఎన్‌టీయూకే ప్రతినిధులు

వీఆర్ సిద్ధార్థకు ప్రతిష్ఠాత్మక అవార్డులు

కానూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడ కానూరులోని వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలకు ప్రతిష్ఠాత్మకమైన ఐదు అవార్డులు దక్కాయి. కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూకే) ప్రతిష్ఠాత్మకమైన ఐదు అవార్డులకు వీఆర్ సిద్ధార్థ వర్సిటీని ఎంపిక చేసింది. ఈనెల 6న జేఎన్‌టీయూకేలో జరిగిన వర్సిటీ ఫార్మేషన్ డే ఉత్సవాల సందర్భంగా వర్సిటీ అధికారులు అవార్డులను ప్రదానం చేశారు. వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏపీ రత్నప్రసాద్‌కు ఫ్యాకల్టీ రీసెర్చ్ ఇంపాక్ట్ అవార్డు దక్కింది. ఈ అవార్డును రత్నప్రసాద్ అందుకున్నారు. కళాశాల సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ సీహెచ్ రూప స్టాన్‌ఫర్డ్ వర్సిటీ గ్లోబల్ సైంటిస్ట్ రికగ్నిషన్ కింద స్టాన్‌ఫర్డ్ జాబితా 2024లో ప్రపంచ టాప్ 2 శాతం సైంటిస్టుల జాబితాలో చోటు దక్కించుకున్నందుకు అవార్డును పొందారు. కళాశాల విద్యార్థిని నిహిత వేములపల్లి అమెజాన్ వెబ్ సర్వీసెస్‌లో రూ.52.6 లక్షల వార్షిక ప్యాకేజీతో ప్లేస్‌మెంట్ సాధించినందుకు స్టూడెంట్ ప్లేస్‌మెంట్‌లో అత్యుత్తమ అవార్డును పొందారు. అలాగే 204 మంది పీహెచ్‌డీ హోల్డర్‌లుండగా, మొత్తం ఫ్యాకల్టీలో 61.4 శాతం కావడంతో అకడమిక్ స్ట్రెంగ్త్ అండ్ డాక్టరేట్ అవార్డును వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల సాధించింది. అలాగే రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌లో అత్యుత్తమంగా ఉండి ఒక్కొక్కటి రూ.20 లక్షలకు పైగా విలువైన 8 ఆర్‌అండ్‌డీ ప్రాజెక్టులు కలిగి ఉండటంతో ఎక్సలెన్స్ ఇన్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ అవార్డు కళాశాలకు లభించింది. సోమవారం కానూరులోని సిద్ధార్థ వర్సిటీలో వైస్ చాన్సలర్ పరుచూరి వెంకటేశ్వరరావు అవార్డులు సాధించిన వారిని అభినందించారు. మున్ముందు మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు.

జిల్లాలో యూరియా కొరత లేదు

- **పారదర్శకంగా ఎరువుల సరఫరా**
- **క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేస్తున్న అధికారులు**
- **వదంతులు నమ్మొద్దు, కంట్రోల్ రూమ్ నుంచి వాస్తవ సమాచారం**
- **విజయవంతంగా ఎరువులపై జన జాగృతి: కలెక్టర్ లక్ష్మీశ**

కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని, అత్యంత పారదర్శకంగా ప్రణాళిక ప్రకారం అన్నదాతలకు అండగా నిలబడుతూ అవసరానికి తగ్గట్టు ఎరువులు సరఫరా చేస్తున్నామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడుతూ తమ సమీపంలోని సొసైటీలో అందుబాటులో ఉన్న ఎరువులు, వచ్చేవారం రోజుల్లో కొత్తగా వచ్చే ఎరువులు, పంట దశను బట్టి ఎరువుల మోతాదు తదితర అంశాలతో పాటు నానో యూరియా ప్రయోజనాలను ఇంటింటికీ వెళ్లి అధికారులు, సిబ్బంది వివరించినట్టు తెలిపారు. గతేడాది ఖరీఫ్‌తో పోల్చితే ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి సాగు విస్తీర్ణం పెరిగిందని, దీనికి తగ్గట్టు యూరియా డిమాండ్ పెరిగిందని, ఇటీవల వర్షాలు కూడా బాగా పడటంతో ఒక్కసారిగా డిమాండ్ అధికమైందన్నారు. ఎరువులకు సంబంధించి వాస్తవ సమాచారాన్ని రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లను సంప్రదించాలని లేదంటే కలెక్టర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సంప్రదించాలన్నారు. ఒకవేళ ఎరువులు మార్గమధ్యంలో ఉంటే టోకెన్లు ఇచ్చి ఎరువులు చేరుకోగానే అందించడం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రకృతి సేద్యం ఉత్పత్తులు, సేంద్రీయ ఎరువుల స్టాళ్లను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. రైతులతో ముచ్చటించి సాగు విధానాల గురించి అడిగి తెలుసుకొన్నారు. ప్రజల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పించే ప్రకృతి సేద్యంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.



మాట్లాడుతున్న కృష్ణా వర్సిటీ ఉప కులపతి ఆచార్య రాంజీ

భారత్ శిక్షణకు ప్రపంచదేశాల ఆసక్తి

● కృష్ణా వర్సిటీ వీసీ ఆచార్య రాంజీ

● రాష్ట్రంలో తొలి అణు విజ్ఞాన ప్రదర్శన ప్రారంభం

మొగల్రాజపురం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అంతరిక్షం, రక్షణ రంగంలో దూసుకువెళుతున్న భారత్ నుంచి శిక్షణ తీసుకోవడానికి ప్రపంచదేశాలు ఆసక్తి కనబరుస్తున్నాయని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకుల పతి ఆచార్య కే రాంజీ అన్నారు. కళాశాల భౌతిక శాస్త్ర విభాగం రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా నిర్వహిస్తున్న అణు విజ్ఞానంపై నిర్వహిస్తున్న 5 రోజుల సైన్సు ఎగ్జిబిషన్ ప్రారంభ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాల ద్వారా ఏనాడో భారత్ తన వైజ్ఞానిక ప్రతిభను చాటుకుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ మాట్లాడుతూ ఆహార, వైద్య రంగాల్లో విజ్ఞాన శాస్త్రం అనేక మార్పులు తెచ్చిందన్నారు. కళాశాల కన్వీనర్ నిమ్మగడ్డ లలిత్ ప్రసాద్ మాట్లాడుతూ 30వేల మంది విద్యార్థులతో 5వేల మంది బోధన, బోధనేతర సిబ్బందితో నడుస్తున్న సిద్ధార్థ స్వర్ణోత్సవం సందర్భంగా ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామని విద్యార్థులు సందర్శించాలని సూచించారు. కళాశాల భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాస కృష్ణ, ఐజీసీఏ రీసెర్చ్ సాంకేతిక, ప్రజాసమన్వయ విభాగం హెడ్ జలజామదన్‌మోహన్, సైంటిఫిక్ అఫీసర్ కే పార్థీపన్, అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, డీన్ రాజేష్ జంపాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాతపద్ధతిలో పరీక్ష రాయించాలి

● 15 నుంచి 19 వరకు జరిగే యూటీఎఫ్ రణభేరి విజయవంతం చేయండి

● జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, సుందరయ్య

విజయవాడ, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): బుక్స్‌లో పరీక్ష రాసే విధానాన్ని రద్దుచేసి పాత పద్ధతిలో పేపర్‌పై పరీక్ష రాయించే విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్ ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 15నుంచి 19వరకు జరగబోయే యూటీఎఫ్ రణభేరిని విజయవంతం చేయాలని యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే శ్రీనివాసరావు, ఏ సుందరయ్య పిలుపునిచ్చారు. మనోహర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలవుతున్నా ఉద్యోగుల ఆర్థికపరమైన ఏ ఒక్క సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టలేదన్నారు. జిల్లా అధ్యక్షుడు కే శ్రీనివాస్ మాట్లాడుతూ బోధనేతర పనులతో ఉపాధ్యాయులపై పనిభారం మోపుతున్నారన్నారు.ఐక్య ఉపాధ్యాయ సంపాదకవర్గ సభ్యుడు జే రామకృష్ణ, సిటీ నేతలు పీ రామారావు, బీ జానకి, రూరల్ మండల అధ్యక్షుడు ఎస్ ఆర్‌హెచ్ పీ దేవ్, బీ రమేష్ పాల్గొన్నారు.




సే నో టూ ప్లాస్టిక్ అని ప్రింట్ చేసిన పేపర్ కవర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

విచ్చలవిడి ప్లాస్టిక్ వినియోగంతో

మానవ మనుగడే ప్రశ్నార్థకం: కలెక్టర్

కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విచ్చలవిడి ప్లాస్టిక్ వినియోగం భవిష్యత్తులో మానవ మనుగడకే ప్రశ్నార్థకం కానుందని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పటిష్ఠంగా అమలు చేసి కాలుష్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇగ్నైట్ సెల్‌ను కలెక్టర్ లక్ష్మీశ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణానికి హాని చేకూర్చే ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. భావితరాలకు ఆరోగ్యకర పర్యావరణాన్ని బహుమతిగా ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారి పీ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

వెయిటేజ్ మార్కులతో న్యాయం చేయండి

● నేతలు దేవేంద్రగౌడ్, నరసింహా నాయుడు డిమాండ్

ధర్నాచౌక్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ నియామకాల్లో ఈవెంట్స్‌లో వెయిటేజ్ మార్పులు కల్పించి ఉత్తమమైన వ్యాయామ ఉపాధ్యాయులను ప్రభుత్వ స్కూళ్ళకు ఎంపిక చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నేతలు దేవేంద్రగౌడ్, నరసింహ నాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ధర్నాచౌక్‌లో వ్యాయామ ఉపాధ్యాయులు సోమవారం ధర్నా నిర్వహించారు. కోలాటం ఆడి వినూత్నంగా తమ నిరసన వ్యక్తం చేశారు. డీఎస్సీ ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులకు సంబంధించి 1:3 రేషియోలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు పిలవాలని, ఫైనల్ కీలో అభ్యంతరాలను సరిచేసి రిజల్ట్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

పలు రైళ్లకు ప్రయోగాత్మక

స్టాపేజీల కొనసాగింపు

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పలు రైళ్లకు ప్రయోగాత్మక స్టాపేజీలను కొనసాగిస్తున్నట్టు సౌత్ సెంట్రల్ రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. షాద్‌నగర్‌లో చెంగల్‌పట్టు - కాచిగూడ, కాచిగూడ - పుదుచ్చేరి వెళ్లి వచ్చేరైళ్లు మరికొంతకాలం పాటు ఆగనున్నాయి. సిరిపూర్ కాగజ్‌నగర్ - హైదరాబాద్, విజయవాడ - సికింద్రాబాద్, సికింద్రాబాద్ - గుంటూరు, హైదరాబాద్ - సిరిపూర్ కాగజ్‌నగర్ వెళ్లి వచ్చే రైళ్లు చర్లపల్లి స్టేషన్‌లో మరికొంతకాలం పాటు ఆగనున్నాయి. యశ్వంత్‌పూర్ - హజరత్ నిజాముద్దీన్ వెళ్లి వచ్చేరైళ్లు మహబూబ్‌నగర్‌లో ఆగనున్నాయి. కాచిగూడ - మధురై, వెళ్లి వచ్చేరైళ్లు పీలేరులో ఆగనున్నాయి. హుబ్లీ - మైసూర్ అప్ అండ్ డౌన్ రైళ్లు అనంతపూర్ స్టేషన్‌లో ఆగనున్నాయి. యశ్వంత్‌పూర్ - లాతూర్ రైలు కమల్‌నగర్‌లో ఆగనుంది. ముంబయి సీఎస్టీ - హింగోలి డక్కన్, వెళ్లి వచ్చేరైళ్లు సెలు స్టేషన్‌లో ఆగనున్నాయి. ఇవే రైళ్లు పర్భార్‌లోనూ ఆగనున్నాయి. నాగర్‌సోల్ - నరసాపూర్ వెళ్లి వచ్చేరైళ్లు మహబూబాద్‌లో ఆగనున్నాయి. కాజీపేట - పూణే వెళ్లి వచ్చేరైళ్లు మంచిర్యాల స్టేషన్‌లో ఆగనున్నాయి. దౌండ్ - నిజామాబాద్ వెళ్లి వచ్చేరైళ్లు నవీపేటలో ఆగనున్నాయి. తిరుపతి-ఆదిలాబాద్ వెళ్లి వచ్చేరైళ్లు మేడ్చల్ స్టేషన్‌లో ఆగనున్నాయి. గుంటూరు-ఔరంగాబాద్ రైలు ఉందానగర్‌లో ఆగనుంది. ముంబయి సీఎస్టీ - నాగర్‌కోయిల్ రైలు పీలేరులో ఆగనుంది. హజరత్ నిజాముద్దీన్ - కేఎస్ఆర్ బెంగళూరు వెళ్లి వచ్చేరైళ్లు యాద్గిర్ స్టేషన్‌లో ఆగనున్నాయి. గుంటూరు-నరసాపూర్ రైలు పుట్లచెరువులో ఆగనుంది. ధర్మవరం - మచిలీపట్నం వెళ్లి వచ్చేరైలు కొండాపురంలో ఆగనుంది. తిరుపతి - సికింద్రాబాద్ రైలు శ్రీరామ్‌నగర్‌లో ఆగనుంది. యల్హంక - కాచిగూడ రైలు షాద్‌నగర్‌లో ఆగనుంది. జైపూర్ - మైసూర్ రైలు గద్వాల్‌లో ఆగనుంది. నాగర్‌సోల్ - చెన్నై సెంట్రల్, గోరఖ్‌పూర్ - యశ్వంతపూర్, డాక్టర్ అంబేద్కర్‌నగర్ - యశ్వంత్‌పూర్ రైళ్లు మహబూబ్‌నగర్‌లో ఆగనున్నాయి. గుంతకల్ - హైదరాబాద్ రైలు గద్వాల్ స్టేషన్‌లో ఆగనుంది. పూరి - తిరుపతి, తిరుపతి - కాకినాడ టౌన్, బిలాస్‌పూర్ - తిరుపతి రైళ్లు చిన్నగంజాం స్టేషన్‌లో ఆగనున్నాయి. గుంటూరు - రాయగడ రైలు భీమడోలు స్టేషన్‌లో ఆగనుంది. విశాఖపట్నం - సికింద్రాబాద్ వెళ్లి వచ్చేరైలు సామర్లకోటలో ఆగనుంది. ఎర్నాకులం - బరోని రైలు చీరాల స్టేషన్‌లో ఆగనుంది. విశాఖపట్నం - సికింద్రాబాద్ వెళ్లి వచ్చేరైలు ఏలూరు స్టేషన్‌లో ఆగనుంది.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వేదిక నేతలు

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో

సుదర్శన్‌రెడ్డికి ఓటు వేయండి

● లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక

గాంధీనగర్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ప్రతిపక్షాల అభ్యర్థి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డికి ఓటువేసి రాజ్యాంగాన్ని, లౌకికవాదాన్ని పరిరక్షించాలని లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక నేతలు రాష్ట్రంలోని ఎంపీలకు పిలుపునిచ్చారు. ఈ ఎన్నికలు ఇద్దరు అభ్యర్థుల మధ్య పోటీ కాదని రెండు సిద్ధాంతాల మధ్య జరుగుతున్న ఎన్నికలన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వేదిక నేతలు మాట్లాడారు. సుదర్శన్‌రెడ్డి 5 దశాబ్దాలుగా న్యాయ సేవలందించారని, అనేక చరిత్రాత్మకమైన తీర్పులిచ్చారన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న వారిపై తప్పుడు కేసులు బనాయించి జైళ్లలో నిర్బంధిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో అధికార కూటమితో పాటు ప్రతిపక్ష వైసీపీ కూడా బీజేపీకి మద్దతు ఇవ్వడాన్ని తప్పుబట్టారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీలు జల్లి విల్సన్, కేఎస్ లక్ష్మణరావు, న్యాయవాది అబ్దుల్ మతిన్, డీహెచ్‌పీఎస్ నేత బుట్టి రాయప్ప, సయ్యద్ అప్సర్, షేక్ బాజీ, హుస్సేనీబాబా పాల్గొన్నారు.

జైలు వద్ద అలజడి జరగలేదు: అధికారులు

విజయవాడ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్యం కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉంటూ బెయిల్ పొందిన మాజీ ఐఏఎస్ కే ధనంజయ్‌రెడ్డి, పీ కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప విడుదల సమయంలో ఎలాంటి హైడ్రామా జరగలేదని జైలు అధికారులు వివరణ ఇచ్చారు. దీనిపై సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఎన్ఎస్పీ కాల్వపై కల్వర్టు ధ్వంసం

● రైతుల రాకపోకలకు ఇబ్బందులు ● నీటి సంఘం అధ్యక్షుడికి చెప్పిన రైతులు

● ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని హామీ



ధ్వంసమైన జమలాపురం మైనర్ కాల్వ కల్వర్టు



రాకపోకలకు వీల్లేకుండా ఉన్న కాల్వకట్ట

గంపలగూడెం, ఆంధ్రజ్యోతి: మండలంలోని కనుమూరు రెవెన్యూ పరిధిలోని పలుకురాయి క్వారీకి సరిహద్దున ఉన్న జమలాపురం మేజర్ కాల్వకట్టపై భారీ వాహనాల రాకపోకలతో తీవ్రంగా దెబ్బతిని, రైతులు తమ సాగుభూములకు వెళ్లేందుకు వీలులేకుండా పోయింది. కనుమూరు నివాసి అయిన వంగల వెంకటేశ్వర్లుకు చెందిన ఆర్ఎస్ నెం.223/2లో సుమారు మూడెకరాల భూమిని, లార్విన్ మినరల్స్ సంస్థ ప్రతినిధులు కౌలుకు తీసుకున్నారు. గనులశాఖ అనుమతితో నాలుగేళ్లు ఆ భూమిలో పలుకురాయి తవ్వకాలు చేస్తున్నారు. ఇప్పటికే రూ.కోట్ల విలువైన సహజ సంపదను తరలించారు. వైసీపీ ప్రభుత్వంలోనే కాకుండా నేటి కూటమి ప్రభుత్వంలోనూ తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ పలుకురాయి జిల్లాకు, రాష్ట్రాలకు తరలిస్తుండంతో సరిహద్దును ఉన్న జమలాపురం ఎన్ఎస్పీ కాల్వకట్టపై 50 నుంచి 60 టన్నుల బరువుతో వాహనాలు రాకపోకలు చేస్తుండటంతో, కాల్వకట్ట 26వ కిలోమీటరు వద్ద ఉన్న మైనర్ ఎన్ఎస్పీ కాల్వపై ఉన్న కల్వర్టుపై, భారీ వాహనాలు పరిమితికి మించిన బరువుతో రాకపోకలు చేయడంతో కల్వర్టు ధ్వంసమైంది. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీసు, ఘనులు, ఎన్ఎస్పీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. కల్వకట్ట ధ్వంసమై తారురోడ్డు గుంతలుపడినా అధికారుల స్పందన లేక రైతులు ఎన్ఎస్పీ నీటిసంఘం అధ్యక్షుడు జంగా చెంచురెడ్డి దృష్టికి తెచ్చారు. ధ్వసంమైన కల్వర్టు, రాకపోకలకు వీలుకాని కల్వకట్ట, గుంతలు పడ్డ తారురోడ్డు పరిశీలించానని, ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి

9

నవ్య డాక్టర్

మంగళవారం • 9 సెప్టెంబరు 2025



ఒబేసిటీ

అధిక బరువును తగ్గించుకునే మార్గాలెన్నో ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. అయితే వాటిని దగ్గరి దారులుగా భావించడం పొరపాటు. అత్యవసరమైతే తప్ప బరువు తగ్గించే మాత్రలు, ఇంజక్షన్ల జోలికి వెళ్లకూడదు. ఒబేసిటీ మందుల ప్రయోజనాలు, దుష్ప్రభావాల గురించి వైద్యులు ఇలా వివరిస్తున్నారు.

బరువు తగ్గించే మందులతో ప్రమాదమే!

అధిక బరువు బిఎమ్‌ఐ మీద ఆధారపడి ఉంటుంది. శరీర బరువు, ఎత్తు/మీటరుతో అధిక బరువును లెక్కించవచ్చు. బిఎమ్‌ఐ 18 కంటే తక్కువగా ఉండే దాన్ని పోషకాహార లోపంగా భావించాలి. 18.5 నుంచి 25 ఉంటే దాన్ని సరైన బరువుగా పరిగణించాలి. 25కు మించితే అధిక బరువుగా, 28, అంతకు మించితే ఒబేసిటీగా పరిగణించాలి. అయితే 13 నుంచి 18 ఏళ్ల వయస్కుల్లో హార్మోన్లు హెచ్చుతగ్గులకు గురవుతూ ఉంటాయి కాబట్టి బరువులో కూడా వ్యత్యాసాలు చోటుచేసుకుంటూ ఉంటాయి. మరీముఖ్యంగా ఈ వయసు అమ్మాయిల్లో నెలసరి మొదలై కార్టిసాల్ హార్మోన్ పెరిగి, తిండి పట్ల యావ పెరుగుతుంది. దాంతో బరువు పెరుగుతారు. ఇదే వయసు అబ్బాయిలు కూడా హార్మోన్ల హెచ్చుతగ్గుల ఫలితంగా ఎత్తు, బరువు పెరుగుతారు. అలాగే థైరాయిడ్ సమస్యల వల్ల కూడా శరీర బరువు పెరుగుతుంది. జన్యుపరమైన సమస్యల వల్ల కొంతమంది పిల్లలు అధిక బరువుతో పుడతారు. ఇలాంటి పిల్లల్లో భవిష్యత్తులో చిన్న వయసులోనే మధుమేహం తలెత్తుతుంది. దాంతో ఒబేసిటీ కూడా తలెత్తుతుంది. ఒబేసిటీ, హైపర్‌టెన్షన్, మధుమేహం... ఈ మిశ్రమ సమస్యను 'మెటబాలిక్ సిండ్రోమ్'గా పరిగణించాలి. ఈ కోవకు చెందినవాళ్లు అవసరానికి మించి తినకపోయినా, బరువు పెరిగిపోతూ ఉంటారు.

జన్యువులూ కారణమే!

కొందరు ఎంత తిన్నా సన్నగానే ఉంటారు. ఇంకొందరు కొంత తిన్నా లావైపోతూ ఉంటారు. పుట్టుకతో సంక్రమించే జన్యువులే ఇందుకు కారణం. ఆకలి, కొన్ని పదార్థాలు తినాలనే బలమైన కోరిక, సంతృప్తి, శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం, శరీరంలో కొవ్వు నిల్వ.. వీటికి సంబంధించిన జన్యువులుంటాయి.
ఈ జన్యువుల్లో లోపాలున్నప్పుడు సంబంధిత అంశాలన్నీ ప్రభావితమవుతాయి. ఆకలి మీద నియంత్రణ కోల్పోవడం, ఎంత తిన్నా సంతృప్తిని పొందలేకపోవడం, శరీరం శక్తిని ఖర్చుచేసుకునే వేగం తగ్గడం, శరీరంలో కొవ్వు పేరుకుపోతూ ఉండడం లాంటి సమస్యలన్నిటికీ సంబంధిత జన్యు లోపాలే కారణం. వీటిని నియంత్రించే వీలు ఉండదు కాబట్టి అంతిమంగా స్థూలకాయులైపోతూ ఉంటారు.

వ్యాయామంతోనే ఫలితం

శరీరం శక్తిని ఖర్చు చేసుకునే బేసిక్ మెటబాలిక్ రేటును పెంచుకోదగిన ఏకైక మార్గం... వ్యాయామం. అందుకోసం రోజుకు 20 నుంచి 30 నిమిషాలకు తగ్గకుండా వారానికి 150 నిమిషాల చొప్పున వేగంగా నడవాలి. ఇలా మూడు నెలల పాటు క్రమం తప్పక నడకను కొనసాగించగలిగితే కచ్చితంగా ఫలితం ఉంటుంది. అలాగే ఈత, జిమ్‌లో వ్యాయామాలతో కూడా ఫలితం ఉంటుంది. అలాగే ఆహార నియమాల్లో భాగంగా పిండిపదార్థాలు తగ్గించేసి, కూరగాయలు, ప్రొటీన్లు ఎక్కువగా తీసుకోవాలి.

ఉత్తమ మార్గం ఇదే!

అధిక బరువును వదిలించుకోడానికి సురక్షితమైన మార్గాన్నే ఎంచుకోవాలి. అవసరానికి మించి తినడం వల్ల, వ్యాయామం లోపించడం వల్ల బరువు పెరిగితే అదే ఆహారాన్ని తగ్గించి, వ్యాయామాన్ని పెంచి బరువు తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. ఈ ప్రయత్నాలతో కచ్చితంగా అధిక బరువు అదుపులోకొస్తుంది. అయినప్పటికీ విపరీతమైన ఆకలి, కొన్ని పదార్థాలను తినాలనే యావ లాంటివి ఉన్నప్పుడు, వాటిని నియంత్రించే కొన్ని మాత్రలు వాడుకోవచ్చు. అవేంటంటే...

అరుగుదల పెంచే మాత్రలు: తిన్నది వెంటనే వేగంగా అరిగి, శరీరంలో క్యాలరీలు పేరుకుపోకుండా చేస్తాయి

కొవ్వును తగ్గించే మాత్రలు: తిన్నది అరిగిపోతున్నా, శరీరంలో కొవ్వు పేరుకుపోతుంటే, ఆ కొవ్వును కరిగించే మాత్రలు వాడుకోవచ్చు

ఆకలి తగ్గించే మాత్రలు: కొన్ని మాత్రలు మెదడును ప్రభావితం చేసి, ఆకలి కోరికను తగ్గిస్తాయి వీటిలో నాలుగు నుంచి 8 రకాల మాత్రలు అందుబాటులో ఉన్నాయి.

బరువు తగ్గించే ఇంజక్షన్లు

ఆకలి తగ్గించే ఇంజక్షన్: ఈ ఇంజక్షన్‌తో వాంతి వస్తున్న భావన నిరంతరం కొనసాగుతుంది. కాబట్టి తినాలనే కోరిక సన్నగిల్లుతుంది. దాంతో ఒకట్రెండు వారాల్లో పదార్థాల పట్ల వ్యామోహం తగ్గి, ఆకలి అదుపులోకొస్తుంది. ఈ ఇంజక్షన్ మధుమేహులకు కూడా సహాయపడుతుంది.

సెమాగ్లూటైడ్: ఆకలి, అధిక బరువుతో పాటు మధుమేహాన్ని కూడా తగ్గించే ఇంజక్షన్ ఇది



ఆర్లిస్టాట్, సిబుట్రమైన్: ఈ ఇంజక్షన్లు శరీరంలోని కొవ్వును కరిగించి, విసర్జనతో శరీరం నుంచి తొలగిస్తాయి

ఈ ఇంజెక్షన్లు అందరికీ ఒకే ఫలితాన్ని అందించకపోవచ్చు. కొందర్లో కొన్ని దుష్ప్రభావాలు కూడా తలెత్తవచ్చు. కొందరికి కడుపు నొప్పి, విరోచనాలు, అజీర్తి, కడుపుబ్బరం వేధిస్తాయి.

ఇంజక్షన్లకూ నియమాలున్నాయి

అధిక బరువును తగ్గించుకోవడం కోసం మొదట మూడు నెలల పాటు ఆహార నియమాలు పాటిస్తూ, వ్యాయామాలు చేయాలి. అలాగే అధిక బరువుకు కారణమయ్యే థైరాయిడ్ సమస్యను మందులతో అదుపులో పెట్టుకోవాలి. వీటితో అనుకున్నంత ఫలితం కనిపించనప్పుడు మాత్రమే అంతిమ పరిష్కారంగా వైద్యులు బరువు తగ్గించే మాత్రలు, ఇంజక్షన్లను సూచిస్తారు. అయితే ఇవి వాడుకున్నంత కాలం ఆహార నియమాలు, వ్యాయామాలు తప్పక కొనసాగించాలి. వ్యాయామాలు మానేసి పూర్తిగా ఈ ఇంజక్షన్ల మీదే ఆధారపడితే, శరీరంలో ఆమ్లం పెరిగి, ఒంటి నొప్పులు, ఇన్‌ఫెక్షన్లు వేధిస్తాయి. బరువు తగ్గించే మాత్రలు, ఇంజక్షన్లు అందరికీ ఒకే రకమైన ఫలితాన్నివ్వవు. కాబట్టి రెండు నుంచి మూడు వారాల పాటు గమనిస్తూ, మాత్రలు, ఇంజక్షన్లలో, వాటి మోతాదుల్లో మార్పులు చేసుకుంటూ ఫలితాన్నీ, దుష్ప్రభావాలనూ గమనిస్తూ, వైద్యులు సరైన చికిత్సను ఎంచుకుంటూ ఉంటారు. ఇలాంటి చికిత్సను మూడు నెలల పాటు కొనసాగించి, అధిక బరువును వదిలించుకోవచ్చు. అయితే ఇలా తగ్గిన బరువు తిరిగి పెరగకుండా ఉంటుందని అనుకోకూడదు. తగ్గిన బరువును కొనసాగించాలంటే వైద్యులు సూచించే ఆహార నియమాలు, వ్యాయామాలు తప్పక కొనసాగించాలి.

డాక్టర్ శ్రీకృష్ణ ఆర్ బొడ్డు
కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్,
కామినేని హాస్పిటల్స్,
ఎల్‌.బి నగర్, హైదరాబాద్.



మీకు తెలుసా?

మలబద్ధకం వదలాలంటే?

ఉదయాన్నే కాలకృత్యాలు తీరకపోతే రోజంతా ఇబ్బందిగానే ఉంటుంది. అయితే కొన్నిసార్లు మన ఆహారశైలి కారణంగా మలబద్ధకం తలెత్తి, తిరిగి రెండో రోజుకి సర్దుకుంటుంది. కానీ ఇదే ఇబ్బంది పదే పదే తలెత్తుతున్నా, రోజుల తరబడి వేధిస్తున్నా సుఖ విరేచనం జరిగేందుకు తోడ్పడే పదార్థాలను తీసుకోవాలి.

- **కలబంద:** కలబందలో ఉండే 'ఆంత్రాక్వినోన్స్' అనే కాంపౌండ్లు పెద్ద పేగుల్లో నీరు ఊరేలా చేసి, మ్యూకస్‌ను ఉత్పత్తి చేసి, పేగుల కదలికలను పెంచుతాయి. దాంతో తేలికగా విరేచనం జరిగి మలబద్ధకం వదులుతుంది. కాబట్టి అర కప్పు కలబంద గుజ్జు పరగడుపునే తీసుకుంటే ఫలితం ఉంటుంది.
- **సబ్జా:** నీళ్లతో కలిస్తే సబ్జా జిగురులా తయారవుతుంది. ఆ తత్వం కారణంగా సబ్జా పేగుల్లో తేలికగా కదిలి మలబద్ధకాన్ని వదిలిస్తుంది. రాత్రంతా నీళ్లలో నానబెట్టిన సబ్జా విత్తనాలను పరగడుపునే తాగితే విరేచనం తేలికగా జరుగుతుంది.
- **అవిసెలు:** వీటిలో పీచు పదార్థం ఎక్కువగా ఉంటుంది. మలబద్ధకం ఉన్నవారు వంటకాల్లో అవిసె గింజల పొడి కలుపుకుని తింటే, తగినంత పీచు శరీరానికి అందుతుంది. ఇది మలంతో కలిసి పేగుల్లో తేలికగా జారేందుకు సహాయపడుతుంది.



- **ఆకు కూరలు:** ఆకు కూరల్లో ఉండే మెగ్నీషియమ్‌కు మలాన్ని మెత్తబరిచే గుణం ఉంటుంది. అంతేకాదు. పేగుల్లో నీరు ఊరేలా చేయగల శక్తి మెగ్నీషియమ్‌కు ఉంటుంది. ఈ గుణాల వల్ల ఆకు కూరలు తింటే విరేచనం తేలికగా జరుగుతుంది.
- **తాజా పళ్లు:** కొందరికి తాజా పళ్లు సుఖ విరేచనానికి సహాయపడతాయి. ఆకలి తీరటంతోపాటు మలబద్ధకం తలెతకుండా ఉండాలంటే రోజుకి కనీసం 3 రకాల పళ్లు తినాలి. రాత్రి నిద్రకు ముందు మగ్గిన అరటి పండు తిన్నా ఉదయాన్నే సుఖ విరేచనం అవుతుంది.
- **కొబ్బరి నీళ్లు:** వీటిలో ఉండే ఎలక్ట్రొలైట్లు మలబద్ధకానికి కారణమయ్యే డీహైడ్రేషన్‌ను తొలగించి, మూత్రనాళాన్ని శుభ్రం చేస్తాయి. ఫలితంగా మలబద్ధకం వదులుతుంది.

తెలుసుకుందాం

గుండె ఆరోగ్యం విషయంలో మనకెన్నో అనుమానాలుంటాయి. మరీ ముఖ్యంగా ఎలాంటి ఆహారం గుండెకు మేలు చేస్తుందో, ఏది కీడు చేస్తుందో తెలుసుకోవాలనే ఆసక్తి మనందర్లో ఉంటుంది. ఆ ఆహారమేదంటే..



గుండెకు రక్షణ ఇచ్చే ఆహారం

వీటితో గుండెకు చేటు

భోజనం తదనంతరం స్టార్చ్‌తో కూడిన చిరుతిళ్లు (బంగాళాదుంప, అరటికాయ చిప్స్) తినడం వల్ల, ఆయుర్దాయం తగ్గే అవకాశాలు 50% పెరుగుతాయనీ, గుండె జబ్బులు తలెత్తే అవకాశాలు 45% పెరుగుతాయనే ఓ అధ్యయనం అమెరికన్ హార్ట్ అసోసియేషన్ జర్నల్‌లో ప్రచురితమైంది. పళ్లు, కూరగాయలు, పాల ఉత్పత్తులు, పప్పుదినుసులతో కూడిన పోషకాహారాలను రోజులోని కొన్ని



నిర్దిష్ట సమయాల్లో తినడం వల్ల ఆరోగ్యపరమైన అస్వస్థతలు దరి చేరకుండా ఉంటాయని ఈ అధ్యయనం చెబుతోంది.

ఏ ఆహారం? ఎప్పుడు?

ఉదయం, మధ్యాహ్నం, రాత్రి తీసుకునే ఆహారంలో పాలిష్ పట్టిన ధాన్యం, ఘనరూపంలోని కొవ్వులు, జున్ను, అదనపు చక్కెరలు, మాంసాలతో కూడి పాశ్చాత్య ఆహారపుటలవాట్లు కలిగిన వారు శ్వాసకోశ, గుండె సంబంధ రుగ్మతలతో చనిపోయే అవకాశాలు 44% ఎక్కువ. అలాకాకుండా మధ్యాహ్న భోజనంలో పళ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, పెరుగు, నట్స్ తీసుకునేవారు ఇలాంటి గుండె సంబంధ రుగ్మతలతో చనిపోయే అవకాశాలు 34% తక్కువ. రాత్రి భోజనంలో కూరగాయలు, పప్పుదినుసులు తీసుకునేవారి విషయంలో హృద్రోగాలతో చనిపోయే అవకాశాలు 23% తక్కువ.

సమయమూ కీలకమే!

గుండె ఆరోగ్యం మెరుగ్గా ఉండాలంటే జీవ గడియారానికి అనుగుణంగా ఆహారం తీసుకోవాలి. ఇందుకోసం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత పళ్లు తినాలి. మధ్యాహ్న భోజనంలో ప్రాసెస్‌డ్ ఫుడ్ మానేయాలి. మాంసం, అదనపు చక్కెరలు, పాలిష్ పట్టిన ధాన్యం తీసుకోకూడదు. బదులుగా పళ్లు, తృణధాన్యాలు తీసుకోవాలి.
సాయంత్రం స్నాక్స్‌గా గుప్పెడు వాల్‌నట్స్ లేదా ఓ కప్పు పెరుగు, తాజా బెర్రీలు తీసుకోవచ్చు. రాత్రి భోజనంలో వీలైనన్ని కూరగాయలు, పప్పుదినుసులు తీసుకోవాలి.

ఆర్థోపెడిక్ షూస్

పాదాలు పదిలంగా...

చెప్పులు అందంగా ఉంటే సరిపోదు, సౌకర్యంగా ఉండాలి. పాదాల్లోని లోపాలను భర్తీ చేయడంతో పాటు పొంచి ఉండే ప్రమాదాల నుంచి రక్షణ కల్పించాలి. మడమ శూల, కీళ్ల నొప్పులు, వంకరలు... ఇలా నడకను ఇబ్బంది పెట్టే సమస్యలకు తగిన చెప్పులెన్నో అందుబాటులో ఉంటున్నాయి. వాటి గురించి తెలుసుకుందాం!

మధుమేహులైతే...

కొత్తగా మధుమేహం బయల్పడి, దాన్ని అదుపులో ఉంచుకుంటున్నవాళ్లు సాధారణ చెప్పులు వేసుకోవచ్చు. కానీ పది నుంచి పదిహేనేళ్లకు పైగా మధుమేహంతో బాధపడుతున్నవాళ్ల నరాలు సున్నితంగా ఉంటాయి. దాంతో స్పర్శ తగ్గి, పాదాలు ఒరుసుకునే చోట అల్సర్లు ఏర్పడే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఈ కోవకు చెందినవాళ్లు, ఎమ్‌సిఆర్ (మైక్రో సెల్యులర్ రబ్బర్) చెప్పులు వేసుకోవాలి. లేదంటే మెత్తని చెప్పులు వేసుకోవాలి.

పాదాల్లో వైకల్యం ఉంటే...

పాదంలో పలు ఎముకలుంటాయి. వాటిలో దేన్లోనైనా పుట్టుకతోనే లోపం ఉండొచ్చు. లేదా పాదమే వంపు తిరిగి ఉండొచ్చు. అయితే ఎక్స్‌రేతో ఇలాంటి లోపాల తీవ్రతను, దశను కనిపెట్టే వైద్యులు, ఆ లోపానికి తగిన చెప్పులను సూచిస్తారు. వాటిని ఎవరికి వారు ప్రోస్థటిక్ షాపుల్లో స్వయంగా తయారు చేయించుకోవాలి. ఇందుకు వైద్యులు సహాయపడతారు. ఫలానా ప్రదేశం మీద ఒత్తిడి పడకూడదని వైద్యులు సూచించినప్పుడు, అందుకు తగిన చెప్పులను ప్రోస్థటిక్ నిపుణులు డిజైన్ చేసి అందిస్తారు. పాదంలోని పుట్టుక లోపాలు స్వల్పమైనవి అయితే, వాటిని ఇలాంటి 'ఆఫ్ లోడింగ్ స్లిప్పర్స్'తో, ఫిజియోథెరపీతో సరిదిద్దుకోవచ్చు. సమస్య మరింత క్లిష్టమైనదైతే సర్జరీ అవసరమవుతుంది. పాదాల్లో వైకల్యాలు భిన్నంగా ఉంటాయి కాబట్టి ఏ ఒక్కరి చెప్పులూ ఒకేలా ఉండవు. ఇవి రెడీమేడ్‌గా దొరకవు. పాదంలోని లోపం ఆధారంగా చెప్పులను డిజైన్ చేయించుకోవాలి.



సర్జరీ తదనంతరం

ఎముకలు విరిగినప్పుడు పాత రోజుల్లో పిండి కట్టు వేయించుకుని నెలల తరబడి ఇంటికే పరిమితమైపోయేవాళ్లం. కానీ ఇప్పుడు పిండికట్టు స్థానాన్ని పిఒపి కాస్ట్‌లు ఆక్రమించాయి. వీటిని వేయించుకుని, నడవడానికి వీలుండే 'ప్లాస్టర్ బూట్లు' అందుబాటులో ఉన్నాయి. అలాగే పాదానికి సర్జరీ చేసి, కోలుకున్న తర్వాత నడవడానికి ఉపయోగపడే చెప్పులు కూడా అందుబాటులోకొచ్చాయి. వాటిని 'వాకర్ బూట్' అంటారు. వీటితో పాదం మీద ఒత్తిడి పడదు. లోపల మెత్తని స్పాంజితో, పాదానికి చక్కని పట్టును, సంతులనాన్నీ అందించే ఈ బూట్లను వైద్యులు సూచించినంత కాలం వాడుకోవచ్చు.

మడమ శూల ఉంటే...

ఈ సమస్య తలెత్తినప్పుడు, మడమ మీద ఒత్తిడి పడే వీల్లేని 'సిలికాన్ హీల్' వాడుకోవాలి. బూట్లలో ఉండే సోల్‌ను తొలగించి, వాటి స్థానంలో సిలికాన్ హీల్స్‌ను అమర్చుకుని వాడుకోవాలి. చెప్పులు వేసుకునే అలవాటున్నవాళ్లు ఎమ్‌సిఆర్ చెప్పులు లేదా 'ఆర్థో హీల్' చెప్పులు వాడుకోవాలి. వీటిని బయటకు వెళ్లేటప్పుడే కాకుండా, ఇంట్లో కూడా వాడుకోవాలి. కాబట్టి రెండు జతల చెప్పులు కొని వాడుకోవాలి.



'ఇన్‌సోల్స్' ఎవరికంటే?

పోలియో ఉన్నవారికి ఒక వైపు కాలు కురచగా ఉండొచ్చు. పాతిక, ముప్పై ఏళ్ల క్రితం ప్రమాదాలకు గురై, కాలికి పిండి కట్టు వేయించుకుని అది విఫలమై, కాలి ఎముక పొడవులో హెచ్చుతగ్గులు చోటుచేసుకోవచ్చు. ఇలాంటి వారి కాళ్ల పొడవును సమం చేయడం కోసం వైద్యులు 'ఇన్‌సోల్స్' సూచిస్తారు. తేలికపాటి పోలియో సమస్య ఉన్నవారికి కూడా వైద్యులు ఇవే చెప్పులను సూచిస్తూ ఉంటారు.

చదును పాదాల కోసం...

పాదంలో వంపు లేకుండా చదునుగా ఉన్నప్పుడు, ఆ వంపును సృష్టించడం కోసం 'మీడియల్ ఆర్చ్ సపోర్టింగ్ సోల్స్'ను ఎంచుకోవాలి. పాదంలో వంపును సృష్టించే ఈ చెప్పులు వేసుకున్నప్పుడు చక్కని పట్టు దక్కి, మడమ శూల, పాదాల నొప్పులు వేధించకుండా ఉంటాయి.

వ్యాయామాలు చేసేటప్పుడు...

ఉడెన్ ఫ్లోరింగ్ ఉన్న చోట 'నాన్ స్లిప్ షూస్' ఎంచుకోవాలి. మైదానంలో, పార్కుల్లో, రోడ్డు మీద పరిగెత్తేవాళ్లు మెత్తగా, సౌకర్యంగా ఉండే బూట్లు వేసుకోవాలి. అలాగే ఈ బూట్ల సైజు ఎక్కువ, తక్కువ ఉండకూడదు. మడమ తేలికగా పైకీ, కిందకూ కదిలేలా ఉంటే సరిపోతుంది. అలాగని నడిచేటప్పుడు మడమ బూటులో నుంచి పూర్తిగా ఊడి రాకూడదు.

కీళ్ల నొప్పులుంటే...

కీళ్ల నొప్పులను అదుపు చేయడం కోసం కాలి కండరాలను బలపరుచుకోవాలి. అందుకోసం వైద్యులు ప్రతి రోజూ నడవమని సూచిస్తూ ఉంటారు. ఇలాంటి సందర్భాల్లో మెత్తని కుషన్ కలిగిన షూలు ఎంచుకోవాలి. చెప్పులు, చదునుగా ఉండే కాన్వాస్ బూట్లు లాంటివి వేసుకుని నడవకూడదు. నడక కోసం ఉద్దేశించిన స్పోర్ట్స్ షూస్ ఎంచుకోవాలి. రెట్టింపు సౌకర్యం కోసం సిలికాన్ ఇన్‌సోల్స్ కూడా వాడుకోవచ్చు.

డాక్టర్ ఆర్.ఎ. పూర్ణచంద్ర తేజస్వి
సీనియర్ ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్‌మెంట్ అండ్ స్పోర్ట్స్ మెడిసిన్ స్పెషలిస్ట్,
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్



పరిశోధన

మళ్లీ మళ్లీ పెరిగే దంతాలు

పాల దంతాలు ఊడిపోయి, వాటి స్థానంలో శాశ్వత దంతాలొస్తాయి. ఈ రెండో దంతాలు ఊడిపోతే కట్టుడు దంతాలు మినహా మరే మార్గమూ ఉండదు. కానీ తాజాగా జపాన్ శాస్త్రవేత్తలు మూడోసారి దంతాలు పెరిగే ఒక ఔషధాన్ని సృష్టించే ప్రయత్నంలో ఉన్నారు. ఆసక్తికరమైన ఈ అంశం గురించి తెలుసుకుందాం!
రెండోసారి ఊడిపోయిన శాశ్వత దంతాల స్థానంలో, చిగుళ్ల నుంచి మూడో దంతాల సెట్ పెరగడం ఎలా ఉంటుందో ఒకసారి ఊహించండి. కిటానో ఆస్పత్రి మెడికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన డాక్టర్ కట్సు టకహాషి నాయకత్వంలోని పరిశోధకుల బృందం, దంతాల పెరుగుదలకు అవరోధంగా మారుతున్న యుఎస్ఎజి-1 అనే జన్యు ప్రొటీన్‌ను అడ్డుకునే ఔషధాన్ని అభివృద్ధి చేసింది. ఎలుకల మీద చేపట్టిన ప్రయోగాల్లో, ఈ ప్రొటీన్‌ను అణచివేయడం ద్వారా, కొత్త దంతాల పెరుగుదల విజయవంతంగా ఊపందుకోవడాన్ని పరిశోధకులు కనిపెట్టారు. 2013 నాటికి ఈ చికిత్సను ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో, మనుషుల మీద కూడా ఈ ప్రయోగాలను చేపట్టడానికి పరిశోధకులు సిద్ధపడుతున్నారు. ఈ ప్రయోగం విజయవంతమైతే, ఎన్నో కోట్ల మందికి మూడవ దంతాల సెట్ ప్రయోజనం దక్కుతుంది. దశాబ్దాల పునరుత్పాదక పరిశోధన ఆధారంగా నిర్మితమైన సైన్స్... షార్కులు, ఏనుగుల మాదిరిగానే మనుషులు కూడా సహజసిద్ధంగా పెరిగే బహుళ దంతాల సెట్‌ను కలిగి ఉంటారని పరిశోధకులు నమ్ముతున్నారు. డెంటల్ పల్ప్, ఎముకల పునరుత్పాదకతలో కొనసాగుతున్న అభివృద్ధి ఆధారంగా... జన్యుపరమైన కారణాల రీత్యా, ప్రమాదాల్లో, లేదా వార్ధక్యంతో కోల్పోయిన దంతాలను తిరిగి మొలిపించుకునే వీలు కలుగుతుందని పరిశోధకులు అంటున్నారు.




అధ్యయనం

గ్రీన్ టీతో మెదడు చురుకుదనం

గ్రీన్ టీ ఆరోగ్యకరం అనే విషయం మనందరికీ తెలిసిందే! అయితే గ్రీన్ టీలోని సహజసిద్ధ మూలకాలు అల్జీమర్స్ నుంచి మెదడుకు రక్షణ కల్పిస్తాయనే ఒక అధ్యయనం తాజాగా వెలుగులోకొచ్చింది.
గ్రీన్ టీలోని నికోటినమైడ్, ఎపిగాలోక్టేకిన్ గాలేట్ అనే రెండు సహజసిద్ధ మూలకాలు మెదడులోని పాత కణాలు కొత్త వాటిలా చురుగ్గా పని చేసేందుకు దోహదపడతాయని క్యాలిఫోర్నియా విశ్వవిద్యాలయ పరిశోధకులు కనిపెట్టారు. ఈ రెండు మూలకాలు, నష్ట నివారణలో తోడ్పడే జిటిపి అనే కీలక శక్తి అణువులను పునరుద్ధరిస్తాయని వారు పేర్కొంటున్నారు.
ఈ ప్రయోగాన్ని వయసు పైబడిన ఎలుకల మీద చేపట్టినప్పుడు, అల్జీమర్స్ వ్యాధితో ముడిపడి ఉన్న అమైలాయిడ్ బీటా అనే ప్రొటీన్ మోతాదు తగ్గడాన్ని పరిశోధకులు గుర్తించారు. సాధారణంగా మనుషులకు వయసు పైబడినప్పుడు, మెదడు కణాలు శక్తిని కోల్పోతూ ఉంటాయి. ఆ కణాలను గ్రీన్ టీలోని రెండు సహజసిద్ధ మూలకాలతో చికిత్స చేసినప్పుడు, కేవలం 24 గంటల్లోనే, శక్తిమోతాదులు పెరిగి, మెదడులో 'ఆటోఫజీ' ఊపందుకుంటోంది. ఈ చికిత్స ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను కూడా తగ్గిస్తుంది. గతంలో అల్జీమర్స్ పరిశోధనల్లో, మెదడు కణాలను ఆరోగ్యంగా ఉంచడంలో జిటిపి పాత్రకున్న ప్రాధాన్యాన్ని పరిశోధకులు పెద్దగా పట్టించుకోలేదు. తాజా అధ్యయనంలో వాటిని బలపరుచుకునే మార్గం తెలిసింది కాబట్టి గ్రీన్ టీతో మెదడు కణాలను ఆరోగ్యంగా ఉంచుకోవడం ద్వారా అల్జీమర్స్‌కు అడ్డుకట్ట వేయగలిగే మార్గం సుగమం అయింది.



ఈసారి అల్కా'రాజే'



యూఎస్ ఓపెన్ చాంపియన్ కార్లోస్

ఫైనల్లో సినర్‌పై విజయం ● నెం.1 ర్యాంక్ కూడా కైవసం

న్యూయార్క్: ఫెడరర్, నదాల్, జొకోవిచ్‌ల బిగ్ త్రీ శకం ముగిసి కార్లోస్ అల్కారజ్, జానిక్ సినర్ జమానా మొదలైంది. ఒక గ్రాండ్‌స్లామ్ నీదైతే..మరొకటి నాది అన్న చందంగా ఈ ఇద్దరి జోరు నడుస్తోంది. వింబుల్డన్‌లో సినర్ చాంపియన్‌గా ఆవిర్భవిస్తే..ఈ ఏడాది చివరి గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్‌లో అల్కారజ్ జయకేతనం ఎగుర వేశాడు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో రెండో సీడ్ అల్కారజ్ (స్పెయిన్) 6-2, 3-6, 6-1 6-4తో ఇటలీకి చెందిన టాప్ సీడ్ సినర్‌ను చిత్తు చేశాడు. తద్వారా వింబుల్డన్ తుదిపోరులో సినర్ చేతిలో ఓటమికి అల్కారజ్ బదులు తీర్చుకున్నాడు. రెండున్నర గంటల పోరులో అల్కారజ్ 10 ఏస్‌లతో బెంబేలెత్తించగా.. రెండు ఏస్‌లకే పరిమితమైన జానిక్ నాలుగు డబుల్‌ఫాల్ట్‌లు చేశాడు. 22 ఏళ్ల కార్లోస్‌కిది రెండో యూఎస్ ఓపెన్ టైటిల్. ఈ సీజన్‌లో ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గాడు. మరోవైపు 24 ఏళ్ల సినర్ ఈ ఏడాది ఆస్ట్రేలియన్, వింబుల్డన్ టైటిళ్లను సొంతం చేసుకున్నాడు. అంటే..నాలుగు గ్రాండ్‌స్లామ్‌లను ఇద్దరు చెరో రెండు పంచుకున్నారన్నమాట. ఓవరాల్‌గా అల్కారజ్‌కిది కెరీర్‌లో ఆరో గ్రాండ్‌స్లామ్.

డబుల్ ధమాకా

యూఎస్ ఓపెన్ విజయంతో అల్కారజ్.. ప్రపంచ నెంబర్‌వన్ ర్యాంక్‌నూ చేజిక్కించుకొని డబుల్ ధమాకా సృష్టించాడు. ఈ టోర్నీకి ముందు అల్కారజ్ రెండో ర్యాంక్‌లో ఉన్నాడు. అతను టాప్ ర్యాంక్‌లోకి రావడం 2023 సెప్టెంబరు తర్వాత ఇదే తొలిసారి. ఇప్పటిదాకా అగ్రస్థానంలో ఉన్న సినర్.. ఫైనల్ ఓటమితో రెండో ర్యాంక్‌కు పడిపోయాడు.



ట్రంప్‌పై ఫ్యాన్స్ గరం గరం

అల్కారజ్, సినర్ ఫైనల్ మ్యాచ్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరయ్యారు. దాంతో ప్రేక్షకులను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే స్టేడియంలోకి అనుమతించారు. ఇంకా..భద్రతా కారణాల రీత్యా వాళ్ల కార్లను స్టేడియానికి ఎంతో దూరంలో నిలిపి వేయించారు. పైగా..ట్రంప్ రాకవల్ల మ్యాచ్ నిర్ణీత సమయాని కన్నా అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. ట్రంప్ రాకతో తీవ్ర అసౌకర్యానికి లోనైన అభిమానులు..బిగ్ స్ర్కీన్‌పై ఆయన కనిపించగానే హేళన చేశారు.

ఆసియా సమరానికి సై

ఎనిమిది జట్ల పోరు నేటి నుంచి

తొలి మ్యాచ్‌లో అఫ్ఘాన్‌తో హాంకాంగ్ ఢీ | **జోష్‌లో టీమిండియా**

రాత్రి 8 గం. నుంచి సోనీ నెట్‌వర్క్‌లో



ఇంగ్లండ్‌లో పర్యటన తర్వాత టీమిండియా మరోసారి మైదానంలోకి అడుగుపెట్టబోతోంది. అయితే ఈసారి ఫార్మాట్ మారింది. ధనాధన్ ఆటతో.. ఎడారి దేశంలో తుఫాన్ సృష్టించేందుకు జట్టు సిద్ధమైంది. ఉపఖండ జట్ల మధ్య నేటి నుంచి జరిగే ఆసియా కప్‌లో సూర్యకుమార్ సేన మరింత జోష్‌తో బరిలోకి దిగుతోంది. ట్రోఫీ కోసం ఎనిమిది జట్లు పోటీపడుతున్నా, ఎనిమిది సార్లు విజేత భారతే ఫేవరెట్. స్టార్లు విరాట్, రోహిత్ లేకుండా బరిలోకి దిగుతున్న మన జట్టు.. టోర్నీలో తన పోరును యూఏఈతో బుధవారం ఆరంభించనుంది. ఇక టోర్నీకే హైలైట్‌గా నిలిచే ఇండో-పాక్ సమరం ఈనెల 14న జరగనుంది.

దుబాయ్: టీ20 ప్రపంచకప్‌నకు సన్నాహంగా భావిస్తున్న ఆసియాకప్ టోర్నీకి రంగం సిద్ధమైంది. యూఏఈలోని దుబాయ్, అబుధాబిలో మంగళవారం నుంచి ఈనెల 28 వరకు మ్యాచ్‌లు జరగనున్నాయి. దీంతో రానున్న 20 రోజుల పాటు ఆసియాకు చెందిన ఎనిమిది జట్లు ధనాధన్ ఆటతీరుతో అభిమానులను అలరించబోతున్నాయి. పొట్టి ఫార్మాట్‌లో జరుగుతున్న ఈ టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో అఫ్ఘానిస్థాన్-హాంకాంగ్ జట్లు అబుధాబిలో తలపడనున్నాయి. డిఫెండింగ్ చాంపియన్ భారత్ బుధవారం యూఏఈతో టైటిల్ పోరును ఆరంభించనుంది. గ్రూప్ 'ఏ'లో టీమిండియాతో పాటు పాకిస్థాన్, యూఏఈ, ఒమన్ ఉండగా.. గ్రూప్ 'బి' నుంచి శ్రీలంక, అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్, హాంకాంగ్ పోటీపడుతున్నాయి. ప్రతీ గ్రూప్ నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్-4కు వెళతాయి. అందులో రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. మొత్తంగా ఇప్పటికి 15 సార్లు జరిగిన ఆసియాకప్‌లో రెండుసార్లు మాత్రమే టీ20 ఫార్మాట్‌లో ఆడించారు. 2023లో శ్రీలంకలో జరిగిన చివరి టోర్నీని వన్డే ఫార్మాట్‌లో నిర్వహించగా, భారత్ విజేతగా నిలిచింది.

భారత్ షెడ్యూల్ (మ్యాచ్‌లన్నీ రాత్రి 8 నుంచి)

సెప్టెంబరు 10	యూఏఈతో	దుబాయ్‌లో
సెప్టెంబరు 14	పాకిస్థాన్‌తో	దుబాయ్‌లో
సెప్టెంబరు 19	ఒమన్‌తో	అబుధాబిలో

పాక్‌తో పోరుపైనే కళ్లన్నీ..!

ఏ జట్టు ఎవరితో ఆడినా ఈనెల 14న దుబాయ్‌లో జరిగే భారత్-పాక్ పోరుపైనే అందరి దృష్టి ఉండనుంది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొనడంతో పాక్‌తో క్రికెట్ ఆడకూడదనే డిమాండ్లు వినిపించాయి. అయితే ఇరు జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరగకపోయినా.. ఐసీసీ, ఏసీసీ స్థాయిలో నిర్వహించే ఈవెంట్లలో పాల్గొనవచ్చని కేంద్ర ప్రభుత్వం తేల్చి చెప్పడంతో ఇరుజట్ల మధ్య మ్యాచ్‌కు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఈసారి పాక్ స్టార్లు బాబర్ ఆజమ్, మహ్మద్ రిజ్వాన్ లేకపోవడంతో ఆ జట్టు కళ తప్పింది. అంతగా అనుభవంలేని యువ ఆటగాళ్లతో పాక్ బరిలోకి దిగుతున్నా ఇరు దేశాల అభిమానులకు ఈ మ్యాచ్‌పై ఆసక్తి మాత్రం తగ్గదని చెప్పవచ్చు. ఒకవేళ రెండు జట్లు ఫైనల్‌కు వస్తే మొత్తం మూడుసార్లు వీరి మధ్య పోరును తిలకించే చాన్సుంది.



భారత్‌కు పోటీ ఉంటుందా?

ఆసియాకప్‌లో బరిలోకి దిగిన ప్రతీసారి భారత జట్టును ఫేవరెట్‌గానే పరిగణిస్తుంటారు. ఈసారి కూడా మిగతా జట్ల నుంచి ఏమేరకు పోటీ ఎదురవుతుందో చూడాలి. కాస్తయినా సవాల్ విసరగల పాకిస్థాన్, శ్రీలంక జట్లు ప్రస్తుతం సంధిదశలో ఉన్నాయి. అంతా సవ్యంగా జరిగితే సూర్యకుమార్ నేతృత్వంలోని భారత జట్టు తొమ్మిదో టైటిల్‌ను ఖాతాలో వేసుకోగలుగుతుంది. రోహిత్, విరాట్, జడేజాలాంటి ఆటగాళ్లు లేకపోయినా జట్టు పటిష్ఠంగానే కనిపిస్తోంది. ఇక, రానున్న టీ20 వరల్డ్‌కప్‌నకు ముందు జట్టు బలాబలాలపై కూడా ఆసియా కప్ ద్వారా స్పష్టత రానుంది. ఇంగ్లండ్‌లో భీకర ఫామ్ చాటుకున్న వైస్‌కెప్టెన్ శుభ్‌మన్ గిల్ జట్టులో చేరడం మరింత సానుకూలాంశం కానుంది. 15 మందిలో అందరూ ప్రతిభావంతులే కావడంతో తుది జట్టు ఎంపిక కూడా సమస్య కాబోతోంది. అందుకే సంజూ శాంసన్ చోటుపై సందేహాలు నెలకొన్నాయి. యూఏఈలో పిచ్‌లు స్పిన్నర్లకు అనుకూలించనుండడంతో అక్షర్, కుల్దీప్, వరుణ్ ఆడనున్నారు. వికెట్ కీపర్‌గా జితేశ్ శర్మ వైపు మొగ్గు చూపవచ్చు. తొలి మ్యాచ్ యూఏఈతో అయినప్పటికీ స్టార్ పేసర్ బుమ్రాను ఆడించనున్నట్టు సమాచారం. ఓపెనర్లుగా అభిషేక్, గిల్ ఆ తర్వాత తిలక్, సూర్య, హార్దిక్, అక్షర్, జితేశ్ రానున్నారు.

భారత జట్టు

సూర్యకుమార్ (కెప్టెన్), గిల్, అభిషేక్, తిలక్ వర్మ, హార్దిక్, అక్షర్, కుల్దీప్, జితేశ్, శాంసన్, వరుణ్, బుమ్రా, అర్ష్‌దీప్, దూబే, రింకూ సింగ్, హర్షిత్ రాణా.

కామెంట్రీ ప్యానెల్‌లో సన్నీ, వీరూ

ఆసియాకప్ టీ20 టోర్నీ కోసం సోనీ నెట్‌వర్క్ తమ కామెంట్రీ ప్యానెల్‌ను వెల్లడించింది. ఇందులో భారత్ నుంచి గవాస్కర్, రవిశాస్త్రి, మంజ్రేకర్, ఊతప్ప ఇంగ్లిష్‌లో.. వీరేంద్ర సెహ్వాగ్, ఇర్ఫాన్, అజయ్ జడేజా, సాబా కరీమ్, అభిషేక్ నాయర్ హిందీలో తమ కామెంట్రీతో అలరించనున్నారు.

సూపర్-4కు భారత్

● 12-0తో సింగపూర్‌పై గెలుపు

● మహిళల ఆసియా కప్ హాకీ

హాంగ్జౌ (చైనా): మహిళల ఆసియా కప్‌లో భారత హాకీ జట్టు సూపర్-4కు దూసుకెళ్లింది. పూల్-బిలో సోమవారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో భారత్ 12-0తో సింగపూర్‌ను చిత్తు చేసింది. నవనీత్ (14వ, 20వ, 28వ నిమిషాలు), ముంతాజ్ (2వ, 32వ, 39వ) చెరో మూడు గోల్స్‌తో చెలరేగగా.. నేహ (11వ, 38వ) డబుల్ సాధించింది. లాల్‌రిమ్సియామి (13వ), ఉదిత (29వ), షర్మిలా దేవి (45వ), రుతుజా (53వ) తలో గోల్ చేశారు. మొత్తం మూడు మ్యాచ్‌ల నుంచి ఏడు పాయింట్లు సాధించిన భారత్.. జపాన్‌తో సమంగా నిలిచినా మెరుగైన గోల్స్ తేడాతో గ్రూప్ టాపర్‌గా సూపర్-4 బెర్త్ దక్కించుకొంది. బుధవారం జరిగే సూపర్-4 మ్యాచ్‌లో కొరియాతో భారత్ తలపడనుంది.

స్టీలర్స్‌కు బుల్స్ షాక్



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రో కబడ్డీ లీగ్‌లో సోమవారం ఇక్కడ జరిగిన తొలి మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 40-33తో హరియాణా స్టీలర్స్‌ను చిత్తు చేసింది. లీగ్‌లో బెంగళూరుకు ఇది రెండో విజయం. బుల్స్ రైడర్ అలీరెజా వరుసగా రెండోసారి సూపర్ 10 స్కోరు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 48-37తో పుణెరి పల్టన్‌పై విజయం సాధించింది.

భారత్‌కు కాంస్యం

కాఫా నేషన్స్ కప్ ఫుట్‌బాల్

హిసోర్ (తజకిస్థాన్): కాఫా నేషన్స్ కప్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో తన ఆగమనాన్ని భారత్ ఘనంగా చాటింది. మూడో స్థానం కోసం సోమవారం జరిగిన మ్యాచ్‌లో తనకంటే ఎంతో మెరుగైన ప్రత్యర్థి ఒమన్‌కు పెనాల్టీ షూటౌట్‌లో 3-2తో భారత్ షాకిచ్చింది. దాంతో కాంస్య పతకంతో టోర్నీని భారత్ ముగించింది.

పంజాబ్ జట్టు నన్ను అవమానించింది



గేల్

న్యూఢిల్లీ: ఐపీఎల్ ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ లెవెన్ తనను ఎంతో అవమానించిందని వెస్టిండీస్ దిగ్గజ క్రికెటర్ క్రిస్ గేల్ ఆవేదన చెందాడు. 2018 నుంచి 2021 వరకు ఆ జట్టుకు ఆడిన సమయంలో తాను ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నట్టు గేల్ తెలిపాడు. 'పంజాబ్ జట్టు కారణంగా ఐపీఎల్‌లో నా కెరీర్ అర్ధంతరంగా ముగిసింది. సీనియర్‌గా నాకు ఆ జట్టులో తగిన గౌరవం లభించలేదు. ఆ జట్టు నన్ను చిన్న పిల్లాడిగా భావించింది. కోచ్ కుంబ్లే వైఖరి కూడా బాధించింది' అని ఓ పాడ్‌కాస్ట్‌లో నాటి విషయాలను గేల్ గుర్తు చేసుకున్నాడు.

అర్జున్ గెలుపు.. గుకేశ్ ఓటమి

సమర్‌ఖండ్ (ఉజ్బెకిస్థాన్): ఫిడే గ్రాండ్ స్విస్ చెస్ టోర్నీ ఐదో రౌండ్‌లో గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి విజయం సాధించాడు. నికిటా విటిగోవ్ (రష్యా)తో సోమవారం జరిగిన గేమ్‌లో అర్జున్ నెగ్గాడు. ఇక అమెరికాకు చెందిన యువ గ్రాండ్‌మాస్టర్ అభిమన్యు మిశ్రా.. గుకేశ్‌కు షాకిచ్చాడు. ప్రజ్ఞానంద, దివ్యా దేశ్‌ముఖ్‌కు ఓటమి ఎదురవగా.. హరికృష్ణ గేమ్‌ను డ్రాగా ముగించాడు. హారిక, వైశాలి గేమ్‌లు డ్రాగా ముగిశాయి.

బిజినెస్

ఎఫ్‌ఎంసీజీకి 'ఎంఆర్‌పీ' తంటా

ఎఫ్‌ఎంసీజీ కంపెనీలు ఈ నెల 22 నుంచి తగ్గించిన జీఎస్‌టీ రేట్లను అమలు చేయటంపై మల్లగుల్లాలు పడుతున్నాయి. ఇప్పటికే గిడ్డంగులు, కిరాణా దుకాణాల్లో పాత ఎంఆర్‌పీతో ఉన్న వస్తువులపై కొత్త రేట్లను ఎలా అమలు చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నాయి. దీంతో పాత ఎంఆర్‌పీ రేట్లపై డిస్కౌంట్‌తో అమ్మేందుకు అనుమతించాలని ప్రభుత్వాన్ని కంపెనీలు కోరుతున్నాయి. కొన్ని రిటైల్ చెయిన్స్ అయితే ఇందుకు ఇప్పటికే సిద్ధమయ్యాయి. 'ఖాతాదారుడికి ఇచ్చే తుది బిల్లులో ప్రభుత్వం తగ్గించిన జీఎస్‌టీ రేటును డిస్కౌంట్ రూపంలో తగ్గించి ఇస్తాం' అని వీమార్ట్ సీఎండీ లలిత్ అగర్వాల్ తెలిపారు. 'ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఈ సరుకులపై ఏమి చేయాలి? అనే ఆలోచిస్తున్నారు' అని ఇమామీ కంపెనీ వైస్ చైర్మన్, ఎండీ హర్షవర్ధన్ అగర్వాల్ తెలిపారు. మారిన జీఎస్‌టీ రేట్లకు అనుగుణంగా కొత్త ఎంఆర్‌పీతో వస్తువులను మార్కెట్లో విడుదల చేసేందుకు కొద్దిగా సమయం పడుతుందని కంపెనీలు చెబుతున్నాయి. వచ్చే నెల తొలి వారం లేదా మధ్య నాటికి గానీ ఇది సాధ్యం కాదని గోద్రెజ్ కన్స్యూమర్ ఎండీ, సీఈఓ సుధీర్ సేనాపతి చెప్పారు. దీంతో తగ్గిన జీఎస్‌టీ రేట్లను వినియోగదారులకు బదిలీ చేయడంలో కొన్ని స్వల్పకాలిక అవాంతరాలు తప్పక పోవచ్చన్నారు.

కోల్ ఇండియా డేటా సెంటర్లు

మూసివేసిన గనుల్లో ఏర్పాటుకు యోచన

కోల్‌కతా: ప్రభుత్వ రంగ బొగ్గు ఉత్పత్తి దిగ్గజం కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్).. డేటా సెంటర్ల రంగంలోకి ప్రవేశించే ఆలోచన చేస్తోంది. మూసివేసిన గనుల్లో వీటిని ఏర్పాటు చేయాలని భావిస్తోంది. సాధ్యాసాధ్యాలపై కన్సల్టెంట్లు, అధికారులతో సమగ్ర అధ్యయనం చేపట్టనున్నట్లు సీఐఎల్ వెల్లడించింది. సీఐఎల్ అనుబంధ విభాగాలకు చెందిన నాలుగు స్థలాలు.. ఉమ్రెర్ (డబ్ల్యూసీఎల్), కోర్బాలోని సరైపాలి (ఎస్ఈసీఎల్), ఝార్సుగూడ దగ్గర్లోని హిమ్‌గిర్ రాంపూర్ (ఎంసీఎల్), నిగాహి(ఎన్‌సీఎల్)ని ఇందుకు ఎంపిక చేసినట్లు సీఐఎల్ తెలిపింది. కాగా వచ్చే 5-6 ఏళ్లలో దేశీయ డేటా సెంటర్ల రంగంలోకి 2,000-2,500 కోట్ల పెట్టుబడులు రావచ్చని పరిశ్రమ వర్గాల అంచనా. గడిచిన కొన్నేళ్లలో దేశంలో డిజిటల్ సేవల వినియోగం అనూహ్యంగా పెరిగింది. దాంతో డేటా సెంటర్ల ఆవశ్యకత కూడా పెరుగుతూ వస్తోంది. దేశీయంగా డేటా నిక్షిప్త అవసరాలను తీర్చేందుకు వీలుగా నిరుపయోగంగా ఉన్న గనులను, వాటిలోని మౌలిక వసతులను డేటా సెంటర్ల ఏర్పాటుకు ఉపయోగించుకోవాలని సీఐఎల్ చూస్తోంది. ఇందుకు సంబంధించిన అధ్యయన నివేదిక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (అక్టోబరు-డిసెంబరు)లో అందుబాటులోకి రావచ్చని భావిస్తోంది.

ఆర్థిక మాంద్యం అంచున అమెరికా!

మూడీస్ ప్రధాన ఆర్థికవేత్త మార్క్ జాండీ హెచ్చరిక



ఉద్యోగ గణాంకాల మాంద్యం ఘంటికలు

ట్రంప్ టారిఫ్ వార్ కారణంగా అమెరికాలో ఉద్యోగావకాశాలు కూడా సన్నగిల్లుతున్నాయి. అమెరికా కార్మిక శాఖ గణాంకాల ప్రకారం.. గత నెలలో వ్యవసాయేతర ఉద్యోగ నియామకాలు అంచనాల కంటే తగ్గి 22,000కు పరిమితం అయ్యాయి. అదే సమయంలో నిరుద్యోగిత రేటు 4.2 శాతం నుంచి 4.3 శాతానికి పెరిగింది. అంతేకాదు, మే, జూన్ నెలలకు విడుదల చేసిన ఉద్యోగ గణాంక అంచనాలను కూడా భారీగా తగ్గించింది. అమెరికా ఆర్థిక వ్యవస్థ ఒత్తిడిలో ఉందనడానికి ఇది సంకేతమని విశ్లేషకులు అంటున్నారు. ట్రంప్ సుంకాలు అమెరికన్ కార్పొరేట్ కంపెనీల లాభాలపైనా ప్రభావం చూపనున్నాయని, దాంతో కంపెనీలు వ్యయ నియంత్రణపై దృష్టి సారిస్తాయని, పర్యవసానంగా అక్కడి జాబ్ మార్కెట్ మరింత బలహీనపడే అవకాశాలున్నాయని జాండీ అన్నారు.

న్యూయార్క్: ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మరో ముప్పు ముంచుకొస్తోందా..? అగ్రరాజ్యం అమెరికా మళ్లీ ఆర్థిక మాంద్యంలోకి జారుకోనుందా..? అవుననే అంటున్నారు పలువురు విశ్లేషకులు. ప్రస్తుత స్థూల ఆర్థిక గణాంకాలను బట్టి చూస్తే అమెరికా మాంద్యం అంచుల్లో ఉందని అంతర్జాతీయ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ ప్రధాన ఆర్థికవేత్త మార్క్ జాండీ హెచ్చరించారు. యూఎస్ జీడీపీలో మూడో వంతు (33.33 శాతం) ఇప్పటికే తిరోగమనంలోకి జారుకుంది లేదా జారుకునేందుకు అధిక అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు. మరో మూడో వంతు నిలకడగా సాగుతుండగా.. మిగతా మూడో వంతు మాత్రమే పురోగమిస్తోందన్నారు. రాష్ట్రాల వారీగా చూస్తే, వ్యోమింగ్, మోంటానా, మిన్నెసోటా, మిస్సిస్సిప్పీ, కాన్సాస్, మసాచుసెట్స్‌కు మాంద్యం ముప్పు పొంచి ఉందన్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగాలకు భారీగా కోతపెట్టడంతో వాషింగ్టన్ డీసీ కూడా ఆర్థిక ఇబ్బందులెదుర్కొంటోందన్నారు. 2008లో అమెరికా ఆర్థిక సంక్షోభాన్ని ముందే అంచనావేసిన ఆర్థికవేత్తల్లో జాండీ ఒకరు. ఆ సంక్షోభం అమెరికాతో పాటు మొత్తం ప్రపంచాన్ని కుదిపివేసిన విషయం తెలిసిందే.

ధరలు మళ్లీ పైపైకి: అమెరికాలో ధరలు, ముఖ్యంగా నిత్యావసరాల రేట్లు మళ్లీ పెరుగుతున్నాయని.. త్వరలోనే విస్మరించలేని స్థాయికి ఎగబాకవచ్చని జాండీ అన్నారు. తాజా ద్రవ్యోల్బణ గణాంకాలు కూడా ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. ధరాభారం కారణంగా అమెరికన్ల కొనుగోలు శక్తి కూడా తగ్గిందని, వినియోగదారుల వ్యయ వృద్ధి 2008-09 ఆర్థిక సంక్షోభ కాలం నాటి కనిష్ఠ స్థాయికి జారుకుందన్నారు. ఈ జూలైలో అమెరికాలో వినియోగదారు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం మరో 0.2 శాతం పెరిగి 2.7 శాతానికి చేరుకుంది. వచ్చే ఏడాదికాలంలో సూచీ 4 శాతానికి ఎగబాకవచ్చని జాండీ అంచనా. తత్ఫలితంగా అమెరికన్ల కొనుగోలు శక్తి మరింత తగ్గిపోవచ్చని జాండీ అన్నారు.

మాంద్యం అంటే: వరుసగా రెండు త్రైమాసికాల పాటు జీడీపీ వృద్ధి రేటు క్షీణిస్తే (రుణాత్మక స్థాయికి పడిపోవడం) ఆ దేశం ఆర్థిక మాంద్యంలోకి జారుకున్నట్లుగా పరిగణిస్తారు. ట్రంప్ సుంకాల యుద్ధం ఫలితంగా ఈ ఏడాది తొలి త్రైమాసికం (జనవరి-మార్చి)లో అమెరికా జీడీపీ 0.50 శాతం క్షీణించగా.. రెండో త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో మాత్రం 3.3 శాతం వృద్ధిని నమోదు చేయగలిగింది.

అంటే, ప్రస్తుతం అమెరికా పరిస్థితి చావు తప్పి కన్ను లొట్టబోయినట్లుగా ఉంది. పెరుగుతున్న ధరలు, సుంకాలతో పెరిగిన వాణిజ్య అనిశ్చితి, తగ్గుతున్న కొనుగోళ్లు ముున్ముందు త్రైమాసికాల్లో ఆ దేశ జీడీపీని మాంద్యంలోకి నెట్టవచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

హైదరాబాద్ ఓఆర్ఆర్ ద్వారా ఆగస్టులో రూ.74 కోట్ల ఆదాయం

ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా

న్యూఢిల్లీ: హైదరాబాద్ బాహ్య వలయ రహదారి (ఓఆర్ఆర్).. ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా కంపెనీకి కనకవర్షం కురిపిస్తోంది. ఆగస్టు నెలలో ఈ రహదారి టోల్ వసూళ్లు రూ.73.7 కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది రూ.5 కోట్లు ఎక్కువని కంపెనీ తెలిపింది. 2023 ఆగస్టులో హెచ్ఎండీఏకు రూ.7,380 కోట్లు చెల్లించడం ద్వారా ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా ఈ రహదారిపై 30 ఏళ్ల పాటు టోల్ వసూలు చేసుకునే హక్కులు పొందింది. గత నెల ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాకి దేశంలోని 17 టోల్‌వే ప్రాజెక్టుల ద్వారా రూ.563 కోట్ల ఆదాయం వచ్చింది. అందులో అత్యధికంగా రూ.147.7 కోట్లు మహారాష్ట్రలోని టోల్‌వేస్ ద్వారా వచ్చింది. ఆ తర్వాత రూ.73.7 కోట్లు ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌వే (హైదరాబాద్ ఓఆర్ఆర్) ద్వారా సమకూరింది.

- కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ).. ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నంలో కొత్త శాఖను ప్రారంభించింది. విశాఖతో పాటు తమిళనాడులోని నీలంబూర్, కోయంబత్తూర్, మధురైల్లో కూడా కొత్త శాఖలను ఏర్పాటు చేసింది.
- హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా అమితాబ్ కాంత్ నియమితులయ్యారు. ఐదేళ్ల పాటు ఈయన ఈ పదవిలో ఉండనున్నారు. ఈ నియామకం తక్షణం అమల్లోకి వచ్చినట్టు కంపెనీ ప్రకటించింది.
- ప్రపంచ తెలుగు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కౌన్సిల్ (డబ్ల్యూటీఐటీసీ).. అమెరికా, ఇల్లినాయిస్ స్టేట్ చాప్టర్ ప్రెసిడెంట్‌గా రామకోటేశ్వరరెడ్డి నియమితులయ్యారు. రెండేళ్ల పాటు ఈయన ఈ పదవిలో కొనసాగనున్నారు.

యూపీఐ చెల్లింపుల్లోకి వియోనా ఫిన్‌టెక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): థర్డ్‌పార్టీ అప్లికేషన్ ప్రొవైడర్‌గా (టీపీఏపీ) సేవలందించేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అనుమతి లభించిందని హైదరాబాద్ కేంద్రంగా ఉన్న వియోనా ఫిన్‌టెక్ ప్రకటించింది. దీనివల్ల భాగస్వామ్య బ్యాంకులతో కలిసి తాము యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలు అందించగలుగుతామని, తద్వారా డిజిటల్ పేమెంట్ వ్యవస్థ మరింతగా విస్తరించే అవకాశం లభిస్తుందని వియోనా ఫిన్‌టెక్ వ్యవస్థాపకుడు రవీంద్రనాథ్ యార్లగడ్డ తెలిపారు. వియోనా తన గ్రామ్‌పే డిజిటల్ మాధ్యమం ద్వారా నిరంతరాయంగా చెల్లింపులు, వసూళ్లు నిర్వహిస్తూ రైతులు, చిన్న వ్యాపారులు, స్థానిక సామాజిక వర్గాలకు సాధికారత కల్పిస్తోంది. బడుగు, బలహీన వర్గాలకు సేవలు మరింత విస్తరించే లక్ష్యంతో వియోనా గ్రామ్‌పే వేదికపై రైతుల మార్కెట్ ప్లేస్ ఏర్పాటు చేసింది. దీన్ని ఉపయోగించుకుని రైతులు వేగవంతంగా లావాదేవీలు నిర్వహించుకుంటూ తమ ఉత్పత్తులకు మెరుగైన గిట్టుబాటు ధరలు పొందగలుగుతారని వియోనా వెల్లడించింది.

మార్కెట్లోకి టీవీఎస్ ఎన్‌టార్‌క్యూ 150



ధర రూ.1,19,000

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టీవీఎస్ మోటార్ కంపెనీ.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లోకి హైపర్ స్పోర్ట్ స్కూటర్ టీవీఎస్ ఎన్‌టార్‌క్యూ 150ను తీసుకువచ్చింది. సోమవారం నాడిక్కడ కంపెనీ ఏపీ, తెలంగాణ జనరల్ మేనేజర్ (సేల్స్) కెంద్‌రాజ్ జోషి, బ్రాండ్ మేనేజర్ రాజ్ బిశ్వాస్ ఈ స్కూటర్‌ను విడుద చేశారు. 149.7 సీసీ రేస్ ట్యూన్డ్ ఇంజన్, స్టెల్త్ ఎయిర్‌క్రాఫ్ట్ డిజైన్‌తో ఈ స్కూటర్‌ను తీసుకువచ్చినట్లు జోషి వెల్లడించారు. ఈ స్కూటర్ పరిచయ ధర రూ.1,19,000 (ఆల్ ఇండియా ఎక్స్ షోరూమ్). యువతను లక్ష్యంగా చేసుకుని ఐఎస్ఎస్- స్ట్రీట్ మోడ్, బూస్ట్- రేస్ మోడ్, ఏబీఎస్, ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్ వంటి ప్రత్యేక ఫీచర్లతో ఈ స్కూటర్‌ను తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల స్కూటర్ మార్కెట్లో టీవీఎస్ మోటార్ వాటా 38 శాతం వరకు ఉందని, ఈ కొత్త స్కూటర్‌తో ఇది మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నట్లు జోషి తెలిపారు. కాగా ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా ఈ నెల 22 నుంచి జీఎస్‌టీ తగ్గింపును అమలు చేయనున్నట్లు చెప్పారు.

బంగారం సరికొత్త రికార్డు

ఫ్యూచర్స్ మార్కెట్లో రూ.1.09 లక్షలకు..

న్యూఢిల్లీ: పసిడి పరుగు ఆపనంటోంది. ఫ్యూచర్స్ మార్కెట్లో 10 గ్రాముల బంగారం ధర సరికొత్త జీవితకాల గరిష్ఠానికి చేరుకుంది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజీ (ఎంసీఎక్స్)లో అక్టోబరు డెలివరీ కాంట్రాక్టు ధర రూ.452 పెరిగి రూ.1,08,180కి చేరగా.. డిసెంబరు డెలివరీ కాంట్రాక్టు రేటు సైతం రూ.370 ఎగబాకి రూ.1.09 లక్షలు దాటింది. కిలో వెండి డిసెంబరు కాంట్రాక్టు ధర కూడా రూ.1,703 పెరుగుదలతో రూ.1,26,400 పలికింది.

స్వల్ప లాభంతో సరి

సెన్సెక్స్ 76 పాయింట్లు అప్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సోమవారం తీవ్ర ఊగిసలాటలకు లోనైనప్పటికీ స్వల్ప లాభాలను నమోదు చేసింది. ఫెడ్ రేట్లు తగ్గవచ్చన్న అంచనాల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో ట్రేడింగ్ ట్రెండ్ బలపడటంతో పాటు ఆటో, కన్స్యూమర్ రంగ షేర్లలో కొనుగోళ్లతో సెన్సెక్స్ మోస్తరు లాభాల్లో ప్రారంభమైంది. ఒక దశలో 461 పాయింట్ల మేర ఎగిసి 81,171 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరలో మదుపరులు పెద్దఎత్తున లాభాల స్వీకరణకు దిగడంతో సూచీ 76.54 పాయింట్ల లాభంతో 80,787.30 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 32.15 పాయింట్ల లాభంతో 24,773.15 వద్ద ముగిసింది.

వచ్చేనెలలో ఎల్‌జీ ఐపీఓ: దక్షిణకొరియాకు చెందిన ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్. భారత విభాగ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)ను వచ్చే నెలలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఐపీఓ ద్వారా కంపెనీలో 15 శాతం వాటాకు సమానమైన 10.2 కోట్ల షేర్లను విక్రయించనుంది. తద్వారా రూ.15,000 కోట్లు సమీకరించే అవకాశం ఉంది.

ఇన్ఫోసిస్ షేర్ల బైబ్యాక్!: దేశీయ ఐటీ దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్ మరోసారి షేర్ల బైబ్యాక్‌కు సిద్ధమవుతోంది. ఈ నెల 11న జరిగే బోర్డు సమావేశం దీనిపై నిర్ణయం తీసుకుంటుందని కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. అయితే ఈ బైబ్యాక్ ద్వారా ఎన్ని షేర్లను, ఎంత మొత్తానికి బైబ్యాక్ చేసేది వెల్లడించలేదు. కంపెనీ డైరెక్టర్ల బోర్డే దీనిపై నిర్ణయం తీసుకోనుంది. 2022లోనూ ఇన్ఫోసిస్ కంపెనీ ఒక్కో షేరును రూ.1,830 చొప్పున రూ.9,300 కోట్ల విలువైన షేర్లను బైబ్యాక్ చేసింది. సోమవారం బీఎస్ఈలో ఇన్ఫోసిస్ షేరు 0.81 శాతం నష్టంతో రూ.1,432.65 వద్ద ముగిసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

9వ తేదీ

హైదరాబాద్	535	విజయవాడ	545
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	113	విజయవాడ	135
వరంగల్	113	గుంటూరు	125
కరీంనగర్	113	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	113	చిత్తూరు	105
కర్నూలు	113	నెల్లూరు	110
విశాఖపట్నం	139	అనంతపురం	110
గోదావరి	135		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,08,380 ▲	99,350 ▲	1,37,000 ▲
విజయవాడ	1,11,500 ▲	1,05,500 ▼	1,28,000 ▲
విశాఖపట్నం	1,11,660 ▲	99,350 ▼	1,37,000 ▼
రాజమండ్రి	1,08,930 ▲	99,850 ▲	1,26,500 ▼
ప్రొద్దుటూరు	1,10,900 ▲	1,02,000 ▲	1,27,200 ▼
ముంబై	1,08,037 ▲	98,962 ▲	1,24,413 ▲

ఉత్తరాన వానలు.. దక్షిణ కోస్తాలో ఎండలు

» రాష్ట్రంలో నేడు, రేపు వర్షాలు



సోమవారం విశాఖ నగరంలో కురుస్తున్న భారీ వర్షం

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉత్తర కోస్తాలో సోమవారం భారీ వర్షాలు కురవగా, దక్షిణ కోస్తాలో ఎండలు మండిపోయాయి. వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఆవరించిన ఉపరిల ఆవర్తనం స్థిరంగా కొనసాగుతోంది. దాని ప్రభావంతో బంగాళాఖాతం నుంచి తేమగాలులు భూ ఉపరితలం దిశగా వీస్తుండడంతో వాతావరణ అనిశ్చితి నెలకొంది. దీంతో ఉత్తరాంధ్రలో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎక్కువచోట్ల తేలిక పాటి నుంచి ఒక మోస్తరుగా, అక్కడక్కడ భారీవర్షాలు కురిశాయి. విశాఖ నగర శివారు మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ వద్ద 8, పెందుర్తి పంప్‌హౌస్ వద్ద 7.9, వేపగుంటలో 6.6, కొత్తపాలెంలో 6.6, అనకాపల్లి జిల్లా కె.కోటపాడులో 6.8, గంధవరంలో 6.1, శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో 5.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక దక్షిణ కోస్తాలో ఎండ తీవ్రంగా ఉంది. కావలిలో 38.8, బాపట్ల, నెల్లూరుల్లో 38.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కాగా, మంగళవారం ఉత్తరకోస్తాలో అక్కడక్కడ పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

నేటి నుంచి మూడో విడత ఈఏపీసెట్ కౌన్సెలింగ్

» 11 వరకు రిజిస్ట్రేషన్.. 15న సీట్ల కేటాయింపు

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఈఏపీసెట్ మూడో విడత కౌన్సెలింగ్‌కు సోమవారం సాంకేతిక విద్యాశాఖ నోటిఫికేషన్ జారీచేసింది. మంగళవారం నుంచి 11వ తేదీ వరకు విద్యార్థులకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించింది. 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల ఎంపికకు గడువిచ్చింది. 13న ఆప్షన్లు మార్చుకోవచ్చు. 15న సీట్లు కేటాయిస్తారు. 15 నుంచి 17 వరకు విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాలి. 15 నుంచి తరగతులకు హాజరుకావాలి. కాగా, ఇదే తుది విడత కౌన్సెలింగ్‌గా భావించాలని సాంకేతిక విద్యాశాఖ స్పష్టంచేసింది. అలాగే ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం బైపీసీ స్ట్రీమ్ విద్యార్థులకు ఈఏపీసెట్ తొలివిడత, తుది విడతల కౌన్సెలింగ్ షెడ్యూలు జారీచేసింది. తొలి విడతలో 11 నుంచి 16 వరకు రిజిస్ట్రేషన్, 13 నుంచి 18 వరకు ఆప్షన్ల ఎంపిక, 19న ఆప్షన్లు మార్చుకోవచ్చు. 21న సీట్లు కేటాయిస్తారు. 21 నుంచి 23 వరకు విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాలి. 21 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. తుది విడతలో 24, 25 తేదీల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

'సృష్టి' కేసులోముగ్గురు ప్రభుత్వ వైద్యులపై వేటు

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా నడుస్తున్న సృష్టి సంతాన సాఫల్య కేంద్రంలో జరిగిన అక్రమాలతో సంబంధమున్న ముగ్గురు ప్రభుత్వ వైద్యులపై వేటు పడింది. విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కాలేజీ అనెస్థీషియా విభాగాధిపతి డా.వాసుపల్లి రవి, గైనకాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ డా.పి.ఉషాదేవి, శ్రీకాకుళం బోధనాసుపత్రి పీడియాట్రిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఎ.విద్యుల్లతను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. సృష్టి కేసులో ఈ ముగ్గురిపై గతనెల 28న అరెస్ట్ చేసినట్లు హైదరాబాద్ పోలీసులు తెలిపారు. ఈ ముగ్గురు వైద్యులపై వచ్చిన ఆరోపణల తీవ్రత దృష్ట్యా పోలీసులు అరెస్ట్ చేసిన తేదీ నుంచే సస్పెండ్ చేయాలని మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. ఈ ముగ్గురు వైద్యులు గత నెలలోనే అరెస్టయినట్లు తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆరా తీశారు. 'సృష్టి' అక్రమాలు మీడియాలో వచ్చిన కొద్దిరోజుల ముందు నుంచే ఈ ముగ్గురు వైద్యులు విధుల్లో లేరని, వారిని సంప్రదించడానికి ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదని మంత్రికి అధికారులు వివరించారు.

టీటీడీ ఈవోగా మళ్లీ సింఘాల్

(మొదటి పేజీ తరువాయి)

అక్కడున్న ముకేశ్‌కుమార్ మీనాను రెవెన్యూ (ఎక్సైజ్) ముఖ్య కార్యదర్శిగా నియమించింది. అటవీ-పర్యావరణ శాఖ స్పెషల్ సీఎస్‌గా ఉన్న జి.అనంతరామును బదిలీచేసి గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సింఘాల్ గతంలోనూ టీటీడీ ఈవోగా పనిచేశారు. చంద్రబాబు హయాంలో 2017 మే 6న ఈ బాధ్యతలు చేపట్టిన ఆయన.. వైసీపీ ప్రభుత్వంలో 2020 అక్టోబరు 4 వరకు పనిచేశారు. ఐదేళ్ల తర్వాత రెండోసారి ఈ పదవిలో నియమితులు కావడం గమనార్హం. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారుల్లో శ్రీలక్ష్మి తర్వాత జి.అనంతరాము రెండోస్థానంలో ఉన్నారు. ఆయన సీనియారిటీకి గౌరవం ఇచ్చిన ప్రభుత్వం.. రాజ్‌భవన్‌లో గవర్నర్‌కు ప్రత్యేక సీఎస్‌గా నియమించింది. ఆర్ అండ్ బీ, రవాణా శాఖల ముఖ్య కార్యదర్శిగా ఉన్న కాంతిలాల్ దండేను అటవీ-పర్యావరణ శాఖకు బదిలీ చేసింది. మీనాకు పరిశ్రమలు, వాణిజ్య (మైనింగ్) విభాగం ముఖ్య కార్యదర్శిగానూ పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించింది. కమిషనర్లుగా అద్భుత పనితీరు కనబరచిన సౌరభ్ గౌర్, సీహెచ్ శ్రీధర్, ఎంవీ శేషగిరిబాబులను కార్యదర్శులుగా నియమించింది.

- వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ సీఎస్‌గా ఉన్న ఎంటీ కృష్ణబాబు ఆర్ అండ్ బీ, రవాణా శాఖల స్పెషల్ సీఎస్‌గా నియమితులయ్యారు. దీంతోపాటు మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ ప్రత్యేక సీఎస్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ శాఖను అదనంగా నిర్వహిస్తున్న యువరాజ్‌ను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు.
- పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శిగా ఉన్న ప్రవీణ్‌కుమార్ ఢిల్లీలోని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా నియమితులయ్యారు.
- పౌరసరఫరాల కమిషనర్‌గా ఉన్న సౌరభ్ గౌర్‌ను వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శిగా నియమించారు. తదుపరి ఆదేశాలు వచ్చేదాకా ఆయన పౌరసరఫరాల కమిషనర్‌గా కూడా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారు.
- మైనారిటీ సంక్షేమ శాఖ కమిషనర్‌గా ఉన్న సీహెచ్ శ్రీధర్‌ను అదే శాఖ కార్యదర్శిగా ప్రభుత్వం నియమించింది. ఆయన కమిషనర్‌గానూ అదనపు విధులు నిర్వహిస్తారు.
- కార్మిక శాఖ కమిషనర్‌గా ఉన్న శేషగిరిబాబును కార్మిక, ఫ్యాక్టరీలు, బాయిలర్స్, బీమా వైద్య సేవల శాఖ కార్యదర్శిగా ప్రభుత్వం నియమించింది. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఆయన కార్మిక కమిషనర్‌గానూ కొనసాగుతారు.
- రిటైర్‌మెంట్ తర్వాత పునర్నియమితులై.. గవర్నర్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఎం.హరి జవహర్‌లాల్‌ను ప్రభుత్వం కీలకమైన దేవదాయ శాఖ కార్యదర్శిగా నియమించింది. ఆయన వైసీపీ ప్రభుత్వంలో దేవదాయ కమిషనర్‌గా విధులు నిర్వహించారు.

553 కోట్లతో
విశాఖలో భూగర్భ డ్రైనేజీ

» జీవీఎంసీకి 498 కోట్ల ఐఎఫ్‌సీ రుణం

» భారీ రుణం నేరుగా పొందిన తొలి సంస్థగా ఘనత

» తక్కింది సర్దుబాటు చేయనున్న కేంద్రం

» సీఎం సమక్షంలో ఒప్పందం ఖరారు

విశాఖపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-2 (మధురవాడ) పరిధిలో రూ.553 కోట్ల వ్యయంతో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థను (యూజీడీ) అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందుకోసం అవసరమైన నిధులను ప్రపంచబ్యాంకుకు అనుబంధంగా పని చేసే అంతర్జాతీయ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) రుణంగా సమకూర్చేందుకు అంగీకరించింది. ఈ మేరకు విజయవాడలో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, ఐఎఫ్‌సీ ఆసియా హెడ్ విక్టోరియాడెల్మాన్ ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు. ఐఎఫ్‌సీ నుంచి అంతభారీ రుణాన్ని నేరుగా పొందిన తొలి స్థానిక సంస్థగా జీవీఎంసీ గుర్తింపు పొందింది.

రుణం, వడ్డీ చెల్లింపునకు 15 ఏళ్ల గడువు

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో మధురవాడ, కొమ్మాది, రుషికొండ, ఎండాడ వంటి ప్రాంతాల్లో నివాసాలు, ఐటీ కంపెనీలు పెరుగుతున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఆ ప్రాంతాలు మరింతగా విస్తరిస్తాయి. అయితే జోన్-2 పరిధిలో సాగర్‌నగర్, విశాలాక్షినగర్, ఆరిలోవ వంటి ప్రాంతాలను మినహాయిస్తే మిగిలిన ప్రాంతాల్లో యూజీడీ సదుపాయం లేదు. జోన్ పరిధిలో యూజీడీ సదుపాయం ఉన్న ప్రాంతం కేవలం 20 శాతానికి మించదు. ఈ నేపథ్యంలో జోన్‌లోని మిగిలిన ప్రాంతాలకు కూడా ఈ సదుపాయం కల్పించేందుకు జీవీఎంసీ ఎప్పటినుంచో ప్రణాళికలు తయారుచేస్తోంది. యూజీడీ పైప్‌లైన్‌తోపాటు పంప్‌హౌస్‌లు, ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం కోసం సుమారు రూ.498 కోట్లు అవసరమని అంచనా వేసింది. దీంతోపాటు నగరంలో యూజీడీ నెట్‌వర్క్ సదుపాయం లేని ప్రాంతాల కోసం అదనంగా మరో రూ.55 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. అంతమొత్తాన్ని ఒకేసారి జీవీఎంసీ భరించే పరిస్థితి లేకపోవడంతో రుణం కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. అందులోభాగంగా ఐఎఫ్‌సీతో సంప్రదింపులు గతకొంతకాలంగా జరుగుతున్నాయి. జీవీఎంసీకి ఏటా పన్నుల రూపంలో రూ.400 కోట్లు వరకు ఆదాయం వస్తుందని, ఆ మొత్తంలో కొంత రుణ వాయిదాలుగా చెల్లిస్తామని అధికారులు ఐఎఫ్‌సీ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వివరించారు. దీనికి ఐఎఫ్‌సీ అధికారులు సానుకూలంగా స్పందించారు. రూ.498 కోట్ల రుణం కేటాయించాలని నిర్ణయించారు. రుణం, వడ్డీ (8.15 శాతం) కలిపి 15 ఏళ్లలో తీర్చేలా జీవీఎంసీ, ఐఎఫ్‌సీ అధికారుల మధ్య అంగీకారం కుదిరింది. అమృత్-2.0లో భాగంగా 45.64 కోట్లు కేంద్రం సర్దుబాటు చేస్తుంది. జీవీఎంసీ సొంత నిధులు రూ. 9.36 కోట్లు వెచ్చిస్తుంది.

ఎన్‌డీఏ అభ్యర్థికి వైసీపీ ఓటా?

» ఎన్‌డీఏ కూటమి చేతిలోనే ఆ పార్టీ ఓడిపోయింది

» తెలుగువాడు, రాజ్యాంగాన్ని నిలబెట్టగలిగినవాడు సుదర్శన్‌రెడ్డికి తెలుగు ఎంపీలంతా ఓటేయాలి

» ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాన్ని బీజేపీ అమలు చేస్తోంది: మాజీ ఎంపీ ఉండవల్లి



రాజమహేంద్రవరం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో జగన్ పార్టీ నిర్ణయం అర్థంకాకుండా ఉందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన ఒక వీడియో సందేశం విడుదల చేశారు. 'ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమికి వ్యతిరేకంగా పోటీ చేసి వైసీపీ ఓడిపోయింది. ఇప్పుడు ఎన్‌డీఏకి చెందిన వ్యక్తికి ఎలా ఓటు వేస్తుంది? పైగా సుదర్శన్‌రెడ్డి తెలుగువాడు. సోషలిస్టు. రాజ్యాంగాన్ని నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. నిజంగా నిలబెట్టగలరు. ఇంతకంటే అదృష్టం మీకేం ఉంటుంది? తెలుగు అభ్యర్థి పోటీ చేయడం వల్ల కూటమికి చెందిన తెలుగు ఎంపీలంతా ఓటేయవచ్చు. ఇక్కడ పార్టీలు అవసరం లేదు. సుదర్శన్‌రెడ్డి 2003లో ఇచ్చిన తీర్పును హోంమంత్రి అమిత్‌షా ఇవాళ వ్యతిరేకించి, ఆయనను నక్సలైట్‌గా చిత్రీకరించడం చాలా తప్పు. ఇది కోర్టు ధిక్కరణ అవుతుంది. రాజ్యాంగాన్ని పక్కనపెట్టి మొత్తం వ్యవస్థను చేతిలోకి తీసుకునే ప్రయత్నం బీజేపీ చేస్తుంది. అందుకే నేరుగా ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన రాధాకృష్ణన్‌ను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా పెట్టింది. రాజ్యాంగ నిపుణుడైన ధన్‌ఖడ్, మోదీతో విభేదించడం వల్లే ఆయనను రాజీనామా చేసేటట్టు చేశారు. ఈ దేశంలో ముస్లింలు, క్రైస్తవులు, సోషలిస్టులు ఉండకూడదనేదే ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతం. బీజేపీ దానిని అమలు చేస్తుంది. బీజేపీతో విభేదించే పార్టీలు ఇవాళ ఎన్‌డీఏకు ఓటు వేస్తే... వారిని చరిత్రలో ఎప్పటికీ ద్రోహులుగానే చూస్తారు' అని ఉండవల్లి హెచ్చరించారు.

చెప్పేదొకటి.. చేసేదొకటి!

ప్రత్యేక హోదాపై జగన్ తీరిదీ

» నాడు ఎక్కువ మంది ఎంపీలను ఇస్తే.. కేంద్రం మెడలు వంచుతామని హుంకరింపు

» 2019లో 22 మందిని ఇచ్చినా గప్‌చుప్

» ఇప్పుడు ఉపరాష్ట్రపతి ఎన్నికలోనూ ఇంతే

» బేషరతుగా ఎన్‌డీఏ అభ్యర్థికి మద్దతు

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడొచ్చినా.. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామనేవారికే మద్దతిస్తామని.. 25 ఎంపీ సీట్లిస్తే కేంద్రం మెడలు వంచి హోదా సాధిస్తామని హుంకరింపు ప్రకటనలు చేయడం.. అవి పూర్తయ్యాక నోరెత్తకపోవడం వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు పరిపాటిగా మారింది. 2014, 19 ఎన్నికల్లో ఇదే తంతు సాగించారు. 2019లో అధికారంలోకి వచ్చాక ఏకంగా 22 మంది లోక్‌సభ, 11 మంది రాజ్యసభ సభ్యుల బలం ఉన్నా.. ఏనాడూ ప్రత్యేక హోదా కోసం ప్రధాని మోదీపై ఒత్తిడి తీసుకురాలేదు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓటమిపాలై కేవలం 11 అసెంబ్లీ సీట్లకే పరిమితమైనా.. శాసనసభలో తనకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలని నానా యాగీ చేస్తున్న ఆయన.. ప్రత్యేక హోదా ఊసే మరిచారు. మంగళవారం జరిగే ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఎన్‌డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు బేషరతుగా మద్దతు ప్రకటించారు. రక్షణ మంత్రి, బీజేపీ సీనియర్ నేత రాజ్‌నాథ్‌సింగ్ ఫోన్ చేసి అడిగీ అడగ్గానే.. జగన్ ఎలాంటి షరతులూ పెట్టకుండానే తలూపారు. ప్రత్యేక హోదా ఇవ్వాలని పట్టుబట్టలేదు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణను ఆపేయాలని మాటవరుసకైనా అడుగలేదు. మాట తప్పను.. మడమ తిప్పనంటూ గొప్పలు చెప్పుకొంటూ.. ఆచరణలో మాత్రం భిన్నంగా వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయం రాష్ట్ర ప్రజల్లో పాతుకుపోయిందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. మద్యం కుంభకోణం కేసులో నిందితుడిగా రాజమండ్రి జైల్లో ఉన్న వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు బెయిలివ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. కోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చింది. రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలో ఉంది. గత ఏడాది ఎన్నికల్లో ఈ కూటమికి వ్యతిరేకంగా వైసీపీ పోరాడింది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని లిఖిత పూర్వక హామీఇచ్చే పార్టీకే కేంద్రంలో మద్దతిస్తామని జగన్ అప్పట్లోనూ అన్నారు. మరి ప్రత్యేక హోదా సాధ్యం కాదని తేల్చిచెప్పిన బీజేపీ నిలబెట్టిన రాధాకృష్ణన్‌కు ఇప్పుడు మద్దతిస్తున్నారు. అవినీతి కేసుల నుంచి రక్షణ కోసమే.. ఆయనకు జగన్ బేషరతుగా మద్దతు ప్రకటించారని ఆయన చెల్లెలు, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తాజాగా మండిపడ్డారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఎన్‌డీఏ అభ్యర్థికి ఎందుకు మద్దతు ప్రకటించారో రాష్ట్ర ప్రజలకు జగన్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★








సీనియర్ నిర్మాత అల్లు అరవింద్ తల్లి కనకరత్నమ్మ దశదిన కర్మ సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మెగాస్టార్ చిరంజీవి, రామ్‌చరణ్ తదితరులు హాజరయ్యారు. కనకరత్నమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించి ఆవిడతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.



ముంబై పర్యటనలో భాగంగా సోమవారం బసవతారకం ఆస్పత్రి ప్రతినిధులతో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌ను సందర్శించారు నందమూరి బాలకృష్ణ. ఈ సందర్భంగా అక్కడి అధికారులు ఆయనకు స్టాక్ ఎక్స్ఛేంజ్ బెల్‌ను మోగించే అవకాశం ఇచ్చారు. ఈ ఘనత సాధించిన తొలి దక్షిణాది హీరో ఆయనే కావడం గమనార్హం.

మొదట రచన.. ఇప్పుడు గానం!



రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా'. మహేశ్‌బాబు పి. దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సినిమాలో ఫస్ట్ సింగిల్ 'నువ్వుంటే చాలే' ను హీరో రామ్ రాయడం విశేషం. ఈ పాట అందరినీ ఆకట్టుకుంటోంది. ఇప్పుడు సెకండ్ సింగిల్ 'పప్పీ షేమ్'ను విడుదల చేశారు. ఈ పాటను హీరో రామ్ పాడడం విశేషం. వివేక్, మెర్విన్ స్వరపరిచారు. గీత రచయిత భాస్కరభట్ల తన రచనలో వినోదాన్ని, అభిమానుల జ్ఞాపకాలను అద్భుతంగా పొందుపరిచారు. తొలిసారిగా రామ్ పాడిన ఈ పాట ఇప్పుడు యూత్‌లో హల్‌చల్ చేస్తోంది. రామ్, ఇలా ఒకే సినిమాతో గీత రచయితగా, గాయకుడిగా తన ప్రతిభను ప్రదర్శించడం విశేషం. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో కన్నడ స్టార్ ఉపేంద్ర కీలక పాత్ర పోషిస్తున్నారు. రావు రమేశ్, మురళీశర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేశ్ ఇతర ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. ప్రస్తుతం చివరి దశ షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రం నవంబర్ 28న విడుదల కానుంది. నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు.

ఘనవిజయం సాధించాలి


దామోదర ప్రసాద్



సన్నీ కునాల్, దేవిక సాహూ, ఆశ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతున్న చిత్రం 'రోహిణి'. సంగ కుమార్ దర్శకత్వంలో కుశాల్ రాజు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ఆడియో వేడుకను నిర్వహించారు. ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి దామోదర ప్రసాద్, నిర్మాత చదలవాడ శ్రీనివాస రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దామోదర ప్రసాద్ మాట్లాడుతూ 'చిత్రం ఘనవిజయం సాధించాలి' అని కోరారు. 'మంచి కంటెంట్‌తో వస్తోన్న సినిమా ఇది' అని చదలవాడ శ్రీనివాస రావు చెప్పారు. 'ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది' అని సంగ కుమార్ తెలిపారు.

హారర్ సినిమాలంటే ఇష్టం

కౌశిక్



'నాకు హారర్ సినిమాలంటే ఇష్టం. ఈ తరహా చిత్రాలకు ప్రత్యేక అభిమానులు ఉంటారు. వారికోసం ఒక కథ చేయాలని ఎప్పటినుంచో ఉండేది. అది ఇప్పుడు నెరవేరింది. ఒక వైపు ఉత్కంఠ.. మరో వైపు భయం.. ఈ రెండింటి సమ్మేళనమే 'కిష్కింధపురి' సినిమా అని అన్నారు దర్శకుడు కౌశిక్ పెగల్లపాటి. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రధారులుగా ఆయన తెరకెక్కించిన చిత్రం 'కిష్కింధపురి'. షైన్ స్క్రీన్స్ బేనర్‌పై సాహు గారపాటి నిర్మించారు. సినిమా ఈనెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా కౌశిక్ మీడియాతో చిత్ర విశేషాలు పంచుకున్నారు.

- నా తొలి చిత్రం 'చావు కబురు చల్లగా' తర్వాత గీతా ఆర్ట్స్‌లోనే మరో సినిమా చేయాలి. కొన్ని కారణాల వల్ల జాప్యం జరిగింది. ఒక సందర్భంలో నిర్మాత సాహు గారపాటికి ఈ కథ చెప్పాను. తర్వాత బెల్లంకొండ శ్రీనివాస్ విన్నారు. అలా ఈ ప్రాజెక్టు పట్టాలెక్కింది.
- ప్రేక్షకులకు ఒక ప్రత్యేక తరహా అనుభూతిని ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ సినిమా తీశాం. ఇందులో ఓ ముఖ్యమైన విషయాన్ని చెప్పబోతున్నాను.
- కిష్కింధపురి అంటే మనకు రామాయణం గుర్తొస్తుంది. ఈ కథకి స్ఫూర్తి రామాయణమే. అయితే ఆ స్ఫూర్తి చాలా ఆసక్తికరంగా ఉంటుంది.

అద్భుత దృశ్య కావ్యం

విశ్వప్రసాద్



తేజ సజ్జా కథానాయకుడిగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మిరాయ్'. మంచు మనోజ్, శ్రియా శరణ్, రితికా నాయక్ కీలక పాత్రలు పోషించారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈనెల 12న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా మేకర్స్ వైజాగ్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా తేజ సజ్జా మాట్లాడుతూ 'మిరాయ్' ఒక యాక్షన్ ఫ్యాంటసీ అడ్వెంచర్. మీ కోసం సరికొత్త ప్రపంచాన్ని సృష్టించాం. థియేటర్లలోనే చూడాల్సిన చిత్రమిది. సినిమాలోని విజువల్స్‌కి, సంగీతానికి గూస్‌బంప్స్ పక్కా' అని తెలిపారు. 'ఇది నాకు కమ్‌బ్యాక్ చిత్రం. ఈ సినిమాతో మనోజ్ 2.0ని చూస్తారు' అని మంచు మనోజ్ చెప్పారు. 'ఈ సినిమా ఒక అద్భుత దృశ్య కావ్యం. తప్పకుండా పాన్ వరల్డ్ ఫ్రాంచైజీ అవుతుందనే నమ్మకం ఉంది' అని టీజీ విశ్వప్రసాద్ తెలిపారు.

క్షణక్షణం ఉత్కంఠభరితం



రాగ్‌మయూర్, మెరిన్ ఫిలిప్ జంటగా 'డీజే టిల్లు' ఫేమ్ విమల్‌కృష్ణ ఓ చిత్రం తెరకెక్కిస్తున్నారు. రాజీవ్ చిలక, రాజేశ్ జగ్తియాని, హిరాచంద్ దండ్, నవీన్‌చంద్ర నిర్మిస్తున్నారు. ప్రిన్స్ సెసిల్, అనన్నయ్య, చరిత్ర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సోమవారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు మేకర్స్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'ఈ సినిమా క్షణక్షణం ఉత్కంఠభరితంగా ఉంటుంది' అని తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: అభినవ్ కూనపరెడ్డి, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

ప్రభావవంతమైన 'భద్రకాళి'

- తృప్తి రవీంద్ర, రియా జిత్తు



'ఇది ఒక ప్రభావవంతమైన కథ. నేటి సమాజానికి ఇలాంటి కథ చాలా అవసరం. అందరికీ కనెక్ట్ అవుతుంది. అందరినీ ఆలోచింపజేస్తుంది' అని అన్నారు కథానాయికలు తృప్తి రవీంద్ర, రియా జిత్తు. విజయ్ ఆంటోని హీరోగా అరుణ్ ప్రభు తెరకెక్కించిన చిత్రం 'భద్రకాళి'. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోని కార్పొరేషన్ సంస్థల సమర్పణలో సర్వంత్ రామ్ క్రియేషన్స్ బేనర్‌పై రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. సినిమా ఈనెల 19న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తృప్తి రవీంద్ర మాట్లాడుతూ 'ఈ చిత్రంలో నా పాత్ర అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. దర్శకుడు పాత్రను అద్భుతంగా మలిచారు. తెలుగు ప్రేక్షకులు అన్ని రకాల సినిమాలను గొప్పగా ఆదరిస్తారు' అని అన్నారు. రియా జిత్తు మాట్లాడుతూ 'విజయ్ ఆంటోని మ్యూజిక్ వింటూ పెరిగాను. ఇప్పుడు ఆయన సినిమాలో నటించే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉంది' అని అన్నారు.

తెలుగు సినిమా ఖ్యాతిని పెంచేలా..



'శుక్ర', 'మాటరాని మౌనమిది' చిత్రాల దర్శకుడు పూర్వాజ్ తెరకెక్కిస్తోన్న సినిమా 'ఏ మాస్టర్ పీస్'. అరవింద్ కృష్ణ, జ్యోతి పూర్వాజ్, మనీష్ గిలాడ, అషు రెడ్డి ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్నారు. శ్రీకాంత్ కండ్రేగుల, మనీష్ గిలాడ, ప్రజయ్ కామత్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ సందర్భంగా షూటింగ్ స్పాట్‌లో చిత్రబృందం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. దర్శకుడు పూర్వాజ్ మాట్లాడుతూ 'ఈ చిత్రంలో మనీష్ గిలాడ సూపర్ విలన్‌గా నటిస్తున్నారు. సూపర్ హీరోగా అరవింద్ కృష్ణ కనిపిస్తారు. ఈ కథలో శివుడి నేపథ్యం ఉంటుంది. కాబట్టి మహా శివరాత్రికి సినిమాను విడుదల చేయాలని అనుకుంటున్నాం' అని చెప్పారు. హీరో అరవింద్ కృష్ణ మాట్లాడుతూ 'తెలుగు సినిమా ఖ్యాతిని పెంచేలా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది' అని తెలిపారు. నిర్మాత మనిష్ గిలాడ మాట్లాడుతూ 'నాలోని సూపర్ విలన్‌ను ప్రేక్షకులకు పరిచయం చేయబోతున్న మా దర్శకుడికి కృతజ్ఞతలు' అని అన్నారు.

అందరికీ కనెక్టయ్యే కథ



అజయ్ దిషన్, ధనుష హీరో హీరోయిన్లుగా గణేశ్ చంద్ర దర్శకత్వంలో 'బుకీ' అనే యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ సినిమా సోమవారం ఘనంగా ప్రారంభమైంది. విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, శరవంత్ రామ్ క్రియేషన్స్ బేనర్లపై రామాంజనేయులు జవ్వాజీ నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి హీరో సత్యదేవ్ క్లాప్ కొట్టగా, నిర్మాత సి.కల్యాణ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. హీరోయిన్ మంచు లక్ష్మీ స్క్రిప్ట్ అందించారు. హీరో విజయ్ ఆంటోని, రామాంజనేయులు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా విజయ్ ఆంటోని మాట్లాడుతూ "బుకీ' విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు. మంచు లక్ష్మీ మాట్లాడుతూ 'ఇది అందరికీ కనెక్ట్ అయ్యే కథ. ఈ ప్రాజెక్టులో భాగమైనందుకు ఆనందంగా ఉంది' అని అన్నారు.

ఎంపీసీలో చరిత్ర.. బైపీసీలో జాగ్రఫీ

(మొదటి పేజీ తరువాయి)

చదువుకునే వెసులుబాటు కలిగింది. దీంతో విద్యార్థులు వైవిధ్యమైన కాంబినేషన్‌లో సబ్జెక్టులను ఎంపిక చేసుకున్నారు.

వచ్చిన మార్పు ఇదీ...

ఇంటర్ బోర్డు కోర్సులను సమూలంగా మార్చేసింది. ఇప్పటివరకూ ఎంపీసీ, బైపీసీల్లో ఆరేసి సబ్జెక్టులు, మిగిలిన గ్రూపుల్లో ఐదు చొప్పున సబ్జెక్టులు ఉన్నాయి. ఈ ఏడాది నుంచి ఎంపీసీలో ఎ,బిలుగా ఉన్న గణితం సబ్జెక్టులను ఒక్కటిగా కలిపింది. బైపీసీలో ఉన్న బోటనీ, జువాలజీని బయాలజీగా మార్చింది. దీంతో అన్ని గ్రూపుల్లో ఐదు సబ్జెక్టుల విధానం అమల్లోకి వచ్చింది. అలాగే భాషా సబ్జెక్టుల్లో ఇంగ్లీష్ తప్పనిసరి సబ్జెక్టు. రెండో భాష సబ్జెక్టు ఉండేది. అంటే విద్యార్థి ఆ స్థానంలో ఏదైనా భాష సబ్జెక్టు మాత్రమే ఎంపిక చేసుకోవాలి. అందువల్ల చాలా మంది విద్యార్థులు సంస్కృతం తీసుకునేవారు. ఇకనుంచి ద్వితీయ భాష సబ్జెక్టు స్థానంలో ఎలక్టివ్ సబ్జెక్టును తీసుకొచ్చింది. అంటే మొత్తం ఇంటర్ విద్యలో అందుబాటులో ఉన్న 24 సబ్జెక్టులను ఎలక్టివ్ సబ్జెక్టు కింద తీసుకోవచ్చు. అయితే, ఎంపికలో ఎలాంటి పరిమితులు లేవు. దీంతో ఎంపీసీ విద్యార్థులు బయాలజీ తీసుకుంటే, బైపీసీ విద్యార్థులు గణితం తీసుకున్నారు.

ఇలా ఎంపిక చేసుకున్నారు...

- 133 మంది ఎంపీసీ విద్యార్థులు బయాలజీ సబ్జెక్టు తీసుకున్నారు. ఒకరు సివిక్స్, ఆరుగురు కామర్స్, ఒకరు ఎకనామిక్స్, 54 మంది ఫ్రెంచ్, 21 మంది జాగ్రఫీ, 3,989 మంది హిందీ, ముగ్గురు చరిత్ర, 12 మంది కన్నడ, 243 మంది ఒరియా, 37 మంది పర్షియన్, 2.41లక్షల మంది సంస్కృతం, 213 మంది తమిళం, 1,787 మంది ఉర్దూ, 830 మంది అరబిక్ తీసుకున్నారు.
- బైపీసీ విద్యార్థుల్లో... 515 మంది అరబిక్, ఇద్దరు సివిక్స్, ఎనిమిది మంది ఫ్రెంచ్, 29 మంది జాగ్రఫీ, 3,239 మంది హిందీ, ఇద్దరు చరిత్ర, 111 మంది గణితం, 265 మంది ఒరియా, 13 మంది పర్షియన్, 48,692 మంది సంస్కృతం, 82 మంది తమిళం, 1,308 మంది ఉర్దూ తీసుకున్నారు.
- సీఈసీ గ్రూపు విద్యార్థుల్లో 27 మంది అరబిక్, 15 మంది బయాలజీ, 63 మంది చరిత్ర, ఎనిమిది మంది గణితం, 11 మంది పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఎంపిక చేసుకున్నారు. ఎంఈసీ గ్రూపు విద్యార్థుల్లో ఐదుగురు ఫ్రెంచ్, 13 మంది జాగ్రఫీ ఎంచుకున్నారు. హెచ్ఈసీలో ఓ విద్యార్థి బయాలజీ, ముగ్గురు గణితం తీసుకున్నారు.

ఎంబైపీసీలో 11,257 మంది


ఈ ఏడాది నుంచి వచ్చిన మార్పులతో విద్యార్థులకు ఎంబైపీసీ చదివే అవకాశం వచ్చింది. సాంకేతికంగా ఎంబైపీసీ పేరుతో గ్రూపు లేకపోయినా ఎంపీసీ విద్యార్థులు బయాలజీ, బైపీసీ విద్యార్థులు గణితం చదివే వెసులుబాటు కలిగింది. దీంతో 133 మంది ఎంపీసీ విద్యార్థులు బయాలజీ, 111 మంది బైపీసీ విద్యార్థులు గణితం ఎలక్టివ్ సబ్జెక్టుగా తీసుకున్నారు. అయితే ఎంబైపీసీ కోసం ఇంటర్ బోర్డు మరో అవకాశం కూడా కల్పించింది. ఈ రెండు గ్రూపుల విద్యార్థులకు అదనపు సబ్జెక్టు తీసుకునే అవకాశం ఇచ్చింది. దీంతో 7,400 మంది బైపీసీ విద్యార్థులు గణితాన్ని అదనపు సబ్జెక్టుగా, 3,613 మంది ఎంపీసీ విద్యార్థులు బయాలజీని అదనపు సబ్జెక్టుగా తీసుకున్నారు. అయితే ఈ అదనపు సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించకపోయినా ఇంటర్మీడియట్ సర్టిఫికెట్ వస్తుంది. కానీ ఇవే సబ్జెక్టులను ఎలక్టివ్‌గా తీసుకున్నవారు మాత్రం కచ్చితంగా ఉత్తీర్ణులు కావాలి. అదనపు సబ్జెక్టు తీసుకున్న వారికి మొత్తం ఆరు సబ్జెక్టులు ఉంటాయి. మొత్తంగా ఎలక్టివ్ లేక అదనపు పద్ధతిలో 11,257 మంది ఎంబైపీసీ చదువుతున్నారు. వీరు ఇంటర్మీడియట్ అనంతరం అటు ఇంజనీరింగ్ వైపు లేదా మెడిసిన్ వైపు వెళ్లొచ్చు. మొత్తంగా ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో 5,40,924 మంది అడ్మిషన్ పొందారు.

ఒకరోజు ఒక సబ్జెక్టే

ఎంబైపీసీ, ఎలక్టివ్ విధానం ప్రవేశపెట్టడంతో పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను బోర్డు మార్చనుంది. ప్రతి సంవత్సరం గణితం సబ్జెక్టు ఉన్నరోజే బోటనీ, జువాలజీ పరీక్షలు ఉంటున్నాయి. ఇప్పుడు ఎంబైపీసీ తీసుకున్నవారు రెండూ ఒకే రోజు రాయడం సాధ్యం కాదు కాబట్టి వేర్వేరు రోజుల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ఫస్టియర్ విద్యార్థులకు ఒక రోజు ఒకే సబ్జెక్టు పరీక్ష ఉండేలా మార్పులు చేయనున్నారు. దీనివల్ల పరీక్షలకు ఎక్కువ రోజులు పట్టే అవకాశం ఉంది. అందుకే ఈ విద్యా సంవత్సరం నుంచి మార్చికి బదులుగా ఫిబ్రవరి నుంచే ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభించాలని ఇంటర్ బోర్డు ప్రాథమికంగా నిర్ణయించింది.

సీఎం సహా మంత్రుల సినీ నటనపై నిషేధం లేదు

- మాజీ సీఎం ఎన్‌టీఆర్ విషయంలో హైకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చింది
- కోర్టు సమయాన్ని వృథా చేసిన మాజీ ఐఏఎస్‌కు ఖర్చులు విధించండి
- పిటిషన్‌ను కూడా కొట్టివేయండి.. హైకోర్టులో అడ్వకేట్ జనరల్ వాదనలు



అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహా మంత్రులుగా ఉన్న వారు సినిమాల్లో నటించడంపై ఎలాంటి నిషేధం లేదని అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు నివేదించారు. సినీనటుడు, మాజీ సీఎం ఎన్‌టీఆర్ విషయంలో హైకోర్టు ఫుల్ బెంచ్ గతంలోనే స్పష్టమైన తీర్పు ఇచ్చిందన్నారు. 'హరిహర వీరమల్లు' సినిమా టికెట్ ధరల పెంపు విషయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాత్ర ఉన్నట్లు పిటిషనర్ ఎలాంటి ఆధారాలను కోర్టు ముందు ఉంచలేదన్నారు. టికెట్ ధరలను పెంచుతూ ఇచ్చిన మెమోను సైతం పిటిషనర్ సవాల్ చేయలేదని తెలిపారు. ప్రాథమిక అంశాలను పరిశీలించకుండానే పిటిషన్ వేసి, కోర్టు సమయాన్ని వృథా చేస్తున్నారని, వ్యాజ్యానికి విచారణార్హత కూడా లేదన్నారు. వ్యాజ్యం దాఖలు చేసిన మాజీ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్‌కు ఖర్చులు విధించి పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. ఈ దశలో విజయ్‌కుమార్ తరఫు న్యాయవాది జోక్యం చేసుకుని.. ఎన్‌టీఆర్ విషయంలో ఇచ్చిన తీర్పును పరిశీలించి, వాదనలు వినిపించేందుకు సమయం ఇవ్వాలని కోర్టును కోరారు. ఈలోపు కౌంటర్ వేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి కౌంటర్ దాఖలుపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని పేర్కొన్నారు. ఏజీ ఇప్పటికే వాదనలు వినిపించారని, పిటిషనర్ తరఫున రిప్లై వాదనల కోసం విచారణను ఈ నెల 15కి వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

ఇదీ పిటిషన్

పవన్‌కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా వాణిజ్య కార్యక్రమాలను ప్రమోట్ చేసుకొనేందుకు ప్రభుత్వ నిధులు, అధికార యంత్రాంగాన్ని వినియోగించారని.. దీనిపై స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ విజయ్‌కుమార్ పిటిషన్ దాఖలు చేశారు. ఆయన తరఫున న్యాయవాది బాల వాదనలు వినిపించారు. "ఉపముఖ్యమంత్రిగా వ్యవహరిస్తూ సినిమాల్లో నటించడం అనైతికం. రాజ్యాంగ విరుద్ధం. వీరమల్లు సినిమా టికెట్ ధరల పెంపు, వాణిజ్య కార్యక్రమాలు ప్రమోట్ చేసుకునేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. ధరల పెంపు ఫైళ్లను కోర్టు ముందు ఉంచేలా ఆదేశించండి" అని విన్నవించారు.

డిగ్రీ సీట్ల కేటాయింపు వాయిదా

- సర్టిఫికెట్ల అప్‌లోడ్‌లో తకరారు... రేపటివరకు అవకాశం

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లు సరిపోలలేదనే కారణంతో ఉన్నత విద్యామండలి డిగ్రీ సీట్ల కేటాయింపును వాయిదా వేసింది. షెడ్యూలు ప్రకారం సోమవారం సీట్లు కేటాయించాలి. అయితే ఇంకా అనేక మంది విద్యార్థులు అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లలో పొరపాట్లు ఉన్నట్లు గుర్తించింది. కొందరు సర్టిఫికెట్లకు బదులుగా ఇతరత్రా పత్రాలు అప్‌లోడ్ చేశారు. ఇలాంటి వారు వేలల్లో ఉన్నట్లు మండలి గుర్తించింది. దీంతో వారికి మరో అవకాశం కల్పిస్తూ సీట్ల కేటాయింపును 10 వరకు వాయిదా వేస్తున్నట్లు తెలిపింది.

ఈఐపీఎల్‌లో ఆరని మంటలు





మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

హెలికాప్టర్ ద్వారా మంటలను అదుపుచేస్తున్న దృశ్యం

- సీ కింగ్ హెలికాప్టర్‌తో రంగంలోకి నేవీ
- ఫోమ్, నీటిని వెదజల్లుతూ మంటలార్పే యత్నం

విశాఖపట్నం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్ ఇండియా పెట్రోలియం లిమిటెడ్(ఈఐపీఎల్) కంపెనీలో మంటలు పూర్తిగా అదుపులోకి రాలేదు. ఆదివారం మధ్యాహ్నం మిథనాల్ ఆయిల్(పెట్రోలియం ఫిల్లరింగ్) ట్యాంకుపై పిడుగు పడటంతో మంటలు చెలరేగిన విషయం తెలిసిందే. ఆ ట్యాంక్ నుంచి సోమవారం రాత్రి వరకు మంటలు వస్తూనే ఉన్నాయి. తూర్పు నౌకాదళం అధికారులు ఐఎన్ఎస్ డేగా నుంచి సీ కింగ్ హెలికాప్టర్‌ను తీసుకువచ్చి, దాని ద్వారా ఫోమ్, నీటిని ట్యాంకుపై వెదజల్లి మంటలను అదుపులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారు. మంగళవారం ఉదయానికి మంటలు పూర్తిగా తగ్గిపోయే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈఐపీఎల్ కంపెనీ మిథనాల్‌ను ట్యాంకుల్లో నిల్వ చేస్తోంది. ప్రమాదానికి గురైన ట్యాంకు సామర్థ్యం 7,225 లీటర్లు. ప్రమాదం జరిగే సమయానికి అందులో 6,500 లీటర్ల మిథనాల్ ఉంది. దీనికి మండే గుణం అధికం. గాలి సోకినప్పుడు ఏ చిన్న ఇగ్నిషన్ (వేడి) తగిలినా వెంటనే అంటుకుంటుంది. మిథనాల్ నిల్వ చేసే ట్యాంకులు ప్రత్యేకంగా ఉంటాయి. ట్యాంకుపై పిడుగు పడినప్పుడు పైకప్పు విరిగి పక్కకు జారిపోవడంతోపాటు లోపల ఉన్న ఫ్లోటింగ్ రూఫ్‌కు ఒక అంగుళం మేర రంధ్రం ఏర్పడి మంట లోపలికి చేరింది. తద్వారా మిథనాల్ అంటుకుంది. మిగిలిన ఫ్లోటింగ్ రూఫ్ అంతా బాగానే ఉంది. ట్యాంకులోకి ఎంత నీరు పోసినా, ఫోమ్ వెదజల్లినా ఆ అంగుళం రంధ్రం నుంచే లోపలకు వెళ్లి మంటలను తగ్గిస్తున్నాయి. మరోవైపు ట్యాంక్‌కు ఉన్న వేరే వాల్వ్ ద్వారా సుమారు 2 వేల కిలో లీటర్ల మిథనాల్‌ను వేరే ట్యాంక్‌లోకి పంపించగలిగారు. సుమారు 4 వేల నుంచి 4,500 లీటర్ల మిథనాల్ గత 30 గంటల్లో మండిపోయింది. కాగా, పిడుగుల వల్ల ప్రమాదం జరగకుండా ఇక్కడ 40 మీటర్ల ఎత్తున లైట్నింగ్ ప్రొటెక్టర్ ఉందని, అది పనిచేసి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని, అది బహుశా పనిచేయడం లేదేమోనని ఒక అధికారి అనుమానం వ్యక్తంచేశారు. ట్యాంక్ పైకప్పుపై మిథనాల్ వేపర్ (ఆవిరి) అక్కడక్కడ ఉండడం వల్లే పిడుగు పడినప్పుడు మంటలంటుకున్నాయని ప్రాథమిక పరిశీలనలో తేలినట్టు విశాఖపట్నం డీసీఎఫ్ సురేశ్ తెలిపారు. 2024 ఆగస్టు 21న అచ్యుతాపురంలోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి 17 మంది చనిపోయిన ఘటన తర్వాత ఫ్యాక్టరీస్ అధికారులు విశాఖ జిల్లాలోని అన్ని కంపెనీల్లో సేఫ్టీ ఆడిట్ చేయించారు. ఈఐపీఎల్‌లోనూ అప్పుడే సేఫ్టీ ఆడిట్ చేయించారు. మళ్లీ ఇప్పుడు చేయించాల్సి ఉండగా, ఈలోపే ప్రమాదం జరిగింది.

అల్లు అరవింద్‌కు జీహెచ్‌ఎంసీ నోటీసు

- అనుమతి లేకుండా పెంట్‌హౌస్ కట్టారని తాఖీదు

బంజారాహిల్స్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్‌కు జీహెచ్‌ఎంసీ సోమవారం నోటీసు జారీ చేసింది. జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 45లో ఆయన అల్లు బిజినెస్ పార్క్ పేరిట సుమారు వెయ్యి గజాల్లో భవనం నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు నాలుగు అంతస్థుల వరకు జీహెచ్‌ఎంసీ అనుమతులు తీసుకున్నారు. ఏడాది క్రితమే ఆ ఇంటి నిర్మాణం పూర్తి చేశారు. అయితే, ఇటీవల అదనంగా పెంట్‌హౌస్ నిర్మించారు. దీంతో అక్రమంగా నిర్మించిన పెంట్‌హౌస్‌ను ఎందుకు కూల్చవద్దంటూ జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

- గ్రామీణాభివృద్ధిశాఖకు ఫీల్డ్ అసిస్టెంట్ల విజ్ఞప్తి

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10 వేల మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి పథకంలో పనిచేస్తుంటే కేవలం 3 వేల మంది సిబ్బంది మాత్రమే ఎఫ్‌టీఈ(ఫిక్స్ టెన్యూర్ ఎంప్లాయీస్)గా ఉన్నారని, మిగిలిన వారిని కూడా ఎఫ్‌టీఈలను చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ల ప్రతినిధులు ఉపముఖ్యమంత్రి ఓఎస్‌డీ వెంకటకృష్ణకు విజ్ఞప్తి చేశారు. 'నిర్వేదంలో ఉపాధి సిబ్బంది' శీర్షికన ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై గ్రామీణాభివృద్ధిశాఖ స్పందించింది. ఒక్కో రోజు ఒక్కో కేడర్ ఉపాధి సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం ఎస్ఆర్‌డీఎస్ మెంబర్ సెక్రటరీ మద్దిలేటి ఆధ్వర్యంలో తాడేపల్లిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ సమావేశం ఏర్పాటు చేయగా, అన్ని జిల్లాల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్స్ ప్రతినిధులు తరలివచ్చారు. ముఖ్య అతిథిగా వెంకటకృష్ణ పాల్గొన్నారు. సిబ్బంది సమస్యలను సానుకూలంగా విన్న అధికారులు ఇందులో ప్రభుత్వం పరిష్కరించగలిగినవన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్‌కు డైరెక్టర్ల నియామకం

ఏపీ కుమ్మరి, శాలివాహన సంక్షేమ కార్పొరేషన్‌కు 15 మంది అనధికార డైరెక్టర్లను నియమిస్తూ బీసీ సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. చైర్మన్‌గా ఇప్పటికే పెరెపి ఈశ్వర్‌ను నియమించారు. పండారి అప్పారావు(రాజమండ్రి రూరల్), భీమా బత్తుల సత్యనారాయణ(కాకినాడ రూరల్), డాలిపర్తి వేమన్న (రాజమండ్రి రూరల్), కె.నాగేంద్ర(అనంతపురం అర్బన్), కె.వెంకటసుబ్బయ్య (తాడిపర్తి), కొడేటి లక్ష్మీ కనకదుర్గ(అచంట), లక్ష్మీ భీమవరపు(ఉంగుటూరు), మేడపాకుల శ్రీనివాసరావు(దర్శి), పీబీవీ సుబ్బయ్య (కర్నూల్), పి.భావన(మదనపల్లి), పిడతల నేమిలయ్య(దర్శి), జీడిమళ్ల సత్యవతి(తిరువూరు), కమ్మరి సుధాకర్(డోన్), గుడి స్వర్ణ(రాయచోటి), మాచవరపు విజయకుమారి(మండపేట)లను డైరెక్టర్లుగా నియమించారు. వీరు రెండేళ్లు పదవిలో ఉంటారు.

ఎస్సీ గురుకుల సొసైటీలో గురువులకు సత్కారం

గురుపూజోత్సవం సందర్భంగా సోమవారం సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పనిచేసే పలువురు ఉపాధ్యాయులకు తాడేపల్లిలోని ఎస్సీ గురుకుల సొసైటీలో సత్కరించారు. టీచర్లు టి.రాంబాబు, కె.శ్రీదేవి, పీవీ కరుణాకరరావు, ఎస్.ఫణిజ్యోతి, పి.సుజాతలకు సొసైటీ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ మెమెంటోలు అందించి అభినందనలు తెలిపారు.

స్టాండింగ్ కౌన్సిళ్ల నియామకం

నెల్లూరు విక్రమసింహపురి యునివర్సిటీ తరఫున హైకోర్టులో వాదనలు వినిపించేందుకు న్యాయవాది చింతా ఉమామహేశ్వరరెడ్డి, అలాగే ఏపీ హౌజింగ్ కార్పొరేషన్ తరఫున న్యాయవాది కోటయ్యగారి మల్లిఖార్జునమూర్తి స్టాండింగ్ కౌన్సిళ్లుగా నియమితులయ్యారు. మూడేళ్లపాటు వీరు పదవిలో కొనసాగుతారు. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు.

రాజధాని అమరావతిలో

భూసేకరణకు సన్నాహాలు

- నిర్మాణానికి అడ్డంకిగా మారిన 1,800 ఎకరాలు
- అందులో 1,300 ఎకరాల రైతులు అనుకూలురే
- సీఆర్‌డీఏ అస్పష్ట విధానాలతోనే ఇవ్వలేదంటున్న రైతులు
- సమస్యలను పరిష్కరిస్తే సమీకరణకు సై అంటున్న భూ యజమానులు
- వ్యతిరేకులను తమనూ ఒకే గాటన కట్టొద్దంటూ విజ్ఞప్తి



విజయవాడ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతికి భూములు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టిన రైతులపై భూ సేకరణను ప్రయోగించడానికి సీఆర్‌డీఏ సిద్ధమయింది. ఈమేరకు సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రక్రియ ప్రారంభమయింది. మొత్తం 1,800 ఎకరాలను రైతులు తమ వద్దే ఉంచుకున్నారు. ఇది రాజధాని నిర్మాణానికి అడ్డంకిగా మారింది. రాజధాని నిర్మాణాన్ని వచ్చే నాలుగేళ్లలో ఒక కొలిక్కి తీసుకురావాలన్న కృతనిశ్చయంతో ఉన్న కూటమి ప్రభుత్వం ఆమేరకు ఒకింత కఠినంగానే వ్యవహరించాలని భావిస్తోంది. అందులో భాగంగానే ఇటీవల జరిగిన 52వ సీఆర్‌డీఏ అథారిటీ సమావేశం భూ సేకరణకు ఆమోద ముద్ర వేసింది. మినిట్స్ చేతికి అంది, వాటికి క్యాబినెట్ ఆమోదం లభించగానే భూ సేకరణ నోటిఫికేషన్‌ను వెలువరించటానికి వీలుగా సీఆర్‌డీఏ అధికారులు పూర్తి స్థాయిలో సన్నాహాలు చేస్తున్నారు.

దూకుడును తప్పుపడుతున్న రైతులు

కేవలం 500 ఎకరాలకు చెందిన రైతులు మాత్రమే భూ సమీకరణకు, రాజధానికి వ్యతిరేకంగా ఉన్నారు. మిగిలిన 1,300 ఎకరాల రైతులు రాజధానికి, సమీకరణకూ అనుకూలమే. వారంతా ఇప్పటికే తమ భూమిలో మూడు వంతులు రాజధానికి ఇచ్చారు. ఒక వంతు మాత్రమే ఇవ్వకుండా తమ వద్ద ఉంచుకున్నారు. గ్రామ కంఠం పరిధిని నిర్ణయించి భూ సమీకరణ నుంచి మినహాయింపు ఇవ్వడంలో సీఆర్‌డీఏ అధికారులు ఒక్కో గ్రామానికి ఒక్కో రకంగా వ్యవహరించడంతో ఈ సమస్య తలెత్తింది. సీఆర్‌డీఏ వ్యవహారశైలితో వచ్చిన ఇబ్బందులను పరిష్కరించాల్సిన అధికారులు ఆ వైపుగా దృష్టిపెట్టకుండా దూకుడుగా వ్యవహరించాలని నిర్ణయించడాన్ని వారు తప్పు పడుతున్నారు. రాజధాని అనుకూల, వ్యతిరేక వర్గాలను ఒకే గాటిన కట్టడాన్ని ఎత్తిచూపుతున్నారు.

మినహాయింపులు ఇలా అనిర్దిష్టంగా...

గ్రామకంఠం మినహాయింపులను ఒకసారి పరిశీలిస్తే... నెక్కల్లులో భూసమీకరణ కింద భూములు ఇస్తామన్న భూ యజమానులందరికీ 10 సెంట్లను మాత్రమే గ్రామకంఠం కింద మినహాయించారు. తుళ్లూరులో 253 మంది రైతులకు 10 సెంట్ల నుంచి 1 ఎకరం వరకు మినహాయింపు ఇచ్చారు. దీనిని నెక్కల్లు రైతులు తప్పుపడుతున్నారు. మందడంలో ఓ రైతుకు 8 ఎకరాల వరకు భూ సమీకరణ నుంచి మినహాయింపు ఇవ్వగా... బోరుపాలెంలో 52 మంది రైతులకు, అబ్బరాజుపాలెంలో 23 మంది రైతులకు, రాయపూడి గ్రామంలో 66 మంది రైతులకు, లింగాయపాలెం గ్రామంలో 13 మంది రైతులకు, నేలపాడులో 67 మంది రైతులకు, అనంతవరంలో 35 మంది రైతులకు 10 సెంట్ల నుంచి ఒక ఎకరం లోపు వరకు మినహాయింపు ఇచ్చారు. నిర్దిష్ట విధానం లేకుండా మినహాయింపులు ఇవ్వడంతో నష్టపోతున్నామని భావించిన రైతులు అసంతృప్తితో 1,300 ఎకరాలను ఇవ్వకుండా ఆపారు.

జరీబు సమస్య మరో కారణం

మూడు పంటలు పండే అత్యంత విలువైన జరీబు భూములకు భూసమీకరణలో ప్యాకేజీ ఎక్కువగా ఉంది. జగన్ ప్రభుత్వం జరీబు భూములను డీ క్లాసిఫికేషన్ చేసింది. దీనిపై రైతులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం రాజకీయ కారణాలతో చేసిన డీ క్లాసిఫికేషన్‌ను కూటమి ప్రభుత్వం కూడా కొనసాగిస్తుండటంతో ఆ రైతులు భూములను అప్పగించకుండా ఉండిపోయారు. మరికొన్ని భూముల విషయంలో జరీబు అవునా? కదా? అన్న అంశంపై రైతులకు, సీఆర్‌డీఏకి మధ్య అభిప్రాయ భేదాలున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ఎలాంటి ప్రయత్నం జరగకపోవడం వల్ల ప్రజా రాజధానికి అనుకూలమైన రైతులే అయినప్పటికీ భూములను ఇవ్వకుండా తమవద్దే ఉంచుకున్నారు.

హక్కు చిక్కులపైనా లేని స్పష్టత

భూయాజమాన్య హక్కుల విషయంలో కొన్ని భూములపై తగాయిదాలున్నాయి. వాటిపై ఇప్పటికే కోర్టులో కేసులు నడుస్తున్నాయి. కోర్టు తీర్పునకు అనుగుణంగా భూయజమానికి భూ సమీకరణ ఫలితాలను అందిస్తామన్న ప్రకటనతో ఆ భూములను తీసుకోవాల్సిన సీఆర్‌డీఏ ఆ దిశగా ప్రయత్నం చేయకుండా వాటిని కూడా భూ సేకరణ కిందకు తీసుకువస్తోంది. వీలైనంతవరకూ వ్యతిరేకతలను తగ్గించుకుని భూసమీకరణ ద్వారా ప్రజా రాజధాని నిర్మాణంపై దృష్టి పెట్టాల్సిన అధికారులు ఆదిశగా అడుగులు వేయడం లేదు. రైతుల కష్టనష్టాలను పరిగణనలోకి తీసుకోకుండా అందరినీ ఒకే గాటిన కట్టి కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చే దిశగా వ్యవహరిస్తున్నారని 1,300 ఎకరాల రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే దృష్టి సారించాల్సి ఉంది. అదే జరిగితే మెజారిటీ భూమి సాఫీగా సీఆర్‌డీఏకు బదిలీ అయ్యే అవకాశం ఉంది.

16 అడుగుల కింగ్ కోబ్రా



కింగ్‌కోబ్రాను పట్టుకున్న క్యాచర్ షేక్ అబ్దుల్‌ఖాన్

సీతంపేట రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో 16 అడుగుల భారీ కింగ్‌కోబ్రా కలకలం రేపింది. ఇక్కడి శ్రీకోటదుర్గ వననర్సరీ ఫాంలో సోమవారం ఇది కనిపించడంతో ఫాం యజమాని భుజంగరావు శ్రీకాకుళంలోని స్నేక్ క్యాచర్, అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. స్నేక్‌క్యాచర్ షేక్ అబ్దుల్‌ఖాన్, సహాయకుడు అశోక్‌కుమార్ అక్కడికి వచ్చి కింగ్ కోబ్రాను చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం దాన్ని సీతంపేట ఏజెన్సీలోని రిజర్వ్ ఫారెస్ట్‌లో విడిచిపెట్టారు. సీతంపేట ఏజెన్సీలో ఇంత పెద్ద కింగ్‌కోబ్రాను చూడటం ఇదే మొదటిసారని కొత్తూరు ఫారెస్ట్ బీట్ అధికారి దాలినాయుడు తెలిపారు. చాలా విషపూరితమని, కాటువేస్తే నిమిషాల్లోనే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందన్నారు.

రాష్ట్రంలో లక్ష ఇళ్లకు సౌర విద్యుత్తు!

- 6% వడ్డీకే రుణ సదుపాయం.. టాటా పవర్ సీఎండీ ప్రవీర్ సిన్హా

విశాఖపట్నం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాబోయే రెండేళ్లలో లక్ష ఇళ్లకు రూఫ్ టాప్ సోలార్(సౌర విద్యుత్తు) అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు టాటా పవర్ సీఎండీ ప్రవీర్ సిన్హా తెలిపారు. విశాఖలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీలో 14 లక్షల మందికిపైగా దరఖాస్తు చేశారని, కానీ వారిలో 45 వేల మందే ఇన్‌స్టాల్ చేసుకున్నారని తెలిపారు. 'టాటా పవర్ రూఫ్ టాప్ సోలార్' తీసుకుంటే 25 ఏళ్ల పాటు సేవలు అందిస్తుందన్నారు. మధ్య తరగతి కుటుంబాల వారు కేవలం రూ.999తోనే దీనిని అమర్చుకునే సౌలభ్యం ఉందన్నారు. కేవలం 6 శాతం వడ్డీకే అన్ని ప్రధాన బ్యాంకులు రుణ సదుపాయం కల్పిస్తాయని తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, మొదటి ఐదేళ్లలో రుణం పూర్తిగా తీరిపోతుందని, మిగిలిన 20 ఏళ్లు ఉచితంగా విద్యుత్‌ను ఉపయోగించుకోవచ్చని వివరించారు. 20 రకాల మోడళ్లు అందుబాటులో ఉంచామన్నారు. ఈ సమావేశంలో టాటా రెన్యువబుల్స్ ప్రెసిడెంట్ సంజయ్ బంగా, రూఫ్ టాప్ చీఫ్ శివరామ్ పాల్గొన్నారు.

గిరిజనులకూ పెద్ద గ్యాస్ సిలిండర్లపై జీవో

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మారుమూల కొండ ప్రాంతాల్లో నివసించే గిరిజనులకు కూడా ఇకపై పెద్ద సిలిండర్లు అందనున్నాయి. 'దీపం-2' పథకం కింద ప్రస్తుతం అందజేస్తున్న 5 కిలోల ఎల్పీజీ గిరిజన ప్యాకేజీ సిలిండర్లను 14.2 కిలోల ఎల్పీజీ సిలిండర్లుగా మారుస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి సంబంధించి సెక్యూరిటీ డిపాజిట్, డాక్యుమెంటేషన్ చార్జీల కోసం రూ. 5.54 కోట్ల బడ్జెట్‌ను కూడా కేటాయించింది. దీంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల పరిధిలో 23,912 మంది అర్హులైన గిరిజనులకు లబ్ధి చేకూరనుంది.

సచివాలయ సీపీఎస్ ఉద్యోగులకు డీఏ బకాయిల చెల్లింపు

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. గత వైసీపీ ప్రభుత్వం పెండింగ్ పెట్టిన రెండు డీఏ బకాయిలను చెల్లించింది. 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను జూలై 2018 డీఏ బకాయిలు, 30 నెలలు, జనవరి 2019 బకాయిలు 30 నెలలు మొత్తం రెండు డీఏల 60 నెలల బకాయిలు సుమారు రూ.3.50 కోట్లకు పైగా సోమవారం చెల్లించింది. దీంతో సచివాలయ ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో ఒక్కో ఉద్యోగికి రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు జమ అయినట్లు ఉద్యోగులు చెబుతున్నారు. డీఏ బకాయిల విడుదలపై సచివాలయ సంఘం మాజీ కార్యదర్శి జి రామకృష్ణ, రాష్ట్ర సచివాలయ సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కోట్ల రాజేశ్, నాపా ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించినందుకు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్రంలోని అందరికీ చెల్లించాలి

రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగులందరికీ డీఏ బకాయిలు ప్రభుత్వం చెల్లించాలని ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సతీష్, సీఎందాస్ సోమవారం కోరారు. రాష్ట్ర సచివాలయ సీపీఎస్ ఉద్యోగులకు ఐదు సంవత్సరాలుగా సీఎఫ్ఎంఎస్‌లో గ్రీన్ చానల్‌లో ఉన్న 60 నెలల బకాయిలు చెల్లించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న సీపీఎస్ ఉద్యోగులందరికీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆధార్ ఆధారమే!

అది చూపిస్తే ఓటర్ గుర్తింపు కార్డు ఇవ్వాల్సిందే

- కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు ఆదేశం
- ఆధార్ పౌరసత్వ గుర్తింపు కాదని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆధార్ పౌరసత్వాన్ని ధ్రువీకరించే కార్డు కాదని, అయితే బిహార్‌లో ఓటర్‌గా పరిగణించేందుకు దాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిందేనని సుప్రీంకోర్టు ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఎన్నికల కమిషన్ పరిగణనలోకి తీసుకునే 11 డాక్యుమెంట్లకు అదనంగా 12వ డాక్యుమెంట్‌గా ఆధార్‌ను చేర్చాలని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఎన్నిసార్లు ఆదేశాలు జారీచేసినా ఆధార్‌ను ఈసీ అధికారులు ఆమోదించడం లేదని ఆర్జేడీ, ఎంఐఎం ఇతర పార్టీలు పిటిషన్ దాఖలు చేయడంతో సుప్రీం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఓటర్‌గా గుర్తించేందుకు ఆధార్‌ను కూడా గుర్తింపు కార్డుగా సమర్పించడాన్ని ఆమోదించాలని సుప్రీం న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. అదే సమయంలో ఆధార్‌తో పాటు ఓటర్ సమర్పించిన డాక్యుమెంట్లు ఏవైనా సరైనవా కాదా తనిఖీ చేసే అధికారం ఈసీకి ఉన్నదని కోర్టు స్పష్టం చేసింది. ఆధార్ పౌరసత్వాన్ని ధ్రువీకరించే కార్డు కాదని ఆధార్ చట్టంలోనే ఉందని, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 23(4) ప్రకారం మనిషిని గుర్తించేందుకు అది ఉపయోగపడుతుందని తెలిపింది. ఆధార్‌ను కూడా ఓటర్ల జాబితాలో చేర్చేందుకు పరిగణనలోకి తీసుకుంటామని ఎన్నికల కమిషన్ ఇచ్చిన హామీ పత్రాన్ని సుప్రీంకోర్టు ఆమోదించింది.

అసెంబ్లీకి వచ్చి మాట్లాడే దమ్ము, ధైర్యం లేవా?

- జగన్, వైసీపీ ఎమ్మెల్యేలకు స్పీకర్ అయ్యన్న ప్రశ్న
- ప్రతిపక్షంగా గుర్తించే అధికారం నాకు లేదు



నర్సీపట్నం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీకి వచ్చి మాట్లాడే దమ్ము, ధైర్యం లేవా? అని వైసీపీ అధినేత జగన్‌ని, ఆ పార్టీ ఎమ్మెల్యేలను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ప్రతిపక్ష హోదా ఇచ్చే అధికారం స్పీకర్‌కు ఉందని వైసీపీ వాళ్లు అంటున్నారు. దేవాలయం వంటి అసెంబ్లీలో నేను పూజారి వంటి వాడిని. నాకు ఆ అధికారం లేదు. వైసీపీకి 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. ప్రతిపక్ష హోదాకు ఆ సంఖ్య సరిపోదు. అసెంబ్లీ ఏర్పడి 15 నెలలు కావస్తోంది. జగన్ ఒక్కసారి కూడా అసెంబ్లీకి రాలేదు. రోజూ ప్రెస్‌లో మాట్లాడుతున్నట్టే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి. నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడతారనే ప్రజలు ఓట్లేసి ఆ 11 మందిని ఎన్నుకున్నారు. ప్రభుత్వం ఏమైనా తప్పులు చేస్తే అసెంబ్లీకి వచ్చి మాట్లాడితే సరి చేసుకుంటుంది' అని అయ్యన్న స్పష్టం చేశారు.

జగన్... దమ్ముంటే అసెంబ్లీకి రా!: మంత్రి సవిత



పెనుకొండ సమీపంలోని నిర్మాణం ఆగిపోయిన మెడికల్ కాలేజీ వద్ద ప్రభుత్వ చీఫ్ విప్ ఆంజనేయులు, ఇతర నాయకులతో మంత్రి సవిత సెల్ఫీ

హిందూపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): యూరియా, ఉల్లి, మెడికల్ కళాశాలలు.. ఇలా ఏ అంశంపైనైనా చర్చించడానికి దమ్ముంటే జగన్ అసెంబ్లీకి రావాలని మంత్రి సవిత సవాలు విసిరారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో నిర్మాణం ఆగిపోయిన మెడికల్ కళాశాల ప్రాంతాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ వీవీ ఆంజనేయులు, పార్టీ నేత నరసింహారావులతో కలసి సోమవారం ఆమె పరిశీలించారు. వైసీపీ హయాంలో ఎంతమేర పనులు జరిగాయో మీడియాకు చూపించారు. సెల్ఫీ తీసుకున్నారు. అనంతరం పెనుకొండలోని జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో స్మార్ట్ పే ఫోన్‌ను ప్రారంభించారు.

ఆత్మనిర్భర్ లక్ష్యసాధనలో ఉక్కుదే కీలక పాత్ర

- ఏపీలో ఆర్సెలార్‌కు త్వరలోనే శంకుస్థాపన: మంత్రి శ్రీనివాసవర్మ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యసాధనలో ఉక్కు పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. ఇండియన్ స్టీల్ అసోసియేషన్ (ఐఎస్ఏ)ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో సోమవారం ప్రారంభమైన 6వ ఐఎస్ఏ స్టీల్ కాన్‌క్లేవ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 'ఆంధ్రప్రదేశ్ నక్కపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ నూతనంగా ఏర్పాటు చేస్తున్న భారీ ఉక్కు పరిశ్రమకు అవసరమైన అనుమతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేశాయి. త్వరలోనే శంకుస్థాపన జరగనుంది' అని మంత్రి తెలిపారు.

అన్నదాతలపై వైసీపీ మొసలికన్నీరు: మంత్రి కొలుసు



అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): 'యూరియా విషయంలో వైసీపీ ఫేక్ ప్రచారాలు చేస్తూ రైతుల్లో భయాందోళనలు సృష్టిస్తోంది' అని మంత్రి కొలుసు పార్థసారథి విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'వ్యవసాయాన్ని నాశనం చేసిన జగన్ నేడు అన్నదాత పోరు పేరుతో కొత్త డ్రామాకు తెరదీశారు. మొసలి కన్నీరు కారుస్తున్నారు. దమ్ముంటే వ్యవసాయం, నీటిపారుదల అంశాలపై వైసీపీ చర్చకు రావాలి. కూటమికి మంచి పేరు వస్తుందనే వైసీపీ విషప్రచారానికి సిద్ధమైంది' అని మంత్రి పార్థసారథి విమర్శించారు.

అసత్యాలను వండివార్చడమే వైసీపీ పని: అశోక్‌బాబు

అమరావతి, న్యూఢిల్లీ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ అసత్యాలను ప్రచారం చేయడమే పనిగా పెట్టుకుంది. జగన్ పత్రికలో 15 ఏళ్లలో చంద్రబాబు ఒక్క వైద్య కళాశాల కూడా తేలేదని అసత్యాలు వండి వార్చి ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడం దారుణం' అని మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో 27 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశారని, విభజన తర్వాత కూడా 2014-19లో 11 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుదని చెప్పారు.

మెడికల్ కాలేజీలపై వైసీపీవి తప్పుడు కూతలు: కలిశెట్టి

'మెడికల్ కాలేజీలపై వైసీపీ తప్పుడు కూతలు కూస్తోంది' అని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'వైద్య కళాశాలల పేరుతో జగన్ రూ.4,948 కోట్ల అప్పు తెచ్చారు. కేంద్రం వాటా రూ.975 కోట్లు వచ్చింది. మొత్తం రూ.5,969 కోట్లకుగాను రూ.1,451 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. మిగిలిన కోట్లన్నీ ఎవరి జేబుల్లోకి వెళ్లాయో జగన్ సమాధానం చెప్పాలి' అని ఎంపీ డిమాండ్ చేశారు.

శాంతిభద్రతల విఘాతానికి వైసీపీ కుట్ర: వర్ల

రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు వైసీపీ కుట్ర పన్నుతోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మద్యం కేసులో వైసీపీ సభ్యత్వం లేని ముగ్గురు వ్యక్తులను బెయిల్‌పై విడుదల చేస్తే, స్వాతంత్ర్య సమరయోధులు విడుదలైనట్లు వైసీపీ నాయకులు వారిని స్వాగతించడం వైసీపీ అరాచకత్వానికి నిదర్శనమని వర్ల విమర్శించారు.

రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- ప్రవాసాంధ్రులకు మంత్రి కొండపల్లి పిలుపు

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో వేగంగా సాగుతున్న ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ప్రవాసాంధ్రులు కీలకపాత్ర పోషించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రస్తుతం స్విట్జర్లాండ్ పర్యటనలో ఉన్న ఆయన సోమవారం జ్యూరిచ్‌లోని తెలుగు అసోసియేషన్ ఆఫ్ స్విట్జర్లాండ్ (టీఏఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు.

ధాన్యం బకాయిలు ఎగ్గొట్టి యూరియాపై ఆందోళనలా..!: నాదెండ్ల



ఏలూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): 'ఆపద్ధర్మ సీఎంగా జగన్ ఉన్న సమయంలోనే ధాన్యం బకాయిలు రూ.1,674 కోట్లు నిస్సిగ్గుగా ఎగ్గొట్టారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని రైతుల సమస్యలు, యూరియాపై ఆర్డీవో కార్యాలయాలను ముట్టడిస్తారు?' అని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రశ్నించారు. ఎరువుల సరఫరాపై ఏలూరు కలెక్టరేట్‌లో సోమవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ బకాయిలను చెల్లించిందని గుర్తు చేశారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌లో 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

వచ్చే రబీకి 9.3 లక్షల టన్నుల ఎరువులు: అచ్చెన్న

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టు ద్వారా రాష్ట్రానికి మరో 17,293 టన్నుల యూరియాను దిగుమతి చేసుకోవటానికి కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సోమవారం తెలిపారు. వచ్చే రబీ సీజన్‌కు 9.3 లక్షల టన్నుల ఎరువులను రాష్ట్రానికి కేంద్రం కేటాయించినట్లు మంత్రి వివరించారు.



ఇండియా టుడే కాంక్లేవ్‌లో రాజ్‌దీప్ సర్దేశాయ్ ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న మంత్రి లోకేశ్

ఏపీ బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబే

- పరిశ్రమలకు అగ్రతాంబూలం ఇస్తున్నాం
- పెట్టుబడుల ఆకర్షణకు 99 పైసలకే భూమి
- ట్రంప్ సుంకాల నేపథ్యంలో ఇతర మార్కెట్లపై దృష్టి
- త్రిభాషా విద్యా విధానానికే కట్టుబడి ఉంటాం
- దేశాభివృద్ధికి అమరావతి లాంటి వంద నగరాల నిర్మాణం జరగాలి
- కోవై 'ఇండియా టుడే' కాంక్లేవ్‌లో మంత్రి నారా లోకేశ్

చెన్నై, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు నాయుడు అనే బ్రాండ్ అంబాసిడర్ ఉన్నారని, ఆ బ్రాండ్‌తోనే దేశంలోని అతిపెద్ద స్టీల్ ప్లాంట్లు, డేటా సెంటర్లు, ఐటీ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయని ఏపీ విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. తమ రాష్ట్రంలో పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం ఉండడం వల్లే పెద్దఎత్తున పరిశ్రమలు తరలివస్తున్నాయని చెప్పారు. తమిళనాడులోని వాణిజ్య నగరం కోయంబత్తూరులో 'అట్రాక్టింగ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫర్ ద సన్‌రైజ్ స్టేట్' అనే అంశంపై 'ఇండియా టుడే' నిర్వహించిన కాంక్లేవ్‌లో ఆయన ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా సభకు సంధానకర్తగా వ్యవహరించిన సీనియర్ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్.. యువనేతను పరిచయం చేస్తూ ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న లోకేశ్ రాజకీయ కుటుంబం నుంచే వచ్చినా.. స్వీయశక్తితో ఎదిగారంటూ ప్రశంసించారు. లోకేశ్ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో టీడీపీ ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ప్రధానమైన 'యువతకు 20లక్షల ఉద్యోగాల కల్పన' దిశగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. టీసీఎస్ 25 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తుందని.. ఆ సంస్థకు 99 పైసలకే భూమిని కేటాయిస్తే తప్పేమిటని ప్రశ్నించారు. కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలతో పోటీపడి పరిశ్రమలను రప్పించడానికి తక్కువ ధరకు భూమి, ఇతర రాష్ట్రాల కంటే మెరుగైన ప్రోత్సాహకాలు అందిస్తున్నామని వివరించారు.

ఆక్వాకు ప్రత్యామ్నాయ మార్కెట్

ట్రంప్ సుంకాల నేపథ్యంలో రాష్ట్రంలో ఆక్వా మార్కెట్‌ను కాపాడుకునేందుకు ప్రభుత్వం తరఫున మద్దతు ఇవ్వడమే కాకుండా రష్యా, చైనా, యూరప్‌లలో ప్రత్యామ్నాయ మార్కెట్లను అన్వేషిస్తామని లోకేశ్ చెప్పారు. ఈ క్రమంలో ఎదురయ్యే సవాళ్లను సవాలుగా తీసుకుంటామని చెప్పారు. స్టాన్‌ఫోర్డ్ చదువుతోపాటు యువగళం పాదయాత్ర సవాళ్లను ఎదుర్కొనే మార్గాలను నేర్పిందన్నారు. తీవ్రమైన నేరాలకు 30 రోజులపాటు జైలు శిక్ష అనుభవించిన ముఖ్యమంత్రులు, మంత్రులను పదవీచ్యుతులను చేయడానికి ఎన్డీయే ప్రభుత్వం ప్రతిపాదించనున్న చట్టసవరణ బిల్లు దుర్వినియోగం కాదనే తాము నమ్ముతున్నామన్నారు.

తప్పుచేస్తే ఎవరినీ క్షమించరు

'భారత్ మల్టీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా ఆవిష్కృతమవుతున్న తరుణంలో పారదర్శకమైన రాజకీయాలు అవసరమని మేం బలంగా విశ్వసిస్తున్నాం. రాజకీయ నాయకులపై ఉన్న కేసులకు సంబంధించి ఏడాదిలోగా విచారణ పూర్తిచేసి, తీర్పు ఇవ్వాలని సుప్రీంకోర్టు గతంలో మార్గదర్శకాలిచ్చింది. దురదృష్టవశాత్తు అది అమలు కావడంలేదు. ఏపీలో ఎవరినీ ఉద్దేశపూర్వకంగా జైలులో పెట్టాలని భావించడం లేదు. అదే సమయంలో తప్పుచేస్తే శిక్ష తప్పదు. ముఖ్యమంత్రి చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని మేం ప్రతీకార రాజకీయాలు చేయబోము. నేను తప్పు చేసినా చంద్రబాబు నన్ను జైలుకు పంపుతారు' అని లోకేశ్ వెల్లడించారు.



ఉపరాష్ట్రపతి ఎన్నిక నేపథ్యంలో పార్టీ ఎంపీలతో సమావేశమైన మంత్రి నారా లోకేశ్

ఏపీ ప్రయోజనాలే ముఖ్యం

తమకు ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని, వారిపట్ల తమకున్న నిబద్ధత వల్లే నాలుగు దశాబ్దాలపాటు వారి హృదయాల్లో సుస్థిర స్థానం ఏర్పరచుకోగలిగామని లోకేశ్ అన్నారు. తెలుగుదేశం పార్టీ మిగిలిన ప్రాంతీయ పార్టీల కంటే భిన్నమైందని, తరాలు మారినా తామంతా కలిసికట్టుగానే ముందుకు సాగుతామని చెప్పారు. గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన వారిలో 50 శాతం మంది తొలిసారి ఎమ్మెల్యేలేనని, 25 మంది మంత్రుల్లో 17 మంది కొత్తవారని తెలిపారు. అంకితభావం కలిగిన కొత్త తరాన్ని తాము రాజకీయాల్లోకి తెస్తున్నామని ఆయన తెలిపారు.

సీపీఆర్‌కే మా మద్దతు...: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కే టీడీపీ మద్దతు ఇస్తుందని లోకేశ్ స్పష్టం చేశారు. "మాది కొత్తగా ఏర్పడిన రాష్ట్రమైనప్పటికీ పెట్టుబడుల ఆకర్షణలో ఇతర అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో పోటీపడుతున్నాం. ఫార్చ్యూన్ 500 కంపెనీలతో పాటు ఇతర ప్రముఖ సంస్థలు ఏపీ వైపు చూస్తున్నాయి. స్పేస్ సెక్టార్ అభివృద్ధికి ఇటీవల 200 ఎకరాల భూమిని కేటాయించాం. హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థను కర్ణాటక తిరస్కరించాకే ఏపీ ప్రభుత్వం ఆహ్వానించింది." అని అన్నారు. తమ ప్రభుత్వం త్రిభాషా విద్యా విధానానికే కట్టుబడి ఉంటుందని లోకేశ్ స్పష్టం చేశారు. కాగా, అమరావతి నిర్మాణానికి రైతుల అంగీకారంతోనే 35 వేల ఎకరాలు సమీకరించామని లోకేశ్ వెల్లడించారు. జనవరిలో అమరావతికి దేశంలోనే మొట్ట మొదటి 158 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ రాబోతోందని తెలిపారు. ఏపీ సర్వతోముఖాభివృద్ధికి శాయశక్తులా పాటుపడుతున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు. టీడీపీ చెన్నై అధ్యక్షుడు చంద్రశేఖర్‌ను కలుసుకున్న లోకేశ్.. పార్టీ నేతలు, అభిమానుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ఓటు వృథా కానివ్వొద్దు

- ఉప రాష్ట్రపతి ఎన్నిక ఓటింగ్ వేళ జాగ్రత్త
- టీడీపీ ఎంపీలకు మంత్రి లోకేశ్ సూచన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను పూర్తి మెజారిటీతో గెలిపించాలని తెలుగుదేశం పార్టీ ఎంపీలకు మంత్రి లోకేశ్ సూచించారు. పోలింగ్ బ్యాలెట్ పద్ధతిలో జరుగుతున్నందున ఓటింగ్ వేళ పూర్తి అప్రమత్తంగా ఉండాలని, పార్టీ ఎంపీలు వేసే ఓట్లు వృథా కారాదని అన్నారు. ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ గెలవడం ప్రజాస్వామ్యానికి అవశ్యమని, ఆయనకు ప్రజాస్వామ్య విలువలు, వ్యవస్థలపై పూర్తి అవగాహన ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తులో బీజేపీతోనే టీడీపీ కలిసి ఉంటుందని, 2029 ఎన్నికల తర్వాత కూడా కేంద్రంలోను, రాష్ట్రంలోను టీడీపీ సుదీర్ఘకాలంపాటు కలిసి పయనిస్తుందని స్పష్టం చేశారు. మంగళవారం ఉప రాష్ట్రపతి ఎన్నిక పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు ఆదేశాలతో సోమవారం మంత్రి లోకేశ్ ఢిల్లీ వచ్చారు. టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు నివాసంలో టీడీపీకి చెందిన 16 మంది లోక్‌సభ సభ్యులు, ఇద్దరు రాజ్యసభ సభ్యులతో దాదాపు 2 గంటలకు పైగా సమావేశమయ్యారు. ఉప రాష్ట్రపతి ఎన్నిక పోలింగ్ ప్రక్రియ, ఎన్డీయే అభ్యర్థి విజయానికి టీడీపీ తరఫున తీసుకోవాల్సిన చర్యలపై ఎంపీలతో చర్చించారు. సీపీ రాధాకృష్ణన్‌తో సీఎం చంద్రబాబుకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, 2024 ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ మధ్య పొత్తు కుదరడంలో ఆయన పాత్ర విస్మరించలేనిదని చెప్పినట్లు సమాచారం. కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు.

టీడీపీ ఎంపీలతో ప్రహ్లాద్ జోషి భేటీ

మధ్యాహ్నం టీడీపీ ఎంపీలతో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి భేటీ అయ్యారు. లావు శ్రీకృష్ణదేవరాయలు నివాసంలో జరిగిన ఈ భేటీలో ఉప రాష్ట్రపతి ఎన్నిక ఓటింగ్ విధానం గురించి నిపుణుల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అనంతరం మీడియాతో జోషి మాట్లాడుతూ... తమకు ఉభయ సభలలో ఉన్న మెజారిటీ కంటే అదనంగా 20-25 శాతం ఓట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. తెలుగు వ్యక్తి అయిన ఇండీ కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఓటు వేయాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునివ్వడం అసందర్భమని అన్నారు.

బాబు అరెస్టుకు రెండేళ్లు!

- 2023 సెప్టెంబరు 9న నంద్యాలలో నిర్బంధం
- దీనితోనే వైసీపీ పతనానికి నాంది

(అమరావతి/రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి చంద్రబాబును తప్పుడు కేసులో అక్రమంగా అరెస్టు చేసి మంగళవారానికి సరిగ్గా రెండేళ్లు. 2023 సెప్టెంబరు 9న అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబును.. లేని కుంభకోణాన్ని సృష్టించి అరెస్టు చేశారు. నిలువెల్లా అవినీతికూపంలో కూరుకుపోయి.. అవినీతి, అక్రమార్జన కేసుల్లో ఏ-1 నిందితుడిగా ఉన్న నాటి ముఖ్యమంత్రి జగన్.. ఆ అవినీతి మరకలను చంద్రబాబుకు కూడా అంటించేందుకు చేసిన దుస్సాహసమే స్కిల్ డెవలప్‌మెంట్ కేసు. కనిపించిన టీడీపీ నేతనల్లా ఏదో ఒక కేసులో ఇరికించి.. అరెస్టులు చేయడం.. ఆ పార్టీ కార్యకర్తలను సైతం తప్పుడు కేసుల్లో నిర్బంధించడం.. వేధించడం.. అర్ధరాత్రి ఇళ్ల గోడలు సైతం దూకి పోలీసులు అరెస్టులకు పాల్పడడం వంటి అరాచకాలకు పాల్పడిన నాటి సీఎం.. చంద్రబాబు విషయంలోనూ అదే కొనసాగించారు. నంద్యాలలో సెప్టెంబరు 8వ తేదీ రాత్రి 'బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమంలో పాల్గొని తన బస్సులో సేదతీరేందుకు సిద్ధమైన టీడీపీ అధినేతను.. రాత్రంతా కునుకైనా వేయనివ్వకుండా వేధించారు. అప్పటి సీఐడీ డీఐజీ కొల్లి రఘురామిరెడ్డి నేతృత్వంలోని పోలీసు బృందం ఆయన బస వద్ద రాత్రంతా హడావుడి చేసి.. 9వ తేదీ తెల్లవారుజామున 6 గంటలకు అరెస్టు చేశారు. ప్రతిపక్ష నేతగా క్యాబినెట్ ర్యాంకులో ఉన్న చంద్రబాబును నంద్యాల నుంచి విజయవాడకు 400 కిలోమీటర్లు రోడ్డు మార్గంలో తీసుకొచ్చారు. కోర్టు రిమాండ్ విధించడంతో ఆయన్ను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబుకు జైల్లోనూ సరైన సౌకర్యాలు కల్పించకుండా వేధించారు. జైళ్ల శాఖ ఉన్నతాధికారిని అడ్డుపెట్టుకుని ఏకంగా వైద్య పరీక్షల నివేదికలనే తారుమారు చేశారు. అనారోగ్య సమస్యలనూ దాచిపెట్టాలని చూశారు.

11 సీట్ల పతనానికి పునాది..

చంద్రబాబు అక్రమ అరెస్టు.. జగన్ ప్రభుత్వ పతనానికి నాంది ప్రస్తావన. అప్పటికే ప్రజల్లో గూడుకట్టుకుని ఉన్న భయాందోళనలు.. ఆయన అరెస్టుతో పతాక స్థాయికి చేరాయి. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి దక్కిన 11 సీట్ల పతనానికి నాడే బీజం పడింది. చంద్రబాబు జైలులో ఉన్నంత కాలం రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారు నిరసనలు హోరెత్తించారు. ఆయనకు సంఘీభావంగా ఐటీ ఉద్యోగులు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశం చరిత్రలో నిలిచిపోతుంది. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారు. హైకోర్టు బెయిల్ ఇవ్వడంతో ఎట్టకేలకు 53 రోజుల తర్వాత.. 2023 అక్టోబరు 31న చంద్రబాబు జైలు నుంచి విడుదలయ్యారు. రాజమహేంద్రి నుంచి విజయవాడలోని నివాసానికి బయల్దేరిన ఆయనకు దారిపొడవునా ప్రజలు నీరాజనాలు పట్టారు. సుమారు 200 కిలోమీటర్ల ప్రయాణానికి 14 గంటలు పట్టిందంటే.. ఎంతలా అభిమానులు తరలివచ్చారో అర్థమవుతుంది.



అరెస్టు చేస్తున్నట్లు చంద్రబాబుకు చెబుతున్న ఐపీఎస్ కొల్లి రఘురామిరెడ్డి

అక్రమ కేసులకు పరాకాష్ఠ 'స్కిల్'

స్కిల్ కేసు.. అక్రమ కేసులకు పరాకాష్ఠగా నిలుస్తుంది. అవినీతి జరగకుండానే జరిగినట్లు చూపడం.. ఐఏఎస్ అధికారులు ఇచ్చిన వాంగ్మూలాలనే తారుమారు చేయడం వంటి చిత్రాలెన్నో ఈ కేసులో చోటుచేసుకున్నాయి. కేవలం రాజకీయ కక్షసాధింపుతో.. ఏ తప్పూ చేయకపోయినా.. ఎలాంటి ఆధారాలూ లేకపోయినా.. ఏ స్థాయి వ్యక్తినైనా అరెస్టు చేయవచ్చని ఈ కేసు ద్వారా జగన్ సర్కారు నిరూపించింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అప్పటి ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పీవీ రమేశ్ వాంగ్మూలాన్ని సీఐడీ అధికారులు తారుమారు చేశారు. ఇన్ని ప్రయత్నాలు చేసినా స్కిల్ కేసులో సీఐడీ ఒక్క ఆధారం కూడా చూపలేకపోయింది. జగన్ 2019లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ కేసుపైనే ప్రత్యేక దృష్టి పెట్టారు. చంద్రబాబును ఎలాగైలా ఇరికించాలని పథక రచన చేశారు. విభజిత ఆంధ్ర రాష్ట్ర యువతలో నైపుణ్యాభివృద్ధి కోసం 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం స్కిల్ ప్రాజెక్టును అమలు చేసింది. సీమెన్స్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థతోపాటు డిజైన్‌టెక్ సంస్థతో ఒప్పందం చేసుకుంది. సుమారు 4 లక్షల మందికి శిక్షణ ఇచ్చారు. వీరిలో వేల సంఖ్యలో ఉద్యోగాలు కూడా పొందారు.

ఏ శక్తీ నన్ను ఆపలేదు..

జైలు నుంచి విడుదలైన తర్వాత చంద్రబాబు పెట్టిన ట్వీట్ యావత్ తెలుగు జాతినీ కదిలించింది. 'గత 45 ఏళ్లుగా తెలుగు ప్రజలకు నిస్వార్థంగా సేవ చేశాను. వారి ప్రయోజనాల కోసం నేను ప్రాణత్యాగానికైనా సిద్ధం. భూమ్మీద ఏ శక్తి కూడా నన్ను తెలుగు ప్రజలకు.. నా మాతృభూమి ఆంధ్రప్రదేశ్‌కు సేవ చేకుండా ఆపలేదు' అని ఆయన పేర్కొన్నారు. ఆయన జైల్లో ఉన్నంత కాలం ఆయన సతీమణి భువనేశ్వరి, తనయుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణి రాజమహేంద్రవరంలోనే బస చేశారు. ఆయన్ను జైల్లో కలిసి సంఘీభావం ప్రకటించిన జనసేనాని పవన్ కల్యాణ్.. జైలు వద్దే టీడీపీతో కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించారు. ఆ తర్వాత బీజేపీ కూడా జతకలవడంతో మూడు పార్టీల కూటమిగా ఎన్నికల బరిలో నిలిచి.. 94 శాతం స్ట్రైక్ రేటుతో 175 అసెంబ్లీ స్థానాలకు గాను 164 స్థానాల్లో జయకేతనం ఎగురవేశాయి. 2019 ఎన్నికల్లో 151 సీట్లు గెలిచిన వైసీపీ.. ఐదేళ్లకే 11 స్థానాలకు పరిమితమై కుదేలైంది. లోక్‌సభ ఎన్నికల్లో కూడా 25 స్థానాలకు నాలుగే గెలిచింది. కూటమి 21 సీట్లలో విజయం సాధించింది. జగన్ తన దుస్సాహసానికి మూల్యం చెల్లించుకున్నారు. కనీసం అసెంబ్లీలో ప్రతిపక్ష నేత హోదా కూడా సాధించలేకపోయారు. అయినా ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాల్సిందేనని.. లేదంటే అసెంబ్లీకి రానంటూ మారాం చేస్తున్నారు.



కర్నూలు మార్కెట్ యార్డులో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

రాజకీయాల్లోకి రాజారెడ్డి!

- అవసరమైనప్పుడు నా కుమారుడు ఏపీలో రంగప్రవేశం చేస్తారు: షర్మిల
- కర్నూలులో ఉల్లి రైతులకు పరామర్శ
- తల్లి వెంట వచ్చిన తనయుడు
- అంతకుముందు విజయమ్మ ఆశీర్వాదం



హైదరాబాద్‌లో విజయలక్ష్మి ఆశీర్వాదం తీసుకుంటున్న రాజారెడ్డి

కర్నూలు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అవసరమైనప్పుడు తన కుమారుడు వైఎస్ రాజారెడ్డి ఆంధ్ర రాజకీయాల్లోకి వస్తారని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ప్రకటించారు. సోమవారం కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి రైతుల కష్టాలు తెలుసుకొని, వారిని పరామర్శించేందుకు కుమారుడితో కలసి వచ్చారు. రాజారెడ్డి కూడా మెడలో కండువా వేసుకుని పర్యటన ముగిసే వరకూ తల్లి షర్మిల వెంటే ఉన్నారు. అవసరమైనప్పుడు ఆంధ్ర రాజకీయాల్లో వస్తారని షర్మిల అన్నప్పుడు ఆయన మొహంలో చిరునవ్వు కనిపించింది. రైతుల సమక్షంలోనే కుమారుడి రాజకీయ పరిచయం చేయాలనే వ్యూహంలో భాగంగానే కర్నూలు మార్కెట్‌ను వేదికగా చేసుకున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి కర్నూలు బయల్దేరే ముందు రాజారెడ్డి తమ ఇంట్లో నుంచి బయటకు రాగానే అమ్మమ్మ వైఎస్ విజయమ్మ ఆశీర్వాదం తీసుకున్నారు. ఇప్పటి వరకు కుటుంబ కార్యక్రమాల్లో మినహా రాజకీయ కార్యక్రమాల్లో ఆయన కనిపించలేదు. తొలిసారిగా కర్నూలు మార్కెట్ యార్డులో తల్లి షర్మిలతో కలసి రైతులను పరామర్శించడం కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపించింది.

అమెరికా వెళ్లి తిరిగొచ్చాక!

వైఎస్ షర్మిల, అనిల్‌కుమార్ కుమారుడు వైఎస్ రాజారెడ్డి 1996లో జన్మించారు. హైదరాబాద్‌లోని ఓక్‌రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుకున్నారు. అమెరికాలో ఉన్నత విద్యను పూర్తి చేసి, ప్రస్తుతం అక్కడే సొంతంగా వ్యాపారాలు చూసుకుంటున్నారు. రాజారెడ్డి రెండు వారాల్లో అమెరికాకు వెళ్తారు. అక్కడ వ్యాపార వ్యవహారాలు చక్కదిద్దుకుని రాష్ట్రానికి తిరిగొస్తారు. అనంతరం రాజారెడ్డితో కలసి వైఎస్ షర్మిల ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలతో సమావేశం అవుతారని సమాచారం.

ఉల్లి రైతులను ఆదుకోవాలి: షర్మిల

ఉల్లి రైతుల కష్టాలు చూస్తుంటే కన్నీళ్లు వస్తున్నాయని, ధరలు పతనమై పెట్టుబడిలో సగం కూడా రావడం లేదని షర్మిల అన్నారు. క్వింటాకు రూ.2,500 గిట్టుబాటు ధర చెల్లించి ఉల్లి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట దిగుబడులతో కర్నూలు మార్కెట్‌కు వచ్చిన ఉల్లి రైతులతో ఆమె మాట్లాడారు. ధరలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. అధిక వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయని, అరకొర దిగుబడి మార్కెట్‌కు తెస్తే క్వింటా రూ.250-600కు మించి కొనుగోలు చేయడం లేదని రైతులు వాపోయారు. కూలీలు, రవాణా ఖర్చులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విదేశాల నుంచి ఆర్డర్లు తెచ్చి ఉల్లి ఎగుమతి చేస్తామని సీఎం చంద్రబాబు చెప్పారని, ఎందుకు ఎగుమతి చేయలేకపోతున్నారని షర్మిల ప్రశ్నించారు. రైతులకు అన్యాయం జరుగుతుందంటే ఇక్కడే ఆమరణదీక్ష చేపడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో జంగిటి లక్ష్మి నరసింహ యాదవ్, మూలింటి మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

యూరియా మాయ!

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాల్లో ఇప్పటికీ యూరియా కోసం పంపిణీ కేంద్రాల వద్ద రైతులు బారులు తీరుతున్నారు. డిమాండ్ మేరకు సరఫరా ఉంటే.. రైతులకు ఎందుకు అందడం లేదన్నది ప్రశ్న. దీనికి అనేక కారణాలున్నాయని అధికారులు, వ్యవసాయరంగ నిపుణులు పేర్కొంటున్నారు. కొంతమేరకు యూరియా పక్కదారి పట్టడం, సరఫరాలోనూ లోటుపాట్లు ఉండటంతోపాటు... అవసరానికి మించిన వినియోగంతో డిమాండ్ పెరిగిందని చెబుతున్నారు. ఇతర రసాయన, మిశ్రమ ఎరువులతో పోల్చితే యూరియా ధర చాలా తక్కువ. 45 కిలోల యూరియా బస్తా అసలు ధర రూ.2234. అయితే.. కేంద్ర ప్రభుత్వం రూ.1967 రాయితీ ఇస్తోంది. అంటే... బస్తా యూరియా రూ.266.50కే లభిస్తోంది. కేంద్ర ప్రభుత్వం యూరియా సబ్సిడీ కోసం ఏటా రూ.2 లక్షల కోట్లకుపైగా వెచ్చిస్తోంది. అదే సమయంలో డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు రాయితీపోగా బస్తా రూ.1,350 నుంచి రూ.1,800 వరకు పలుకుతున్నాయి. యూరియా చౌక ధరకే లభిస్తుండటంతో... రైతులు దీనిపైనే ఎక్కువ మొగ్గు చూపిస్తున్నారని, అవసరానికి మించి వాడుతున్నారని నిపుణులు చెబుతున్నారు.

ఎక్కువ... తక్కువలు...

యూరియా అంటే... నత్రజని! పంట ఎదుగుదలకు ఇది ఉపయోగపడుతుంది. వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న తదితర పంటలకు యూరియా ఎక్కువగా వాడుతున్నారు. కానీ...దీని వినియోగానికి ఒక లెక్క ఉంది. కోస్తా జిల్లాల్లో ఎకరాకు రెండున్నర బస్తాలు... ఉత్తర కోస్తా, ఇతర ప్రాంతాల్లో రెండు బస్తాల యూరియా వినియోగించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. కానీ... రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎకరాకు ఐదు నుంచి ఆరు బస్తాల యూరియా వినియోగిస్తున్నారు. మిశ్రమ ఎరువులతో పోల్చితే యూరియా ధర తక్కువ కావడం, ఎంత ఎక్కువ యూరియా వేస్తే అంత ఎక్కువ దిగుబడి వస్తుందనే అపోహలే దీనికి కారణమని ఒక అధికారి వెల్లడించారు. యూరియా కష్టాలు, కొరతపై మీడియాలో వస్తున్న వార్తలతో రైతులు ఆందోళనకు గురవుతుండటం నిజం. దీంతో... 'ప్యానిక్ పర్చేజింగ్' (మనకు మళ్లీ దొరకవేమో అనే ఆందోళనతో ఇప్పటికిప్పుడు అవసరంలేకున్నా కొనడం) కూడా పెరిగిందనే వాదన వినిపిస్తోంది. కొన్నిచోట్ల వచ్చే రబీ సీజన్ కోసం నిల్వలు చేసుకుంటున్నారని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

పరిష్కారం ఏదీ?

ఎరువుల తయారీ కంపెనీలు యూరియాకు ఇతర ఉత్పత్తులు లింకు పెడుతున్నాయని డీలర్లు చెబుతున్నారు. దీంతో యూరియా కొనుగోలు చేయలేమని గత మే నెలలోనే డీలర్లు తేల్చి చెప్పారు. ఇప్పటికీ అధికారులు ఈ సమస్యను పరిష్కరించలేదు. ప్రభుత్వం కూడా 70% రైతుసేవా కేంద్రాలు, సహకార సంఘాలకు కేటాయించడంతో యూరియా అమ్మకానికి కొందరు డీలర్లు వెనుకాడుతున్నారు. దీంతో పలుకుబడి ఉన్న వ్యక్తులు రైతుల ముసుగులో సొసైటీలు, రైతు సేవా కేంద్రాల నుంచి ఎక్కువ మొత్తంలో ఎరువులు ఎత్తుకెళ్తున్నారన్న వాదన ఉంది. 'ఈ-పోస్' మిషన్లు లేకపోవడంతో కొంతమంది డీలర్లు తమ ఖాతాదారులకు, చెప్పిన ధరకు కొనే వారికే ఎరువులు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో డిమాండ్‌కు, సరఫరాకు మధ్య వ్యత్యాసం తలెత్తుతోంది.

ఇతర అవసరాలకూ...

వ్యవసాయేతర అవసరాలకు కూడా యూరియాను వినియోగిస్తుండడం కొరతకు మరో కారణమని చెబుతున్నారు. పాల కల్తీ మొదలుకుని బీర్ల తయారీ వరకు యూరియాను వాడుతున్నారు. కొన్ని పారిశ్రామిక అవసరాలకూ ఉపయోగిస్తున్నారు. రైతుల పేరుతో కొనుగోలు చేసి, యూరియాను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు.. కొందరు వ్యాపారులు సిండికేట్‌గా మారి యూరియాను అధిక మొత్తంలో కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరికి అధికారులు సైతం సహకరిస్తున్నట్లు సమాచారం.

అంతర్జాతీయ పరిణామాలూ...

యూరియా సరఫరా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశం. మన దేశం ఇప్పటికీ యూరియా కోసం దిగుమతులపైనే ఎక్కువ ఆధారపడుతోంది. అందులోనూ... భారత్‌కు రష్యా నుంచి ప్రధానంగా యూరియా వస్తోంది. ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా దిగుమతులు తగ్గాయని చెబుతున్నారు.

ఈ లెక్కన కొరతే ఉండొద్దు...

ప్రస్తుత ఖరీఫ్‌లో 78.75 లక్షల ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణంలో ఇప్పటి వరకు 59.35 లక్షల ఎకరాల్లోనే పంటలు సాగులోకి వచ్చాయి. దీంతో ఈ సీజన్‌కు 6.22 లక్షల టన్నుల యూరియా అవసరమని అంచనా వేశారు. దీని ప్రకారం కేంద్రం నుంచి ఇప్పటి వరకు రాష్ట్రానికి 3.77 లక్షల టన్నుల యూరియా వచ్చింది. ప్రారంభ నిల్వతో కలిపి 6.75 లక్షల టన్నులు ఉంది. ఇప్పటి వరకు 5.97 లక్షల టన్నుల యూరియాను విక్రయించారు. ప్రస్తుతం 77 వేల టన్నులు అందుబాటులో ఉందని వ్యవసాయశాఖ తెలిపింది. అంటే... వ్యవసాయ అవసరాలకు యూరియా కొరత అనేదే ఏర్పడకూడదు. అయినా... కష్టాలు తప్పడంలేదంటే, ఎక్కడా తేడా వస్తోందనే కదా అర్థం! ప్రభుత్వం నిఘా పెట్టి అక్రమ తరలింపును నిరోధించాల్సిన అవసరం ఉంది. గత నెల చివరి వారంలో విజిలెన్స్ బృందాలు తనిఖీ చేసి 2,845 టన్నుల ఎరువుల్ని పట్టుకున్నారు. ఆ తర్వాత మళ్లీ తనిఖీల ఊసేలేదు.

సమీక్ష అవసరం!: యూరియా సమస్యను పరిష్కరించేందుకు వచ్చే రబీ నుంచి ఈ-క్రాప్, ఆధార్ అనుసంధానంతో రైతులకు అవసరమైన మేరకే ఎరువులు ఇవ్వాలని చంద్రబాబు అధికారులకు సూచించారు. కానీ, యూరియాతో సహా ఎరువుల సరఫరా, పంటలకు అధిక వాడకం, వ్యవసాయేతర అవసరాలకు తరలింపు వంటి అంశాలపై ప్రభుత్వం సమీక్ష చేయాల్సి ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఇదీ పరిస్థితి...

ఆదివారం వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ కృష్ణా జిల్లాలో పర్యటించారు. రైతులు ఏ మేరకు ఎరువులు వాడుతున్నారో ఆరా తీశారు. వరి సాగుకు ఇప్పటికే వేసిన యూరియాకు అదనంగా ఎకరానికి కనీసం 2-4 బస్తాలు అవసరమని రైతులు చెప్పారు. ఇంత ఎక్కువగా ఎరువులు వాడడం వల్ల భూసారం దెబ్బతింటుందని ఆయన రైతులకు చెప్పారు. అయినప్పటికీ.. రైతులు యూరియా అవసరమని తేల్చి చెప్పారు.




యూరియా కోసం ఉదయగిరిలో బారులు

ఉదయగిరి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ఉదయగిరి రైతు సేవా కేంద్రం-2లో సోమవారం యూరియా పంపిణీ సందర్భంగా రైతులు బారులు తీరారు. అధికారులు ప్రణాళికాబద్ధంగా పంపిణీ చేయలేదని, అందరికీ యూరియా దక్కలేదని పలువురు ఆరోపించారు. ఉదయగిరికి 400 బస్తాల యూరియా కేటాయించగా.. తొలుత ఒక్కో రైతుకు రెండు బస్తాలు, తర్వాత ఒక్కో బస్తా పంపిణీ చేశారు. క్యూలోని రైతులందరికీ యూరియా దక్కకపోవడంతో వాగ్వాదాలు జరిగాయి. ఉదయం 10 గంటలకు పంపిణీ ప్రారంభించగా, మధ్యాహ్నం 3 గంటలకే 400 బస్తాల యూరియా అయిపోయింది. బస్తా రూ.266.50లకు విక్రయించాల్సి ఉండగా.. అధికారులు రూ.280 వసూలు చేశారని రైతులు చెబుతున్నారు. కొంతమంది నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ బస్తాలు కొనుగోలు చేసి, అనంతరం బస్తా రూ.500 చొప్పున విక్రయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సమృద్ధిగా యూరియా

కొరత లేనేలేదని రైతులకు భరోసా ఇవ్వాలి: సీఎం

- అధికారులు, కలెక్టర్లతో సుదీర్ఘ సమీక్ష
- రబీ అవసరాలపై ముందస్తు ప్రణాళిక
- కర్నూలు ఉల్లి క్వింటా 1,200 కన్నా తగ్గితే.. ఆ మేరకు రైతులకు ప్రభుత్వం చెల్లింపు
- ఏజెన్సీలో వ్యాధులు ప్రబలకుండా చూడాలి: సీఎం
- ఆర్టీజీఎస్ నుంచి, టెలికాన్ఫరెన్స్‌లో సుదీర్ఘ సమీక్ష



కొందరు రాజకీయ ముసుగులో క్రిమినల్స్ తరహాలో ఆలోచిస్తూ.. ఎరువుల లభ్యత ఉండదన్న అభద్రతాభావం కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. శాంతిభద్రతల సమస్య సృష్టించేందుకు జరుగుతున్న యత్నాలకు అడ్డుకట్ట వేయాలి.

ఎరువులు దొరకవనే ఆందోళనతో రైతులు, కౌలు రైతులు ఒకేసారి వాటిని కొనుగోలు చేయకుండా.. నిల్వ చేసి పెట్టుకోకుండా చూడాలి. అనవసరపు కొనుగోళ్లపైనా దృష్టి పెట్టాలి. - సీఎం చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా లభ్యత సమృద్ధిగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. దానిని సమర్థంగా, సక్రమంగా రైతులకు అందేలా చూడాలని ఆదేశించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి యూరియా సరఫరా, ఉల్లి కొనుగోలు, తురకపాలెంలో ఆరోగ్య పరిస్థితిపై ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు. కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ కూడా నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 80,503 టన్నుల యూరియా అందుబాటులో ఉందని.. మరో 10 రోజుల్లో 23,592 టన్నులు రాష్ట్రానికి వస్తుందని అధికారులు ఆయనకు వివరించారు. వెంటనే సీఎం అక్కడికక్కడే కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రి జేపీ నడ్డాతో ఫోన్లో మాట్లాడారు. కాకినాడ తీరానికి చేరుకున్న నౌకలోని యూరియాలో 7 రేక్‌లను తమకు కేటాయించాలని కోరగా.. నడ్డా సానుకూలంగా స్పందించారు. దీంతో రాష్ట్రానికి అదనంగా 50 వేల టన్నులు కేటాయించినట్లయిందని అధికారులు చెప్పారు. యూరియా పంపిణీలో ఎక్కడా సమస్య రాకుండా చూడాలని.. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి, ఎరువులపై రైతులకు భరోసా ఇవ్వాలని సీఎం ఆదేశించారు. 'నిత్యావసర వస్తువుగా ఉన్న యూరియాను బ్లాక్ మార్కెట్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. కొందరు కావాలని రాజకీయ దురుద్దేశాలతో చేస్తున్న ప్రయత్నాలను నిలువరించాలి. ఇదే సమయంలో... అధిక మోతాదులో ఎరువుల వాడకంతో కలిగే నష్టాన్ని రైతులకు వివరించాలి. ఎరువుల వినియోగాన్ని తగ్గించిన రైతులకు ప్రోత్సాహకంగా సబ్సిడీని వారి ఖాతాల్లో జమ చేసే విధానంపై చర్యలు తీసుకోవాలి. వచ్చే రబీ సీజన్‌కు ఇప్పటికే యూరియా సరఫరా ప్రణాళికలు సిద్ధం చేయాలి' అని నిర్దేశించారు. యూరియా సరఫరాపై మరోమారు జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులతో సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సీజన్‌లో ముందుగానే సాగునీరు ఇవ్వడం వల్ల పంటల సాగు ఎక్కువ చేశారని, వాణిజ్య పంటలైన ఉల్లి, మామిడి, టమోటా, చీనీ ఉత్పత్తి ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని అధికారులకు చెప్పారు.

డ్రామా ఆడిన వారిపై చర్యలు..

కర్నూలు మార్కెట్‌లో ఉల్లి కొనుగోళ్లు, రైతులకు మద్దతు ధరపైనా సీఎం సమీక్షించారు. ఉల్లి ధర క్వింటాకు రూ.1,200కు తగ్గకుండా చూడాలని మార్కెటింగ్ శాఖ, మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. రైతులెవరైనా క్వింటా రూ.1,200 కన్నా తక్కువ ధరకు అమ్ముకుంటే.. ఆ మిగులు ప్రభుత్వం చెల్లిస్తుందని స్పష్టం చేశారు. ఉల్లి పంట ఉత్పత్తి అంచనా మేరకు నిల్వ చేసేందుకు గోదాములు, కోల్డ్ స్టోరేజీ సౌకర్యాలను కల్పించాలన్నారు. కొనుగోలు చేసిన ఉల్లిని రైతుబజార్లతో పాటు బహిరంగ మార్కెట్లకు తరలించాలని స్పష్టం చేశారు. కర్నూలు జిల్లా కోడుమూరులో పురుగు మందుల డబ్బాతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై సీఎం ఆరా తీశారు. పంటను కనీసం మార్కెట్‌కు తీసుకురాకుండా పురుగు మందు తాగినట్లు డ్రామా ఆడినవారిపై చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. అరకు కాఫీకి సోకిన కాయతొలుచు పురుగుపై సీఎం ఆరా తీశారు. ఇప్పటికి 80 ఎకరాల్లో తెగులు సోకితే 60 ఎకరాల్లో పంట తొలగించామని ఉద్యానశాఖ అధికారులు చెప్పారు. ఈ తెగులు ఇతర ప్రాంతాలకు సోకకుండా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు సూచించారు.

పౌర సేవలు మరింత మెరుగుపడాలి

పెన్షన్లు, ఉచిత గ్యాస్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, పంచాయతీరాజ్.. ఇలా వేర్వేరు శాఖల్లో అందిస్తున్న సేవలపై ఇంకా సంతృప్త స్థాయి పెరగాలని సీఎం స్పష్టం చేశారు. దీనిపై ఇక నుంచి ప్రతి వారమూ సమీక్షిస్తానన్నారు. కొన్ని చోట్ల రాజకీయ కారణాలు కూడా ప్రజల సంతృప్త స్థాయిపై ప్రభావం చూపుతున్నాయన్నారు. ఆర్టీజీఎస్ నుంచి సమీక్ష సందర్భంగా ఆయన మాట్లాడారు. 'ప్రతి ప్రభుత్వ శాఖ పౌరసేవలను మెరుగుపరచుకోవాలి. ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాలను డేటా అనలటిక్స్ ద్వారా విశ్లేషించి, తగిన నిర్ణయం తీసుకుంటాం. అలాగే కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు ఏ మేరకు రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరిగేందుకు ఉపకరిస్తున్నాయన్న అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటాం' అని తెలిపారు.

'తురకపాలెం' వ్యాధి మూలం గుర్తించండి..

గుంటూరు జిల్లా తురకపాలెంలో తలెత్తిన అనారోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని వైద్య ఆరోగ్యశాఖను సీఎం ఆదేశించారు. వ్యాధికి మూలం ఎక్కడుందో గుర్తించాలని, దీనినో కేస్ స్టడీగా తీసుకుని, ఇతర ప్రాంతాల్లోనూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు స్పష్టంచేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా సహా విష జ్వరాలు సోకకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా ఐదు గంటల పాటు సీఎం వివిధ అంశాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమాల్లో సీఎస్ విజయానంద్, వ్యవసాయం, వైద్యారోగ్యం, ఐటీ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నల్లపరెడ్డిపై చర్యలు వద్దు

- తదుపరి విచారణ వరకు ఆగండి
- దర్గామిట్ట పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కోవూరు వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ వరకు వేచి ఉండాలని దర్గామిట్ట పోలీసులకు తేల్చి చెప్పింది. ప్రసన్నకుమార్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను ఈ నెల 15కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై. లక్ష్మణరావు సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. మరో వైపు ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ వేసిన క్వాష్ పిటిషన్‌ను కూడా అదే రోజుకు వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు. మాజీ సీఎం జగన్ నెల్లూరు జిల్లాలో పర్యటించిన సందర్భంలో తన విధులకు ఆటంకం కలిగించడంతో పాటు, తనపై దాడికి పాల్పడ్డారని పేర్కొంటూ స్పెషల్ బ్రాంచ్(ఎస్బీ) హెడ్‌కానిస్టేబుల్ మాలకొండయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా దర్గామిట్ట పోలీసులు నల్లపరెడ్డిపై కేసు నమోదు చేశారు.

రెగ్యులర్ బెయిల్ ఇవ్వండి!

- ఇంటి భోజనానికి అనుమతించండి: ఏసీబీ కోర్టులో మిథున్‌రెడ్డి

విజయవాడ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన భారీ మద్యం కుంభకోణంలో ఏ-4 నిందితుడిగా ఉన్న రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి విజయవాడలోని ఏసీబీ కోర్టులో 2 పిటిషన్లు దాఖలు చేశారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న తనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయడంతోపాటు జైల్లో ఉన్నన్ని రోజులు 2 పూటలా ఇంటి నుంచి భోజనం అనుమతించాలని పిటిషన్లలో అభ్యర్థించారు. వీటిపై విచారణను ఏసీబీ కోర్టు ఈ నెల 12వ తేదీకి వాయిదా వేసింది. అదేవిధంగా జైల్లో ఉన్న మిథున్‌రెడ్డికి పలు సదుపాయాలు కల్పిస్తూ ఏసీబీ కోర్టు గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఈ ఉత్తర్వులను పునః సమీక్షించాలని కోరుతూ జైళ్ల శాఖ అధికారులు ఇదే కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై కూడా 12వ తేదీన విచారణ చేపడతామని కోర్టు తెలిపింది.

సజ్జల బెయిల్ పిటిషన్ దాఖలు: మద్యం కేసులో విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న సజ్జల శ్రీధర్‌రెడ్డి మరోసారి ఏసీబీ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా రిమాండ్ ఖైదీలుగా ఉన్న నలుగురికి బెయిల్ రావడంతో ఆయన మూడోసారి బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.

అరుణ నన్ను బెదిరించింది!

- నా ఆఫీసును తగలబెట్టిస్తానని, కుటుంబాన్ని చంపేస్తానంది
- కిలేడీపై హైకోర్టు న్యాయవాది ఫిర్యాదు

నెల్లూరు క్రైం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): "వంద లీటర్ల పెట్రోలు పోసి నీ కార్యాలయాన్ని తగులబెట్టి, నీ కుటుంబసభ్యులందరినీ చంపేస్తా." అని కిలేడీ నిడుగుంట అరుణ తీవ్రస్థాయిలో బెదిరించినట్టు హైకోర్టు సీనియర్ న్యాయవాది పేటేటి రాజారావు తెలిపారు. కోవూరు మండలం పెద్ద పడుగుపాడుకి చెందిన ఆయన సోమవారం నెల్లూరులో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పెద్దపడుగుపాడులోని ఓ అపార్ట్‌మెంట్‌లో తాను కుటుంబంతో సహా నివాసం ఉంటున్నానని తెలిపారు. అదే అపార్ట్‌మెంట్‌లోని ఐదో ఫ్లోర్‌లో ఓ ఫ్లాట్‌ను సంవత్సరం క్రితం అరుణ అద్దెకు తీసుకున్నట్టు చెప్పారు. అరుణ తన ఫ్లాట్‌కు గుర్తుతెలియని వ్యక్తులను తీసుకువచ్చి అసాంఘిక కార్యకలాపాలు చేయిండచాన్ని గుర్తించి ఆమెను ప్రశ్నించానన్నారు. దీంతో ఆమె తన అనుచరులతో వచ్చి "ఎక్కువ మాట్లాడితే చంపేస్తా. పెట్రోల్ పోసి నీ ఆఫీసును తగులబెట్టిస్తా." అని బెదిరించినట్టు తెలిపారు. అంతటితో ఆగకుండా తన కారు స్పేర్‌పార్ట్స్ తీసేయడం, బైక్‌లో పెట్రోలు తీసేయడం వంటి పనులను చేసినట్టు పేర్కొన్నారు. అరుణ అగడాలను బయట పెట్టాలని రాజారావు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే వాటిని సైతం ధ్వంసం చేయించినట్టు తెలిపారు. చివరకు తనపైనే అక్రమంగా ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయించినట్టు పేర్కొన్నారు.

ఆ ముగ్గురికి డీఫాల్ట్ బెయిల్‌పై

హైకోర్టు కీలక ఉత్తర్వులు

- ఏసీబీ కోర్టు ఉత్తర్వుల్లోని పలు అంశాలపై స్టే
- ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీకి నోటీసులు
- వీరి బెయిల్ రద్దు కోసం వ్యాజ్యం వేసిన సీఐడీ

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసు నిందితులు ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పలకు డీఫాల్ట్ బెయిల్ మంజూరుచేస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. సీఐడీ దాఖలుచేసిన చార్జిషీట్లపై ఆగస్టు 23న పలు అభ్యంతరాలను లేవనెత్తుతూ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఆఫీస్ మెమోరాండంతోపాటు బెయిల్ ఉత్తర్వుల్లో ప్రస్తావించిన పలు అంశాలపై స్టే విధించింది. నిందితులు ఇప్పటికే బెయిల్ పై విడుదలైన నేపథ్యంలో వారికి నోటీసులు ఇచ్చి వాదన వినాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. వారు ముగ్గురికి నోటీసులు జారీ చేసింది. మరోవైపు ఇదే కేసులో నిందితుడు బూనేటి చాణిక్య(ఏ8) వేసిన డీఫాల్ట్ బెయిల్ పిటిషన్ పై విచారణ జరపకుండా ఏసీబీ కోర్టును నిలువరించాలని సీఐడీ దాఖలు చేసిన అత్యవసర పిటిషన్‌పై కోర్టు విచారణ జరిపింది. చాణిక్యకు నోటీసులు జారీ చేసింది. ఈ నాలుగు వ్యాజ్యాలపై తదుపరి విచారణను సెప్టెంబరు 11కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి సోమవారం మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. సిట్ దాఖలు చేసిన చార్జిషీట్, సప్లిమెంటరీ చార్జిషీట్ అసంపూర్తిగా ఉన్నాయనే కారణంతో మద్యం కుంభకోణం కేసు నిందితులు ధనుంజయ్‌రెడ్డి(ఏ31), కృష్ణమోహన్‌రెడ్డి(ఏ32), బాలాజీ గోవిందప్ప(ఏ33)లకు ఏసీబీ కోర్టు ఈ నెల 6న పొరపాటున డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేసిందని, ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ సీఐడీ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలు సోమవారం విచారణకు వచ్చాయి. సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. "చట్టనిబంధనల మేరకు నిర్దిష్ట గడువులోగా ప్రాథమిక చార్జిషీట్ దాఖలు చేశాం. తదనంతరం సప్లిమెంటరీ చార్జిషీట్ కూడా వేశాం. సీఐడీ దాఖలుచేసిన చార్జిషీట్లలో 21 అభ్యంతరాలను లేవనెత్తుతూ ఏసీబీ కోర్టు ఆఫీస్ మెమోరాండం జారీ చేసింది. ఆ మెమోరాండంలో లేవనెత్తిన అభ్యంతరాల సమాచారమంతా ఏసీబీ కోర్టు ముందు అందుబాటులో ఉం ది. డీఫాల్ట్ బెయిల్ మంజూరుకు సంబంధించి రీతు చాబ్రియా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఆధారం చేసుకొని ఏసీబీకోర్టు నిందితులకు డీఫాల్ట్ బెయిల్ మం జూరు చేసింది. ప్రస్తుత కేసుకు ఆ ఉత్తర్వులు వర్తించవు. చార్జిషీట్ దాఖలు చేసిన అనంతరం సీఆర్పీసీ సెక్షన్ 309 కింద నిందితుల రిమాండ్‌ను ఏసీబీ కో ర్టు ఎప్పటికప్పుడు పొడిగిస్తూ వస్తోంది. నిందితుల కు డీఫాల్ట్ బెయిల్ పొందే వీలులేకుండా చేసేందు కు చార్జిషీట్ దాఖలు చేశామా? లేదా బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 187 ప్రకారం నిర్దిష్ట గడువులోగా చార్జిషీట్ వేశామా? అనే విషయంపై లోతైన విచారణ అవస రం. ఈ నేపథ్యంలో ఏసీబీ కోర్టు బెయిల్ ఉత్తర్వుల్లో ప్రస్తావించిన అంశాలపై స్టే విధించాలి." అని వారు కోరారు. ఈ వివరాలు పరిగణనలో కి తీసుకున్న న్యాయమూర్తి... సీఆర్పీసీ సెక్షన్ 309 కింద నిందితులకు రిమాండ్ పొడిగించినప్పుడు సీఆర్పీసీ సెక్షన్ 167 కింద డీఫాల్ట్ బెయిల్ మంజూరు అంశం ఉత్ప న్నం కాదు కదా అని వ్యాఖ్యానించారు. నిందితులకు నోటీసులు జారీచేశారు.



దిలీప్ బెయిల్ రద్దు చేయండి..

మద్యం కుంభకోణం వ్యవహారంలో నిందితుడు, రాజ్ కసిరెడ్డి(ఏ1) అనుచరుడు పైలా దిలీప్‌కు బెయిల్ మంజూరు చేస్తూ గత నెల 28న ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ సీఐడీ సోమవారం హైకోర్టులో పిటిషన్ దాఖలుచేసింది. కోర్టు ముందున్న ఆధారాలను, సుప్రీంకోర్టు తీర్పులను పరిగణనలోకి తీసుకోవడంలో ఏసీబీ కోర్టు విఫలమైందని పేర్కొంది. "ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డితో కలిసి ఆర్థిక లావాదేవీలు జరపడంలో దిలీప్‌ది కీలకపాత్ర. నల్లధనాన్ని తెల్లధనంగా మార్చడంతో దిలీప్‌ది ముఖ్యపాత్ర. మద్యం కుంభకోణం కేసు నమోదైన తరువాత దిలీప్ మొత్తం 51 ఎకరాలు అమ్మారు. 'సిట్' ఏర్పాటైన అనంతరం ఒక్క మార్చి నెలలోనే 42 ఎకరాలు విక్రయించారు. దిలీప్ బెయిల్ పై ఉంటే ముడుపుల రూపంలో వచ్చిన సొమ్ముతో ఇతర నిందితులు కొనుగోలు చేసిన ఆస్తులను గుర్తించడం కష్టమవుతుంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని దిలీప్ బెయిల్‌ను రద్దు చేయండి." అని పిటిషన్‌లో కోరారు.

చనిపోతూ.. ఏడుగురికి కొత్త జీవితం!

- రోడ్డు ప్రమాదంలో గాయాలైన చిత్తూరు వాసి బ్రెయిన్ డెడ్
- బాధలోనూ అవయవదానానికి ముందుకొచ్చిన కుటుంబీకులు



నిరంజన్‌కుమార్ చౌదరి

వెదురుకుప్పం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తమ బిడ్డ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. పలు ఆస్పత్రుల్లో చూపించినా ప్రయోజనం లేకపోయింది. చివరకు బ్రెయిన్ డెడ్ అని వైద్యులు తేల్చారు. అయితే ఇంతటి దుఃఖంలోనూ ఆ కుటుంబం అవయవదానానికి అంగీకరించింది. దీంతో ఆ యువకుడు చనిపోతూ.. ఏడుగురికి కొత్త జీవితాన్నిచ్చాడు. కర్ణాటకలో గతనెల 31న జరిగిన రోడ్డు ప్రమాదంలో చిత్తూరు జిల్లా ఎస్ఆర్‌పురం మండలం సింధురాజపురం గ్రామానికి చెందిన నిరంజన్‌కుమార్ చౌదరి (40) తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి అక్కడి ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ప్రయోజనం లేకపోయింది. చివరకు గత శుక్రవారం బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో అవయవదానంపై వైద్యులు కుటుంబసభ్యులకు అవగాహన కల్పించారు. అంత బాధలోనూ కొందరికైనా జీవితాన్నివ్వాలని నిరంజన్ కుటుంబీకులు భావించి.. అవయవదానానికి అంగీకరించారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి కిడ్నీలు, కళ్లు, లివర్, తదితర అవయవాలను ఏడుగురికి కేటాయించారు. సోమవారం వేకువజామున నిరంజన్ మృతదేహాన్ని తీసుకుని కుటుంబీకులు స్వగ్రామానికి చేరుకున్నారు. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.



అనంతపురం నగర శివారులో 'సూపర్‌హిట్' సభా వేదిక వద్ద డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాతో మంత్రులు పయ్యావుల, గొట్టిపాటి, నారాయణ, అనగాని

చరిత్రలో నిలిచేలా 'సూపర్ సిక్స్' సభ

- కడప మహానాడును మించి నిర్వహిస్తాం: పయ్యావుల
- అనంత సభ వేదిక ఏర్పాట్ల పరిశీలన

అనంతపురం క్రైం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): చరిత్రలో నిలిచిపోయేలా 'సూపర్‌సిక్స్-సూపర్ హిట్' సభ జరుగుతుందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. అనంతపురం శివారులోని జీఎంఆర్ ఇంద్రప్రస్థ గ్రౌండ్స్‌లో బుధవారం జరిగే ఈ సభ ఏర్పాట్లను డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా సోమవారం పయ్యావులతోపాటు మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, గొట్టిపాటి రవికుమార్, రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంఎస్ రాజు తదితరులతో కలిసి పరిశీలించారు. పయ్యావుల మీడియాతో మాట్లాడారు. మొన్న కడపలో జరిగిన మహానాడు బహిరంగ సభ అద్భుతం అనుకుంటే.. అంతకు మించిన ఏర్పాట్లు అనంతలో చేస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నికల వాగ్దానాలన్నీ అమలు చేశామన్నారు. సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభ.. కృతజ్ఞతా సభ అని.. దీనికి తరలిరావాలని టీడీపీ కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి పిలుస్తున్నారని, ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. సభను విజయవంతం చేయడానికి జనసేన, బీజేపీ, టీడీపీ కలసి పనిచేస్తున్నాయని అన్నారు. సూపర్ సిక్స్ హామీలతోపాటు రాయలసీమకు కీలకమైన హంద్రీ-నీవా కాలువ విస్తరణ పనులను 100 రోజుల్లో పూర్తిచేశామని, రెట్టింపు నీటిని తీసుకురావడంతో సీమ రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోందని తెలిపారు. సభలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, లోకేశ్‌తోపాటు రాష్ట్ర, కేంద్ర మంత్రులు, కూటమి పార్టీల నాయకులు, శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొంటారు. కాగా.. భద్రతా ఏర్పాట్లను డీజీపీ క్షేత్రస్థాయిలో సమీక్షించారు. భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ జగదీశ్ వివరించారు.

హ్యాండ్సమ్ డీజీపీ.. పయ్యావుల చలోక్తి

'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభ భద్రతా ఏర్పాట్లను పరిశీలించేందుకు డీజీపీ అనంతపురం వచ్చారు. యూనిఫాంలో కాకుండా సివిల్ డ్రెస్‌లో ఆయన సభావేదిక వద్దకు రావడంతో మంత్రులు తొలుత గుర్తించలేకపోయారు. పయ్యావుల కేశవ్ మాత్రం గుర్తుపట్టి పలకరించారు. 'రెవెన్యూ మంత్రిగారూ చూడండి.. హ్యాండ్సమ్ డీజీపీ.. గుర్తు పట్టారా.. అని నవ్వుతూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో అన్నారు. దీంతో ఆయన డీజీపీతో కరచాలనం చేశారు. 'డీజీపీ గారు మామూలుగానే హ్యాండ్సమ్.. ఈ రోజు కలర్‌ఫుల్‌గా ఉన్నారు. గుర్తుపట్టకుండా ఉంటామా' అని వ్యాఖ్యానించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.